
సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 16+32 పేజీల ఆదివారం అనుబంధం | వెల: ₹ 7.00 | సంపుటి: 18 సంచిక: 133
SUNDAY Special | ఆదివారం 3-8-2025
SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | MUMBAI | BANGALORE | CHENNAI | DELHI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL


'ప్రతి రైతూ వాణిజ్యవేత్తగా మారాలి'



'టెస్ట్ ట్యూబ్'లో.. మీ 'బేబీ'యేనా?
కృత్రిమ గర్భధారణలో ఐవీఎఫ్ ప్రాధాన్యమేమిటి? అది ఎప్పుడు, ఎందుకు చేస్తారు? దంపతులు ఎక్కడ మోసపోయే అవకాశం ఉంటుంది? ప్రభుత్వం నియమ నిబంధనలూ, మార్గదర్శకాలు ఏమిటి? -16లో




ఆప్తమిత్రులతోనే ఆరోగ్య భాగ్యం
స్నేహం అంటే ఇది అని నిర్వచించలేం. దాన్ని స్కూళ్లలో పాఠంలా నేర్చుకోలేం. అలాంటి అనుకూలుడు, శ్రేయోభిలాషి, దోస్తు, హితుడు, స్నేహితుడు ఉన్నవారు ఆరోగ్యంగా ఉంటారట. -3లో



'స్వదేశీ' విప్లవం ప్రారంభిద్దాం
ఆర్థిక అనిశ్చిత పరిస్థితులున్న తరుణంలో మన దేశంలో తయారైన ఉత్పత్తులే ఉపయోగిద్దామని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు.
- వివరాలు 6లో▶



ప్రజ్వల్ రేవణ్ణకు జీవితఖైదు
అత్యాచారం కేసులో జేడీఎస్ నేత హెచ్‌డీ రేవణ్ణ కుమారుడు ప్రజ్వల్‌ను దోషిగా తేలుస్తూ కోర్టు ఆయనకు జీవితఖైదు విధించింది.
- వివరాలు 6లో▶



కీలక దశకు 'డెంగీఆల్' పరీక్షలు
లక్షలాది మరణాలకు హేతువైన డెంగీని తుదముట్టించేందుకు భారత్‌లో జరుగుతున్న సుదీర్ఘ పరిశోధనలు కీలకదశకు చేరాయి.
- వివరాలు 6లో▶



9 తీస్తారా... సమం చేస్తారా?
ఇంగ్లండ్‌తో ఐదో టెస్టులో మరో 9 వికెట్లు తీస్తే భారత్ ఈ మ్యాచ్‌లో నెగ్గి సిరీస్‌ను 2–2తో సమంగా ముగిస్తుంది.
- వివరాలు 14లో▶

బాధ్యులు వారే!

'కాళేశ్వరం' వైఫల్యంలో కేసీఆర్, హరీశ్, ఈటల, అధికారులు, ఇంజనీర్ల పాత్ర
సర్కారుకు సమర్పించిన నివేదికలో జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్?



- ప్రత్యక్షంగా, పరోక్షంగా మాజీ ముఖ్యమంత్రి వల్లే బరాజ్‌ల వైఫల్యం
- ప్లానింగ్, నిర్మాణం, నిర్వహణ, పర్యవేక్షణ సంబంధిత అవకతవకల్లో పాత్ర
- అంచనాల పెంపు, ఒప్పందాల సవరణ, గ్యారెంటీల విడుదలకు ఒత్తిడి చేశారు
- కేఐపీసీఎల్ ముసుగులో గత ప్రభుత్వం అక్రమాలకు పాల్పడింది

సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌ల వైఫల్యానికి మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ప్రత్యక్షంగా, పరోక్షంగా బాధ్యుడని జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ తన నివేదికలో పేర్కొన్నట్లు తెలిసింది. అలాగే మాజీ మంత్రులు హరీశ్‌రావు, ఈటల రాజేందర్‌తో పాటు నీటిపారుదల శాఖ మాజీ ముఖ్య కార్యదర్శి శైలేంద్రకుమార్ జోషీ, నాటి సీఎం కేసీఆర్ అదనపు కార్యదర్శి స్మితా సబర్వాల్, నీటిపారుదల శాఖ మాజీ ఈఎన్సీ (జనరల్) సి.మురళీధర్, కాళేశ్వరం ప్రాజెక్టు మాజీ ఈఎన్సీ హరిరామ్‌ల పాత్ర కూడా ఉన్నట్టుగా వెల్లడించినట్లు సమాచారం. బరాజ్‌ల ప్లానింగ్, నిర్మాణం, పనుల పూర్తి, నిర్వహణ, పర్యవేక్షణకు సంబంధించి జరిగిన అవకతవకల్లో కేసీఆర్ పాత్ర ఉందని వెల్లడించినట్లు సమాచారం. నాడు సీఎం హోదాలో నిర్వహించిన సమీక్ష సమావేశాల్లో బరాజ్‌ల అంచనాల పెంపు (ప్రైస్ అడ్జస్ట్‌మెంట్), కాంట్రాక్టర్లతో ఒప్పందాల సవరణ, వారికి ఫైనాన్షియల్ గ్యారంటీల విడుదల విషయంలో అధికారులపై కేసీఆర్ ఒత్తిడి తెచ్చారని నిర్ధారించినట్లు తెలిసింది. మేడిగడ్డ బరాజ్ 2023 అక్టోబర్ 21న కుంగిపోగా, అన్నారం, సుందిళ్ల బరాజ్‌లలో సైతం బుంగలు ఏర్పడ్డాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కారు ఏర్పాటైన తర్వాత బరాజ్‌ల నిర్మాణంలో సాంకేతిక లోపాలతో పాటు అవినీతి ఆరోపణలపై విచారణ కోసం 2024 మార్చి 14న జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌ను నియమించింది. కాగా కమిషన్ 115 మంది సాక్షులను విచారించింది. జూలై 31న సర్కారుకు నివేదిక సమర్పించింది.

కేసీఆర్ రెండు విధాలుగా బాధ్యుడు!
విశ్వసనీయ సమాచారం ప్రకారం నివేదికలోని వివరాలు ఇలా ఉన్నాయి. బరాజ్‌ల నిర్మాణంలో జరిగిన అవకతవకలకు నాటి సీఎం కేసీఆర్ డైరెక్ట్‌గా, వైకారియస్‌గా బాధ్యత వహించాల్సి ఉంటుందని కమిషన్ పేర్కొంది. న్యాయ పరిభాషలో వైకారియస్ అంటే సేవకులు చేసే తప్పిదాలకు యజమాని (మాస్టర్) పరోక్ష బాధ్యత వహించడం. అంటే సహచర మంత్రులతో పాటు ఐఏఎస్ అధికారులు, ఇంజనీర్లు చేసిన తప్పిదాలకు సీఎంగా కేసీఆర్ బాధ్యత వహించాల్సి ఉంటుందని కమిషన్ పేర్కొంది. ఇక ప్రత్యక్షంగా కూడా కేసీఆర్ పలు అవకతవకలకు పాల్పడినట్టు తెలిపింది.

ఈటల, హరీశ్‌లది బాధ్యతారాహిత్యం!
నాటి ఆర్థిక శాఖ మంత్రిగా ఈటల రాజేందర్ బాధ్యతలను గాలికి మిగతా 2వ పేజీలో ▶

'కాళేశ్వరం' నివేదికపై తప్పుడు రాతలు



సీఎం రేవంత్ కార్యాలయం నుంచే లీకులు
- తప్పుడు రాతలపై కచ్చితంగా చర్యలుంటాయి
- సీఎం 50 సార్లు ఢిల్లీకి వెళ్లినా 50 పైసలు కూడా తేలే
- మీడియా సమావేశంలో జగదీశ్‌రెడ్డి

2లో

శనివారం హైదరాబాద్‌లో క్రీడా పాలసీని ప్రకటిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి. చిత్రంలో మంత్రి వాకిటి శ్రీహరి, అభినవ్ బింద్రా, జితేందర్‌రెడ్డి, శివసేనారెడ్డి



ఒలింపిక్స్ పతకం లక్ష్యం

స్పోర్ట్స్ కాంక్లేవ్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

- రాష్ట్రంలో అత్యుత్తమ క్రీడాకారులను తయారు చేస్తాం
- అందుకే కొత్త క్రీడా విధానం తీసుకొస్తున్నాం
- పాలసీ అమలుకు అనుభవజ్ఞులు, నిష్ణాతులతో గవర్నింగ్ బోర్డు
- పీపీపీ పద్ధతిలో కలిసి పనిచేస్తామని వెల్లడి
- వివిధ క్రీడలకు సంబంధించి పలు సంస్థలతో ఎంఓయూలు

సాక్షి, హైదరాబాద్: 'ఒలింపిక్స్ నిర్వహించేందుకు మన వద్ద నిధులు, వేదికలు, అన్ని వనరులు, హైదరాబాద్ నగరంలో ఉన్నాయి. కానీ ఇంతా చేసి మనం ఒక్క స్వర్ణ పతకం కూడా గెలవలేకపోతే మన ముఖం ప్రపంచానికి ఎలా చూపిస్తాం? అందుకే ముమ్మందు రాష్ట్రంలో అత్యుత్తమ క్రీడాకారులను తయారు చేయాలని నిర్ణయించుకున్నాం. ఈ క్రమంలోనే కొత్త క్రీడా విధానాన్ని తీసుకొచ్చాం' అని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తొలిసారి అత్యంత ప్రతిష్టాత్మకంగా హైదరాబాద్ హెచ్ఐసీసీలో క్రీడా సదస్సు(స్పోర్ట్స్ కాంక్లేవ్) నిర్వహించింది. ఈ సందర్భంగా శనివారం నిర్వహించిన చర్చాగోష్టిలో ఒలింపిక్ పతక విజేతలు అభినవ్ బింద్రా, గగన్ నారంగ్, ప్రపంచ చాంపియన్‌షిప్ మెడలిస్ట్ అంజూ బాబీ జార్జ్, మాజీ వాలీబాల్ ప్లేయర్ రవికాంత్ రెడ్డి పాల్గొని రాష్ట్రంలో క్రీడాభివృద్ధికి ఉన్న అవకాశాలపై తమ అభిప్రాయాలు, సూచనలు వెల్లడించారు. పలువురు మాజీ క్రీడాకారులు, కార్పొరేట్ సంస్థల ప్రతినిధులు కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా కొత్త స్పోర్ట్స్ పాలసీని ప్రభుత్వం ప్రకటించింది. సదస్సు ముగింపు కార్యక్రమంలో సీఎం మాట్లాడారు.

క్రీడల్లో రాజకీయ జోక్యం ఉండదు
'క్రీడల్లో రాజకీయ జోక్యం లేకుండా ఉండేందుకు ప్రభుత్వ–ప్రైవేట్ భాగస్వామ్యం (పీపీపీ) విధానంలో ప్రముఖ ప్రైవేట్ మిగతా 5వ పేజీలో ▶

న్యూస్‌రీల్

కొండా సురేఖపై క్రిమినల్ కేసు నమోదు చేయండి



బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దాఖలు చేసిన పరువు నష్టం కేసులో మంత్రి కొండా సురేఖపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని పోలీసులను నాంపల్లి కోర్టు ఆదేశించింది.
- వివరాలు 15లో▶

ఫిరాయింపు ఎమ్మెల్సీలపై బీఆర్ఎస్ నజర్



ఎమ్మెల్యేల ఫిరాయింపులపై సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో వారిపై 3 నెలల్లో నిర్ణయం తీసుకునేలా స్పీకర్‌ను కోరాలని బీఆర్ఎస్ భావిస్తోంది. అదే సమయంలో ఫిరాయించిన ఎమ్మెల్సీలపైనా వేటు వేసేలా మండలి చైర్మన్‌పై ఒత్తిడి తేవాలనుకుంటోంది.
- వివరాలు 12లో▶

ఔటర్ పరిధిలో సమీకృత సబ్‌రిజిస్ట్రార్ ఆఫీస్‌లు



రాష్ట్రంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ భవనాల పునర్వ్యవస్థీకరణలో ప్రభుత్వం మరో ముందడుగు వేసింది. ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల స్థానంలో సమీకృత భవనాలు నిర్మించాలని నిర్ణయించింది.
- వివరాలు 12లో▶

200 మ్యూల్ ఖాతాలపై ఈడీ దృష్టి



గొర్రెల పంపిణీ పథకంలో రూ. వెయ్యి కోట్ల నిధుల గోల్‌మాల్ వ్యవహారంలో బయట పడిన 200 మ్యూల్ బ్యాంకు ఖాతాల లెక్కలు తేల్చే పనిలో ఈడీ నిమగ్నమైంది.
- వివరాలు 5లో▶

ఇదండీ సంగతి



ఓట్లు మరీ ఎక్కువగా తీసేశామేమోననిపిస్తోంది సార్!

ఎన్నికల వ్యవస్థ చచ్చిపోయింది

2014 నుంచి ఎన్నికల్లో అక్రమాలు జరుగుతున్నాయి
- గతేడాది లోక్‌సభ ఎన్నికల్లో రిగ్గింగ్ జరిగింది
- సాక్ష్యాల అణు బాంబు త్వరలో ప్రయోగిస్తా
- ఎన్నికల వ్యవస్థలో ప్రకంపనలు సృష్టించడం తథ్యం
- ఎన్డీయేకు 15 సీట్లు తక్కువొస్తే మోదీ ప్రధాని అయ్యేవారు కాదు
- పిరికివాళ్లను చూసి నేను భయపడను
- కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ స్పష్టీకరణ

6లో





"ఎన్నికల సంఘం లెక్కలేకుండా వ్యవహరిస్తోంది. ఎన్నికల్లో జరుగుతున్న అక్రమాలపై గతంలో నా దగ్గర ఆధారాల్లేవు. అందుకే ఎన్నికల సంఘంపై ఆరోపణలు చేయలేదు. కానీ, ఇప్పుడు 100 శాతం సాక్ష్యం ఉంది కాబట్టే పూర్తివిశ్వాసంతో మాట్లాడుతున్నా. ఎన్నికల్లో అవకతవకలకు ఎలా సాధ్యమని కుర్చీలో కూర్చున్నవారు అడుగుతున్నారు. కానీ, అది ముమ్మాటికీ సాధ్యమే. గత ఎన్నికల్లో అక్రమాలు జరిగాయి. ఎన్నికల వ్యవస్థపై నాకు ఎప్పటి నుంచో అనుమానాలున్నాయి.
- రాహుల్ గాంధీ

రాహుల్ నేతృత్వంలో మోదీని ఓడిస్తాం
- వచ్చే ఎన్నికల్లో బీజేపీకి 150కి మించి ఒక్క సీటూ రాదు: సీఎం రేవంత్‌రెడ్డి
- సామాజిక న్యాయం, 42 శాతం రిజర్వేషన్లు కాంగ్రెస్‌తోనే సాధ్యం
- ఢిల్లీలో ఏఐసీసీ ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో ప్రసంగం

5లో



హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద జరిగిన ధర్నాలో సంఘీభావం ప్రకటిస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి. చిత్రంలో రాంచందర్‌రావు, బీబీ పాటిల్, ఆర్.కృష్ణయ్య, ఈటల, ఏలేటి తదితరులు

బీసీలకు 32 శాతమే రిజర్వేషన్లు ఇచ్చే కుట్ర

ప్రభుత్వం కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను యథాతథంగా అమలుచేయాలి
- ముస్లింలకు 10 శాతం రిజర్వేషన్లు ఇస్తామంటే ఊరుకోం
- ఇందిరాపార్కు బీసీల మహాధర్నాలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి
- సీఎం చిత్తశుద్ధి నిరూపించుకోవాలి: ఎన్.రాంచందర్‌రావు

సాక్షి, హైదరాబాద్: బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల పేరుతో ఆయా వర్గాలను రాష్ట్ర ప్రభుత్వం మోసం చేయాలని చూస్తోందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఆరోపించారు. ప్రతిపాదిత 42 శాతం రిజర్వేషన్లు బీసీలకే ఇవ్వాలని అందులో 10 శాతం ముస్లింలకు ఇస్తామంటే ఊరుకోబోమని తేల్చి చెప్పారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను రాష్ట్ర ప్రభుత్వం యథాతథంగా వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. శనివారం మిగతా 3వ పేజీలో ▶

సిట్ మరో అడ్డగోలు బరితెగింపు

రూ.11 కోట్ల జప్తు డ్రామాపై కోర్టులో చెంపపెట్టు
- వెంటనే సాయంత్రానికి రంగంలోకి సిట్, ఎల్లో మీడియా
- అకస్మాత్తుగా తెరపైకి రూ.35 కోట్ల కట్టుకథ
- చెవిరెడ్డి అనుచరుడిదిగా పేర్కొంటూ ఓ వీడియో విడుదల
- ఇందులో రూ.2 వేల నోట్లు.. ఎన్నికల నాటి డబ్బుగా ఆరోపణలు
- కానీ, అంతకు ఏడాది ముందే రూ.2 వేల నోట్లు వెనక్కుతీసుకున్న ఆర్బీఐ
- సిట్ రూ.11 కోట్ల భేతాళ కథ ఫెయిల్‌తో రూ.35 కోట్ల కుట్ర కథ తెరపైకి

సాక్షి, అమరావతి: నిమిషానికో అబద్ధం... అరగంటకో ఎల్లో మీడియా లీక్... గంటకో కట్టుకథ..! మొత్తానికి రోజుకో భేతాళ విక్రమార్క కథ..! మద్యం అక్రమ కేసులో సిట్ బరితెగింపు ఇది. అరాచకంలో రోజురోజుకు అంచనాలను మించుతూ, అడ్డగోలుతనంలో పీహెచ్‌డీ చేస్తోంది దర్యాప్తు సంస్థ. అక్రమ కేసులో ఆరు నెలలుగా డ్రామాలతో రక్తి కట్టిస్తున్న సిట్.. శనివారి మరోసారి బరితెగించింది. ''ఇంతకంటే దిగజారడం ఉండదని ఊహించిన ప్రతిసారి నా అంచనా తప్పని రుజువు చేస్తున్నావ్'' అని అదేదో సినిమాలో చెప్పినట్లు.. భేతాళ విక్రమార్క కట్టుకథల్లో అన్ని రికార్డులను దాటేస్తోంది సిట్. బహుశా ప్రతిష్ఠాత్మక నోబెల్ భేతాళ విక్రమార్క కథలకు అవార్డు ఉంటే జీవిత కాలం ఆ అవార్డు సిట్‌కే దక్కుతుందనడంలో సందేహం లేదు. ఇదంతా ఎందుకు చెప్పాల్సి వస్తున్నదంటే.. గత బుధవారం హైదరాబాద్ శివారు శంషాబాద్ మండలం కాచారంలోని వర్ధమాన్ ఇంజనీరింగ్ కాలేజీ యజమాని విజయేందర్‌రెడ్డికి చెందిన ఫామ్‌హౌస్‌లో రూ.11 కోట్లు పట్టుబడినట్లు.. ఇదంతా మద్యం అక్రమ కేసు సొమ్మేనంటూ సిట్ ఓ కట్టుకథను తెరపైకి తెచ్చింది. ఈ నగదు జప్తు పేరిట సాగించిన హైడ్రామా విజయవాడ ఏసీబీ కోర్టులో తేలిపోయింది. మూడో కంటికి తెలియకుండా బ్యాంకులో డిపాజిట్ చేయాలని సిట్ పన్నిన కుయుక్తి బెడిసికొట్టింది. మద్యం అక్రమ కేసు నిందితుడు అభ్యర్థన మేరకు... రూ.11 కోట్లను ప్రత్యేకంగా భద్రపరచాలని కోర్టు ఆదేశించింది. కట్టలపై ఉన్న బ్యాచ్ నంబర్లు, సీరియల్ నంబర్ల వివరాలను నమోదు చేస్తూ పంచనామా నిర్వహించాలని తేల్చి చెప్పింది. మొత్తం ప్రక్రియను వీడియో తీయించాలని స్పష్టం చేసింది. ఈ నగదును రాజ్ కసిరెడ్డి 2024 జూన్ నుంచే ఫామ్‌హౌస్‌లో ఉంచినట్టు సిట్ పేర్కొంది. కానీ, ఆర్‌బీఐ అధికారులు ఆ నోట్ల కట్టలపై ఉన్న బ్యాచ్ నంబర్లు, సీరియల్ నంబర్లు పరిశీలిస్తే అసలు విషయం వెలుగులోకి వస్తుంది. ఆ నోట్లు అన్నిగానీ వాటిలో కొన్నిగానీ 2024 జూన్ తరువాత ముద్రించినవి అని నిర్ధారణ అయితే సిట్ చెప్పిన జప్తు వ్యవహారం అంతా కట్టుకథేనని స్పష్టమవుతుంది. దీంతో సిట్ బండారం బట్టబయలవుతుంది. మొత్తానికి ఏసీబీ కోర్టు... సిట్‌కు చెంపపెట్టు లాంటి ఆదేశాలు జారీ చేసింది. అంతే... దీన్ని కప్పిపుచ్చేందుకు శనివారం సాయంత్రానికి సిట్‌తో పాటు ఎల్లో మీడియా రంగంలోకి దిగాయి. పన్నాగంలో భాగంగా మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సన్నిహితుడు వెంకటేష్‌నాయుడు సెల్‌ఫోన్ నుంచి రిట్రీవ్ చేసినట్లుగా ఓ వీడియోను సిట్ తెరపైకి తెచ్చింది.

ఇదిగో కట్టుకథకు నిలువెత్తు సాక్ష్యం..

సిట్ తాజా కట్టుకథ ప్రకారం విడుదల చేసిన వీడియోలో... రూ.35 కోట్లు రిసీవ్ చేసుకున్నట్లు వెంకటేష్ నాయుడు వీడియో తీసుకున్నారు. ఈ డబ్బునే గత ఏడాది (2024) ఎన్నికల సమయంలో అభ్యర్థుల ఖర్చు కోసం చెవిరెడ్డి వినియోగించారని సిట్ కట్టుకథలతో ఎల్లో మీడియా రంగప్రవేశం చేసింది. ఇది ఎంత డొల్ల వాదన అనేది ఇక్కడే బయటపడింది. ఎలాగంటే.. వెంకటేష్ నాయుడికి చెందిన నోట్ల కట్టలుగా చెబుతూ సిట్ విడుదల చేసిన వీడియోలో రూ.2 వేల నోట్లు ఉన్నాయి. కానీ, రూ.2 వేల నోటును 2023 మే 19నే రిజర్వ్ బ్యాంక్ వెనక్కుతీసుకుంది. అంటే... ఎన్నికలకు సరిగ్గా ఏడాది ముందే రూ.2 వేల నోటు చెలామణి లేదు. ఏడాది ముందుగానే చెలామణి ఆగిపోయిన నోట్లను ఎన్నికల సమయంలో ఎలా పంపిణీ చేశారనేది ప్రశ్నార్థకం. ఇదంతా చూస్తుంటే.. హైదరాబాద్‌లో రూ.11 కోట్ల జప్తు భేతాళ విక్రమార్క కథలు బెడిసికొట్టడంతో సిట్ రూ.35 కోట్ల డ్రామాను ముందుకుతెచ్చిందని స్పష్టం అవుతోంది.

కాగా, వెంకటేష్‌నాయుడు రియల్టర్. తన వ్యాపార లావాదేవీల్లో భాగమైన నగదును మద్యం అక్రమ కేసుకు సిట్ ముడిపెడుతోందని తేలుతోంది. కోర్టులో చెంపపెట్టులాంటి ఆదేశాలతో ప్రజలను తప్పుదారి పట్టించేందుకు సిద్ధమైనట్లు స్పష్టమవుతోంది. వెంకటేష్ నాయుడు అరెస్టు సమయంలో డబ్బుల కట్టల వీడియో ప్రస్తావనే లేదు. ఆయన రిమాండ్ రిపోర్టు సమయంలోనూ ఈ విషయం రివీల్ చేయలేదు. కానీ, రూ.11 కోట్ల కుట్ర కథ ఫెయిల్‌తో హడావుడిగా వక్రీకరణలకు దిగిందనే విషయం తేటతెల్లం అవుతోంది.

అడ్డంగా దొరికిన సిట్!

సీజ్ చేసిన రూ.11 కోట్ల డబ్బుపై సర్వత్రా అనుమానాలు
కోర్టులో పిటిషన్ దాఖలు చేసిన కేసిరెడ్డి
సీజ్ చేసిన డబ్బును వేరుగా డిపాజిట్ చేసేలా ఆదేశాలివ్వాలని అభ్యర్థన
సిట్ మాటలపై నమ్మకం లేదన్న కేసిరెడ్డి న్యాయవాది
దాంతో దర్యాప్తు అధికారిని పిలిపించిన ఏసీబీ ప్రత్యేక కోర్టు

- సీజ్ చేసిన డబ్బును ఇప్పటికే బ్యాంకులో జమ చేశామని వెల్లడి
- అలా అయితే డిపాజిట్ చేసిన స్లిప్పుని చూపాలని కోరిన న్యాయవాది
- అరగంటలో తెస్తానని వెళ్లి ఎంతకూ తిరిగి రాని వైనం
- కోర్ట్ సమయం ముగిసినా పత్తా లేక పోవడంతో విసిగిపోయిన న్యాయస్థానం
- ఏదో తేడా ఉందని ప్రాథమికంగా నిర్ధారించుకున్న కోర్టు



సాక్షి, అమరావతి : మద్యం అక్రమ కేసులో సిట్ అడ్డంగా దొరికిపోయింది. ప్రధాన నిందితుడు రాజ్ కేసిరెడ్డికి చెందిన డబ్బు అంటూ సిట్ అధికారులు రంగారెడ్డి జిల్లాలోని ఓ ఫాం హౌస్‌లో జప్తు చేసిన రూ.11 కోట్లపై సర్వత్రా అనుమానాలు వ్యక్తమవుతున్న వేళ ఏసీబీ కోర్టు శనివారం కీలక ఆదేశాలు జారీ చేసింది. బ్యాంకులో డిపాజిట్ చేసే ముందు ఆ రూ.11 కోట్లకు పూర్తి స్థాయిలో పంచనామా నిర్వహించాలని సిట్ దర్యాప్తు అధికారిని ఏసీబీ కోర్టు ఆదేశించింది. ప్రతీ నోటుపై ఉన్న సీరియల్ నెంబర్‌ను రికార్డ్ చేయాలని స్పష్టం చేసింది. ఒకవేళ డబ్బును సిట్ ఇప్పటికే డిపాజిట్ చేసి ఉంటే, ఆ మొత్తాన్ని ఇతర కరెన్సీ నోట్లతో కలపకుండా వేరుగా ఉంచాలని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మాచవరం బ్రాంచ్‌ను కోర్టు ఆదేశించింది. తాము తదుపరి ఉత్తర్వులు జారీ చేసేంత వరకు ఆ నోట్లను వేరుగానే ఉంచాలని తేల్చి చెప్పింది. ఈ మేరకు ఏసీబీ కోర్టు న్యాయాధికారి పి.భాస్కరరావు ఉత్తర్వులు జారీ చేశారు. వాస్తవానికి రూ.11 కోట్ల జప్తు వ్యవహారంలో సిట్ అడ్డంగా దొరికిపోయింది. ఈ డబ్బు కేసిరెడ్డిదేనని సిట్ చెప్పగా, ఆ డబ్బుతో తనకు ఎలాంటి సంబంధం లేదని కేసిరెడ్డి ఏసీబీ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అంతేకాక 2024 ఎన్నికలకు ముందే ఈ రూ.11 కోట్లను దాచిపెట్టినట్లు సిట్ చెబుతోందని, ఆ కరెన్సీ నోట్లు ఏ సంవత్సరానివో నిగ్గు తేలాలంటే రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) రికార్డులను పరిశీలించాలని ఆయన కోర్టును కోరారు. రూ.11 కోట్ల కరెన్సీ నోట్లపై ఉన్న సీరియల్ నెంబర్లను రికార్డ్ చేసేందుకు ఓ అడ్వొకేట్ కమిషనర్‌ను నియమించాలని కోరుతూ రాజ్ కేసిరెడ్డి తాజాగా ఏసీబీ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై కోర్టు శనివారం విచారణ జరిపింది.

బ్యాంక్‌లో డిపాజిట్ చేసి ఉంటే స్లిప్ చూపమనండి..

కేసిరెడ్డి తరపు న్యాయవాది శెట్టిపల్లి దుష్యంత్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ, ఆ కరెన్సీ నోట్లపై ఉన్న సీరియల్ నెంబర్లను వీడియోగ్రఫీ చేసి, దాని ఫుటేజీని కోర్టు ముందుంచేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. తమకున్న సమాచారం మేరకు ఆ రూ.11 కోట్లను సిట్ ఇప్పటి వరకు బ్యాంకులో జమ చేయలేదన్నారు. ఆ నోట్లపై ఉన్న సీరియల్ నెంబర్ల విషయంలో పిటిషనర్ అనుమానాలు వ్యక్తం చేసిన నేపథ్యంలో, ఆ నోట్లను సిట్ తారుమారు చేసే అవకాశం ఉందన్నారు. సిట్‌పై తమకు ఏ విధమైన నమ్మకమూ లేదన్నారు. దీంతో డబ్బు డిపాజిట్ చేశారా? లేదా? అన్న విషయాన్ని నిర్ధారించుకునేందుకు కోర్టు సిట్ దర్యాప్తు అధికారి (ఐవో)ని పిలిపించింది. కోర్టు ముందు హాజరైన దర్యాప్తు అధికారి తాము రూ.11 కోట్లను బ్యాంకులో డిపాజిట్ చేసేశామని చెప్పారు. ఈ సమయంలో దుష్యంత్ జోక్యం చేసుకుంటూ, సిట్‌ను నమ్మలేమని, ఒకవేళ రూ.11 కోట్లను డిపాజిట్ చేసి ఉంటే డిపాజిట్‌కు సంబంధించిన బ్యాంక్ స్లిప్పును చూపించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. బ్యాంక్ స్లిప్పును 5 నిమిషాల్లో వాట్సాప్ ద్వారా తెప్పించుకోవచ్చన్నారు. అంతేకాక డిపాజిట్ చేసిన డబ్బును వేరుగా ఉంచేలా బ్యాంకును ఆదేశించాలని ఆయన కోరారు. దీంతో దర్యాప్తు అధికారి అర్ధగంటలో డిపాజిట్ స్లిప్పును తీసుకొస్తానని వెళ్లారు. అయితే గంటలు గడిచినా కూడా ఆ అధికారి తిరిగి రాలేదు. ఆయన పత్తా లేకుండా పోవడంతో కోర్టు ఈ మొత్తం వ్యవహారంలో ఏదో తేడా ఉందన్న ప్రాథమిక నిర్ణయానికి వచ్చింది. దర్యాప్తు అధికారి రాకపోవడంతో డిపాజిట్ చేసిన డబ్బును వేరుగా ఉంచాలని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మాచవరం బ్రాంచ్ అధికారులను ఆదేశించింది. అలాగే డిపాజిట్ చేసిన నోట్ల పంచనామా చేయాలని దర్యాప్తు అధికారిని ఆదేశించింది.

రేపు కేబినెట్ భేటీ

సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధ్యక్షతన సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు రాష్ట్ర మంత్రివర్గం సమావేశం కానుంది. కాళేశ్వరం ప్రాజెక్టులోని బరాజ్‌ల నిర్మాణంలో అవకతవకలపై విచారణ నిర్వహించిన జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ ఇటీవల ప్రభుత్వానికి సమర్పించిన నివేదికపై చర్చించేందుకు ఈ మంత్రివర్గ సమావేశాన్ని నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. కమిషన్ ఇచ్చిన 650 పేజీల నివేదికపై విస్తృత అధ్యయనం కోసం ప్రభుత్వం ఐఏఎస్‌ల కమిటీని నియమించింది. ఈ నివేదికను అధ్యయనం చేసి ఈ కమిటీ చేయనున్న సిఫారసుల ఆధారంగా బాధ్యులపై చర్యల విషయంలో మంత్రివర్గం నిర్ణయం తీసుకోనుంది.

నీతిఆయోగ్ 'ఆస్పిరేషనల్' ఫలితాలు భేష్

గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ హర్షం

సాక్షి, హైదరాబాద్: నీతి ఆయోగ్ ఆస్పిరేషనల్ డిస్ట్రిక్ట్స్ అండ్ ఆస్పిరేషనల్ బ్లాక్స్ కార్యక్రమంలో రాష్ట్రంలోని పలు జిల్లాలు, బ్లాకులు ఉత్తమ ఫలితాలు సాధించడం పట్ల గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ హర్షం వ్యక్తంచేశారు. మాతా, శిశు ఆరోగ్యం, పౌష్టికాహారం, వ్యవసాయం, నీటి వనరులు, విద్య, సమ్మిళిత ఆర్థికాభివృద్ధి వంటి ఆరు అంశాల్లో 100 శాతం ఫలితాలను సాధించేందుకు ఈ కార్యక్రమాన్ని నీతి ఆయోగ్ అమలు చేస్తోందని తెలిపారు. శనివారం రాజ్‌భవన్‌లో నిర్వహించిన సంపూర్ణ అభియాన్ సమ్మాన్ సమారోహ్‌లో గవర్నర్ మాట్లాడారు. కుమరంభీం, జయశంకర్ భూపాలపల్లి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలతో పాటు గుండాల, ముథారామ్, పలిమెల, తిర్యాణి, నిర్మనూర్ బ్లాకులు 100 శాతం ఫలితాలు సాధించడం పట్ల హర్షం వ్యక్తంచేశారు. ఇందుకు ఆయా జిల్లాల కలెక్టర్లు చేసిన కృషిని కొనియాడారు. అత్యుత్తమ పనితీరు కనబరిచిన 10 జిల్లాల కలెక్టర్లకు పతకాలు, ప్రశంసాపత్రాలతో సన్మానించారు.

అధికారికంగా సత్యసాయి శతజయంతి

సాక్షి, హైదరాబాద్: శ్రీ సత్య సాయిబాబా శత జయంతిని అధికారికంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. నవంబర్ 23న జరిగే జయంతి వేడుకలకు ఏర్పాట్లు కోసం తెలంగాణ సత్యసాయి ట్రస్టును సంప్రదించాలని అధికారులను ఆదేశించింది.

బాధ్యులు వారే!

▶ మొదటి పేజీ తరువాయి

వదిలేశారని, కేఐపీసీఎల్ బోర్డులో ఆర్థిక శాఖ ఉన్నా పూర్తి బాధ్యతలను ఆ సంస్థకే వదిలేశారని కమిషన్ తప్పుబట్టింది. ఇక హరీశ్‌రావు ఎలాంటి జవాబుదారీతనం లేకుండా ఇష్టారాజ్యంగా ఆదేశాలు జారీ చేశారని, పరిపాలన వ్యవస్థను నిర్వీర్యం చేశారని పేర్కొంది. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణానికి రుణాల సమీకరణ కోసం గత ప్రభుత్వం కేఐపీసీఎల్‌ను ఏర్పాటు చేసి అక్రమాలకు పాల్పడిందని కమిషన్ పేర్కొంది. దీనికి గతంలో, ప్రస్తుతం బోర్డులో సభ్యులుగా ఉన్న వారందరూ బాధ్యులేనని స్పష్టం చేసింది. నేరపూరిత విశ్వాసఘాతం, నిధుల దుర్వినియోగానికి వీరంతా బాధ్యులని పేర్కొంది. భారీగా ప్రజాధనం దుర్వినియోగమైందని తెలిపింది.

ఇష్టారాజ్యంగా వర్క్ కంప్లీషన్ సర్టిఫికెట్లు!

'మేడిగడ్డ బరాజ్ నిర్మాణం పూర్తికాక ముందే దాదాపుగా పూర్తైందని నిర్ధారిస్తూ 2019 సెప్టెంబర్ 9న బరాజ్ సూపరింటెండింగ్ ఇంజనీర్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సబ్‌స్టాన్షియల్ వర్క్ కంప్లీషన్ సర్టిఫికెట్ ఇచ్చారు. మేడిగడ్డ బరాజ్ నిర్మాణం పూర్తైందని మళ్లీ 2021 మార్చి 15న మరో సర్టిఫికెట్ ఇచ్చారు. అన్నారం, సుందిళ్ల బరాజ్‌లలో లోపాలు/లీకేజీలపై నిర్లక్ష్యం వహించి అవి సైతం పూర్తైనట్టు ఆయా బరాజ్‌ల క్వాలిటీ కంట్రోల్ ఇంజనీర్లు సర్టిఫికెట్లు జారీ చేశారు..' అని కమిషన్ పేర్కొంది. ఇక బరాజ్‌ల నిర్వహణ, పర్యవేక్షణలో పూర్తిగా విఫలమైనందుకు గాను మాజీ ఈఎన్సీ (ఓ అండ్ ఎం) బి.నాగేంద్ర రావుతో పాటు డ్యామ్ సేఫ్టీ విభాగం బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేసింది.

ఇంజనీర్లు వీరే..

మోడల్ స్టడీస్ నిర్వహించకుండానే డిజైన్ల తయారీ, నిర్మాణంలో నాణ్యతకు తిలోదకాలు ఇవ్వడం, థర్డ్ పార్టీతో డిజైన్లకు వెట్టింగ్ చేయించకపోవడం, నిర్వహణ, పర్యవేక్షణలో నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు గాను నీటిపారుదల శాఖలోని పలు విభాగాల ఇంజనీర్లను కమిషన్ బాధ్యులుగా తేల్చింది. విభాగాల వారీగా వారి పేర్లను ప్రస్తావించింది..
- సెంట్రల్ డిజైన్స్ ఆర్గనైజేషన్ నాటి చీఫ్ ఇంజనీర్
- తెలంగాణ స్టేట్ ఇంజనీరింగ్ రీసెర్చ్ ల్యాబ్ చీఫ్ ఇంజనీర్
- కాళేశ్వరం ప్రాజెక్టు ఇంజనీర్ ఇన్ చీఫ్
- సూపరింటెండింగ్ ఇంజనీర్లు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, డిప్యూటీ ఈఈలు, ఏఈలు

వాస్తవాలను తొక్కి పెట్టిన మాజీ ఈఎన్సీలు

బరాజ్‌ల నిర్మాణానికి సంబంధించి కాంట్రాక్టర్లతో ఎలాంటి ఒప్పందాలు చేసుకోవాలి? లంప్‌సమ్ విధానంలో చేసుకోవాలా? టర్న్ కీ విధానంలోనా? అనే విషయంలో..మాజీ ఈఎన్సీ(జనరల్) సి.మురళీధర్, మాజీ సీఈ బి.హరిరామ్ వాస్తవాలను తొక్కిపెట్టారని కమిషన్ పేర్కొంది. నీటి లభ్యత విషయంలో నిపుణుల కమిటీ నివేదికను విస్మరించి కేంద్ర జల సంఘాన్ని (సీడబ్ల్యూసీ) తప్పుదోవ పట్టించారని వెల్లడించింది. ఇక కమిషన్ ముందు హాజరై తప్పుడు సాక్ష్యం ఇచ్చిన సీడీఓ మాజీ సీఈ ఎ.నరేందర్ రెడ్డి, సీఈ టి.శ్రీనివాస్, కాళేశ్వరం బరాజ్ మాజీ ఈఈ ఓంకార్ సింగ్‌లను కమిషన్ తప్పుబట్టింది.

నివేదిక తొక్కి పెట్టిన జోషి.. బిజినెస్ రూల్స్ ఉల్లంఘించిన స్మిత

మేడిగడ్డ బరాజ్ నిర్మించాలనే ప్రతిపాదనలను వ్యతిరేకిస్తూ నిపుణుల కమిటీ సమర్పించిన కీలక నివేదికను ఎస్‌కే జోషీ తొక్కిపెట్టారని కమిషన్ పేర్కొంది. లేనిపక్షంలో బరాజ్ నిర్మాణం జరగక పోయేదని అభిప్రాయపడింది. ఇక స్మితా సబర్వాల్ బరాజ్‌ల నిర్ణయాలకు సంబంధించిన కీలకమైన ఫైళ్లను కేబినెట్ ముందుంచడంలో విఫలమయ్యారని, ఈ విషయంలో ఆమె బిజినెస్ రూల్స్‌ను ఉల్లంఘించారని పేర్కొంది.

ఎల్ అండ్ టీకి ఆ అర్హత లేదు

మేడిగడ్డ బరాజ్ నిర్మాణం పూర్తైందని నిర్ధారిస్తూ జారీ చేసిన సర్టిఫికెట్‌ను పొందడానికి నిర్మాణ సంస్థ ఎల్ అండ్ టీకి అర్హత లేదని కమిషన్ పేర్కొంది. బరాజ్‌లో కుంగిపోయిన 7వ బ్లాక్‌ను తన సొంత ఖర్చుతో ఆ సంస్థ పునరుద్ధరించాల్సిందేనని స్పష్టం చేసింది. డిఫెక్ట్ లయబిలిటీ కాలంలో అన్నారం, సుందిళ్ల బరాజ్‌లలో ఏర్పడిన లోపాలను గుర్తించి సరిచేయడంలో విఫలమైనందుకు ఆ రెండు బరాజ్‌ల నిర్మాణ సంస్థలూ బాధ్యత వహించాలని పేర్కొంది.

'కాళేశ్వరం' నివేదికపై తప్పుడు రాతలు

సీఎం రేవంత్ కార్యాలయం నుంచే లీకులు
- తప్పుడు రాతలపై కచ్చితంగా చర్యలుంటాయి
- సీఎం 50 సార్లు ఢిల్లీకి వెళ్లినా 50 పైసలు కూడా తేలే
- మీడియా సమావేశంలో జగదీశ్‌రెడ్డి



మీడియాతో మాట్లాడుతున్న జగదీశ్‌రెడ్డి. చిత్రంలో లింగయ్య యాదవ్, భాస్కర్ రావు, రవీంద్ర కుమార్ తదితరులు

సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టుపై పీసీ ఘోష్ కమిషన్ ప్రభుత్వానికి సమర్పించిన నివేదిక పేరు మీద మీడియాలో ఇష్టమొచ్చినట్టు రాతలు రాయిస్తున్నారని, అవేవీ నిజాలు కావని బీఆర్‌ఎస్ నేత, మాజీ మంత్రి జి.జగదీశ్‌రెడ్డి అన్నారు. అవన్నీ సీఎం రేవంత్‌రెడ్డి కార్యాలయం నుంచి వస్తున్న తప్పుడు లీకులు మాత్రమేనని స్పష్టంచేశారు. ఎలాంటి ఆధారాలు లేకుండా కేసీఆర్‌ను, బీఆర్‌ఎస్ పార్టీని బద్నాం చేసేలా వార్తలు రాయవద్దని కోరారు. శనివారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో జగదీశ్‌రెడ్డి మాట్లాడారు. 'మేము మౌనంగా ఉన్నామని అనుకోవద్దు. తప్పుడు వార్తలు రాసేవారిపై కచ్చితంగా చర్యలు ఉంటాయి. అయితే, నేను కేవలం మీడియా ముసుగులో ఉన్న తెలంగాణ వ్యతిరేక స్లాటర్ హౌస్ (వధశాల)ల గురించి మాట్లాడుతున్నా. ఈ రోత రాతలను అర్థం చేసుకోవాలని తెలంగాణ ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నా. కాళేశ్వరం కమిషన్ రహస్య నివేదిక ఇస్తే అందులోని అంశాలు ఈ స్లాటర్ హౌస్‌లకు ఎలా తెలిశాయి? సొంత వ్యాఖ్యానాలు చేస్తామంటే కుదరదు'అని జగదీశ్‌రెడ్డి హెచ్చరించారు. కాళేశ్వరం కమిషన్ విచారణలో కేసీఆర్ కడిగిన ముత్యంలా బయటకొస్తారని పేర్కొన్నారు. ఏ కమిషన్ అయినా కేసీఆర్‌కు వ్యతిరేకంగా ఎలాంటి నివేదికలు ఇవ్వలేవు అన్నారు. తెలంగాణ కోసమే కేసీఆర్ ప్రతీ క్షణం పరితపించారని, నాలుగేళ్లలోనే కాళేశ్వరం లాంటి అతిపెద్ద ప్రాజెక్టును పూర్తి చేసి తెలంగాణ రైతాంగానికి అంకితమిచ్చారని పేర్కొన్నారు. 'పోలవరం పనులు ప్రారంభించి నాలుగు దశాబ్దాలైనా ఇంకా పూర్తి చేయలేక పోయారు. కేంద్రం పోలవరంపై ఇప్పటికే రూ.30 వేల కోట్లు ఖర్చు పెట్టింది. అందులో రూ.2 వేల కోట్లు వరదల్లో కొట్టుకుపోయిన వాటి బాగుకే వెచ్చించారు. ఇప్పటికే పోలవరం మూడు సార్లు కొట్టుకుపోయింది. అలాంటిది 500 సంవత్సరాల్లో ఎపుడూ రాని విధంగా దాదాపు 38 లక్షల క్యూసెక్కులు రావడంతోనే మేడిగడ్డ బరాజ్‌లో కొంత భాగం కుంగిపోయాయి. కానీ, మోదీ, చంద్రబాబు, రేవంత్ కలిసి కేసీఆర్‌పై దుర్మార్గమైన దాడి చేస్తున్నారు' అని విమర్శించారు.

రూ.50 వేల కోట్ల మూటల సంగతేంటి?

దాదాపు రూ.50 వేల కోట్ల మూటలు ఢిల్లీకి సమర్పణ అని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ గతంలో కాంగ్రెస్‌పై విమర్శలు చేశారని జగదీశ్‌రెడ్డి గుర్తుచేశారు. కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ రాష్ట్రం ఏటీఎంగా మారిందని చేసిన విమర్శలు ఏమయ్యాయని ప్రశ్నించారు. కేసీఆర్ సీఎంగా పదేళ్ల కాలంలో పదిసార్లు కూడా ఢిల్లీకి వెళ్లలేదని, రేవంత్‌రెడ్డి సీఎం అయ్యాక ఢిల్లీ పర్యటనల్లో అర్ధశతకం పూర్తి చేశారని ఎద్దేవా చేశారు. 50 సార్లు వెళ్లినా రాష్ట్రానికి 50 పైసలు కూడా తేలేదని విమర్శించారు. 'ఢిల్లీ వెళ్లేది సంచుల పంపిణీకి మాత్రమే. నిన్న సీఎం, మంత్రులు ఢిల్లీ వాటాల గురించి మాట్లాడుకున్నారు' అని జగదీశ్‌రెడ్డి ఆరోపించారు. గతంలో సోషల్ మీడియాను వాడుకుని బీఆర్‌ఎస్ ప్రభుత్వంపై బురదజల్లిన రేవంత్‌రెడ్డి.. ఇప్పుడు అదే సోషల్ మీడియాను చూస్తే భయపడుతున్నారని ఎద్దేవా చేశారు. మీడియా సమావేశంలో మాజీ ఎంపీ లింగయ్య యాదవ్, మాజీ ఎమ్మెల్యేలు ఎస్ .భాస్కర్ రావు, రవీంద్ర కుమార్ పాల్గొన్నారు.

బాలసదనాల్లో భారీగా ఖాళీలు..!

పలు కేటగిరీల్లో 267 పోస్టులు ఖాళీగా ఉన్నట్లు గుర్తింపు
- భర్తీకి ప్రతిపాదనలు రూపొందిస్తున్న మహిళా, శిశు సంక్షేమ శాఖ



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ పరిధిలో ప్రత్యేకంగా ఏర్పాటైన శిశు గృహాలు, బాలసదనాలు, జిల్లా స్థాయి శిశు సంరక్షణ యూనిట్లలో పలు కేటగిరీల్లో 267 పోస్టులు ఖాళీగా ఉన్నట్లు అధికారుల నివేదికలు చెబుతున్నాయి. నవజాత శిశువు మొదలు ఆరేళ్లలోపు ఉన్న చిన్నారుల సంరక్షణలో ఈ గృహాలు కీలక పాత్ర పోషిస్తాయి. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 17 శిశు గృహాలు, బాలసదనాలున్నాయి. వీటితో పాటు రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ కమిషనరేట్ పరిధిలో శిశు విహార్ ఉంది. మంజూరైన పోస్టుల్లో దాదాపు 60 శాతానికి పైబడి ఖాళీగా ఉన్నట్లు తెలుస్తోంది.

కీలక పోస్టులు ఖాళీ..

శిశు గృహాలు, బాల సదనాల్లోని చిన్నారుల ఆలనా, పాలన చూసుకోవడంలో ఆయాలు కీలక భూమిక పోషిస్తుండగా.. వారికి వైద్య సేవలందించడంలో వైద్యులు, పారామెడికల్ సిబ్బంది పాత్ర కూడా ప్రధానంగా ఉంటుంది. ఈ గృహాల్లో మొత్తం 32 మంది వైద్యులు పనిచేయాల్సి ఉండగా.. ప్రస్తుతం 8 మంది మాత్రమే కొనసాగుతున్నారు. నర్సుల కేటగిరీలో 70 శాతం మేర పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇవికాకుండా సూపరింటెండెంట్, మ్యాట్రిన్, నైట్ వాచ్‌మెన్ పోస్టులు కూడా పెద్ద సంఖ్యలో ఖాళీగా ఉన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లా స్థాయి శిశు సంరక్షణ కేంద్రాల్లో చాలా కేటగిరీల్లో వేకెన్సీ ఉంది. శిశు గృహాల్లో మొత్తంగా 267 పోస్టులు ఖాళీగా ఉండగా జిల్లా స్థాయి శిశు సంరక్షణ కేంద్రాల్లో 67 పోస్టులు ఖాళీగా ఉన్నట్లు రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ అధికారులు గణాంకాలు వెల్లడించారు. వీటి భర్తీకి సంబంధించి ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వ అనుమతి కోసం పంపాలని అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

అనుమతి లేకుండా దైవిక కార్యక్రమాల్లో

పాల్గొంటే చర్యలు


దేవాలయ వేదపండితులు, అర్చకులకు ప్రభుత్వం ఆదేశం

సాక్షి, హైదరాబాద్: దేవాదాయ శాఖ అధీనంలోని దేవాలయాల్లో పనిచేస్తున్న వేదపండితులు, పురోహితులు, అర్చకులు ప్రభుత్వం నుంచి ముందస్తు అనుమతి లేకుండా రాష్ట్రం, ఇతర రాష్ట్రాలు, ఇతర దేశాల్లో ఎలాంటి ధార్మిక క్రతువులు, ప్రవచన కార్యక్రమాలు, దైవిక సంబంధిత కార్యక్రమాల నిర్వహణలో పాల్గొనకూడదని దేవాదాయ శాఖ ఆదేశించింది. కొంతమంది వేదపండితులు, అర్చకులు ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకుండా ఇతర ప్రాంతాల్లో కార్యక్రమాలను నిర్వహిస్తున్నారని, ఇది ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధమని ఆ శాఖ శనివారం మెమో జారీ చేసింది. దేవాలయాల్లో పనిచేస్తున్న వేదపండితులు, పురోహిత అర్చకులు ఇతర ప్రభుత్వ ఉద్యోగులతో సమానమే అయినందున, ప్రభుత్వ నిబంధనలు వారికి కూడా వర్తిస్తాయని తెలుసుకోవాలని సూచించింది. ఇక నుంచి ముందస్తు అనుమతి లేకుండా అలా వెళ్లే వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. దీనిపై తగు చర్యలు తీసుకోవాల్సిందిగా దేవాదాయ శాఖ కమిషనర్‌ను ఆదేశించింది. అనుమతి కోసం దరఖాస్తు చేస్తే, దాన్ని పరిశీలించి తదనుగుణంగా అనుమతి ఇవ్వనున్నట్టు తెలిపింది. కొన్ని సంఘాల వారు విదేశాల్లో దైవకల్యాణాలు నిర్వహిస్తూ పలు దేవాలయ వేద పండితులను ఆహ్వానిస్తున్నారు. అలాగే కొందరు అర్చకులు స్థానికంగా ఆయా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇకపై అలాంటి ఆహ్వానాలపై వెళ్లేవారు వాటి ద్వారా కొంత ఆదాయాన్ని ఆయా ఆలయాలకు చెందేలా చర్యలుంటాయని సమాచారం.

'ఆస్తిని పంచుకుని అమ్మను గెంటేశారు'

కథనానికి స్పందన

సుమోటోగా స్వీకరించిన లోకాయుక్త



విచారణ చేపట్టిన ఆర్ఐ

మద్దూరు: నారాయణ పేట జిల్లా మద్దూరు మండలంలోని ఖాజీపూర్ గ్రామానికి చెందిన వడ్ల నాగమ్మ (83) తన కొడుకులు పోషించకపోవడంతో పాటు, భర్త పేరు మీద ఉన్న ఆస్తి, డబ్బులను లాక్కొని ఆమెకు తిండి పెట్టడం లేదనే విషయాన్ని శనివారం 'సాక్షి' వెలుగులోకి తెచ్చింది. 'ఆస్తిని పంచుకుని అమ్మను గెంటేశారు' అనే కథనానికి లోకాయుక్త స్పందించి సుమోటోగా స్వీకరించింది. దీనిపై విచారణ చేసి సమగ్ర నివేదికను ఈనెల 22వ తేదీ వరకు అందజేయాలని నారాయణపేట జిల్లా కలెక్టర్‌ను, మద్దూరు తహసీల్దార్‌ను ఆదేశించినట్లు తెలిసింది. కాగా, సాక్షిలో వచ్చిన కథనం, వృద్ధురాలి ఫిర్యాదు మేరకు తహసీల్దార్ మహేశ్‌గౌడ్ ఆదేశాలతో శనివారం ఆర్ఐ అమరేందర్‌శెట్టి ఖాజీపూర్‌లో విచారణ చేపట్టారు. గ్రామ పంచాయతీ భవనంలో నాగమ్మను, ముగ్గురు కొడుకులను పిలిపించి విచారించారు. ఆర్ఐ ఎదుట తమ తల్లిని చూసుకుంటామని కుమారులు చెప్పారు. కాగా, నాలుగేళ్లుగా తన కుమారులు బాగోగులు చూసుకోవడం లేదని ఆర్ఐకు ఆ వృద్ధురాలు వివరించింది. గతంలో తన పేరు మీద ఉన్న రెండెకరాల భూమిని తన పేరు మీద పట్టా చేయాలని కోరింది.

'ఫేక్ అటెండెన్స్'పై

చర్యలు షురూ

- అక్రమ హాజరు నమోదులో 553 మందిని గుర్తించిన పంచాయతీరాజ్ శాఖ
- ఒక ఓఎస్ సెక్రటరీ తొలగింపు, 15 మంది సస్పెన్షన్, మిగిలిన వారికి షోకాజ్‌లు

సాక్షి, హైదరాబాద్: పంచాయతీ కార్యదర్శుల ఫేక్ అటెండెన్స్ వ్యవహారంపై ప్రభుత్వం చర్యలు చేపట్టింది. రాష్ట్రవ్యాప్తంగా 553 మంది సెక్రటరీలు హాజరు నమోదులో ఈ విధమైన అక్రమాలకు పాల్పడినట్టుగా అధికారులు గుర్తించారు. వందల సంఖ్యలో విధులకు హాజరు కాకుండా ఫేక్ అటెండెన్స్ నమోదు చేస్తున్న వైనంపై పంచాయతీరాజ్ శాఖమంత్రి సీతక్క ఆదేశాల నేపథ్యంలో అధికారులు చర్యలు చేపట్టారు. పెద్దసంఖ్యలో పంచాయతీ కార్యదర్శులు అటెండెన్స్ నమోదు విషయంలో అక్రమాలకు పాల్పడటం పట్ల పీఆర్ శాఖ ఉన్నతాధికారుల్లో విస్మయం వ్యక్తమవుతోంది. ఫేక్ అటెండెన్స్ వ్యవహారం వెలుగులోకి వచ్చిన నేపథ్యంలో ఔట్‌సోర్స్ విధానంలో పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న ఒకరిని సర్వీస్ నుంచి తొలగించగా, మరో 15 మందిని సస్పెండ్ చేశారు. మిగిలిన వారికి షోకాజ్ నోటీసులు జారీచేశారు. ఈ విషయంలో తప్పుచేసిన పంచాయతీ కార్యదర్శులపైనే కాకుండా వారి అటెండెన్స్‌ను పర్యవేక్షించాల్సిన మండల పంచాయతీ అధికారుల (ఎంపీవోల) నిర్లక్ష్య వైఖరిపైనా పీఆర్ ఆర్‌డీ శాఖ సీరియస్‌గానే స్పందించింది. విధుల్లో నిర్లక్ష్యం వహించిన 47 మంది ఎంపీవోలకు షోకాజ్ నోటీసులు జారీచేసింది.

జిల్లాల వారీగా ఉల్లంఘనలు: మొత్తంగా 553 మంది ఫేక్ అటెండెన్స్‌లో.. సిద్దిపేట జిల్లాలో 70 మంది, నల్లగొండలో 69, వికారాబాద్ 63, సూర్యాపేట 48, కామారెడ్డి 43, భద్రాద్రి కొత్తగూడెం 42, రాజన్న సిరిసిల్ల 32, ఆదిలాబాద్ 26, జగిత్యాల 22, ఖమ్మం, మంచిర్యాలలో 21 మంది చొప్పున, మెదక్ జిల్లాలో 20 మంది, ఇతర జిల్లాల్లో పదుల సంఖ్యలో అక్రమాలకు పాల్పడినట్టుగా పీఆర్ శాఖ ఉన్నతాధికారులు గుర్తించారు.

ప్రైవేటు ఐవీఎఫ్ కేంద్రాలపై విచారణ కమిటీ

- మంత్రి దామోదర ఆదేశం



సాక్షి, హైదరాబాద్‌: ఐవీఎఫ్, సరోగసీ పేరిట దందాకు పాల్పడుతున్న ప్రైవేట్ ఐవీఎఫ్ కేంద్రాలపై కఠినచర్యలు తీసుకోవాలని ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశించారు. సృష్టి తరహా ఘటనలు పునరావృతం కాకుండా తక్షణమే చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ మేరకు ఐవీఎఫ్ క్లినిక్‌లలో తనిఖీలు, నియంత్రణ కోసం.. ఉన్నతాధికారులతో విచారణ కమిటీని ఏర్పాటు చేయాలని ఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా జెడ్ చొంగ్తూకు మంత్రి సూచించారు. ఈ మేరకు ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ నేతృత్వంలో.. ఆరోగ్యశ్రీ సీఈవో, మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్లతో విచారణ కమిటీని నియమిస్తూ కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కమిటీ ప్రైవేటు ఐవీఎఫ్ కేంద్రాల్లో తనిఖీలు నిర్వహించనుంది. ఏఆర్‌టీ, సరోగసీ చట్టాల కింద ఐవీఎఫ్ కేంద్రాల కార్యకలాపాలు, రిజిస్ట్రేషన్, రోగి సమ్మతి వంటి అంశాల్లో చట్టపరమైన ప్రక్రియలు ఎలా ఉన్నాయో పరిశీలిస్తుంది. ఈ ప్రక్రియను పదిరోజుల్లో పూర్తి చేసి, నివేదిక అందజేయాలని ప్రభుత్వం ఆదేశించింది.

ఉచిత వైద్య క్యాంపుల ముసుగులో మోసాలు

- డాక్టర్ నమ్రత పోలీసు కస్టడీలో కీలకాంశాలు వెలుగులోకి

రాంగోపాల్‌పేట్: యూనివర్సల్ సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ యజమాని డాక్టర్ నమ్రత సాగించిన మోసాలు ఆమె పోలీసు కస్టడీ సాక్షిగా బయటపడుతున్నాయి. కోర్టు అనుమతితో ఈ నెల ఒకటిన ఆమెను ఐదు రోజుల కస్టడీకి తీసుకున్న గోపాలపురం పోలీసులు నిందితురాలి నుంచి పలు కీలకాంశాలను రాబట్టారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. వైజాగ్ పరిసర ప్రాంతాల్లోని గ్రామాల్లో డాక్టర్ నమ్రత బృందం ఉచిత వైద్య క్యాంపుల ముసుగులో పేదింటి గర్భిణులను డబ్బుతో మభ్యపెట్టేది. వారిని వైజాగ్, విజయవాడ తీసుకొచ్చి అక్కడే డెలివరీ చేసి నవజాత శిశువులను తీసుకొని పంపించేది. అనంతరం సరోగసీ పేరు చెప్పి పిల్లలు లేని జంటలకు ఆ శిశువులను విక్రయించేది. ఇలా అక్రమంగా వసూలు చేసిన డబ్బుతో హైదరాబాద్, ఏపీలోని వైజాగ్, విజయవాడలలో ఫాంహౌస్‌లు, కూకట్‌పల్లి, మియాపూర్, సికింద్రాబాద్, యూసుఫ్‌గూడలో భవనాలు కొనుగోలు చేసినట్లు పోలీసులు గుర్తించారు. ఈ వ్యవహారంలో ఆమెకు సహకరించిన సంతోషి, కల్యాణి అనే నిందితులను సైతం పోలీసులు కస్టడీలోకి తీసుకొని విచారిస్తున్నారు.

మన ఆకాశం లాంటి జీవితాన్ని ఇంద్రధనుస్సులా రంగులమయం చేసేవాడే నిజమైన చెలికాడు. స్నేహం అంటే ఇది అని నిర్వచించలేం. దాన్ని స్కూళ్లలో పాఠంలా నేర్చుకోలేం. అలాంటి అనుకూలుడు, శ్రేయోభిలాషి, దోస్తు, హితుడు, స్నేహితుడు ఉన్నవారు ఆరోగ్యంగా ఉంటారట. స్నేహామృతం అంటే ఇదేనేమో. పరిశోధనల సారాంశం ఇదే. ఆరోగ్యాన్ని కోరుకునేవారు స్నేహ పరిమళాలను ఆస్వాదించాల్సిందే. మదర్స్ డేలా.. స్నేహితుల దినోత్సవం అని ఒకరోజు అనుకోవడమే గానీ.. 365 రోజులూ అమ్మ/స్నేహితులు లేనిదే గడుస్తాయా?

దోస్తులున్నారనే ధైర్యమే ఆరోగ్య హేతువు

ఒకరికి కనీసం ఐదుగురు నేస్తాలు అవసరం

భారతీయులకు సగటున ఆరుగురు హితులు

నేడు స్నేహితుల దినోత్సవం



ఆప్తమిత్రులతోనే ఆరోగ్యభాగ్యం


ఒక మంచి పుస్తకాన్ని చదువుతూ చదువుతూ ఉంటే.. దానిలోని గొప్పదనం మరింత గొప్పగా అర్థమవడం ఆరంభమవుతుంది. అలాగే మంచి వ్యక్తితో స్నేహం కూడా.. రోజురోజుకూ కొత్త పరిమళాలతో గుభాళిస్తుంది. స్నేహితులంటే రోజురోజుకూ గుండెకు మరింత దగ్గరయ్యేవారు. అందుకే, వాళ్లు గుండె భారాన్ని.. ఒత్తిడిని.. ఆందోళనను సైతం తగ్గించగలరు.

కొండలూ చిన్నబోతాయి

ఇప్పటివరకూ జరిగిన పరిశోధనలన్నీ తేల్చిన విషయం ఏంటంటే.. ఎంత ఎక్కువ మంది మంచి మిత్రులు ఉంటే.. ఆ వ్యక్తి అంత దీర్ఘకాలంపాటు ఆరోగ్యంగా, సంతృప్తికరమైన జీవితాన్ని గడుపుతాడు. ప్రపంచవ్యాప్తంగా జరిగిన 38 ప్రధాన పరిశోధనలు చెప్పిందేంటంటే..

- ఒక పెద్ద కొండ ఎక్కాల్సివచ్చినప్పుడు.. నిజమైన స్నేహితుడు పక్కన ఉంటే, ఆ ఎత్తు వాళ్లను అస్సలు భయమే పెట్టలేదట. 'ఇదేమంత ఎత్తూకాదు, జారిపోయేలానూ లేదు' అని ధీమా వ్యక్తం చేశారట.
- వైవాహిక జీవితంలో సమస్యలు వచ్చిన మహిళల్లో.. ఇష్టసఖులు లేదా సఖుల్లాంటి బంధువులు ఉన్నవారు మానసికంగా దృఢంగా ఉంటున్నారు.
- మంచి నేస్తాలు ఉన్నవారిలో ఆందోళన, ఒత్తిడి చాలా తక్కువగా ఉంటున్నాయి.
- నమ్మదగిన, అత్యంత ఆప్తుడైన హితుడితో మాట్లాడుతుంటే బీపీ కూడా తగ్గుతుందట.
- ఒక కష్టమైన పనిని లేదా లక్ష్యాన్ని సాధించాల్సి వచ్చినప్పుడు తోడుగా ఒక శ్రేయోభిలాషి ఉండేవారిలో గుండెపై ఒత్తిడి తక్కువగా ఉంటోందట.





మృత్యువు కూడా దూరం

అమెరికన్ జర్నల్ ఆఫ్ సైకియాట్రీ అధ్యయనం ప్రకారం.. నమ్మదగిన స్నేహితులున్న వ్యక్తులు.. జీవితంలో సంతృప్తితో ఉన్నారు. ఒత్తిడి, ఆందోళనకు గురయ్యే అవకాశాలు మిగతావారితో పోలిస్తే వీరిలో తక్కువ.

- ప్రముఖ వైద్యశాస్త్ర వీక్లీ మెడికల్ జర్నల్ 'పీఎన్ఓఎస్ మెడిసిన్'లో ప్రచురితమైన మరో అధ్యయనం ప్రకారం.. 'మామూలు వ్యక్తులతో పోలిస్తే.. గుండె జబ్బులు వచ్చే అవకాశం ఇలాంటి స్నేహితులు ఉన్నవారికి తక్కువ.'
- 4.8 లక్షలకుపైగా యూకే వాసులపై చేసిన అధ్యయనంలో.. నమ్మదగిన స్నేహితులు లేనివారు, ప్రేమలో పడనివారు, ఇతర సామాజిక సంబంధాలు లేని వ్యక్తుల్లో ఒంటరితనం, గుండె పోటు, స్ట్రోక్, అకాల మరణాల అవకాశం ఎక్కువగా ఉందని తేలిందట.
- 'స్నేహితులు ఉన్నవారితో పోలిస్తే.. ఒంటరితనం లేదా సామాజికంగా తక్కువ సంబంధాలు ఉన్న వ్యక్తుల్లో అకాల మరణానికి గురయ్యే అవకాశాలు ఎక్కువగా ఉంటున్నాయి' అంటారు అమెరికాకు చెందిన బ్రిగమ్ యంగ్ యూనివర్సిటీలోని సైకాలజీ, న్యూరోసైన్స్ ప్రొఫెసర్ జూలియానే హోల్ట్ లన్‌స్టడ్.

ఎంతమంది కావాలి?

నిజానికి ఒక మనిషికి ఎంత మంది స్నేహితులు ఉండాలి.. ఎంతమంది ఉంటే ఒక మనిషి మానసికంగా ధైర్యంగా ఉండగలడు? ఇదేంటి.. ఇదెలా చెప్పగలం అనుకుంటున్నారా? ఆస్ట్రేలియాకు చెందిన 'గ్రోత్ డిస్టిలరీ', 'మెడిబ్యాంక్' సంయుక్తంగా చేసిన అధ్యయనంలో ఆసక్తికర విషయాలు వెల్లడయ్యాయి.

- మేం మానసికంగా చాలా దృఢంగా ఉన్నాం అని చెప్పిన వాళ్లకు సగటున ఐదుగురు స్నేహితులు ఉన్నారట. వాళ్లను పూర్తిగా నమ్మవచ్చనీ, ఎలాంటి సమస్య / కష్టం వచ్చినా వాళ్లకు చెప్తే చాలనీ చెప్పారట.
- అదే సమయంలో.. మానసికంగా కుంగుబాటుతో ఉన్నవాళ్లకు ఇలాంటి స్నేహితుల సంఖ్య గరిష్టంగా మూడుకు మించలేదు
- ఈ రీసెర్చ్ చర్చించిన మరో ప్రధాన అంశం.. 'నిజమైన స్నేహం వాట్సాప్ లేదా మెసేజుల్లోని ఎమోజీలు.. 'ఏమీకాదు, ధైర్యంగా ఉండు' అనే సందేశాలు కాదు.. కష్టం వచ్చినప్పుడు మనం వాళ్ల దగ్గరకు వెళ్లడం.. వాళ్లతో ఉండటం'. ఇదే అత్యధికుల అభిప్రాయమట.

చివరిగా...

తమ స్నేహితుడి భార్య చనిపోయిందని తెలిసిన వెంటనే.. వాట్సాప్ గ్రూపులో అందరూ 'సో శాడ్', 'రిప్', 'ఎవ్రీథింగ్ విల్ బి ఆల్‌రైట్' వంటి మెసేజులు పెట్టారు. కానీ, 12 రోజుల కార్యక్రమానికి 20 మందిలో ఇద్దరే వచ్చారు. వాళ్లు.. సదరు వ్యక్తితో 'అవసరమైతే మళ్లీ ఎప్పుడైనా వస్తాం. ఫోన్ చేయడానికి సంకోచించకు' అని చెప్పారు. మిగతావాళ్లు మాత్రం.. 'సారీరా రాలేకపోయాం. ఆఫీసు పని ఉంది, ఊరెళ్లాల్సి వచ్చింది' లాంటి కారణాలు చెప్పారు. 'ఎవరు నిజమైన స్నేహితులో అప్పుడే అర్థమయింది' అని సదరు వ్యక్తి అనుకున్నాడట. ఇది సోషల్ మీడియాలో ఒక మిత్రుడి మిత్రుడు పంచుకున్న అనుభవం.

భారతీయులది స్నేహ హస్తమే

2019లో స్నాప్ ఇంక్ కంపెనీ భారత్, అమెరికా, యూకే, జర్మనీ వంటి 9 దేశాల్లోని 10 వేల మందిపై సర్వే చేసింది. దీనిప్రకారం సౌదీ అరేబియన్లకు అత్యధికంగా ఒకరికి సగటున 6.6 మంది స్నేహితులు ఉన్నారట. ఆ తరవాత స్థానంలో భారత్ ఉంది.

మనవాళ్లకు సగటున ఆరుగురు స్నేహితులు ఉన్నారట. యూకేవాళ్లలో స్నేహభావం చాలా తక్కువ. ఒకరికి కేవలం 2.6 మంది మిత్రులే ఉన్నారట.



- సాక్షి, స్పెషల్ డెస్క్

బీసీలకు 32 శాతమే రిజర్వేషన్లు ఇచ్చే కుట్ర

▶ మొదటి పేజీ తరువాయి

ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో బీజేపీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో జరిగిన బీసీల మహాధర్నాలో కిషన్‌రెడ్డి మాట్లాడారు. 42 శాతం రిజర్వేషన్లు అని చెప్పి, వాస్తవంగా 32% రిజర్వేషన్లతో కాంగ్రెస్ ప్రభుత్వం బీసీల గొంతు కోసే కుట్ర చేస్తోందని మండిపడ్డారు. కాంగ్రెస్‌నాయకులు అసత్య ప్రచారం చేస్తూ, ఢిల్లీకి వెళ్లి ధర్నా చేసే ప్రయత్నం చేస్తున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక మతపరమైన రిజర్వేషన్లు తొలగించి.. బీసీ, ఎస్సీ, ఎస్టీలకు ఇస్తామన్నారు.

సీఎం చిత్తశుద్ధిని నిరూపించుకోవాలి

సీఎం రేవంత్ రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే ముస్లింలకు సంబంధం లేకుండా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు డిమాండ్ చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లతో వెంటనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని కోరారు. రేవంత్ రెడ్డి ఢిల్లీకి వెళ్లినా రాహుల్‌గాంధీ అపాయింట్‌మెంట్ ఇవ్వకపోవడంతో జంతర్ మంతర్ వద్ద నిరసన డ్రామాకు తెరలేపారని ఎద్దేవా చేశారు. స్థానిక ఎన్నికలపై హైకోర్టు చీవాట్లు పెట్టాక బీసీ రిజర్వేషన్లపై ఆర్డినెన్స్ తెచ్చారని అన్నారు.

రిజర్వేషన్లు అమలు చేయకుంటే సీఎం భరతం పడతం

రిజర్వేషన్ల పేరుతో సీఎం రేవంత్‌రెడ్డి బీసీలను నిలువునా మోసం చేస్తున్నారని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ విమర్శించారు. బీసీ రిజర్వేషన్లు అమలు చేయకపోతే రేవంత్‌రెడ్డి భరతం పడతామని హెచ్చరించారు. బీఆర్ఎస్ హయాంలో బీసీల రిజర్వేషన్లను 23 శాతానికి తగ్గించారని, బీసీల కళ్లలో మట్టి కొట్టిన బీఆర్ఎస్‌కు ఇప్పుడు ఆయా వర్గాల గురించి మాట్లాడే నైతిక హక్కు లేదని అన్నారు. ఎంపీ ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ.. బీసీ రిజర్వేషన్ల విషయంలో సీఎం రేవంత్ రెడ్డి డ్రామాలు ఆడుతూ.. బీజేపీపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 243- ఈ (6) ప్రకారం బీసీ రిజర్వేషన్లను నిర్ణయించే పూర్తి అధికారం రాష్ట్ర ప్రభుత్వానికే ఉందని తెలిపారు. బీసీలకు మేలు చేయకూడదన్న ఎజెండాతోనే కాంగ్రెస్ నాయకులు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. బీజేఎల్పీనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. బీసీలకు సీఎం రేవంత్‌రెడ్డి ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. 'మీరిచ్చే 42 శాతం రిజర్వేషన్లను కోర్టులు ఆపుతున్నాయా..? ఢిల్లీ ఆపుతుందా..?' అని ప్రశ్నించారు. సమావేశంలో బీజేఎల్పీ ఉపనేత పాయల్ శంకర్, ఎమ్మెల్సీలు మల్క కొమురయ్య, అంజిరెడ్డి, మాజీ ఎంపీలు బూర నర్సయ్యగౌడ్, బీబీ పాటిల్, బీజేపీ నేతలు యెండల లక్ష్మీనారాయణ, డా.కాసం వెంకటేశ్వర్లు, ఆనంద్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు 'ఇంటింటికీ బీజేపీ..'

సాక్షి, హైదరాబాద్‌: పార్టీ పరంగా చేపడుతున్న మహా సంపర్క్ అభియాన్‌లో భాగంగా ఆది, సోమవారాల్లో రాష్ట్రవ్యాప్తంగా 'ఇంటింటికీ బీజేపీ–ప్రతి ఇంటికి పోలింగ్ బూత్ అధ్యక్షుడు' కార్యక్రమాన్ని చేపడుతున్నారు. ప్రధాని మోదీ పాలనలో సాధించిన ప్రగతి, చేపట్టిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించేలా పలు కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అలాగే రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు, నెరవేర్చని హామీల గురించి ప్రజలకు వివరించాలని నిర్ణయించారు. శనివారం బీజేపీ కార్యాలయంలో ఈ అభియాన్‌కు సంబంధించిన 'ఘర్ ఘర్ బీజేపీ' కరపత్రాన్ని రాష్ట్ర కార్యదర్శులు ఎస్.ప్రకాశ్‌రెడ్డి, మాధవిలతో కలిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు విడుదలచేశారు. కేంద్ర సర్కార్‌కు, బీజేపీకి మద్దతు తెలిపేందుకు 92400 15366 అనే మిస్డ్ కాల్ నంబర్‌ను ప్రజలకు అందుబాటులోకి తెచ్చామన్నారు. 'తెలంగాణలో మార్పు రాలే.. బతుకులు మారలే' అనే నినాదంతో ప్రజల్లోకి వెళ్లబోతున్నట్లు వెంకటేశ్వర్లు తెలిపారు.



అన్నపానములు పుచ్చుకొనుట కంటెను, తన కష్టార్జితము చేత సుఖపడుటకంటెను నరునికి మేలుకర మైనదేదియు లేదు. ఇదియును దేవునివలన కలుగునని నేను తెలిసి కొంటిని.

– క్రైస్తవ ధర్మం

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు శ్రావణ మాసం, **తిథి:** శు.నవమి ఉ.7.54 వరకు, తదుపరి దశమి, **నక్షత్రం:** విశాఖ ఉ.6.04 వరకు, తదుపరి అనూరాధ, **వర్జ్యం:** ఉ.10.25 నుండి 12.11 వరకు, **దుర్ముహూర్తం:** సా.4.44 నుండి 5.36 వరకు, **అమృత ఘడియలు:** రా.9.01 నుండి 10.47 వరకు.

సూర్యోదయం : 5.42
సూర్యాస్తమయం : 6.29
రాహుకాలం : సా.4.30 నుంచి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుంచి 1.30 వరకు

జేమ్స్ కామెరన్ (డైరెక్టర్)

రాయని డైరీ

మాధవ్ శింగరాజు

'అవతార్–3' పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో ఉన్నాం. సన్నగా మళ్లీ కడుపునొప్పి మొదలైంది!

డైవర్టిక్యులైటిస్!! డాక్టర్లు ఈ నొప్పికి పేరైతే పెట్టారు కానీ, నయమవటం మాత్రం నా చేతుల్లోనే ఉందంటారు. నా చేతుల్లో అంటే – నేను తినే వాటిల్లో!

"మిస్టర్ కామెరన్! ఇలా నొప్పి వచ్చినప్పుడు మీరు కొద్ది రోజుల పాటు కూరగాయల రసం మాత్రమే తాగండి. అలాగే గుజ్జు లేని పండ్ల రసాలు..." అంటారు వైద్యులు. ఈ మందు చీటీ నా దగ్గర 'అవతార్–1' ముందు నుంచే ఉంది.

పొత్తి కడుపు కింద, ఎడమవైపు సన్నగా మొదలైన నొప్పి... కాసేపు మెలిపెడుతోంది, కాసేపు కత్తితో పొడిచినట్లుగా ఉంటోంది. ఆత్మశక్తిని కూడదీసుకుని పని చేస్తున్నాను.

"ఏంటి మళ్లీనా?" అన్నారు, నా పక్కనే ఉన్న స్టీఫెన్ ఇలియెట్. ఫిల్మ్ ఎడిటర్ తను. అతడికి నా డైవర్టిక్యులైటిస్ గురించి తెలుసు.

"లేదు, లేదు... స్టీఫెన్, ఏదో కొద్దిగా! అంతే" అన్నాను, నవ్వే ప్రయత్నం చేస్తూ.



పెయిన్ కన్నా కూడా పని ఆగి పోవటం ఎక్కువ పెయిన్ నాకు. డిసెంబర్‌లో 'అవతార్–3' రిలీజ్ పెట్టుకున్నాం. ఆ లోపే నేను అన్నీ సర్దేసుకుని న్యూజిలాండ్ వెళ్లిపోవాలి.

ఇప్పటికి రెండుసార్లు యూఎస్ సిటిజెన్‌షిప్‌కు అప్లికేషన్ పెట్టి కూడా వెనక్కు తీసుకున్నాను. మొదటిసారి 2004లో జార్జి బుష్ అమెరికా ప్రెసిడెంటుగా రీ–ఎలెక్ట్ అయినప్పుడు. ఇరవై ఏళ్ల తర్వాత మళ్లీ డోనాల్డ్ ట్రంప్ రీ–ఎలెక్ట్ అయినప్పుడు.

హారిఫిక్ ప్రెసిడెంట్లు ఇద్దరూ! ఇలాంటి వాళ్లు మళ్లీ గెలవటం అంటే ఒకే కారుకు పదే పదే రోడ్డు ప్రమాదాలు జరుగుతూ ఉండటం.

అమెరికాను వదిలి, న్యూజిలాండ్ వెళ్లటం అంటే కేవలం ఇల్లు మారటం కాదు. ఒక మంచి ఇంట్లోకి మారటం! న్యూజిలాండ్ అందర్నీ సమానంగా చూస్తుంది. కెనడా నుంచి వెళ్లిన వారినైనా, వేరే ఖండం వారే అయినా అక్కడ ప్రశాంతంగా జీవించవచ్చు.

ప్రశాంతంగా జీవించటం అంటే, జీవితమంతా ఇష్టంగా చేస్తూ వచ్చిన పనిని జీవితాంతమూ కొనసాగిస్తూ ఉండటం. నేనైతే ఎనభై ఏళ్లకీ, తొంభై ఏళ్లకీ ఎన్ని 'అవతార్'లు తీయగలిగితే అన్నీ తీస్తూనే ఉంటాను. ఇక తీయలేనప్పుడు, సినిమా తియ్యటం ఎంత తేలికో పిల్లలకు చెబుతూ ఉండిపోతాను.

న్యూజిలాండ్ వెళ్లినప్పుడు నన్నొక పట్టభద్రుడు కలిశాడు. "సర్! నేను సినిమా డైరెక్టర్‌ని అవ్వాలనుకుంటున్నాను. అవగలనా?" అని అడిగాడు.

'అవగలనా?' అనుకుంటే ఎవరూ అవలేరు. "అవలేనా!" అనుకుంటే ఎవరైనా అవగలరు అన్నాను.

అతడి కళ్లు మెరిశాయి.

"ఒక కెమెరా తీసుకో. ఒక కథ అనుకో. చిన్న కథా, చెత్త కథా అని చూడకు. నీ ఫ్రెండ్స్ చేత యాక్ట్ చేయించు. నీకు సిస్టర్ ఉంటే తనకూ ఒక పాత్ర ఇవ్వు. షూటింగ్ అయ్యాక టైటిల్స్‌లో డైరెక్టర్‌గా నీ పేరు పెట్టుకో. ఇక అప్పట్నుంచి నువ్వు సినిమా డైరెక్టర్! నువ్వెంత బడ్జెట్‌లో తీస్తావో, నీకెంత ఇవ్వాలో నిర్మాతలతో బేరం కుదుర్చుకో" అని చెప్పాను.

మెరుస్తున్న అతడి కళ్లలో నాకు 'జెనోజెనిసిస్' సినిమా కనిపించింది. నా 24 ఏళ్ల వయసులో మా టీమ్ తీసిన తొలి సినిమా అది. 12 నిమిషాల సైన్స్ ఫిక్షన్ షార్ట్ ఫిల్మ్!

"కామెరన్... కామెరన్... మళ్లీ మీరు న్యూజిలాండ్ వెళ్లిపోయారా?" అని, నా భుజం ఊపుతూ పండ్ల రసం అందించారు స్టీఫెన్.

"థ్యాంక్యూ స్టీఫెన్" అన్నాను, అతడి చేతిలోని గ్లాసును తీసుకుంటూ.

స్టీఫెన్ నా భుజం ఊపినప్పుడు ఏ యాంగిల్‌లోనో నా కడుపు నొప్పి కాస్త తగ్గినట్లుగా అనిపించింది.

కదలిక వల్ల నొప్పి నుంచి ఉపశమనం లభిస్తోంది అంటే నాకెందుకో నమ్మకం కలుగుతోంది – నేను ముందసలు అమెరికా నుంచి కదిలితే, ఈ డైవర్టిక్యులైటిస్ నన్నొదిలేస్తుందని!

ఆ నోట్ల కట్టలు నోళ్లు తెరిస్తే..?



జనతంత్రం



వర్ధెల్లి మురళి

చాలా విషయాలు బయటకొస్తాయి. ఆ నోట్ల కట్టలపై నిజాయితీగా విచారణ జరిగితే మద్యం కేసు కడుపులో దాక్కున్న గుట్టు రట్టవుతుంది. కట్టు కథలు ఎవరు చెబుతున్నారో, పుక్కిటి పురాణాలను ఎవరు వల్లెవేస్తున్నారో తేలిపోతుంది. అంతేకాదు, అపవిత్ర రాజకీయ మైత్రీబంధాల బండారం కూడా బద్దలు కావచ్చు. పన్నెండు అట్టపెట్టెల్లోని 11 కోట్ల సంగతి ఇది. ఆంధ్రప్రదేశ్ పోలీసుల సిట్ బృందం చెప్పిన లెక్క. జగన్ ప్రభుత్వ హయాంలో తీసుకొచ్చిన ఎక్సైజ్ పాలసీలో కుంభ కోణం ఉన్నదని దర్యాప్తు కోసం సీఐడీకి అప్పగించి ఏడాది పూర్తయింది. 'సిట్' రంగప్రవేశం చేసి ఆరు నెలలయింది. ఈ మధ్యనే ఒక అసంపూర్ణ ఛార్జిషీట్ వేశారు. ఆయన చెప్పాడని ఈయన పేరు, ఈయన చెప్పాడని ఆయన పేరు చొప్పున ఓ నలభై ఎనిమిది మందిని ఇందులో నిందితులుగా చేర్చారు.

త్వరలో ఇంకో చార్జిషీట్‌ను వేస్తారట! అందులో ఇంకొంత మందిని చేరుస్తారేమో! ఈ కుంభకోణం ద్వారా ఆనాటి ప్రభుత్వం 3,500 కోట్ల రూపాయల మేరకు అవినీతికి పాల్పడిం దని సిట్ ఆరోపిస్తున్నది. నిందితులుగా నమోదైన వారిలో కొందరి చేత నయానో భయానో తమ స్క్రిప్టుకు అనుకూలంగా చెప్పించుకుంటున్నారనీ, కొందరు చెప్పిన వాఙ్మూలాలకు విరుద్ధంగా రాసుకొని బలవంతంగా సంతకాలు తీసుకుంటున్నారనీ వైసీపీ నాయకులు ఆరోపిస్తున్నారు. ఈ రకమైన వాఙ్మూలాల మీదనే కథ నడిపిస్తున్నారు తప్ప ఇంతవరకూ తమ ఆరోపణలకు బలం చేకూర్చే వస్తుగతమైన, సాంకేతికమైన, లిఖిత పూర్వకమైన ఆధారాలేవీ సిట్ సంపాదించలేక పోయిందనేది యథార్థం. ఇక తుది ఛార్జిషీట్‌ను వేయవలసిన దశలో 12 అట్టపెట్టెలు, 11 కోట్ల నోట్ల కట్టలు అనే వృత్తాంతాన్ని ముందుకు తెచ్చింది.

వరుణ్ అనే నిందితుడు ఇచ్చిన సమాచారం మేరకు హైదరాబాద్ శివార్లలోని ఒక ఫామ్‌హౌస్‌లో ప్రధాన నిందితుడైన రాజ్ కేసిరెడ్డి ఆదేశాలతో దాచిపెట్టిన 11 కోట్ల రూపాయలను గత బుధవారం సీజ్ చేసినట్టు న్యాయస్థానానికి సిట్ చెప్పింది. 2024 జూన్‌లోనే తాము ఈ డబ్బును అక్కడ పెట్టినట్టు కూడా వరుణ్ చెప్పినట్టు సిట్ తెలియజేసింది. ఈ 11 కోట్లు కూడా లిక్కర్ కుంభకోణం డబ్బేనని సిట్ వాదన. దీనిపై స్పందిస్తూ రాజ్ కేసిరెడ్డి కోర్టులో ఒక పిటిషన్ వేశారు. సిట్ సీజ్ చేసినట్టు చెబుతున్న ఫామ్‌హౌస్ తీగల విజయేందర్‌రెడ్డి అనే వ్యాపారవేత్తదని, ఆయన టర్నోవర్ కోట్ల రూపాయల్లో ఉంటుందని కూడా కేసిరెడ్డి తన పిటిషన్‌లో తెలిపారు. విజయేందర్‌రెడ్డికి చెందిన ఒక ఆస్పత్రిలో తన భార్య చిన్న భాగస్వామి మాత్రమేనని, అంతకుమించి ఆ ఫామ్‌హౌస్‌తో తనకు ఎటువంటి సంబంధం లేదని ఆయన వాదించారు.

సీజ్ చేసిన సొమ్ముకూ, తనకూ ఎటువంటి సంబంధం లేదని చెబుతూ 2024 జూన్ నుంచి ఫామ్‌హౌస్‌లో ఉంచినట్టు చెబుతున్న నోట్లను వీడియో తీయించాలని, ఆ సీరియల్ నెంబర్ల ఆధారంగా ఆ నోట్లను ఎప్పుడు విడుదల చేశారో రిజర్వు బ్యాంకు ద్వారా సమాచారం తెప్పించుకోవాలని ఆయన అభ్యర్థించారు. 2024 జూన్ తర్వాత విడుదల చేసినట్టు తేలితే ప్రాసిక్యూషన్ కథనం తేలిపోతుందనీ, తనకు న్యాయం జరుగుతుందనీ ఆయన వాదించారు. దీనిపై జడ్జి స్పందిస్తూ ఆ నోట్ల కట్టలను ఫోటోలు తీయించాలని దర్యాప్తు అధికారిని ఆదేశించారు. ఫోటోలు, వీడియోలు తీయకుండానే ఆ నోట్ల కట్టలను సిట్ బ్యాంకులో డిపాజిట్ చేసే ప్రయత్నం చేస్తున్నదని, దాన్ని అడ్డుకోవాలని, కోర్టు కమిషన్ ఆధ్వర్యంలో వీడియో తీయించాలని కేసిరెడ్డి న్యాయవాదులు శనివారం నాడు మరో పిటిషన్ వేశారు. తాము అప్పటికే కోర్టులో నగదు డిపాజిట్ చేశామని దర్యాప్తు అధికారి కోర్టుకు చెప్పారు. అలా చేసి వుంటే ఆ లావాదేవీ తాలూకు కౌంటర్ ఫాయిల్ చూపెట్టాలని కేసిరెడ్డి న్యాయవాదులు డిమాండ్ చేశారు. దర్యాప్తు అధికారి ఇప్పుడు తన దగ్గర లేదన్నారు. కనీసం వాట్సాప్‌లోనైనా పంపించాలని వారు కోరారు. చాలాసేపటి వరకు ఎటువంటి వాట్సాప్ సమాచారం రాలేదు. అంటే బ్యాంకులో డిపాజిట్ చేయకుండానే చేసినట్టు కోర్టులో సిట్ చెప్పి ఉండాలి. పిటిషన్ విచారించిన జడ్జి కీలకమైన ఆదేశాలను సిట్‌కు, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు జారీ చేశారు. సదరు 11 కోట్లను ప్రత్యేకంగా ఉంచాలనీ, మిగతా డబ్బుతో కలపొద్దనీ చెప్పారు. అలాగే పంచనామా చేసి ఆ నోట్ల సీరియల్ నంబర్లను నమోదు చేయాలని, ఈ ప్రక్రియను వీడియో తీయాలని సిట్‌కు ప్రత్యేకంగా తెలిపారు.

ఆ నోట్లను వీడియో తీయాలని ముందురోజు జడ్జి చెప్పినప్పటికీ, లెక్క చేయకుండా ఆ నోట్లను హడావిడిగా బ్యాంకులో డిపాజిట్ చేశామని ఎందుకు చెప్పినట్టు? ఒకసారి బ్యాంకులో డిపాజిట్ చేసిన తర్వాత, ఆ సొమ్ము మిగతా డబ్బులో కలిసిన తర్వాత దానిపై విచారణ కుదరదనే ఎత్తుగడను వేశారని అనుకోవాలా? సిట్ వ్యవహరించిన తీరు పారదర్శకంగా లేదు. న్యాయబద్ధంగా దర్యాప్తు చేస్తున్నట్టుగా లేదు. ఈ కేసులో ఇంతవరకూ ఒక్క సాక్ష్యాన్ని కూడా సమర్పించలేకపోయారని కోర్టు అక్షింతలు వేసినందువల్లనే ఈ గూడుపుఠాణీ జరిపినట్టు నిందితులు ఆరోపిస్తే దాన్ని పూర్వ పక్షం చేయగలరా? దర్యాప్తు సంస్థ నిష్పాక్షికంగా పని చేస్తున్నట్టయితే, కోర్టు కమిషన్ సమక్షంలో రిజర్వు బ్యాంకు ప్రతినిధుల సమక్షంలోనే వీడియో తీసి, నోట్ల సీరియల్ నెంబర్లను నమోదు చేసి అనంతరం బ్యాంకులో డిపాజిట్ చేసి ఉండేవారు. ఎవరూ అడగనవసరం లేదు. అది వారి కనీస బాధ్యత. ఈ నోట్ల కట్టల వ్యవహారంలో ఆది నుంచి అంతం వరకూ సిట్ వ్యవహారం తీరు పారదర్శకంగా లేదు. 'విశ్వసనీయ' సమాచారం మేరకు పక్క రాష్ట్రంలోకి వెళ్ళి డబ్బు సీజ్ చేయాల్సి వచ్చినప్పుడు ఆ రాష్ట్ర పోలీసులకు ముందస్తు సమాచారం ఇవ్వడమో, వారిని కూడా వెంటబెట్టుకుని వెళ్లడమో చేసి ఉండవలసింది. లేదంటే సీబీఐ లేదా ఈడీ వంటి కేంద్ర సంస్థలకు సమాచారం అందించి ఉండవలసింది. దొరికింది నల్లధనం కనుక ఆదాయం పన్ను శాఖకు కూడా సమాచారం ఇచ్చి ఉండవలసింది. దొరికిన నల్లడబ్బు ఒక పెద్ద కేసులో సాక్ష్యంగా చూపెడుతున్నారు కనుక ఈమాత్రం పారదర్శకత లేకపోతే అదొక కుట్రపూరిత వ్యవహారంగానే జనం భావిస్తారు. ఇప్పుడు ఏసీబీ కోర్టు తాజా ఆదేశాల తర్వాత సిట్ వారి స్క్రిప్టు ఏ మలుపులు తిరుగుతుందో చూడవలసి ఉన్నది.

పొరుగు రాష్ట్రానికి వెళ్లి కుట్రపూరిత వ్యవహారాలకు పురుడు పోయాలంటే అదీ, ఒక వాణిజ్య ప్రముఖుని ఫామ్‌హౌజ్ కేంద్రంగా జరిపించాలంటే స్థానిక వ్యవస్థల సహకారం లేకుండా సాధ్యపడుతుందనేది అనుమానమే. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ వ్యవస్థల మధ్య సహకార ధోరణి బాగా ఉన్నట్టే చెబుతున్నారు. రెండు రాష్ట్ర ప్రభుత్వాలు పరస్పరం సహకరించుకొని ప్రజలకు మేలు చేసే పనులు చేస్తే మంచిదే. కానీ ఒక ప్రభుత్వ స్వార్థ రాజకీయాలకు సాయపడే విధంగా వ్యవహరించడం, ఒక ప్రభుత్వంలోని ప్రముఖ వ్యక్తికి మేలు చేయడం కోసం ఒట్టు తీసి గట్టున పెట్టడం ప్రజల్లో చర్చకు దారితీస్తున్నాయి. 'పుష్ప' సినిమా విడుదల సమయంలో జరిగిన తొక్కిసలాట, అల్లు అర్జున్ అరెస్టు వగైరాలు తాజా సంఘటనలే. ఆ సమయంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఒక ప్రతిజ్ఞ చేశారు. తాను సీఎం కుర్చీలో కూర్చున్నంతకాలం సినిమా టిక్కెట్ల ధరలు పెంచడానికి, స్పెషల్ షోలు వేయడానికి అనుమతించబోనని ఖండితంగా చెప్పారు. జనం కూడా హర్షించారు. నాయకుడంటే ఈమాత్రం పట్టుదల ఉండాలని అభినందించారు. కానీ ఆరు నెలలు తిరిగే సరికి ఆ పట్టుదల పట్టు తప్పింది. 'హరిహర వీరమల్లు' సినిమా టిక్కెట్ రేట్లు పెంచుకోవడానికి, స్పెషల్ షోలు వేసుకోవడానికి అనుమతులు లభించాయి. ఆ సినిమా హీరో పక్కరాష్ట్రంలో ఉప ముఖ్యమంత్రిగా ఉన్న విషయం తెలిసిందే. రెండు రాష్ట్రాల మధ్య రాజకీయ, వ్యక్తిగత సహకారాలపై పొలిటికల్ సర్కిల్స్‌లోనే కాదు, బ్యూరోక్రాట్లు, వ్యాపార వర్గాలు కూడా మాట్లాడుతున్నాయి.

రెండు తెలుగు రాష్ట్రాల్లో కాంగ్రెస్ – తెలుగుదేశం పార్టీల మధ్య సహకారం కొత్తదేమీ కాదు. ఉమ్మడి రాష్ట్రంగా ఉన్న సమయంలోనే జగన్‌మోహన్‌రెడ్డి కాంగ్రెస్ నుంచి బయటకు వచ్చి సొంత పార్టీ స్థాపించుకున్న దగ్గర నుంచి ఈ పార్టీల బంధం కొనసాగుతున్నది. ఆయన మీద కేసులు వేయడం, జైలుకు పంపించడంలోనూ కాంగ్రెసు నాయకత్వంలోని కేంద్ర – రాష్ట్ర ప్రభుత్వాలు, చంద్రబాబు నేతృత్వంలోని తెలుగుదేశం – యెల్లో మీడియాలు సమష్టిగానే పనిచేశాయి. రాష్ట్ర విభజన తర్వాత 2018లో జరిగిన తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీతో పొత్తు పెట్టుకొని కాంగ్రెసు పార్టీ తన విజయావకాశాలను కాలదన్నుకున్న సంగతి తెలిసిందే. ఇప్పుడు తెలంగాణ క్షేత్రస్థాయిలో కేసీఆర్‌కు మళ్లీ ఆదరణ పెరుగుతున్నదని సంకేతాలు అందుతున్న నేపథ్యంలో చంద్రబాబు సరికొత్త ఆలోచనలు చేస్తున్నట్టు సమాచారం. కేసీఆర్‌ను అధికారానికి దూరంగా ఉంచడం కోసం ఏపీ మాదిరిగానే టీడీపీ, జనసేనలు బీజేపీ కూటమి (ఎన్డీఏ)గా పోటీ చేస్తే ప్రయోజనమా? లేక బీజేపీని ఒక్కదాన్నే పోటీలో నిలిపి తాము వ్యూహాత్మకంగా వ్యవహరిస్తే ప్రయోజనమా అనే అంశంపై ఆయన మల్లగుల్లాలు పడుతున్నట్టు విశ్వసనీయ సమాచారం.

ఆంధ్రప్రదేశ్‌లోని కాంగ్రెస్ పార్టీ విభాగం ఆచరణలో ఎన్డీఏలో నాలుగో పార్టీగా వ్యవహరిస్తున్నదనే భావన సామాన్య ప్రజల్లోనే కాదు, ఆ పార్టీ కార్యకర్తల్లో కూడా ఉన్నది. ఒకపక్క రాహుల్‌గాంధీ ఎన్డీఏపై రాజీలేని పోరాటానికి కసరత్తులు చేస్తున్నారు. ఢిల్లీ గద్దె కోసం నాలుగో పానిపట్టు యుద్ధానికి సిద్ధమవుతున్నారు. బీజేపీపై సైద్ధాంతిక పోరాటాన్ని కూడా ప్రారంభించి అస్త్రశస్త్రాలను ఆవాహన చేసుకుంటున్నారు. ఇదే సమయంలో బీజేపీ ముసుగులో ఉన్న ఓ రాజ్యసభ సభ్యుడు కాంగ్రెస్ ముఖ్యమంత్రికి మద్దతుగా రంగంలోకి దిగి రెచ్చి పోవడం కాంగ్రెస్ పార్టీకి మేలు చేసే విషయమైతే కాదు. బీజేపీ పార్లమెంట్ సభ్యుడు సీఎం రమేశ్‌కు కాంగ్రెస్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 16 వేల కోట్ల కాంట్రాక్టు ఇచ్చాడని బీఆర్ఎస్ నాయకుడు కేటీఆర్ ఆరోపించారు. దాన్ని ఖండించడానికి, వివరణ ఇచ్చుకోవడానికి సిఎం రమేశ్‌కు ఉన్న హక్కును ఎవరూ కాదనలేరు.

కానీ, ఆయన అంతటితో ఆగిపోకుండా బీఆర్ఎస్ బండారం బయటపెడతానని హెచ్చరించడం, బీజేపీలో తమ పార్టీని విలీనం చేయడానికి కేటీఆర్ తన సహాయాన్ని అర్థించాడని చెప్పడం బూమెరాంగయింది. కేసీఆర్ స్థాయి నేత తన పార్టీని ఒక జాతీయ పార్టీలో విలీనం చేయాలని భావిస్తే సీఎం రమేశ్ లాంటి వాళ్ల సహాయం అవసరమా? ఇటువంటి నాసిరకం ఆరోపణను ఎవరూ విశ్వసించకపోగా ఒకరకంగా బీఆర్ఎస్‌కు మేలు చేసింది. బీజేపీ – బీఆర్ఎస్‌ల మధ్య అవగాహన ఉన్నదని నమ్మించేందుకు కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ప్రయత్నాలకు రమేశ్ ప్రకటన గండి కొట్టింది.

vardhelli1959@gmail.com

> ఆ నోట్లను వీడియో తీయాలని ముందురోజు జడ్జి చెప్పినప్పటికీ, లెక్క చేయకుండా ఆ నోట్లను హడావిడిగా బ్యాంకులో డిపాజిట్ చేశామని ఎందుకు చెప్పినట్టు? ఒకసారి బ్యాంకులో డిపాజిట్ చేసిన తర్వాత, ఆ సొమ్ము మిగతా డబ్బులో కలిసిన తర్వాత దానిపై విచారణ కుదరదనే ఎత్తుగడను వేశారని అనుకోవాలా? సిట్ వ్యవహరించిన తీరు పారదర్శకంగా లేదు. న్యాయబద్ధంగా దర్యాప్తు చేస్తున్నట్టుగా లేదు. ఈ కేసులో ఇంతవరకూ ఒక్క సాక్ష్యాన్ని కూడా సమర్పించలేకపోయారని కోర్టు అక్షింతలు వేసినందువల్లనే ఈ గూడుపుఠాణీ జరిపినట్టు నిందితులు ఆరోపిస్తే దాన్ని పూర్వ పక్షం చేయగలరా? దర్యాప్తు సంస్థ నిష్పాక్షికంగా పని చేస్తున్నట్టయితే, కోర్టు కమిషన్ సమక్షంలో రిజర్వు బ్యాంకు ప్రతినిధుల సమక్షంలోనే వీడియో తీసి, నోట్ల సీరియల్ నెంబర్లను నమోదు చేసి అనంతరం బ్యాంకులో డిపాజిట్ చేసి ఉండేవారు. ఎవరూ అడగ నవసరం లేదు. అది వారి కనీస బాధ్యత. ఈ నోట్ల కట్టల వ్యవహారంలో ఆది నుంచి అంతంవరకూ సిట్ వ్యవహారం తీరు పారదర్శకంగా లేదు.

అన్యాయమా? ఆలస్యపు న్యాయమా?!

అభిప్రాయం



ఎన్. వేణుగోపాల్


బొంబాయి హైకోర్టు జస్టిస్ అనిల్ కిలోర్, జస్టిస్ శ్యామ్ చండక్‌ల ద్విసభ్య ధర్మాసనం జూలై 21న ఒక చరిత్రాత్మకమైన తీర్పు ఇచ్చింది. అది పది సంవత్సరాల కింద జరిగిన అన్యాయాన్ని కొంతవరకు సరిదిద్దడం మాత్రమే గాని పూర్తి న్యాయం అనడానికి కూడా వీలు లేదు.

ప్రత్యేక మకోకా న్యాయస్థానం 2015లో అయిదుగురు నిందితులకు విధించిన మరణశిక్ష, ఏడుగురికి విధించిన యావజ్జీవ శిక్ష చెల్లవని, పందొమ్మిదేళ్లుగా జైలులో మగ్గుతున్న నిందితులు నేరం చేశారని ప్రాసిక్యూషన్ నిస్సందేహంగా రుజువు చేయలేకపోయిందని, తప్పుడు సాక్ష్యాలు సృష్టించిందని, పోలీసు కస్టడీలో చిత్రహింసలు పెట్టి నేరాలు ఒప్పించారని, కూటసాక్ష్యాలు తయారుచేశారని, దర్యాప్తు ప్రక్రియ కళ్లకు గంతలు కట్టుకున్నట్టు ఇతర అవకాశాల వైపు చూడకుండా ఎవరో ఒకరిని ఇరికించి శిక్ష విధించే లక్ష్యంతో సాగిందని హైకోర్టు న్యాయమూర్తులు అభిప్రాయపడ్డారు. దేశంలో కొనసాగుతున్న పోలీసు వ్యవస్థ మీద, దర్యాప్తు యంత్రాంగం మీద, ప్రాసిక్యూషన్ మీద, కిందిస్థాయి న్యాయ వ్యవస్థ మీద తీవ్రమైన విమర్శనాత్మక వ్యాఖ్యానం ఇది.

పందొమ్మిది సంవత్సరాల కింద, 2006 జూలై 11న ముంబాయి సబర్బన్ రైళ్లు రద్దీగా ఉండే సమయంలో ఫస్ట్ క్లాస్ కంపార్ట్‌మెంట్లలో వరుస బాంబు పేలుళ్లు జరిగి 187 మంది మరణించారు, ఎనిమిది వందల మంది గాయపడ్డారు. ఈ దారుణ మారణకాండకు వ్యతిరేకంగా దేశమంతా నిరసన పెల్లుబికింది. మహారాష్ట్రలో అప్పుడు అధికారంలో ఉండిన కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే కేసు దర్యాప్తు చేయడానికి నియమించిన యాంటీ టెర్రరిజం స్క్వాడ్ కొద్ది నెలల్లోనే 13 మంది నేరస్థులను పట్టుకున్నామని ప్రకటించింది. సరైన దర్యాప్తు జరపకుండానే కొందరు ముస్లిం అనుమానితులను పట్టుకుని వారి చేత నేరం ఒప్పించి కేసు నడిపే ఆనవాయితీని పాటించింది. పాకిస్తాన్ ఐఎస్ఐ, లష్కర్ ఎ తోయిబా, దేశంలో నిషిద్ధ స్టూడెంట్స్ ఇస్లామిక్ మూవ్‌మెంట్ ఆఫ్ ఇండియా, కొందరు భారతీయ అనుచరులతో కలిసి కుట్ర చేసి ఈ బాంబు దాడులు చేశారని మహారాష్ట్ర కంట్రోల్ ఆఫ్ ఆర్గనైజ్డ్ క్రైమ్ యాక్ట్ (మకోకా), భారత శిక్షాస్మృతి, ఆయుధాల చట్టం, చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం (ఉపా) కింద కేసు నడిపారు.

ప్రత్యేక మకోకా న్యాయస్థానం 2007లో విచారణ ప్రారంభించి, 2015 సెప్టెంబర్‌లో పదమూడు మంది నిందితులలో పన్నెండు మందికి శిక్షలు విధించి, ఒకరిని నిర్దోషిగా విడుదల చేసింది. అలా నిర్దోషిగా విడుదలైన వ్యక్తి డా॥ అబ్దుల్ వహీద్ షేఖ్ ప్రస్తుత హైకోర్టు తీర్పుకు ప్రధాన కారకులలో ఒకరు. అప్పటికి తొమ్మిది సంవత్సరాల పాటు జైలులో మగ్గిపోయి నిర్దోషిగా విడుదలయ్యాడు. అరెస్టుకు ముందు ఆయన ముంబైలో ఉపాధ్యాయుడుగా పని చేసేవారు. రాజకీయాలలో పాల్గొనడం కాదు గదా, వాటి మీద ఆసక్తి కూడా ఎన్నడూ చూపలేదు. తాను, తన ఉద్యోగం, కుటుంబంగా ఉండేవారు.

జైలులో ఉన్న కాలంలో ఆయన పోస్ట్ గ్రాడ్యుయేషన్,



డా॥ అబ్దుల్ వహీద్ షేఖ్

> 'ఈ పోరాటం నా ఒక్కడిదే కాదు. అది సత్యం కోసం, న్యాయం కోసం, అన్యాయంగా ఆరోపణలు ఎదుర్కొంటున్న మా సమూహం కోసం జరిపిన పోరాటం' అన్నాడు వహీద్.

ఎల్ఎల్‌బీ చదివాడు. విడుదలయ్యాక శిక్షలు పడిన ఇతర నిందితులు కూడా తనలాగనే నిర్దోషులేననీ, వారి మీద ప్రాసిక్యూషన్ తప్పుడు కేసు బనాయించిందనీ, వారిని కూడా నిర్దోషులుగా న్యాయస్థానంలో నిరూపించడమే తన లక్ష్యమని 'ఇన్నోసెన్స్ నెట్వర్క్' అనే స్వచ్ఛంద సంస్థ ప్రారంభించి హైకోర్టు అప్పీలు ప్రక్రియలో పాలు పంచుకున్నాడు. 'అక్విట్ అండర్ ట్రయల్' అని ఒక యూట్యూబ్ ఛానల్ పెట్టి నిరపరాధులైన ఖైదీల విషాద గాథలు వినిపించాడు. ఎల్ఎల్ఎం చదివి, దేశంలో నేర విచారణ వ్యవస్థ మీద పీహెచ్‌డీ చేశాడు. దేశమంతా ఎన్నోచోట్ల సభల్లో ఈ కేసు గురించి మాట్లాడాడు. 'బేగునా ఖైదీ' (నిరపరాధులైన ఖైదీలు) అని ఆయన ఉర్దూలో రాసిన పుస్తకం ఎన్నో భాషల్లోకి అనువాదమై ఈ కేసులో పోలీసులు, ప్రాసిక్యూషన్ చేసిన అక్రమాల గుట్టు విప్పింది.

ఒకవైపు సామాజిక స్థాయిలో ఈ పోరాటం చేస్తూనే, న్యాయపోరాటాన్ని కూడా కొనసాగించాడు. మొత్తం కేసులో ప్రాసిక్యూషన్ వాదన అంతా నిందితుల ఒప్పుదల ప్రకటనల మీదనే ఆధారపడిందని, ఆ ఒప్పుదల ప్రకటనలు చిత్రహింసలు పెట్టి తయారు చేసినవని ఆయన వాదించాడు. ప్రాసిక్యూషన్ సమర్పించిన ఇతర సాక్ష్యాలు ఆకుకు అందకుండా పోకకు పొందకుండా, పరస్పర వైరుద్ధ్యాలతో ఉన్నాయని చూపాడు. పేలుడు పదార్థాలకు సంబంధించిన కీలక ఫోరెన్సిక్ నిర్ధారణలు బలహీనంగా, వీరే నిందితులు అని నిర్ధారించడానికి వీలు లేకుండా ఉన్నాయని చూపాడు. సమాంతరంగా జరిగిన పరిశోధనలు కూడా నిజంగా నేరస్థులు ఇతరులని నిర్ధారించాయి.

అప్పీలులో ఈ వాదనలను కూలంకషంగా పరిశీలించి హైకోర్టు ఇచ్చిన 671 పేజీల తీర్పు... ఆ ఒప్పుదల ప్రకటనల విశ్వసనీయతను ప్రశ్నించింది. సందర్భ సాక్ష్యం బలహీనంగా ఉందని చెప్పింది. కాల్ డాటా రికార్డులలో, అవి ఎక్కడి నుంచి వచ్చాయో తేల్చడంలో ప్రాసిక్యూషన్ తప్పులు చేసిందని చెప్పింది. సాక్షులు పరస్పర విరుద్ధంగా, పొంతన లేకుండా మాట్లాడారని గుర్తించింది. ప్రాసిక్యూషన్ చట్టపరమైన నిబంధనలను ఉల్లంఘించిందని గుర్తించింది.

'ఈ పోరాటం నా ఒక్కడిదే కాదు. అది సత్యం కోసం, న్యాయం కోసం, అన్యాయంగా ఆరోపణలు ఎదుర్కొంటున్న మా సమూహం కోసం జరిపిన పోరాటం' అన్నాడు వహీద్.

ఇప్పుడు నిర్దోషులుగా, లేదా నేరం చేశారని ప్రాసిక్యూషన్ రుజువు చేయలేక పోయినవారిగా బైటపడిన పన్నెండు మందిలో ఒకరు 2021లో కోవిడ్‌తో జైలులోనే చనిపోయారు. మిగిలిన వారందరూ వారి ఇరవైల్లో జైలుకు వెళ్లి ఇప్పుడు నలభయ్యో పడి దగ్గర పడుతుండగా విడుదల అవుతున్నారు. అందుకే హైకోర్టు తీర్పు రాగానే వహీద్ 'ఈ తీర్పు అసంపూర్ణం. కోర్టు కేసు పునర్విచారణకు ఆదేశించ లేదు. రెండు దశాబ్దాల జీవితం నష్టపోయినవారికి పరిహారం గురించి మాట్లాడలేదు. కనీసం ఇప్పటికైనా నిజమైన నేరస్థులను పట్టు కొమ్మని ప్రాసిక్యూషన్‌కు చెప్పలేదు. అయితే ఇవాళ్టి భారతదేశంలో ఈ అసంపూర్ణ తీర్పు అయినా ముస్లింలకు గొప్ప విజ యమే' అన్నాడు. ఈ నిర్దోషులు ఇంతకాలం అనుభవించిన తప్పుడు ముద్ర తర్వాత, విచ్ఛిన్నమైన తమ జీవితాలను పునర్నిర్మించుకోగలరా? ఆలస్యంగా జరిగిన న్యాయం అన్యాయమే అన్నమాట మరొకసారి రుజువు అవుతున్నదా?

వ్యాసకర్త 'వీక్షణం' సంపాదకుడు

దైవ బలం తోడు!

'నడవడి గలిగిన యప్పుడె, పడయగవలె విష్ణుభక్తి పదిలుడవైతే' అన్నాడు ఒక పూర్వకాలపు చాటుకవి. బుద్ధి పెడదారి పట్టక, జీవన గమనం మంచి నడవడికతో సాగుతున్న రోజులలోనే, పరమాత్ముడిపై భక్తి భావాన్ని వృద్ధి చేసుకుని లబ్ధి పొందాలనీ, విజ్ఞతతో కూడుకున్న ఆలోచన అదనీ ఆ చాటుకవి మాటల ఉద్దేశం. **'కాలము భగవదధీనము, కాలాశ్రయ మఖిల భూతగణ లోకమ్ముల్'** అన్నాడు తేకుమళ్ళ రంగశాయి, 'వాణీవిలాస వనమాలిక' కావ్యంలో! కాలము భగవంతుని అధీనంలో ఉండేటువంటిది. భగవదధీనంలో ఉండే కాలమును ఆశ్రయించి ఉండేదే అఖిల భూత ప్రపంచమూను. కనుక, ఒక వ్యక్తి జీవితంలో అనుకూలంగా జరుగుతున్న రోజులు అంటే భగవంతుని కరుణా కటాక్షాలు సంపూర్ణంగా ఆ వ్యక్తిపై ప్రసరించి ఉండే ఉత్కృష్టమైన దశ అని గ్రహించి, ఆ రోజులలోనే విధిగా, నియమం తప్పకుండా ప్రతి రోజూ కొంత సమయం భగవదారాధనకు కేటాయించుకుని, కొనసాగించాలి. దైవ సహాయం తోడైన ఆ దశలో చేసే అన్ని ప్రయత్నాలూ సఫలం అవుతాయి. అన్ని పనులూ అనుకున్నట్లుగా జరుగుతాయి. ఆ తోడు తొలగిన కాలంలో, మనిషి ఎంతగా పాకులాడినా, ఏదీ సరిగా జరగదని ఎఱ్ఱయ కవి 'సకల నీతి కథా నిదానము' కావ్యంలోని ఈ పద్యంలో తేలికైన మాటలలో అర్థయుక్తంగా చెప్పాడు.

జ్యోతిర్మయం

కం. **బలహీనుడైనగానీ**
బలయుతుడగు ధాత తోడుపడినను, మఱి దో
ర్బలయుక్తుడైనగానీ
బలహీనుండగును దైవబలమెడలుటయున్.


దైవబలం తోడు మనిషికి ఎంతైనా అవసరం. కార్య సాధనలో ఎంతగా కష్టపడినా ఒక్కొకప్పుడు ఆశించిన ఫలితాలు రావు సరికదా ఊహించని విఘ్నాలు ఎదురవుతాయి. దైవబలం తోడుగా లేనపుడే అలా జరుగుతుందన్నది నిజం. కనుక మనిషికి దైవబలం కొండంత అండ. దైవబలం బలహీనుడిని బలవంతుడిని చేస్తుంది. దైవబలం తోడుగా లేకపోవడం అన్నది బలవంతుడిని బలంలేని వానిగా చేస్తుంది. 'హరి కరుణ గలుగు నెయ్యెడ పరిభవ మయ్యెడను లేదు' అన్నాడు అల్లాడు నృసింహకవి 'నారదీయ పురాణం'లో! పరిపూర్ణమైన శ్రద్ధా భక్తులతో ధ్యానించడం ద్వారా మనిషి సంపాదించు కోగలిగే పరమాత్ముని కరుణాకటాక్షాలు నిండుగా ఉన్న చోట పరాభవము, పరాజయములకు తావు లేదని ఆ మాటల అర్థం.

– భట్టు వెంకటరావు

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వల్ల ప్రస్తుతం ఉన్న ఉద్యోగాల్లో మార్పులు, ఏయే ఉద్యోగాలకు ముప్పు రావచ్చు అంటూ ఈ మధ్య మనం చాలా వింటున్నాం. అయితే, అందరూ ఊహిస్తున్న దానికంటే చాలా పెద్ద మార్పు మన ముందుకు రాబోతోంది. వచ్చే ఐదేళ్లలో దేశంలో ఏకంగా కోటికి పైగా ఉద్యోగాలను ఓ కొత్త రకం ఏఐ పూర్తిగా మార్చనుంది. అదే 'ఏజెంటిక్ ఏఐ'. అయితే ఈ మార్పు వల్ల ఉద్యోగాలు పోతాయనే భయం అక్కర్లేదు. ఎందుకంటే.. ఇది యువతకు కొత్త అవకాశాలు, దారుల్ని తెరుస్తోంది. ఈ ఏఐతో పని వేగం పెరిగి, పనులన్నీ సులభంగా మారిపోనున్నాయి.

సాధారణంగా ఏఐ అంటే.. మనం ఏదైనా అడిగితే జవాబు చెప్పే చాట్‌బాట్. ఇంకా సింపుల్ గా చెప్పాలంటే.. ఒక పాట ప్లే చేయమనగానే చటుక్కున ప్లే చేసే స్మార్ట్ స్పీకర్ లాంటిది. కానీ, 'ఏజెంటిక్ ఏఐ' దీనికి భిన్నమైనది.

- సాక్షి, స్పెషల్ డెస్క్



ఏజెంటిక్ ఏఐ.. ఉద్యోగ విప్లవం

ఏమిటి దీని ప్రత్యేకత ?

'ఏజెంటిక్ ఏఐ' కేవలం ఆదేశాలను పాటించదు. ఒక పని పూర్తి చేయమని మనం చెబితే.. దానికి ఏమేం అవసరం అవుతాయి? ఏ పనులను ముందుగా పూర్తి చేయాలి?.. ఇలా భిన్నకోణాల్లో సొంతంగా ఆలోచిస్తుంది. అప్పటికప్పుడే తగు ప్రణాళికలు వేసుకుని, ఒక్కొక్కటిగా పూర్తి చేస్తుంది. ఉదాహరణకు, మనం ఒక ట్రిప్ ప్లాన్ చేయమని 'ఏజెంటిక్ ఏఐ'ని అడిగామనుకోండి. బడ్జెట్‌తో పాటు మనకు ఇష్టమైన ప్రదేశాలను లిస్ట్ చేస్తుంది. అనుకూలమైన హోటల్స్‌ని వెతుకుతుంది. గదుల్ని బుక్ చేస్తుంది. మన బడ్జెట్‌లోనే రైలు/విమాన టికెట్లు బుక్ చేయడం.. లోకల్ ట్రావెల్స్‌ని అడ్వాన్స్ బుకింగ్ చేయడం.. అక్కడ చూడాల్సిన ప్రదేశాల లిస్ట్ తయారు చేయడం చేస్తుంది. అంటే, ఇది ఒక తెలివైన డిజిటల్ అసిస్టెంట్‌లా మనతో కలిసి పనిచేస్తుంది.

సొంతగా నిర్ణయాలు తీసుకోగలిగే 'డిజిటల్ అసిస్టెంట్'

దేశంలో 2030 కల్లా మారనున్న కోటికి పైగా ఉద్యోగాలు

తయారీ, రిటైల్ రంగాల్లో ఉద్యోగాలపై అధిక ప్రభావం

మనుషులకు మరింత సృజనాత్మకంగా పనిచేసే అవకాశం

విప్లవాత్మక మార్పులు!

ఈ ఏజెంటిక్ ఏఐ మన రోజువారీ జీవితాన్ని, ముఖ్యంగా పనిచేసే విధానాన్ని పూర్తిగా మార్చేయనుంది అంటున్నారు టెక్ నిపుణులు.

పని విధానంలో మార్పులు: మనం చేసే కొన్ని పనులు బోరింగ్‌గా, రోజూ ఒకే రకంగా ఉంటాయి. ఈ ఏఐ ఆ రొటీన్ పనులను పూర్తిగా తన చెప్పుచేతల్లోకి తీసుకుంటుంది. దీంతో మనుషులు క్రియేటివ్‌గా ఆలోచించడం, కొత్త వ్యూహాలు రూపొందించడం లాంటి కీలకమైన పనులపై దృష్టి పెట్టొచ్చు.

కొత్త ఉద్యోగాలు, కొత్త నైపుణ్యాలు: ఏఐ వల్ల కొన్ని ఉద్యోగాలు మారినా, కొత్త ఉద్యోగాలూ పుట్టుకొస్తాయి. ఉదాహరణకు, డేటా ఎంట్రీ చేసేవాళ్లు ఏఐని ఎలా ఉపయోగించాలి అని గైడ్ చేసే 'ఏఐ సూపర్ వైజర్'గా మారొచ్చు. ఈ మార్పును ఎదుర్కోవడానికి మనం ఏఐ టూల్స్ వాడటం, సృజనాత్మకంగా ఆలోచించడం వంటి కొత్త నైపుణ్యాలను నేర్చుకోవాలి.

ఏయే రంగాల్లో..

'సర్వీస్‌నౌ ఏఐ స్కిల్స్ రీసెర్చ్ 2025' ప్రకారం, కొన్ని కీలక రంగాల్లో ఈ ఏఐ ప్రభావం ఎక్కువగా ఉండనుంది.

తయారీ రంగం

- ఈ రంగంలో ఏకంగా 80 లక్షల ఉద్యోగాలు మారబోతున్నాయి.
- ఏఐ ఏజెంట్లు ఒక వస్తువు తయారీకి కావాల్సిన ముడి పదార్థాలను మేనేజ్ చేయడం, యంత్రాలు ఎప్పుడు పాడైపోతాయో ముందే చెప్పడం, ఉత్పత్తి వేగాన్ని పెంచడం వంటివి చేస్తాయి.
- దీంతో మనుషులు యంత్రాల పర్యవేక్షణ, మరమ్మతులు వంటి పనులు చేయాల్సి రావొచ్చు.

రిటైల్ రంగం

- వ్యాపారాలు ఎదుర్కొనే అతి పెద్ద సవాళ్లలో ఒకటి.. మార్కెట్ ట్రెండ్లు, వినియోగదారుల నుంచి వచ్చే సమాచారాన్ని వేగంగా విశ్లేషించడం. ఏజెంటిక్ ఏఐ ఈ సమస్యను తీరుస్తుంది. ఈ రంగంలో 76 లక్షల ఉద్యోగాలు మార్పునకు గురవుతాయట.
- ఏఐ ఏజెంట్లు కస్టమర్ల ఇష్టాలను బట్టి వారికి నచ్చే వస్తువులను చూపించడం, ఎప్పుడు ఏ వస్తువు స్టాక్‌లో ఉందో తెలుసుకోవడం, కస్టమర్ సర్వీస్‌కు జవాబులు చెప్పడం వంటివి చేస్తాయి.
- ఈ ఏఐ వల్ల ఉద్యోగులకు విలువైన సమయం ఆదా అవుతుంది. వారు మార్కెట్ మార్పులకు స్పందించడంపై దృష్టి పెట్టొచ్చు. అయితే, ఈ ఏఐ నిర్ణయాలకు మనుషుల పర్యవేక్షణ చాలా ముఖ్యం. ఆటోమేషన్, మానవ నిర్ణయాల మధ్య సమతుల్యత సాధించొచ్చు.

విద్యారంగం

- ఈ రంగంలో 25 లక్షల ఉద్యోగాలు మారనున్నాయి.
- ఏఐ ఏజెంట్లు విద్యార్థుల కోసం ప్రత్యేకంగా చదువుకునే ప్రణాళికలు తయారు చేయడం, అసైన్‌మెంట్‌లను కరెక్ట్ చేయడం, వెంటనే ఫీడ్‌బ్యాక్ ఇవ్వడం వంటివి చేస్తాయి.
- దీంతో టీచర్లు క్లాస్‌రూమ్‌లో విద్యార్థులపై మరింత శ్రద్ధ పెట్టడం, వారికి మార్గదర్శకత్వం చేయడం వంటి వాటిపై ఫోకస్ చేయవచ్చు.

ఏఐతో కలిసి పనిచేయాలి

ఇది కేవలం ఆటోమేషన్ మాత్రమే కాదు. పని అంటే ఏంటో తిరిగి నిర్వచించుకునే సమయం. ఈ ఏఐ విప్లవం వల్ల దేశ యువతకు కొత్త నైపుణ్యాలు నేర్చుకోవడానికి, కొత్త రకాల ఉద్యోగాలు చేయడానికి అపారమైన అవకాశాలు లభిస్తాయి. ఏఐతో కలిసి పనిచేయడం ఎలాగో నేర్చుకోవాలి. అప్పుడే భవిష్యత్తులో మనం మరింత మెరుగ్గా రాణించగలుగుతాం. ఏజెంటిక్ ఏఐ అనేది మన శత్రువు కాదు, మన పనిని సులభతరం చేసే ఒక స్మార్ట్ పార్ట్‌నర్.

– సుమీత్ మాథుర్, ఎస్వీపీ- ఎండీ, సర్వీస్‌నౌ ఇండియా

డేటా సెక్యూరిటీ సమస్య

ఏజెంటిక్ ఏఐ వల్ల డేటా సెక్యూరిటీ విషయంలో కంపెనీలకు ఇంకా పూర్తి స్పష్టత రాలేదని సర్వీస్‌నౌ నివేదిక చెబుతోంది. ఇందుకోసం ఎలాంటి నైపుణ్యాలు అవసరమవుతాయో తమకు తెలియడం లేదని 26 శాతం కంపెనీలు చెప్పాయట.

శ్రీశైలం ప్రాజెక్టుకు స్వల్పంగా తగ్గిన నీటి ప్రవాహం



అచ్చంపేట/నాగార్జునసాగర్: శ్రీశైలం ప్రాజెక్టుకు ఎగువ నుంచి వస్తున్న వరద స్వల్పంగా తగ్గింది. శనివారం రాత్రి 9 గంటల సమయంలో ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు క్రస్టు గేట్ల ద్వారా 1,39,132 క్యూసెక్కులు, విద్యుదుత్పత్తి ద్వారా 25,843, సుంకేసుల ద్వారా 15,816 మొత్తం శ్రీశైలం ప్రాజెక్టుకు 1,80,791 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. ఉదయం ఎనిమిది గేట్లు ఎత్తగా.. నీటి ప్రవాహం తగ్గడంతో మధ్యాహ్నం ఒక గేటు, రాత్రి మరో గేటును మూసివేశారు. ప్రస్తుతం ఆరు క్రస్టు గేట్లు 10 మీటర్ల మేర ఎత్తి స్పిల్‌వే ద్వారా 1,61,016 క్యూసెక్కుల నీటిని నాగార్జునసాగర్‌కు విడుదల చేస్తున్నారు. అలాగే ఎడమగట్టు భూగర్భ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి చేస్తూ 35,315 క్యూసెక్కులు, ఏపీ జెన్‌కో పరిధిలోని కుడిగట్టు కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 30,787 క్యూసెక్కులు మొత్తం 66,102 క్యూసెక్కుల నీటిని అదనంగా సాగర్‌కు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం శ్రీశైలం జలాశయంలో 882.30 అడుగుల నీటి మట్టం వద్ద 200.6588 టీఎంసీల నీటి నిల్వ ఉంది.

సాగర్‌కు స్వల్పంగా తగ్గిన వరద



ఎగువ నుంచి సాగర్ జలాశయానికి వస్తున్న వరద స్వల్పంగా తగ్గింది. శుక్రవారం వరకు 26 గేట్లు తెరిచి ఉండగా.. శనివారం ఎనిమిది గేట్లను మూసి 18 గేట్ల ద్వారా దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. శ్రీశైలం జలాశయానికి వచ్చే వరద కూడా తగ్గడంతో 8 గేట్లకు గాను ఒకటి మూసి ఏడు గేట్ల ద్వారా దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. శ్రీశైలం జలాశయం నుంచి నాగార్జునసాగర్‌కు 2,10,499 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. సాగర్ నుంచి స్పిల్‌వే మీదుగా 1,36,656 క్యూసెక్కులు, విద్యుదుత్పాదనతో 29,070 క్యూసెక్కులు కలిపి మొత్తం 1,65,726 క్యూసెక్కుల నీటిని దిగువ కృష్ణానదిలోకి విడుదల చేస్తున్నారు. నాగార్జునసాగర్ జలాశయం గరిష్ట నీటిమట్టం 590 అడుగులు (312.0450 టీఎంసీలు) కాగా.. ప్రస్తుత నీటిమట్టం 585.30 అడుగులు (298.3005టీఎంసీలు) ఉంది.

బాలునితో పరారీ.. పెళ్లి

- మహిళపై పోక్సో కేసు నమోదు

సత్తుపల్లి: బాలునికి మాయమాటలు చెప్పి పెళ్లి చేసుకున్న మహిళపై పోక్సో కేసు నమోదైంది. ఖమ్మం జిల్లా సత్తుపల్లికి చెందిన బాలునికి మాయమాటలు చెప్పిన సదరు మహిళ.. నాలుగు నెలల క్రితం ఇంటి నుంచి తీసుకెళ్లింది. ఆపై వైజాగ్, హైదరాబాద్ తదితర ప్రాంతాల్లో తిరుగుతుండడమే కాక బాలుడిని పెళ్లి కూడా చేసుకుంది. బాలుని కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టారు. వారిద్దరూ ఉంటున్న ప్రాంతాన్ని గుర్తించి శనివారం సత్తుపల్లికి తీసుకొచ్చారు. బాలుడిని కుటుంబానికి అప్పగించి.. మహిళపై పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సత్తుపల్లి సీఐ టి.శ్రీహరి తెలిపారు.

రాహుల్ నేతృత్వంలో మోదీని ఓడిస్తాం

- వచ్చే ఎన్నికల్లో బీజేపీకి 150కి మించి ఒక్క సీటూ రాదు
- సామాజిక న్యాయం, 42 శాతం రిజర్వేషన్లు కాంగ్రెస్‌తోనే సాధ్యం
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టీకరణ
- ఢిల్లీలో ఏఐసీసీ ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో ప్రసంగం

సాక్షి, న్యూఢిల్లీ: కేంద్రంలో అధికారంలో ఉన్న ప్రధాని మోదీ నేతృత్వంలోని బీజేపీని గద్దె దించేది ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మాత్రమేనని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. మోదీని గతంలో కుర్చీ నుంచి దించాలని ఆర్‌ఎస్‌ఎస్, దివంగత ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి ప్రయత్నించినా విఫలమయ్యారని.. కానీ వచ్చే ఎన్నికల్లో రాహుల్ నేతృత్వంలో మోదీని ఓడించడం ఖాయమన్నారు. శనివారం ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో ఏఐసీసీ ఆధ్వర్యంలో నిర్వహించిన 'కానిస్టిట్యూషనల్ చాలెంజెస్... పర్‌స్పెక్టివ్స్ అండ్ పాత్‌వేస్' సదస్సులో సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగించారు.

పేదల కోసం 25 ఏళ్లుగా రాహుల్ పోరాటం..

'రాహుల్ గాంధీ అనుకొని ఉంటే 2004లోనే కేంద్ర మంత్రి, 2009లోనే ప్రధాని అయ్యే వారు. కానీ ఆయన ఆ పదవులను త్యాగం చేశారు. సామాన్య కార్యకర్తగానే కొనసాగుతున్నారు. పేదలు, దళితులు, ఆదివాసీలు, ఓబీసీలు, సామాజిక న్యాయం కోసం 25 ఏళ్లుగా రాహుల్ పోరాడుతున్నారు. మోదీ మాత్రం 2001లో ముఖ్యమంత్రి అయ్యింది మొదలు కుర్చీ వదలడం లేదు. ఆర్‌ఎస్‌ఎస్ చెప్పినా వినడం లేదు. రెండు నెలల క్రితం ఆర్‌ఎస్‌ఎస్ సంఘ్ చాలక్ మోహన్ భాగవత్ 75 ఏళ్ల నిండిన వారు కుర్చీ వదలాలని చెప్పినా మోదీ అందుకు సిద్ధంగా లేరు. అద్వానీ, మురళీ మనోహర్ జోషీకి వర్తించే నిబంధనలు మోదీకి వర్తించవా? ఆయన ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు వాజ్‌పేయి సైతం మోదీని సీఎం కుర్చీ నుంచి దించలేకపోయారు. కానీ వచ్చే ఎన్నికల్లో రాహుల్ గాంధీ మోదీని కుర్చీ నుంచి దింపేస్తారు' అని సీఎం రేవంత్ జోస్యం చెప్పారు. మోదీ లేకుంటే బీజేపీకి 150 సీట్లు కూడా రావని బీజేపీ ఎంపీ నిశికాంత్ దూబే ప్రకటించడాన్ని రేవంత్ తప్పుబట్టారు. 'దూబే డైరీలో రాసుపెట్టుకోవాలి. వచ్చే ఎన్నికల్లో రాహుల్ నేతృత్వంలో పోరాడతాం. బీజేపీకి 150కి మించి ఒక్క సీటూ రాదు. మోదీని ఓడించేందుకు, కుర్చీ నుంచి దింపేందుకు, రాజ్యాంగాన్ని రక్షించేందుకు రాహుల్ నేతృత్వంలోని కాంగ్రెస్ శ్రేణులన్నీ పోరాడతాయి' అని సీఎం స్పష్టం చేశారు.



రాహుల్‌గాంధీతో కరచాలనం చేస్తున్న సీఎం రేవంత్

42 శాతం రిజర్వేషన్లను సాధించుకుంటాం..

దేశంలో సామాజిక న్యాయం జరగాలన్నా.. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు కావాలన్నా అది కాంగ్రెస్‌తోనే సాధ్యమని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. దేశంలో సామాజిక న్యాయం కోసం, కులగణన కోసం, ఓబీసీలకు 42 శాతం రిజర్వేషన్లు సాధించేందుకు నూతన సామాజిక న్యాయం సాధనకు రాహుల్ గాంధీ నేతృత్వంలో పోరాడతాం. రిజర్వేషన్లు సాధించుకుంటాం' సీఎం రేవంత్ పేర్కొన్నారు.

దేశానికి తెలంగాణ మోడల్ ఇచ్చాం..

'రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర చేశారు. ఆ సమయంలో తెలంగాణలో కుల గణనకు రాహుల్ గాంధీ హామీ ఇచ్చారు. దీంతో ఆయనకు బాసటగా తెలంగాణ ప్రజలు ప్రేమ దుకాణాలు (మొహబ్బత్ కా దుకాణ్) తెరిచారు. అందుకే మేం తెలంగాణలో కులగణన చేశాం. దేశానికి తెలంగాణ మోడల్ ఇచ్చాం' అని సీఎం రేవంత్ తెలిపారు.

త్యాగాలన్నీ గాంధీల కుటుంబానివే..

'దేశం కోసం గాంధీల కుటుంబం ప్రాణ త్యాగాలు చేసింది. ఉగ్రవాదుల నుంచి దేశాన్ని రక్షించే క్రమంలో ఇందిరాగాంధీ ప్రాణాలు త్యాగం చేశారు. ఉగ్రవాదంపై పోరులో రాజీవ్ గాంధీ అమరులయ్యారు. 2004లో కేంద్రంలో యూపీఏ-1 అధికారంలోకి వచ్చినప్పుడు ప్రధాని పదవిని స్వీకరించాలని అందరూ సోనియా గాంధీని కోరినప్పటికీ ఆమె ఆ పదవిని త్యాగం చేసి మన్మోహన్ సింగ్‌ను ప్రధానమంత్రిని చేశారు. రాష్ట్రపతి అయ్యే అవకాశం వచ్చినా వదులుకొని ప్రణబ్ ముఖర్జీని రాష్ట్రపతిని చేశారు' అని సీఎం రేవంత్ గుర్తుచేశారు.



గతుకుల హైవేపై బితుకుబితుకు

- అధ్వానంగా హైదరాబాద్ - విజయవాడ నేషనల్ హైవే

చిట్యాల: ఇటీవలి వర్షాలకు 65వ నంబర్ హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారి పలుచోట్ల ధ్వంసమైంది. నల్లగొండ జిల్లా చిట్యాల, నార్కట్‌పల్లి మండలాల పరిధిలో ఈ హైవేపై గుంతలు ఏర్పడ్డాయి. కొన్నిచోట్ల రెండు మీటర్ల పొడవు మేర రోడ్డు పొరలు లేచిపోయాయి. చిట్యాల పట్టణం, పెద్దకాపర్తి గ్రామ శివారులో రోడ్డు ఎక్కువగా దెబ్బతినడంతో.. వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారింది. రోడ్డుపై అడుగు మేర అక్కడక్కడ గుంతలు ఏర్పడ్డాయి. దీంతో వీటి మీదుగా ప్రయాణించే ద్విచక్ర వాహనాలు అదుపుతప్పి పడిపోతున్నాయి. గుంతలు పడిన రోడ్డుపై వాహనాలు వేగంగా వెళ్లలేకపోవటంతో పాటు వాహనాల కుదుపులకు ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. దీంతో ద్విచక్ర వాహనదారులకు మార్జిన్ రోడ్డు కనిపించకపోవడంతో అదుపుతప్పి ప్రమాదాల బారిన పడుతున్నారు. జాతీయ రహదారికి వెంటనే మరమ్మతులు చేపట్టాలని వాహనచోదకులు, ప్రయాణికులు కోరుతున్నారు.

---

200 మ్యూల్ ఖాతాలపై ఈడీ దృష్టి

- గొర్రెల స్కాంలో ఒక్కో ఖాతాలో సగటున రూ. 5 కోట్ల వరకు డిపాజిట్ అయినట్లు ఆధారాలు
- నాటి ఉన్నతాధికారుల పాత్రపైనా ఆరా.. తలసాని మాజీ ఓఎస్డీ అరెస్టుకు కసరత్తు

సాక్షి, హైదరాబాద్: గొర్రెల పంపిణీ పథకంలో రూ. వెయ్యి కోట్లకుపైగా నిధుల గోల్‌మాల్ వ్యవహారంలో బయటపడిన 200 మ్యూల్ బ్యాంకు ఖాతాల లెక్కలు తేల్చే పనిలో ఈడీ నిమగ్నమైంది. గొర్రెలు కొనకుండానే కొన్నట్లుగా.. సరఫరా చేసినట్లు, లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోకి నిధులు జమ చేసినట్లు సాగిన అవినీతిపై లోతుగా ఆరా తీస్తోంది. ఈ కుంభకోణంలో కీలక సూత్రధారిగా ఉన్న నాటి పశుసంవర్ధకశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఓఎస్డీ జి. కల్యాణ్ కుమార్‌తోపాటు కొందరు లబ్ధిదారులు, దళారుల ఇళ్లలో జూలై 30న ఈడీ నిర్వహించిన సోదాల్లో దాదాపు 200లకు పైగా నకిలీ, మ్యూల్ బ్యాంకు ఖాతాల పత్రాలు, డెబిట్ కార్డులు, 31 మొబైల్ ఫోన్లు, 20కిపైగా సిమ్‌కార్డులు దొరకడం తెలిసిందే. ఈ బ్యాంకు ఖాతాలు ఎవరివి? వాటిల్లోకి డబ్బు ఎవరి నుంచి మళ్లించారు? ఆ తర్వాత ఆ నిధులు మళ్లీ ఏయే బ్యాంకు ఖాతాలకు వెళ్లాయి? ఒక్కరి ఇంట్లోనే భారీగా బ్యాంకు పాస్ పుస్తకాలు, డెబిట్ కార్డులు ఎందుకు ఉన్నాయి? అనే అంశాలపై ఈడీ లోతుగా దర్యాప్తు చేస్తోంది.

సొమ్ము ఏయే ఖాతాలకు తరలింది?

ఈడీ గుర్తించిన 200 మ్యూల్ బ్యాంకు ఖాతాలకు, బెట్టింగ్ యాప్స్‌కు లింకు ఉండటంతో ఈ కేసు కీలక మలుపు తీసుకుంది. గొర్రెలు, మేకల అభివృద్ధి సహకార సమాఖ్య హెడ్ ఆఫ్ అకౌంట్ నుంచి మ్యూల్ అకౌంట్లలోకి వెళ్లిన నిధులు.. చివరగా డబ్బు డిపాజిట్ అయిన అకౌంట్లను గుర్తించే పనిలో ఈడీ నిమగ్నమైంది. ఒక్కో మ్యూల్ ఖాతాలో సగటున రూ. కోటి నుంచి రూ. 5 కోట్ల వరకు డబ్బు డిపాజిట్ అయినట్లు ఈడీ ప్రాథమిక ఆధారాలు సేకరించింది. ఈ నేపథ్యంలో ఎక్కువ మొత్తంలో డబ్బు డిపాజిట్ అయిన అకౌంట్లను గుర్తించి ఫ్రీజ్ చేసేందుకు వీలుగా సంబంధిత బ్యాంకులకు లేఖలు రాయనుంది. అలాగే అనుమానాస్పద లావాదేవీల ఆధారంగా సంబంధిత ఖాతాదారులకు నోటీసులు ఇచ్చి విచారించేందుకు సిద్ధమవుతోంది.

కిక్‌బ్యాక్స్ పంపకాల్లో ఎవరెవరు?

గొర్రెల పంపిణీ పథకంలో కొల్లగొట్టిన ప్రజాధనం ఎవరి జేబుల్లోకి వెళ్లిందన్న అంశంపైనా ఈడీ ఆరా తీస్తోంది. లంచం సొమ్మును వాటాలు వేసుకున్న వారిలో ఏ స్థాయిలోని వారున్నారన్న దానిపై దృష్టిపెట్టింది. గతంలో ఏసీబీ దర్యాప్తు సందర్భంగా అరెస్టయిన వారితోపాటు ఆ సమయంలో పశుసంవర్ధక శాఖలో కీలక, అత్యున్నత స్థాయిలో పనిచేసిన అధికారులకు ఏమైనా సంబంధం ఉందా? అనే కోణంలోనూ దర్యాప్తు కొనసాగిస్తోంది. నాటి మంత్రి పేషీలోని అధికారులతోపాటు 'కీలక' వ్యక్తుల పూర్తి సహకారంతోనే ఇంత భారీ అవినీతి జరిగి ఉండొచ్చని అనుమానిస్తున్న ఈడీ.. ఆ దిశగా ఆధారాల సేకరణపై దృష్టి పెట్టినట్టు తెలిసింది. కాగా, ఇప్పటివరకు లభించిన కీలక పత్రాలు, గతంలో ఏసీబీ దర్యాప్తు సందర్భంగా లభించిన సాక్ష్యాలను ఆధారంగా చేసుకొని జి. కల్యాణ్‌కుమార్‌తోపాటు నగదు బదిలీలో కీలకంగా వ్యవహరించిన మరో ఇద్దరిని అరెస్టు చేసే అవకాశం ఉన్నట్టు తెలిసింది.

ఒలింపిక్స్ పతకం లక్ష్యం

మొదటి పేజీ తరువాయి

కంపెనీలతో కలిసి పని చేస్తాం. స్పోర్ట్ పాలసీ అమలుకు సంబంధించి పలువురు ప్రముఖులతో గవర్నింగ్ బోర్డును ఏర్పాటు చేస్తున్నాం. ఇకపై క్రీడల్లో ప్రభుత్వ పాత్ర చాలా పరిమితంగా ఉంటుంది. రాజకీయ నాయకులు ఎవరూ ఇందులో జోక్యం చేసుకోరు. ఈ రంగంలో ఎంతో అనుభవం ఉన్న, నిష్ణాతులైన వారిని ఏరికోరి భాగస్వాములను చేస్తున్నాం. వారంతా రాష్ట్రంలో క్రీడాభివృద్ధికి తమ వంతు పాత్ర పోషిస్తారని నమ్ముతున్నా..' అని సీఎం పేర్కొన్నారు.

ముమ్ముందు క్రీడలకు ప్రత్యేక బడ్జెట్

'పారిస్ ఒలింపిక్స్‌లో భారత్ పేలవ ప్రదర్శన చూసిన తర్వాతే నాకు రాష్ట్రంలో క్రీడాభివృద్ధికి తగిన చర్యలు తీసుకోవాలనే ఆలోచన వచ్చింది. చాలా కాలంగా రాష్ట్రంలో స్పోర్ట్స్ పాలసీ అనేదే లేదు. ఈ క్రమంలోనే కొత్త క్రీడా విధానం గురించి నిర్ణయం తీసుకున్నాం. విజన్ 2047లో క్రీడలకు ప్రత్యేక అధ్యాయం కేటాయించాం. ముమ్ముందు క్రీడలకు ప్రత్యేకంగా బడ్జెట్‌ను కేటాయిస్తాం. ఈ పాలసీ లైబ్రరీలో పడేసే కాగితం ముక్క కాదు. బంగారంతో గీసిన రేఖ లాంటిది..' అని రేవంత్ అన్నారు.

హైదరాబాద్‌కు చాన్స్ ఇవ్వమని అడిగాం..

'1956 ఒలింపిక్స్‌లో నాలుగో స్థానంలో నిలిచిన భారత ఫుట్‌బాల్ జట్టులో 9 మంది హైదరాబాదీలే ఉన్నారు. హైదరాబాద్‌లో గతంలో జాతీయ క్రీడలు, ఆఫ్రో ఏషియన్ క్రీడలు, ప్రపంచ మిలిటరీ క్రీడలను సమర్థంగా నిర్వహించాం. అయితే గత ప్రభుత్వం పదేళ్ల క్రీడలను ఏమాత్రం పట్టించుకోలేదు. స్టేడియంలు ఫంక్షన్ హాళ్లుగా, సన్‌బర్న్‌లాంటి ఈవెంట్లకు వేదికలుగా మారిపోయాయి. ఈ పరిస్థితిని చక్కదిద్దేందుకు మేము ప్రయత్నిస్తున్నాం. 2026లో ఖేలో ఇండియా నిర్వహణ హక్కులు మనకు కేటాయించాలని, 2036లో భారత్‌లో ఒలింపిక్స్ జరిగితే రెండు క్రీడాంశాలను హైదరాబాద్‌లో నిర్వహించే అవకాశం ఇవ్వాలని కేంద్రాన్ని కోరాం..' అని ముఖ్యమంత్రి తెలిపారు.



అనిల్ కుంబ్లేకు జ్ఞాపికను అందజేస్తున్న మంత్రి వాకిటి శ్రీహరి.. చిత్రంలో జయేశ్ రంజన్, శివసేనారెడ్డి

కొరియా యూనివర్సిటీ నుంచి కోచ్‌లు

'రాష్ట్రంలో డ్రగ్స్ వాడకంతో యువత పెడదారి పడుతోంది. అటువంటివారిని సరైన మార్గంలోకి తెచ్చేందుకు క్రీడలే తగిన మార్గమని భావిస్తున్నాం. గత ఏడాది నేను కొరియా వెళ్లినప్పుడు అక్కడ 30 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న స్పోర్ట్స్ యూనివర్సిటీ నుంచి 16 మంది ఒలింపిక్ పతక విజేతలు వచ్చిన విషయం నన్ను ఆశ్చర్యపర్చింది. ఇప్పుడే అదే యూనివర్సిటీతో జత కట్టి కోచ్‌లను తీసుకురానున్నాం. యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీతో పాటు స్పోర్ట్స్ అకాడమీ కూడా త్వరలోనే ప్రారంభమవుతుంది..' అని రేవంత్ ప్రకటించారు. సిరాజ్, నిఖత్ జరీన్, దీప్తిలాంటి ప్రతిభావంతులకు ప్రభుత్వ ఉద్యోగాలు ఇవ్వడంతో పాటు ఇంటి స్థలం, నగదు ప్రోత్సాహకాలతో ప్రభుత్వం అండగా నిలిచిందని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా చెప్పారు. యువత క్రీడల పట్ల ఆసక్తిని పెంచుకోవడానికి తెలంగాణలో క్రీడల స్పోర్ట్స్ పాలసీని తీసుకురావడం జరిగిందని క్రీడలు యువజన సర్వీసులు, పశుసంవర్థక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు.

15 మందితో గవర్నింగ్ బోర్డు

కొత్త స్పోర్ట్స్ పాలసీని సమర్థంగా నిర్వహించేందుకు 15 మందితో ప్రభుత్వం గవర్నింగ్ బోర్డును ఏర్పాటు చేసింది. రాష్ట్ర ప్రభుత్వం తరఫున స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేశ్ రంజన్, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డితో పాటు మాజీ క్రీడాకారులు పుల్లెల గోపీచంద్, అభినవ్ బింద్రా, కపిల్ దేవ్, బైచుంగ్ భూటియా, రవికాంత్ రెడ్డి, మాజీ అధికారులు పాపారావు, ఇంజేటి శ్రీనివాస్, వ్యాపారవేత్తలు సంజీవ్ గోయెంకా, ఉపాసన కామినేని, విటా దాని, కావ్య మారన్, సి.శశిధర్ సభ్యులుగా ఉన్నారు.

పలు సంస్థలతో ఎంఓయూలు

'స్పోర్ట్స్ కాంక్లేవ్'లో భాగంగా వేర్వేరు సంస్థలతో ప్రభుత్వం ఎంఓయూలు కుదుర్చుకుంది. ఫుట్‌బాల్ అకాడమీ కోసం 'ఫిఫా', 'ఏఐఎఫ్ఎఫ్'లతో, ఒలింపిక్ వాల్యూస్ ప్రోగ్రామ్‌కు సంబంధించి అభినవ్ బింద్రాతో, షూటింగ్‌లో ప్రతిభాన్వేషణ, శిక్షణ కోసం 'గన్ ఫర్ గ్లోరీ' అకాడమీతో, బాస్కెట్ బాల్ క్రీడలో ప్రతిభాన్వేషణ, అభివృద్ధి కోసం 'స్పోర్ట్స్ ప్రిక్స్'సంస్థతో, క్రీడలతో పాటు చదువులో కూడా కెరీర్ మార్గనిర్దేశం చేసేలా 'హర్ స్పోర్ట్స్ కీ చాంపియన్'సంస్థతో ఒప్పందాలు కుదిరాయి. మాజీ క్రికెటర్ అనిల్ కుంబ్లేకు చెందిన 'టెన్‌విక్'సంస్థ రాష్ట్రంలోని 50 పాఠశాలల్లో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ కేంద్రాలు ఏర్పాటు చేసే విధంగా కూడా ఎంఓయూ కుదిరింది.

'స్వదేశీ' విప్లవం ప్రారంభిద్దాం

మన దేశంలో తయారైన ఉత్పత్తులే వాడుకోవాలి

- స్థానిక వస్తువులను ప్రోత్సహించాలి
- దుకాణాలు, మార్కెట్లలో స్వదేశీ వస్తువులే విక్రయించాలి
- మన ఆర్థిక ప్రయోజనాలు, ప్రాధాన్యతల పట్ల అప్రమత్తంగా ఉండాలి
- దేశ ప్రజలకు ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు
- వారణాసి నియోజకవర్గంలో ప్రధాని పర్యటన
- రైతుల ఖాతాల్లో పీఎం–కిసాన్ సమ్మాన్ నిధి సొమ్ము జమ



సభలో ప్రసంగిస్తున్న ప్రధాని మోదీ

వారణాసి: స్వదేశీ స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ అందిపుచ్చుకోవాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. అంతర్జాతీయంగా ఆర్థిక అనిశ్చిత పరిస్థితులు కొనసాగుతున్న తరుణంలో మన దేశంలో తయారైన ఉత్పత్తులే ఉపయోగిద్దామని, స్వదేశీ విప్లవం ప్రారంభిద్దామని దేశ ప్రజలకు పిలుపునిచ్చారు. స్థానిక ఉత్పత్తులు కొనుగోలు చేయడం, ప్రోత్సహించడం అసలైన దేశ సేవ అవుతుందని ఉద్ఘాటించారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారతీయ ఉత్పత్తులపై ఏకంగా 25 శాతం సుంకాలు విధించడంతో, భారత ఆర్థిక వ్యవస్థ మృత ప్రాయంగా మారిందంటూ వ్యాఖ్యానించిన నేపథ్యంలో స్వదేశీ వస్తువుల ప్రాధాన్యతను ప్రధాని మోదీ ప్రత్యేకంగా చాటిచెప్పడం గమనార్హం. మోదీ శనివారం తన సొంత నియోజకవర్గం వారణాసిలో పర్యటించారు. రూ.2,200 కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులు ప్రారంభించారు. మరికొన్నింటికి శంకుస్థాపన చేశారు. అలాగే పీఎం–కిసాన్ సమ్మాన్ నిధి కింద 9.70 కోట్ల మంది రైతుల ఖాతాల్లో రూ.20,500 కోట్లు జమ చేశారు. అనంతరం బహిరంగ సభలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ప్రస్తుతం ప్రపంచమంతటా ఆర్థిక పరిస్థితులు, దేశాల వైఖరి ఎలా ఉందో అందరూ తెలుసుకోవాలని చెప్పారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ అనిశ్చితి, అస్థిరతను ఎదుర్కొంటోందని అన్నారు. అందుకే విదేశాలు సొంత ప్రయోజనాలపైనే దృష్టి పెడుతున్నాయని తెలిపారు. ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదగాలని మనం లక్ష్యంగా పెట్టుకున్నామని, ఈ క్రమంలో మన ఆర్థిక ప్రయోజనాలు, ప్రాధాన్యతల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రధాని మోదీ ఇంకా ఏం మాట్లాడారంటే...

పౌరులకు బాధ్యతలుంటాయి

''రైతులకు, చిన్న పరిశ్రమలకు మేలు చేయడానికి, యువతకు ఉపాధి కల్పించడానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నాం. ఈ విషయంలో చేయగలిగినదంతా చేస్తున్నాం. పౌరులుగా మనకు కూడా కొన్ని బాధ్యతలు ఉంటాయి. స్వదేశీ ఉత్పత్తులకు మద్దతు ఇవ్వడాన్ని జాతీయ ఉద్యమంగా మార్చేద్దాం. మోదీ చెప్పారని కాదు. ఇది ప్రతి ఒక్క భారతీయుడి బాధ్యత. మన దేశం మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారాలంటే ప్రతి రాజకీయ పార్టీ, ప్రతి నాయకుడు స్వప్రయోజనాలు పక్కనపెట్టి దేశ ప్రయోజనాల కోసం పనిచేయాలి. ప్రజల్లో స్వదేశీ స్ఫూర్తిని మేల్కొల్పాలి. ప్రజలు తెలివైన వినియోగదారులుగా మారాలి. మనం ఏది కొనుగోలు చేసినా అది మన దేశంలోనే తయారైందా? అని ప్రశ్నించుకోవాలి. తోటి పౌరుల స్వేదం, నైపుణ్యంతో తయారైన వస్తువులు వాడుకోవాలి. ఇకపై మన మంత్రం 'వోకల్ ఫర్ లోకల్'. దుకాణాలు, మార్కెట్లలో స్వదేశీ వస్తువులే విక్రయిస్తామని వ్యాపారులు, దుకాణదారులు ప్రతిజ్ఞ చేయాలి. దేశానికి సేవ చేయాలనుకుంటే 'మేడ్ ఇన్ ఇండియా' ఉత్పత్తులను ప్రోత్సహించండి.

సిందూరాన్ని అవమానిస్తున్నారు

మన శక్తి సామర్థ్యాలు ఆపరేషన్ సిందూర్ ద్వారా ప్రపంచానికి తెలిసొచ్చాయి. భారత్‌పై దాడికి దిగే ధైర్యం చేస్తే ఎట్టిపరిస్థితుల్లోనూ వదిలిపెట్టబోమని, పాతాళ లోకంలో దాక్కున్నా వెతికి మరీ అంతం చేస్తామని తెలియజెప్పాం. ఉగ్రవాదాన్ని సహించే ప్రసక్తే లేదు. మహాశివుడి రుద్ర రూపమే ఆపరేషన్ సిందూర్. మన సైనిక దళాల సాహసాన్ని కాంగ్రెస్ పార్టీ పదేపదే కించపరుస్తోంది. ఆపరేషన్ సిందూర్‌ను తమాషా అంటూ హేళన చేస్తోంది. మన సోదరీమణులు ధరించే పవిత్ర సిందూరాన్ని అవమానిస్తోంది. పహల్గాం ఉగ్రవాద దాడిలో 26 మంది మరణించడం నన్ను తీవ్రంగా కలిచివేసింది. నా మనసు ఆవేదనతో నిండిపోయింది. ముష్కరులపై ప్రతీకారం తీర్చుకుంటామని సిందూరం కోల్పోయిన మన బిడ్డలకు హామీ ఇచ్చా. మహాదేవుడి ఆశీస్సులతో అది నెరవేర్చా. ఆపరేషన్ సిందూర్ విజయాన్ని పరమశివుడి పాదాలకు అంకితం ఇస్తున్నా. 140 కోట్ల మంది భారతీయుల ఐక్యతే ఆపరేషన్ సిందూర్‌కు బలంగా మారింది. శివ అంటే అర్థం మంచి. కానీ, ఉగ్రవాదం, అన్యాయం తల ఎగరేసినప్పుడు శివుడు రుద్ర రూపం దాలుస్తాడు.' అని మోదీ అన్నారు.

పాక్ నష్టపోతే ప్రతిపక్షాలకు ఏడుపెందుకో?

'ఆపరేషన్ సిందూర్ విజయాన్ని ప్రజలు పండుగలా భావిస్తున్న సమయంలో మన దేశంలోనే కొందరు వ్యక్తులు అది తట్టుకోలేకపోయారు. కళ్లల్లో నిప్పులు పోసుకున్నారు. పాకిస్తాన్‌లో ఉగ్రవాదుల స్థావరాలను మన సైన్యం నేలమట్టం చేయడాన్ని కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు జీర్ణించుకోలేపోయాయి. పాకిస్తాన్ భూభాగంలోని పలు వైమానిక స్థావరాలు ఇప్పటికీ ఐసీయూలో ఉన్నాయి. ఇండియా దాడుల్లో నష్టపోయినందుకు పాకిస్తాన్ ఏడుస్తోందంటే అర్థం చేసుకోవచ్చు. మరి మన దేశంలోని కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీలకు వచ్చిన బాధేమిటో అర్థం కావడం లేదు. పాకిస్తాన్‌కు నష్టం జరగడం చూసి ఆ పార్టీల నాయకులు భరించలేకపోతున్నారు. పహల్గాం దాడిలో పాల్గొన్న ఉగ్రవాదులను ఆపరేషన్ మహాదేవ్‌లో మట్టుబెట్టాం. ఈ ఆపరేషన్ ఇప్పుడే ఎందుకు చేపట్టారని సమాజ్‌వాదీ పార్టీ నేతలు ప్రశ్నిస్తున్నారు. అంటే ఉగ్రవాదులు పారిపోయేదాకా ఆగాలా? మిమ్మల్ని ఇప్పుడు చంపాలా? లేక తర్వాత చంపాలా? అని ఉగ్రవాదులను అడగాలా? ఇదే సమాజ్‌వాదీ పార్టీ ఉత్తరప్రదేశ్‌లో అధికారంలో ఉన్నప్పుడు ఉగ్రవాదులకు క్లీన్‌చిట్ ఇచ్చారు. బాంబు పేలుళ్లకు పాల్పడిన వారిపై కేసులు ఎత్తేశారు. ఇప్పుడు ఉగ్రవాదులు హతమైపోతుండడం చూసి ఆ నాయకులకు నిద్రపట్టడం లేదు.' అని మోదీ ఎద్దేవా చేశారు.

స్వదేశంలోనే పెళ్లి చేసుకోండి

వివాహాల సీజన్ మొదలైంది. పండుగలు రాబోతున్నాయి. ప్రజలు కొత్తగా కొనే వస్తువులు, ఉత్పత్తులు మన దేశంలో తయారైనవే కావాలి. సంపన్నులు విదేశాల్లో వివాహాలు చేసుకోవడానికి ఆసక్తి చూపుతున్నారు. అలాంటి వారు వివాహ వేదికను మన దేశానికి మార్చుకోవాలి. గతంలోనూ ఇలాంటి పిలుపు ఇచ్చా, ఎంతమంది స్పందించారో తెలియదు. మన ప్రతి అడుగులో స్వదేశీ అనే భావన ఉంటే అది మన భవిష్యత్తును నిర్దేశిస్తుంది. మహాత్మా గాంధీకి మనం ఇచ్చే అసలైన నివాళి ఏమిటో తెలుసా?.. స్థానిక ఉత్పత్తులు వాడుకోవడమే. సమ్మిళిత ప్రయత్నం, కృషి ద్వారానే మన దేశాన్ని సంపూర్ణంగా అభివృద్ధి చేసుకోగలం.

మన క్షిపణులతో శత్రువుల్లో భయం

ఇది నవ భారతం. మహా శివుడిని ఆరాధిస్తున్నాం. అదే శివుడు అవసరమైనప్పుడు శత్రువులను చీల్చి చెండాడడానికి కాలభైరవుడు అవుతాడు. మన స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధి చేసుకున్న క్షిపణులు, డ్రోన్లు, గగనతల రక్షణ వ్యవస్థల శక్తి ఏమిటో ఆపరేషన్ సిందూర్ ద్వారా నిరూపితమైంది. మన బ్రహ్మోస్ క్షిపణులు శత్రువుల్లో భయం పుట్టించాయి. పాకిస్తాన్‌లోని దుష్టులు వారి కలలోనూ ప్రశాంతంగా నిద్రపోలేరు. పాకిస్తాన్ కనుక మన దేశంపై మళ్లీ దాడికి దిగితే.. ఉత్తరప్రదేశ్‌లో తయారవుతున్న క్షిపణులతో పాక్ ఉగ్రవాదులను ఖతం చేస్తాం'' అని ప్రధాని మోదీ ప్రతిన బూనారు.

మోదీకి శివలింగం బహూకరణ

ప్రధాని మోదీ వారణాసిలో పర్యటించడం ఇది 51వ సారి కావడం విశేషం. పవిత్ర శ్రావణ మాసాన్ని పురస్కరించుకొని ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ప్రధానమంత్రికి చేతితో తయారు చేసిన శివలింగాన్ని బహూకరించారు. 18 అంగుళాల పొడవు, 15 అంగుళాల వెడల్పు ఉన్న ఈ శివలింగానికి ఎన్నో ప్రత్యేకతలు ఉన్నాయి. ముగ్గురు బనారస్ కళాకారులు తయారు చేశారు. మూడు భౌగోళిక సూచిక(జీఐ) సర్టిఫికెట్లు పొందిన మూడు హస్తకళల సమ్మేళనమే ఈ శివలింగం. మన స్వదేశీ హస్త కళాకృతులు, వస్త్రాలను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లాలని కళాకారులకు, చేనేత కార్మికులకు ప్రధాని మోదీ ఈ సందర్భంగా సూచించారు. 'లోకల్ టు గ్లోబల్' మన లక్ష్యం కావాలన్నారు. జీఐ గుర్తింపు లభించిన స్థానిక ఉత్పత్తులను పరిరక్షించుకోవాలని, వాటిని మరింత ప్రోత్సహించాలని కోరారు.



ప్రజ్వల్‌కు జీవితఖైదు

అత్యాచారం కేసులో శిక్ష ఖరారు

సాక్షి, బెంగళూరు: కర్ణాటకలో సంచలనం సృష్టించిన మహిళలపై అత్యాచారం, లైంగిక వేధింపుల కేసులో జేడీఎస్ కీలక నేత హెచ్‌డీ రేవణ్ణ కుమారుడు ప్రజ్వల్‌కు జీవితఖైదు విధిస్తూ ఎంపీ/ఎమ్మెల్యేల ప్రత్యేక న్యాయస్థానం తీర్పు చెప్పింది. ప్రజ్వల్‌పై రూ.11.50 లక్షల జరిమానా సైతం కోర్టు విధించింది. ఈ రూ.11.50 లక్షల్లో బాధిత మహిళకు రూ.11.25 లక్షలు చెల్లించాలని ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి సంతోష్ గజానన్ భట్ ఆదేశించారు. పలు ఐపీసీ సెక్షన్లతోపాటు ఐటీ చట్టం కింద నిందితుడిని శుక్రవారం దోషిగా నిర్ధారించిన కోర్టు శనివారం శిక్షను ప్రకటించింది. మైసూరు జిల్లా కేఆర్ నగర ప్రాంతానికి చెందిన 48 ఏళ్ల మహిళపై 34 ఏళ్ల ప్రజ్వల్ పలుమార్లు అత్యాచారానికి పాల్పడటంతోపాటు ఆ దారుణాన్ని సెల్‌ఫోన్‌లో చిత్రించి బెదిరించినట్లు ఆరోపణలున్నాయి. హోలెనరసింహపుర జిల్లాలోని హాసన పట్టణంలోని గన్నికడ ఫామ్‌హౌస్‌లో ఈ దారుణం జరిగిందని బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదుతో ఈ కేసు నమోదుచేసిన పోలీసులు దాదాపు 14 నెలల క్రితం ప్రజ్వల్‌ను అరెస్ట్‌చేయడం తెల్సిందే. కోర్టు ఏకంగా జీవితఖైదు విధించడంతో కోర్టు హాల్‌లోనే ఉన్న దోషి ప్రజ్వల్ ఒక్కసారిగా ఏడ్వడం మొదలెట్టాడు. ''నేను మెకానికల్ ఇంజనీరింగ్ చదివిన మెరిట్ విద్యార్థిని. పార్లమెంట్ సభ్యునిగా మంచి పనులు చేశా. నాపై ఇంతవరకు నమోదైన రేప్ కేసుల్లో ఒక్కరు కూడా స్వచ్ఛందంగా వచ్చి నాపై కేసు వేయలేదు. వేగంగా రాజకీయాల్లో పైకి ఎదిగానన్న కక్షతో నాపై కేసులు మోపారు. నేనింతవరకు ఏ తప్పూ చేయలేదు. రాజకీయాల్లో ఎదగడమే నేను చేసిన తప్పు. గత ఏడాది లోక్‌సభ ఎన్నికలకు కేవలం ఆరు రోజుల ముందు దురుద్దేశంతో నాపై లైంగిక ఆరోపణలు మొదలయ్యాయి. బాధితురాలిగా చెబుతున్న మహిళ తన భర్త, కుటుంబసభ్యులకు కూడా తనకు అన్యాయం జరిగిందని అసలు చెప్పనే లేదు. ఉద్దేశపూర్వకంగా నాపై తప్పుడు ఫిర్యాదుచేశారు. నాకూ కుటుంబం ఉంది. కనీసం ఆరు నెలల నుంచి కన్న తల్లిదండ్రులను చూడలేకపోయా. నాకు తక్కువ శిక్ష విధించండి''అని ప్రజ్వల్ ఏడుస్తూ జడ్జీని వేడుకున్నాడు. కేసు నమోదువేళ జర్మనీకి పారిపోయిన ఆనాటి ఎంపీ ప్రజ్వల్‌ను ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) పోలీసులు గత ఏడాది మే 31వ తేదీన బెంగళూరు ఎయిర్‌పోర్ట్‌లో అరెస్ట్‌చేశారు. 113 మంది సాక్షుల నుంచి వాంగ్మూలాలు తీసుకుని బలమైన ఆధారాలు సంపాదించారు. 1,632 పేజీలతో చార్జ్‌షీట్‌ను గతంలో కోర్టుకు సమర్పించారు. ఐటీ చట్టంతోపాటు పలు సెక్షన్ల కింద నమోదైన అన్ని అభియోగాలపై కోర్టు ఏకీభవించిందని స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ అశోక్ నాయక్, అదనపు స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బీఎన్ జగదీశ చెప్పారు.

బాధితురాలికి హ్యాట్సాఫ్: సీఐడీ చీఫ్ వ్యాఖ్య

బనశంకరి: ఈ కేసులో ఎన్ని బెదిరింపులు ఎదురైనా బాధితురాలు ధైర్యంగా ఎదుర్కొన్నారని సీఐడీ అదనపు డీజీపీ బిజయ్ సింగ్ వ్యాఖ్యానించారు. ''కేసు నమోదైన 16 నెలల్లో తీర్పు రావడం నిజంగా ప్రత్యేకం. లైంగిక వేధింపుల వీడియోలో ఉన్నది ప్రజ్వల్ అని కోర్టుకు నిరూపించడానికి సిట్ ఎంతో శ్రమించింది. నేర నిరూపణకు బాధితురాలి ధైర్యమే కారణం. ఆమెకు ఈ విషయంలో సీఐడీ నిజంగా ధన్యవాదాలు తెలుపుతోంది. ఈమె నిరుపేద కావడంతో రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా ప్రాబల్యం కలిగిన వ్యక్తి కుటుంబం నుంచి తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొన్నారు''అని బిజయ్ అన్నారు.

ఎప్పుడేం జరిగిందంటే?

- ➤ **2024 ఏప్రిల్ 22:** ప్రజ్వల్ రేప్ వీడియోలు వైరల్
- ➤ **ఏప్రిల్ 25 :** అశ్లీల వీడియోలపై దర్యాప్తు జరపాల్సిందిగా కోరుతూ రాష్ట్ర ప్రభుత్వానికి రాష్ట్ర మహిళా కమిషన్ నుంచి లేఖ
- ➤ **ఏప్రిల్ 26–27:** జర్మనీకి పారిపోయిన ప్రజ్వల్
- ➤ **ఏప్రిల్ 28 :** ప్రజ్వల్‌పై ఎఫ్ఐఆర్ నమోదు
- ➤ **ఏప్రిల్ 28 :** అశ్లీల దృశ్యాలు కలిగిన పెన్‌డ్రైవ్ కేసుకు సంబంధించి సమగ్ర దర్యాప్తు జరపాలని సిట్ ఏర్పాటు చేసిన ప్రభుత్వం
- ➤ **ఏప్రిల్ 30:** జేడీఎస్ పార్టీ నుంచి ప్రజ్వల్‌ను సస్పెండ్ చేస్తూ జేడీఎస్ నిర్ణయం
- ➤ **మే 1 :** ప్రజ్వల్‌పై అత్యాచారం కేసు నమోదు
- ➤ **మే 30:** బెంగళూరు ఎయిర్‌పోర్ట్‌లో ప్రజ్వల్ అరెస్టు
- ➤ **సెప్టెంబర్ 9 :** 113 సాక్షులతో కూడిన 1,632 పేజీల రెండో చార్జ్‌షీట్ దాఖలు
- ➤ **నవంబర్ 11 :** ప్రజ్వల్ బెయిల్ పిటిషన్‌ను తిరస్కరించిన సుప్రీంకోర్టు
- ➤ **2025 జూలై 18 :** విచారణ పూర్తి చేసి జూలై 30న తీర్పు వెలువరిస్తామని చెప్పిన కోర్టు
- ➤ **జూలై 30:** ఆగస్టు 1కి తీర్పు వాయిదా
- ➤ **ఆగస్టు 1:** ప్రజ్వల్‌ను దోషిగా తేల్చిన ప్రజాప్రతినిధుల ప్రత్యేక న్యాయస్థానం
- ➤ **ఆగస్టు 2:** ప్రజ్వల్‌కు జీవిత ఖైదు విధింపు

ఓటరు జాబితాలో నా పేరు మిస్సయ్యింది

- ఆర్‌జేడీ నేత తేజస్వీ యాదవ్ ఆరోపణ
- అలాందేమీ లేదంటూ స్క్రీన్‌షాట్ షేర్ చేసిన ఈసీ



పట్నా: ఎన్నికల కమిషన్ తాజాగా విడుదల చేసిన బిహార్ ఓటరు ముసాయిదా జాబితాలో తన పేరు గల్లంతైందని ప్రతిపక్ష ఆర్‌జేడీ నేత తేజస్వీ యాదవ్ ఆరోపించారు. తనకు కేటాయించిన ఎపిక్ నంబర్ సైతం మారిందన్నారు. ఎపిక్ నంబర్ ఆధారంగా ఎన్నికల కమిషన్ వెబ్‌సైట్‌లో తన పేరు కోసం సోధించగా 'నో రికార్డ్స్ ఫౌండ్'అని సూచిస్తోందని ఆరోపించారు. మా ఏరియాకు వచ్చిన బూత్ లెవల్ అధికారి తాను నింపి అందజేసిన ఎన్యుమరేషన్ ఫారానికి సంబంధించి ఎలాంటి రిసిప్టును ఇవ్వలేదన్నారు. ఎన్యుమరేషన్ ఫారంలను బూత్ లెవల్ అధికారి ఇచ్చేటప్పుడు తన ఫొటోను తానే తీసుకున్నానన్నారు. 'ఇప్పుడు చూడండి.. నా పేరు ఓటరు జాబితాలో నమోదు కాలేదు. దీంతో ఎన్నికల్లో పోటీ చేసే అర్హత ఉండదు. దేశ పౌరుడిగా నేను గుర్తింపు పొందలేదు. మా ఇంట్లో ఉండే హక్కు కూడా లేదు'అని ఆయన చెప్పుకొచ్చారు. తమ వంటి వారి పరిస్థితే ఇలా ఉంటే సామాన్యుల విషయం ఎవరు పట్టించు కుంటారంటూ ఈసీపై ఆయన ధ్వజమెత్తారు. తేజస్వీ వ్యాఖ్యలను ఈసీ తీవ్రంగా ఖండించింది. 'ఓటరు జాబితాలో ఆయన పేరుంది. గతంలో మాదిరిగా వెటరినరీ కాలేజీలోని బూత్‌లోనే ఆయన పేరుంది. ఇదే సాక్ష్యం.. అంటూ జాబితాలో ఆయన పేరున్న జాబితా ఫొటో స్క్రీన్ షాట్‌ను షేర్ చేసింది.

ఎన్నికల వ్యవస్థ చచ్చిపోయింది

ఈసీపై రాహుల్ ధ్వజం

- 2014 నుంచి ఎన్నికల్లో అక్రమాలు జరుగుతున్నాయి
- గతేడాది లోక్‌సభ ఎన్నికల్లో రిగ్గింగ్ జరిగింది
- సాక్ష్యాల అణు బాంబు త్వరలో ప్రయోగిస్తా
- ఎన్నికల వ్యవస్థలో ప్రకంపనలు సృష్టించడం తథ్యం
- ఎన్డీయేకు 15 సీట్లు తక్కువొస్తే మోదీ ప్రధాని అయ్యేవారు కాదని వ్యాఖ్య



న్యూఢిల్లీ: ఎన్నికల సంఘంపై కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ మరోసారి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. దేశంలో ఎన్నికల వ్యవస్థ ఇప్పటికే చచ్చిపోయిందని అన్నారు. గత ఏడాది లోక్‌సభ ఎన్నికలు రిగ్గింగ్ అయ్యాయని మండిపడ్డారు. ఎన్నికల్లో జరిగిన అక్రమాలపై తన వద్దనున్న అణు బాంబును అతిత్వరలో ప్రయోగిస్తానని, అది మన ఎన్నికల వ్యవస్థలో ప్రకంపనలు సృష్టించడం ఖాయమని తేల్చిచెప్పారు. శనివారం ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో జరిగిన న్యాయ సదస్సులో రాహుల్ గాంధీ ప్రసంగించారు. నరేంద్ర మోదీ ఈసారి అతి తక్కువ మెజార్టీతో ప్రధానమంత్రిగా ఎన్నికయ్యారని గుర్తుచేశారు. ఎన్డీయేకు మరో 15 సీట్లు తక్కువ వచ్చి ఉంటే ఆయన ఆ పదవిలో ఉండేవారే కాదని వ్యాఖ్యానించారు. లోక్‌సభ ఎన్నికలను రిగ్గింగ్ చేయొచ్చని, గత ఎన్నికల్లో రిగ్గింగ్ జరిగిందని త్వరలో నిరూపిస్తామని పేర్కొన్నారు. రాహుల్ ప్రసంగం ఆయన మాటల్లోనే...

ఆ కొత్త ఓటర్లు ఎవరు?

ఎన్నికల సంఘం స్వతంత్రను కాపాడుతున్నది రాజ్యాంగమే. కానీ, రాజ్యాంగాన్ని ఎన్నికల సంఘం అతిక్రమిస్తోంది. లెక్కలేకుండా వ్యవహరిస్తోంది. ఎన్నికల్లో జరుగుతున్న అక్రమాలపై గతంలో నా దగ్గర ఆధారాల్లేవు. అందుకే ఎన్నికల సంఘంపై ఆరోపణలు చేయలేదు. కానీ, ఇప్పుడు 100 శాతం సాక్ష్యం ఉంది కాబట్టే పూర్తివిశ్వాసంతో మాట్లాడుతున్నా. ఎన్నికల్లో అవకతవకలు ఎలా సాధ్యమని కుర్చీలో కూర్చున్నవారు అడుగుతున్నారు. కానీ, అది ముమ్మాటికీ సాధ్యమే. గత ఎన్నికల్లో అక్రమాలు జరిగాయి. ఎన్నికల వ్యవస్థపై నాకు ఎప్పటి నుంచో అనుమానాలున్నాయి. 2014 నుంచే జగరానిది ఏదో జరుగుతున్నట్లు సందేహాలు తలెత్తాయి. గుజరాత్ అసెంబ్లీ ఎన్నికలతో అనుమానాలు బలపడ్డాయి. అక్కడ బీజేపీ ఏకపక్షంగా విజయం సాధించించింది. రాజస్తాన్‌లో కాంగ్రెస్‌కు ఒక్క సీటు కూడా రాలేదు. మధ్యప్రదేశ్, గుజరాత్‌లోనూ సీట్లు రాలేదు. ఇది నాకు చాలా ఆశ్చర్యం కలిగించింది. మహారాష్ట్రలో లోక్‌సభ ఎన్నికల్లో మంచి స్కోర్ సాధించిన మూడు పార్టీలు అసెంబ్లీ ఎన్నికల్లో మాత్రం సీట్లు గెల్చుకోలేదు. ఎన్నికల్లో అక్రమాలపై అప్పటి నుంచే సీరియస్‌గా దృష్టి పెట్టాం. మహారాష్ట్రలో లోక్‌సభ ఎన్నికల తర్వాత కొత్తగా కోటి మంది ఓటర్లుగా నమోదయ్యారు. ఎన్నికల్లో ఈ ఓట్లన్నీ బీజేపీకి పడ్డాయి. ఆ కొత్త ఓటర్లు ఎవరన్నదానిపై నావద్ద స్పష్టమైన ఆధారం లేదు. ఎన్నికల్లో చీటింగ్ జరిగిందని మా మిత్రపక్షాలతోనూ చెప్పా. ఇప్పుడు ఆధారం దొరికింది. దేశంలో ఎన్నికల సంఘం అనేదే లేదు, అది అదృశ్యమైపోయిందని నిరూపించే సాక్ష్యాధారాన్ని దేశానికి చూపిస్తాం.

ఓటర్ల జాబితాల సంగతేంటి?

లోక్‌సభ ఎన్నికల్లో జరిగిన మోసంపై ఆధారాలు సేకరించడానికి ఆరు నెలలపాటు శ్రమించాం. ఎలక్ట్రానిక్ రూపంలోని ఓటర్ల జాబితాలను ఎన్నికల సంఘం మాకు ఇవ్వలేదు. బూత్‌ల వారీగా కాగితాల రూపంలోని జాబితాలు ఇచ్చారు. ఎన్నికల సంఘం వాటిని స్కాన్ చేయలేదు. ఓటర్ల జాబితాలను స్కాన్ చేసి ఎందుకు భద్రపర్చడం లేదు? వాటి ఎలక్ట్రానిక్ కాపీలను భద్రపర్చాల్సిన అవసరం లేదా? ఒక లోక్‌సభ నియోజకవర్గంలో భౌతిక రూపంలోని ఓటర్ల జాబితాలను క్షుణ్నంగా పరిశీలిస్తే 6.5 లక్షల ఓట్లలో 1.5 లక్షల ఓట్లు తప్పుడువని తేలిపోయింది' అని రాహుల్ స్పష్టం చేశారు.

జైట్లీ బెదిరించారు

నరేంద్ర మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిన మూడు వ్యవసాయ చట్టాలను నేను తీవ్రంగా వ్యతిరేకించా. కానీ, వ్యతిరేకించవద్దని అప్పటి ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీ చెప్పారు. వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా మాట్లాడితే నాపై చర్యలు తీసుకుంటామని బెదిరించాలని చూశారు. ఆయన కళ్లల్లోకి సూటిగా చూస్తూ గట్టిగా బదులిచ్చా. మీరు ఎవరితో మాట్లాడుతున్నారో తెలియదనుకుంటా... మేము కాంగ్రెస్ మనుషులం. పిరికిపందలం కాదు. మేము ఎవరికీ తలవంచం. బ్రిటిష్ పాలకులే మమ్మల్ని ఏమీ చేయలేకపోయారు. మాకు చెప్పడానికి మీరెవరు? అని నిలదీశా'' అని రాహుల్ గాంధీ వెల్లడించారు.

2019లో చనిపోతే 2020లో బెదిరించారా?: రోహన్ జైట్లీ

అరుణ్ జైట్లీ బెదిరించడానికి ప్రయత్నించారంటూ కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలపై అరుణ్ జైట్లీ తనయుడు రోహన్ జైట్లీ ఖండించారు. తన తండ్రి 2019లో మరణించారని, వ్యవసాయ చట్టాలు 2020లో వచ్చాయని గుర్తుచేశారు. అలాంటప్పుడు రాహుల్ గాంధీని బెదిరించడం ఎలా సాధ్యమని ప్రశ్నించారు. ఈ మేరకు రోహన్ జైట్లీ 'ఎక్స్'లో పోస్టు చేశారు. భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేసినవారిని బెదిరింపులకు గురిచేయడం తన తండ్రికి అలవాటు లేదని, అది ఆయన వ్యక్తిత్వం కాదని పేర్కొన్నారు.

దమ్ముంటే బాంబు పేల్చు

రాహుల్ గాంధీకి రాజ్‌నాథ్ సింగ్ సవాల్



పట్నా: ఓట్ల చౌర్యానికి పాల్పడుతున్న ఎన్నికల సంఘంపై అణు బాంబు లాంటి సాక్ష్యం ఉందంటూ కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పందించారు. దమ్ముంటే ఒక్కసారి అణు బాంబు పేల్చి చూపించాలని రాహుల్‌కు సవాల్ విసిరారు. అది పేలేటప్పుడు హాని జరగకుండా చూసుకోవాలని హితవు పలికారు. పార్లమెంట్‌లో భూకంపం సృష్టిస్తానని రాహుల్ గతంలో హెచ్చరించారని, చివరకు తుస్సుమనిపించారని ఎద్దేవా చేశారు. శనివారం బిహార్ రాజధాని పాట్నాలో ఓ కార్యక్రమంలో రాజ్‌నాథ్ మాట్లాడారు. రాజ్యాంగబద్ధ సంస్థ అయిన ఎన్నికల సంఘాన్ని రాహుల్ కించపరుస్తున్నారని ఆరోపించారు. నిజానికి రాహుల్ పార్టీ చేతులే రక్తంతో తడిశాయని విమర్శించారు. 1975లో ఎమర్జెన్సీ విధించడం ద్వారా ప్రజాస్వామ్యాన్ని హత్య చేయడానికి కాంగ్రెస్ పార్టీ ప్రయత్నించిందని రాజ్‌నాథ్ ధ్వజమెత్తారు.

ట్రంప్ చెప్పింది అబద్ధం

రష్యా నుంచి భారత్ చమురు కొనుగోళ్లు యథాతథం

వాషింగ్టన్: రష్యా నుంచి ఆయుధాలు, చమురును కొనుగోలు చేయొద్దని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ గుడ్లురిమి చూసినా భారత్ ఏమాత్రం బెదరలేదని తాజాగా వెల్లడైంది. భారత్ చమురు, ఆయుధాలను కొనుగోలు చేయడం ద్వారా ఆర్జించిన లాభాలను రష్యా.. ఉక్రెయిన్‌పై యుద్ధం కోసం వెచ్చిస్తోందని ట్రంప్ ఇప్పటికే ఆరోపించారు. ఈ కొనుగోల్లు ఆపకపోతే భారీ దిగుమతి సుంకాలు విధిస్తానని భారత్‌ను ట్రంప్ బెదిరించినా రష్యా ముడిచమురును భారత రిఫైనరీ కంపెనీలు నిరాటంకంగా కొనుగోలుచేస్తూనే ఉన్నాయని జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. భవిష్యత్తులో రష్యా నుంచి భారత్ చమురును కొనుగోలుచేయబోదనే వార్తలను విన్నానని ట్రంప్ శనివారం వ్యాఖ్యానించిన కొద్దిసేపటికే జాతీయమీడియాలో భిన్నమైన వార్తలు రావడం విశేషం. ''రష్యా నుంచి చమురు కొనే సంస్కృతికి భారత్ మంగళం పాడుతుందని విన్నా. ఇది నిజంగా మంచి విషయం. అయితే ఇందులో నిజమెంతో నాక్కూడా తెలీదు. తర్వాత ఏం జరుగుతుందో వేచిచూద్దాం'' అని ట్రంప్ న్యూజెర్సీలోని బెడ్‌మిన్‌స్టర్ గల్ఫ్ క్లబ్‌లో మీడియాతో ట్రంప్ అన్నారు. అయితే అగ్రరాజ్యం అమెరికా ఎంతగా బెదిరించినా సరే భారత్ తన స్వప్రయోజనాలకు, సార్వభౌమతానికే అత్యంత ప్రాధాన్యతనిస్తుందని మరోసారి రుజువైందని జాతీయమీడియాలో శనివారం పలు కథనాలు వచ్చాయి. '' రష్యా నుంచి ముడి చమురును కొనుగోలు చేయాలా? వద్దా? కొంటే ఎంత పరిమాణంలో కొనాలి? అనేవి కేవలం మార్కెట్ ధర ప్రకారం మే నిర్ణయం తీసుకుంటాంగానీ ట్రంప్ వంటి బయటివ్యక్తి బెదిరింపులకు భయపడికాదు'' అని రిఫైనరీల సంబంధిత వర్గాలు వ్యాఖ్యానించాయి. '' ముడి చమురు నాణ్యత, సరఫరా వ్యయాలు, ఇతరత్రా ఖర్చుల గురించే మేం ఆలోచిస్తాంగానీ అమెరికా ఆదేశించిందనో మరెవరో వద్దన్నారో మేం చమురు కొనుగోళ్లను ఆపబోం'' అని భారతీయ రిఫైనరీలు స్పష్టంచేసినట్లు తెలుస్తోంది.

మోదీ పేరు చెప్పాలంటూ ఒత్తిడి చేశారు

ప్రజ్ఞా ఠాకూర్ సంచలన ఆరోపణ

ముంబై: 2008 నాటి మాలెగావ్ పేలుడు ఘటన కేసు నుంచి బయటపడిన బీజేపీ మాజీ ఎంపీ ప్రజ్ఞాఠాకూర్ సంచలన ఆరోపణలు చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్, ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ తదితరులకు పేలుళ్లతో సంబంధం ఉందని చెప్పాలంటూ అధికారులు తనను తీవ్ర ఒత్తిడికి గురి చేయడంతోపాటు చిత్రహింసలు పెట్టారన్నారు. 'నాపై ఒత్తిడి చేసి, నేను చెప్పిన ప్రతి విషయాన్ని రాత పూర్వకంగా తీసుకున్నారు. మేం చెప్పినట్లుగా ఆయా పేర్లను చెబితే కొట్టబోమని నాకు మాటలు చెప్పారని' ఆరోపించారు. అప్పటి యూపీఏ ప్రభుత్వంలోని కాంగ్రెస్ పార్టీయే ఆ కుట్ర పన్నిందని, కాషాయాన్ని, సాయుధ బలగాలను అప్రతిష్ఠపాలు చేయాలన్న భారీ కుట్ర దీని వెనుక దాగుందని ఆమె పేర్కొన్నారు.

తుది దశకు 'డెంగీఆల్' క్లినికల్ పరీక్షలు

తొలిసారిగా దేశీ వ్యాక్సిన్ తయారీలో ఐసీఎంఆర్

- దేశవ్యాప్తంగా 20 కేంద్రాల్లో జరుగుతున్న క్లినికల్ పరీక్షలు
- బీబీనగర్ ఎయిమ్స్‌లోనూ ట్రయల్స్
- వివరాలు వెల్లడించిన కేంద్ర ఆరోగ్య శాఖ

సాక్షి, న్యూఢిల్లీ: దేశంలో లక్షలాది మరణాలకు ప్రబల హేతువైన డెంగీ వ్యాధిని తుదముట్టించేందుకు భారత్‌లో జరుగుతున్న సుదీర్ఘ పరిశోధనలు కీలకదశకు చేరాయి. తొలిసారిగా దేశీయంగా అభివృద్ధి చేసిన 'డెంగీ ఆల్'వ్యాక్సిన్‌పై కీలక క్లినికల్ పరీక్షలు తుది దశలోకి ప్రవేశించాయి. ఈ వ్యాక్సిన్‌కు సంబంధించి భారత వైద్యపరిశోధనా మండలి(ఐసీఎంఆర్) ఆధ్వర్యంలో మూడో దశ క్లినికల్ పరీక్షలు మొదలెట్టినట్లు కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రిత్వ శాఖ ప్రకటించింది. 10,000 మంది వలంటీర్లు ఈ మూడో దశ క్లినికల్ పరీక్షల్లో భాగస్వాములుకానున్నారు. ఇప్పటికే 70 శాతానికి పైగా వలంటీర్ల నమోదు ప్రక్రియ పూర్తయిందని ఆరోగ్య శాఖ తెలిపింది. భారత వైద్య పరిశోధనా మండలి ఆధ్వర్యంలో దేశంలోని 20 కేంద్రాల్లో ఈ క్లినికల్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. తెలంగాణలో బీబీనగర్ ఎయిమ్స్, కర్ణాటకలో మైసూరు జేఎస్ఎస్ మెడికల్ కళాశాల, బెంగళూరు మెడికల్ కాలేజీల పరిధిలోనూ ఈ పరీక్షలు కొనసాగుతున్నాయి. ఒక్కో కేంద్రానికి రూ.1.3 కోట్ల నుంచి రూ.1.5 కోట్ల వరకు బడ్జెట్ కేటాయించారు. 2024 సంవత్సరంలో దేశవ్యాప్తంగా 5,73,563 డెంగీ కేసులు నమోదైనట్లు వ్యాధుల నియంత్రణ కేంద్ర సంస్థ (ఎన్‌సీడీసీ) వెల్లడించింది. ప్రపంచవ్యాప్తంగా డెంగీ కారణంగా అధిక మరణాలు సంభవిస్తున్న దేశాల జాబితాలో భారత్ సైతం ఉంది. దేశంలోని చాలా ప్రాంతాల్లో సెరోటైప్– డీఈఎన్‌వీ 1, 2, 3, 4 రకం డెంగీ వైరస్ జాతులు విజృంభిస్తున్నాయి. ఒకే వ్యక్తిలోనూ ఒకేసారి ఒకటి కంటే ఎక్కువ వైరస్ రకాలు సోకే ప్రమాదం ఉంది. ఈ కారణంగానే దేశంలోని భిన్న ప్రాంతాల ప్రజలకు సరిపడేలా దేశవ్యాప్తంగా వేర్వేరు వాతావరణ జోన్లలో క్లినికల్ పరీక్షలు నిర్వహిస్తున్నామని ఐసీఎంఆర్ వెల్లడించింది. ఇప్పటికీ డెంగీను ముందస్తుగా నివారించేలా పూర్తి దేశీయంగా తయారైన వ్యాక్సిన్ లేదా ప్రత్యేకంగా యాంటీవైరల్ ఔషధం లేదు. ప్రస్తుతం ఉన్న చికిత్సలన్నీ డెంగీ సోకిన తర్వాతే లక్షణాలను తగ్గించి, రోగిని మామూలు స్థితికి తీసుకుని రావడానికి అక్కరకొస్తున్నాయి. డెంగీ కేసులపై తక్షణ పర్యవేక్షణ, నివారణ చర్యలపై ఎన్‌వీబీడీసీ, డీజీహెచ్ఎస్, ఆరోగ్య మంత్రిత్వ శాఖ చురుకుగా వ్యవహరిస్తున్నాయి. డెంగీ కట్టడి కోసం ప్రతి రాష్ట్రానికి నిధులు, శిక్షణా కార్యక్రమాలు, అవగాహన చిత్రాలు, ఫాగింగ్, ఇంటి వద్ద దోమల నియంత్రణ చర్యలు చేపడుతున్నారు. అంతేగాక సెంటినెల్ సర్వేలెన్స్ హాస్పిటల్స్, అపెక్స్ ల్యాబ్‌లు దేశవ్యాప్తంగా ఏర్పాటు చేసినట్లు కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ పేర్కొంది.



చేనేత రంగం అభివృద్ధికి కృషి

చేనేత రంగం అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. 'వీవ్స్' చేనేత వస్త్ర ప్రదర్శనను శనివారం ఆయన సందర్శించారు. -10లో



దునియా మెచ్చే.. దోస్తీ..

తల్లిదండ్రులే స్నేహితులుగానూ మారిపోతున్నారు. పిల్లలు కూడా ప్రతిదీ తల్లిదండ్రులకు షేర్ చేసుకుంటూ.. దునియా మెచ్చే దోస్తీ అనిపించుకుంటున్నారు. - సిటీప్లస్‌లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం 32.0/24.0

నగరంలో ఆదివారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. తేలికపాటి వర్షం కురిసే అవకాశముంది. గరిష్టంగా 32, కనిష్టంగా 24 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయని అంచనా.

హైడ్రాతో ప్రజలకు అభయం.. కబ్జాకోరులకు భయం

హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్



సమావేశంలో మాట్లాడుతున్న ఏవీ రంగనాథ్

బంజారాహిల్స్: కూలగొట్టుడు కాదు.. పర్యావరణహితమైన.. అందరికీ నివాసయోగ్యమైన నగర నిర్మాణమే లక్ష్యమని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ స్పష్టం చేశారు. హైడ్రా అంటే భయం కాదని, ప్రజలకు ఓ అభయమన్నారు. చెరువులు, నాలాలు, ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాలను కబ్జా చేసినవారి దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని ఆయన సూచించారు. 'హైడ్రా.. బస్తీతో దోస్తీ'లో భాగంగా శనివారం ఫిలింనగర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వివిధ బస్తీల నుంచి వచ్చిన ప్రజలను ఉద్దేశించి రంగనాథ్ మాట్లాడారు. హైడ్రా ఎప్పుడూ పేదలు, సామాన్యుల పక్షమేనన్నారు. పేదలు ఎక్కడైనా ఇల్లు నిర్మించుకుని ఉంటే వాటిని తొలగించబోమని, ఒకవేళ తప్పనిసరైతే వారికి ప్రత్యామ్నాయంగా ఎక్కడైనా నివాసాన్ని చూపించి మాత్రమే హైడ్రా ముందుకెళ్తుందని స్పష్టం చేశారు. ప్రభుత్వ విధానం కూడా ఇదేనని తెలిపారు. మూసీ సుందరీకరణతో హైడ్రాకు సంబంధం లేదన్నారు. నదీ ప్రవాహానికి అడ్డంగా మారిన కబ్జాలను తొలగించామన్నారు. ఇలా 10 ఎకరాల మేర కబ్జా చేసి నెలకు కోటి రూపాయల ఆదాయం పొందుతున్న వారి భరతం పట్టామన్నారు. చారిత్రక బుల్కాపూర్ నాలాను పరిశుభ్రంగా ఉంచుకోవడంలో అందరూ సహకరించాలన్నారు. నగరంలో వరద ముంపు ముప్పు ఉన్న 750 బస్తీల్లోని నాలాలను పరిశుభ్రం చేస్తామని హైడ్రా అడిషనల్ డైరెక్టర్ వర్ల పాపయ్య చెప్పారు.

నెలరోజుల్లో 2,479 మంది బాల కార్మికులకు విముక్తి

- 530 మందిపై కేసులు నమోదు చేసిన రాచకొండ పోలీసులు



పోలీసు సిబ్బందిని అభినందిస్తున్న రాచకొండ సీపీ

సాక్షి, సిటీబ్యూరో: ఆపరేషన్ ముస్కాన్–11లో రాచకొండ పోలీసు కమిషనరేట్ రాష్ట్రంలో అత్యధిక రెస్క్యూ యూనిట్‌గా అగ్రస్థానంలో నిలిచింది. తప్పిపోయిన పిల్లలను గుర్తించడం, ప్రమాదకర వృత్తులలో బాల కార్మికులు, కౌమారదశలను గుర్తించడంలో ఆపరేషన్ ముస్కాన్ నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. నెల రోజుల ఈ ఆపరేషన్‌లో భాగంగా 9 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. వాణిజ్య సంస్థలు, ట్రాఫిక్ జంక్షన్లు, బస్ స్టేషన్లు, రైల్వే స్టేషన్లు, నిర్మాణ స్థలాలు, ఇతర అనుమానిత ప్రదేశాలలో తనిఖీలు, రెస్క్యూ ఆపరేషన్లను నిర్వహించి.. కమిషనరేట్ పరిధిలో మొత్తం 2,479 మంది బాల కార్మికులను రక్షించారు. ఇందులో 2,353 మంది బాలురు, 126 మంది బాలికలు ఉన్నారు. వీరిలో తెలంగాణ రాష్ట్రంలో 1,077 మంది, ఆంధ్రప్రదేశ్ నుంచి 133 మంది, బిహార్, ఛత్తీస్‌గఢ్, ఉత్తరప్రదేశ్, ఒడిశా, పశ్చిమ బెంగాల్, ఝార్ఖండ్ వంటి రాష్ట్రాలకు చెందిన 1,269 మంది పిల్లలు ఉండగా.. నేపాల్ దేశానికి చెందిన 12 మంది పిల్లలు ఉన్నారు. పిల్లలను పనిలో పెట్టుకున్న ఆయా కర్మాగారాల యాజమాన్యాలు, ఉద్యోగులు 530 మందిపై పోలీసులు కేసులు నమోదు చేశారు. 556 మందిని అరెస్టు చేశారు. ముస్కాన్–11ను సక్సెస్ చేసిన పోలీసు అధికారులను కమిషనర్ జి.సుధీర్ బాబు అభినందించారు.

19న ఓయూ స్నాతకోత్సవం



ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ 84వ స్నాతకోత్సవం ఈ నెల 19న నిర్వహించనున్నట్లు శనివారం ఎగ్జామినేషన్ కంట్రోలర్ ప్రొ.శశికాంత్ తెలిపారు. గత రెండు విద్యా సంవత్సరాలకు జరిగే స్నాతకోత్సవంలో వివిధ పీజీ కోర్సుల్లో అత్యధిక మార్కులు సాధించిన 121 మంది విద్యార్థులకు బంగారు పతకాలు, సుమారు 1200 మంది పీహెచ్‌డీ స్కాలర్స్‌కు డాక్టరేట్ డిగ్రీ పట్టాలను అందజేయనున్నట్లు చెప్పారు. స్నాతకోత్సవానికి ఇప్పటివరకు దరఖాస్తు చేసుకోని అభ్యర్థులు ఈ నెల 6 వరకు, రూ.500 అపరాధ రుసుముతో 12 వరకు చేసుకోవచ్చన్నారు. పూర్తి వివరాలను ఉస్మానియా వెబ్‌సైట్‌లో చూడవచ్చని ఆయన సూచించారు.



గవర్నర్‌తో ఓ జ్ఞాపకం!

ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం 55వ స్నాతకోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ హాజరై పీజీ, పీహెచ్‌డీ పట్టాలను, బంగారు పతకాలను ప్రదానం చేశారు. అనంతరం గవర్నర్‌తో కలిసి వర్సిటీ వీసీ జానయ్య, పాలక మండలి సభ్యులు, అధికారులు, విద్యార్థులు ఇలా ఫొటో దిగారు.

షీ హెచ్‌ఎంసీ!

బల్దియా పాలనలో మహిళల మార్కు

- ఇంజినీరింగ్ విభాగంలోనూ అతివలదే ఆధిక్యత
- కీలక, ఉన్నత పోస్టుల్లోనూ వీరిదే పైచేయి
- తాజా నియామకాలతో పెరిగిన సంఖ్య

సాక్షి, సిటీబ్యూరో


కోటిమందికి పైగా ప్రజలకు వివిధ సేవలందిస్తున్న, సదుపాయాలు కల్పిస్తున్న జీహెచ్‌ఎంసీలో అడిషనల్, డిప్యూటీ కమిషనర్లతో సహా వివిధ ఉన్నత పోస్టుల్లో ఇప్పటికే చెప్పుకోదగ్గ సంఖ్యలో మహిళా అధికారులున్నారు. తాజాగా ఒక విభాగంలో చీఫ్ ఇంజినీర్‌గాను, మూడు విభాగాల్లో సూపరింటెండింగ్ ఇంజినీర్లు (ఎస్ఈ)గానూ మహిళల్నే నియమించారు. ఇప్పటికే పలు సర్కిళ్లలో ఈఈలు, డీఈఈలుగా పలువురు మహిళలున్నారు. తాజా నియామకాలతో ఉన్నత స్థాయిలో సంబంధిత విభాగంలో పనులు పర్యవేక్షించే మహిళా అధికారుల సంఖ్య పెరిగింది. ఆ స్థాయిలోని ఉన్నతాధికారులు పదవీ విరమణ పొందిన నేపథ్యంలో వారి స్థానాల్లో మహిళల్ని నియమించారు. ఇటీవల పదవీ విరమణ పొందిన ఎం. కోటేశ్వరరావు ఘనవ్యర్థాల నిర్వహణ విభాగానికి ఎస్ఈగా పని చేస్తూనే, వ్యూహాత్మక నాలా అభివృద్ధి పథకం (ఎస్ఎన్‌డీపీ) ప్రాజెక్టులో సీఈగానూ అదనపు బాధ్యతలు నిర్వహించారు. పదవీ విరమణ పొందిన మరో ఎస్ఈ బి. వెంకటేశ్వర్లు డిజైన్స్, అడ్మినిస్ట్రేషన్ విభాగాల ఎస్ఈగా పని చేశారు. వారి రిటైర్మెంట్‌తో ఖాళీ అయిన నాలుగు పోస్టుల్లోనూ మహిళల్నే నియమించారు.

అదనపు బాధ్యతల్లోనూ..

- పబ్లిక్ హెల్త్ అండ్ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన ఇంజినీర్లనే జీహెచ్‌ఎంసీలో నియమించడం రివాజు. సదరు విభాగంలో ఎస్ఈగా ఉన్న టీఎస్ జ్యోతిర్మయిని జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్ విభాగంలోని డిజైన్స్, అడ్మినిస్ట్రేషన్ విభాగాల ఎస్‌గా నియమించడంతో పాటు ఎస్ఎన్‌డీపీ సీఈగానూ అదనపు బాధ్యతలప్పగించారు. మరో ఎస్ఈ ఎల్.రమాదేవిని జీహెచ్‌ఎంసీ ఘనవ్యర్థాల నిర్వహణ విభాగం ఎస్ఈగా నియమించారు. వ్యూహాత్మక రహదారుల అభివృద్ధి పథకం (ఎస్సార్‌డీపీ) మూడు జోన్ల ఎస్ఈగా శ్రీలక్ష్మి పని చేస్తున్నారు. జీహెచ్‌ఎంసీలో ఉన్న ఆరు జోన్లలో మూడింటి బాధ్యతలు ఆమే నిర్వహిస్తున్నారు.
- నగరంలోని కీలకమైన, పనులు ఎక్కువగా ఉన్న శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి, ఖైరతాబాద్ జోన్ల ఎస్సార్‌డీపీ ఎస్ఈగా ఆమె పనిచేస్తున్నారు. ప్రాజెక్ట్స్ విభాగం డిప్యూటీ సీఈగా సంపద ఉన్నారు. ఇంజినీరింగ్ మెయింటనెన్స్ విభాగంలోనూ సికింద్రాబాద్ జోన్ ఎస్ఈగా ఆశాలతను కొద్దికాలం క్రితం నియమించారు. ఒక సర్కిల్‌లో ఈఈగా పని చేస్తున్న ఆమె ఎస్ఈ పోస్టును అదనపు బాధ్యతలతో నిర్వహిస్తున్నారు. ఎలక్ట్రికల్ విభాగం ఇన్‌చార్జి ఎసీఈగా మమత పని చేస్తున్నారు. జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్ విభాగంలో ఉన్నత స్థానాల్లో ఇంతమంది మహిళా అధికారులు ఇంతకు ముందెన్నడూ లేరు.

ఇతర విభాగాల్లోనూ..

అడిషనల్ కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్లు, జాయింట్ కమిషనర్లు (జేసీ), కొన్ని విభాగాల్లో హెచ్‌ఓడీలుగానూ మహిళలే ఉన్నారు. ప్రధాన కార్యాలయంలో యూసీడీ విభాగం అడిషనల్ కమిషనర్ (ఏసీ)గా ఎస్. పంకజ, ఫైనాన్స్ విభాగం ఏసీగా గీతా రాధిక, ఎన్నికలు, ఎస్టేట్స్ విభాగాల ఈసీగా మంగతాయారు, యూబీడీ, స్పోర్ట్స్ విభాగాల ఏసీగా వీపీఎస్ సుభద్రాదేవి, డిపార్ట్‌మెంట్ ఎంక్వైరీస్ ఏసీగా పి.సరోజ, ఐటీ విభాగం జేసీగా రాధ, స్పోర్ట్స్ విభాగం జేసీగా ఎస్. వాణిశ్రీ, ఎన్నికల విభాగం జేసీగా రమాదేవి, చీఫ్ ఫైనాన్షియల్ అడ్వైజర్‌గా ఎస్.లక్ష్మి, చీఫ్ హార్టికల్చరిస్ట్‌గా సునంద, చీఫ్ మెడికల్ ఆఫీసర్‌గా, ఇన్‌చార్జి చీఫ్ ఎంటమాలజిస్ట్‌గా డాక్టర్ పద్మజ ఉన్నారు. రాజకీయాల్లో మహిళలకు రిజర్వేషన్లేమో కానీ, జీహెచ్‌ఎంసీలో ఉన్నత పదవుల్లో మాత్రం మహిళలు గణనీయంగానే ఉండటం విశేషం.



పంద్రాగస్టు నేపథ్యంలో ఎయిర్‌పోర్టులో హై అలర్ట్

శంషాబాద్: పంద్రాగస్టు నేపథ్యంలో శంషాబాద్ విమానాశ్రమంలో హై అలర్ట్ విధించారు. ఇందులో భాగంగా ఆర్‌జీఐఏ ఔట్‌పోస్టు పోలీసులతో పాటు సీఐఎస్ఎఫ్, రక్షా సెక్యూరిటీ అధికారులు తనిఖీలు ముమ్మరం చేశారు. ఎయిర్‌పోర్టులో అన్ని రోటరీలతో పాటు ప్రధాన గేటు వద్ద వాహనాలను తనిఖీలు చేపడుతున్నారు. విమానాశ్రయంలో పాసుల జారీలో ఆంక్షలు విధించారు. ఈ నెల 20 వరకు లాంజ్‌లకు ప్రవేశం లేకుండా పాస్‌ల జారీని నిలిపివేసినట్లు ఎయిర్‌పోర్టు అధికారులు వెల్లడించారు.



పోలీసుల తనిఖీలు

అర్హులందరికీ రేషన్ కార్డులు

- పంపిణీ ప్రక్రియ నిరంతరాయం
- మంత్రి పొన్నం ప్రభాకర్



రేషన్‌కార్డుల పంపిణీని ప్రారంభిస్తున్న మంత్రి పొన్నం, ఎమ్మెల్యే పద్మారావు, కలెక్టర్ హరిచందన

సికింద్రాబాద్: అర్హులైన వారందరికీ రేషన్ కార్డుల జారీ ప్రక్రియ నిరంతరాయంగా కొనసాగుతుందని మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ స్పష్టం చేశారు. శనివారం సికింద్రాబాద్ నియోజకవర్గంలో కొత్త రేషన్‌కార్డులను స్థానిక ఎమ్మెల్యే పద్మారావుతో కలిసి లబ్ధిదారులకు మంత్రి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదేళ్ల అనంతరం కొత్త రేషన్ కార్డులు ఇవ్వడంతో పాటు లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీ చేస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. రేషన్ కార్డును నిత్యావసర సరకులు పంపిణీ చేయడం కోసమే కాకుండా అన్ని ప్రభుత్వ పథకాలు పొందేందుకు వీలుగా ఒక గుర్తింపు కార్డుగా పరిగణనలోకి తెచ్చేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ మాట్లాడుతూ.. నియోజకవర్గంలో వేలాదిమంది దరఖాస్తు దారులు ఉండగా కేవలం 1800 మందికి మాత్రమే కార్డులు ఇవ్వడమేంటని ప్రశ్నించారు. ఇందుకు స్పందించిన మంత్రి.. జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి మాట్లాడుతూ.. నియోజకవర్గంలో 6,500 దరఖాస్తులు పరిశీలించి 4 వేల కార్డులు ఇచ్చేందుకు ఎంపిక చేశామని చెప్పారు. దశలవారీగా అందరికీ కార్డులు అందిస్తామన్నారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్ రవికిరణ్, కార్పొరేటర్లు సామల హేమ, కంది శైలజ, రాసూరి సునీత, లింగాని ప్రసన్నలక్ష్మి, కాంగ్రెస్ నాయకులు ఆదం సంతోష్‌కుమార్, సురేశ్‌లాల్ పాల్గొన్నారు.

వినియోగదారుల విన్నపాలు వినరా!

రెండున్నరేళ్లుగా కమిషన్ ఛైర్మన్ కుర్చీ ఖాళీ

- ప్రభుత్వం స్పందించి పోస్టును భర్తీ చేయాలి
- విజ్ఞప్తి చేస్తున్న న్యాయవాదులు, కక్షిదారులు



సిటీ కోర్టులు : రాష్ట్ర వినియోగదారుల కమిషన్‌కు రెండున్నరేళ్లుగా ఛైర్మన్ లేకపోవడంతో కేసుల పెండెన్సీ పెరిగిపోతోంది. అనేకమంది వినియోగదారులు తమ కేసుల పరిష్కారం కోసం ఎదురు చూపులు చూస్తున్నారు. 2023 ఫిబ్రవరి 5న జస్టిస్ జైశ్వాల్ పదవీకాలం ముగిసింది. అప్పటి నుంచి సీనియర్ నాన్ జ్యుడీషియల్ మెంబర్ ఇన్‌చార్జి ప్రెసిడెంట్‌గా వ్యవహరిస్తున్నారు. ఛైర్మన్ పదవికి రిటైర్మెంట్ అయిన హైకోర్టు న్యాయమూర్తిని.. ప్రధాన న్యాయమూర్తి రాష్ట్ర ప్రభుత్వంతో సంప్రదించి నియమించాల్సి ఉంటుంది. 2019 వినియోగదారుల చట్టంలో రాష్ట్ర కమిషన్ ఛైర్మన్ పదవికి సైతం రాతపరీక్ష అవసరం అని పేర్కొనగా న్యాయమూర్తులు ఆ పదవిపై ఆసక్తి చూపలేదు. ఈ మధ్యలో సుప్రీంకోర్టు జోక్యం చేసుకుని ఆ పదవికి పరీక్ష అవసరం లేదని ప్రభుత్వం హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి సూచించిన వారిని ఛైర్మన్‌గా నియమించుకో వచ్చని చెప్పినా జాప్యం కొనసాగుతోంది.

- ఒక న్యాయవాది దాఖలు చేసిన రిట్ పిటిషన్‌లో హైకోర్టు కూడా ఛైర్మన్ నియామకం జరపాలని సూచన కూడా చేసింది. దాదాపు సంవత్సరం క్రితమే క్లియరెన్స్ వచ్చినా, సుప్రీంకోర్టు మరోసారి మే 21న ఈ మేరకు ఉత్తర్వులు ఇచ్చినా ప్రభుత్వ అలస్యం కారణంగా నియామక ప్రక్రియ ముందుకు సాగడం లేదు. ఈ విషయంలో సెలక్షన్ కమిటీ పాత్ర ఏ మాత్రం ప్రస్తావన లేకపోయినా దరఖాస్తుల పేరున ఇతర కారణాలతో నియామకం చేయకుండా తాత్సారం చేయడం సుప్రీంకోర్టు ఆదేశాలను అమలు చేయక పోవడమే అవుతుందని న్యాయనిపుణులు భావిస్తున్నారు. ఇదే కాకుండా ఇద్దరు జిల్లా కమిషన్ సభ్యుల పునర్ నియామకం చేయాలని సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలు సైతం రెండు నెలలకు పైగా పెండింగ్‌లోనే ఉండడం గమనార్హం. దేశ అత్యున్నత న్యాయస్థానం ఆదేశాలను రాష్ట్ర ప్రభుత్వం ఖాతరు చేయకపోవడంతో రాష్ట్ర మొత్తం నుంచి 12 జిల్లా కమిషన్లపై దాఖలయ్యే అప్పీల్ కేసులు పరిష్కారానికి నోచుకోలేక పోతున్నాయి. పెండెన్సీ కేసుల సంఖ్య 4 వేల దరిదాపులకు చేరుతున్నా రాష్ట్ర ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తూ సుప్రీంకోర్టు ఆదేశాలను సైతం ఖాతరు చేయక పోవడంతో ఎటువంటి పరిణామాలు ఎదురు కానున్నాయో అని న్యాయనిపుణులు అభిప్రాయపడుతున్నారు.

ఎన్నేళ్లీ నిరీక్షణ..

రాష్ట్ర వినియోగదారుల కమిషన్ ఛైర్మన్ నియామకం కోసం జస్టిస్ జైశ్వాల్ పదవి ముగియడానికి కంటే ముందే 2022 డిసెంబరు 31న నోటిఫికేషన్ జారీ చేశారు. మార్చి 2023లో సుప్రీంకోర్టు జారీ చేసిన ఉత్తర్వులతో కొంత గందరగోళం నెలకొంది. హైకోర్టు జడ్జిలుగా పనిచేసిన వారికి కూడా పరీక్ష తప్పదనడంతో ఈ సమస్య ఉత్పన్నమైంది. తర్వాత సుప్రీంకోర్టు దానిని సవరిస్తూ పరీక్ష అవసరం లేదని, రాష్ట్ర ప్రభుత్వం ప్రధాన న్యాయమూర్తి తో సంప్రదించాక ఆయన సూచించిన వారిని నియమించాలని ఆదేశాలు జారీ చేయగా.. ఆ మేరకు 2025 ఏప్రిల్ 10న మరో నోటిఫికేషన్ ఇచ్చారు. మే 5 ఆఖరి తేదీ నాటికి మూడు దరఖాస్తులు వచ్చినా నియామక ప్రక్రియ పూర్తి కాలేదు. సెలక్షన్ కమిటీ సమావేశమైన తర్వాత వారు నిర్ణయించి ప్రధాన న్యాయమూర్తి ఆమోదం పొందిన అనంతరం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసే అవకాశం ఉండవచ్చని న్యాయ నిపుణులు భావిస్తున్నారు. ఇటీవల జూన్ నెలాఖరున పదవీ విరమణ పొందిన మహిళా న్యాయమూర్తికి అవకాశం రావచ్చని పరిశీలకులు భావిస్తున్నారు. అలా అయితే వినియోగదారుల కమిషన్ ఛైర్మన్ బాధ్యతలు చేపట్టే తొలి మహిళా న్యాయమూర్తి అవుతారు. గతంలో ఛైర్మన్ స్థానం ఖాళీగా ఉన్నప్పుడు, ప్రస్తుత ఖాళీ సమయంలోనూ మహిళా సభ్యులు ఇన్‌చార్జులుగా పని చేస్తుడటం విశేషం.

'మహా ప్రణాళిక'కు సాంకేతిక దన్ను

ఔటర్ వరకు త్రీడీ ట్విన్ బేస్ మ్యాపులు

- ట్రిపుల్ ఆర్ వరకు టూడీ మ్యాపింగ్
- ఐఐటీ హైదరాబాద్‌తో హెచ్‌ఎండీఏ ఒప్పందం
- మాస్టర్‌ప్లాన్ అధ్యయనం కోసం కన్సల్టెన్సీ ఎంపిక
- త్వరలో ఆర్ఎఫ్‌పీలకు బిడ్డింగ్

సాక్షి, సిటీబ్యూరో: మహా నగర సమగ్ర ప్రణాళిక-2050 రూపకల్పనకు ఐఐటీ హైదరాబాద్ సాంకేతిక భాగస్వామిగా సేవలందించనుంది. ఈ మేరకు హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ (హెచ్‌ఎండీఏ), ఐఐటీ హైదరాబాద్‌తో ఒప్పందం ఏర్పాటు చేసుకుంది. మాస్టర్‌ప్లాన్‌ను రూపొందించేందుకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఐఐటీ సంస్థ అందజేయనుంది. భవిష్యత్ అవసరాలకనుగుణంగా అంతర్జాతీయ ప్రమాణాల మేరకు హైదరాబాద్ నగర విస్తరణ, అభివృద్ధి కోసం హెచ్‌ఎండీఏ సమగ్ర మాస్టర్ ప్లాన్ కోసం భారీ కసరత్తు చేపట్టిన విషయం విదితమే. ఇప్పటి వరకు ఉన్న ఐదు మాస్టర్ ప్లాన్‌లను విలీనం చేస్తూ ట్రిపుల్ ఆర్ వరకు ఒకే సమగ్రమైన మహా ప్రణాళికను రూపొందించనున్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే ప్రజారవాణా, మౌలిక సదుపాయాల కల్పన కోసం కాంప్రహెన్సివ్ మొబిలిటీ ప్లాన్, లాజిస్టిక్స్, వ్యాపార, వాణిజ్య, పారిశ్రామిక అభివృద్ధి లక్ష్యంగా ఆర్థికాభివృద్ధి ప్రణాళిక, జల వనరులు, అడవులు, పర్యావరణ పరిరక్షణ కోసం బ్లూగ్రీన్ ప్లాన్‌లను రూపొందిస్తున్నారు. ప్రస్తుతం ఈ మూడు రకాల ప్రణాళికలు తుది దశకు చేరుకున్నాయి. వీటికి అనుగుణంగా సమగ్రమైన మాస్టర్‌ప్లాన్– 2050ను తయారు చేస్తారు. ఇందుకోసం రెండు రకాల సాంకేతికతను జోడించనున్నారు. హైదరాబాద్ ఐఐటీ అభివృద్ధి చేసిన త్రీడీ, టూడీ డిజిటల్ ట్విన్ టెక్నాలజీ ఆధారంగా బేస్ మ్యాపులను సిద్ధం చేయనున్నారు. దీంతో హైదరాబాద్ మహానగర సమగ్ర స్వరూపం ఆవిష్కృతమవుతుందని హెచ్‌ఎండీఏ అధికారులు తెలిపారు.

ఔటర్ వరకు ఉన్నది ఉన్నట్లుగా...

- కొత్తగా రూపొందించనున్న మాస్టర్‌ప్లాన్–2050లో ఔటర్ రింగ్‌రోడ్డు వరకు అంటే.. సుమారు 2050 చ.కి.మీ పరిధిలో త్రీడీ డిజిటల్ ట్విన్ టెక్నాలజీని వినియోగిస్తారు. దీనిద్వారా ప్రతి ప్రాంతం వెడల్పు, పొడవు, ఎత్తులను పరిగణనలోకి తీసుకొని మూడు డైమెన్షన్‌లలో మ్యాపింగ్ చేస్తారు. ఇందుకోసం లైడార్ ఏరియల్ సర్వే నిర్వహించనున్నారు. ఈ టెక్నాలజీతో ఔటర్ రింగ్‌రోడ్డు వరకు ఉన్న నగరంలోని ప్రతి అంగుళాన్ని రియల్ టైమ్‌లో ఉన్నది ఉన్నట్లుగా వీక్షించేందుకు అవకాశం లభిస్తుంది. వరదలు, ట్రాఫిక్ రద్దీ నియంత్రణ, మౌలిక సదుపాయాలు వంటి సేవలను సత్వరమే అందజేసే అవకాశం లభిస్తుంది. హెచ్‌ఎండీఏ, జీహెచ్‌ఎంసీ తదితర ప్రభుత్వ విభాగాల ప్లానింగ్‌లోనూ రియల్ టైమ్ టెక్నాలజీ వల్ల వంద శాతం కచ్చితత్వాన్ని పాటించవచ్చు. ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ ఏరియాలో కూడా త్రీడీ డిజిటల్ ట్విన్ టెక్నాలజీని అమలు చేయనున్నట్లు అధికారులు తెలిపారు.
- ట్రిపుల్ఐటీ హైదరాబాద్ క్యాంపస్‌లోని స్మార్ట్ లివింగ్ ల్యాబ్ ఈ డిజిటల్ ట్విన్ టెక్నాలజీని అభివృద్ధి చేసింది. దీనిద్వారా ఇనిస్టిట్యూట్ సమీపంలో రాకపోకలు సాగించే వాహనాల సంఖ్య, రద్దీని కచ్చితంగా అంచనా వేసి ట్రాఫిక్ నియంత్రణకు అవసరమైన సూచికలను ఏర్పాటు చేశారు. నీటి వనరులను రియల్-టైమ్‌లో పర్యవేక్షించేందుకు, వృథాను నివారించేందుకు కూడా ఈ టెక్నాలజీ దోహదం చేసింది. గచ్చిబౌలిలోని ఒక రెసిడెన్షియల్ కాలనీలో ఈటెక్నాలజీ ద్వారా పైప్‌లైన్‌ల లీకేజీలను గుర్తించి, నీటి సరఫరాను సమర్థవంతంగా మెరుగుపరిచారు.అలాగే పార్కులు, పచ్చదనం పరిరక్షణలో త్రీడీ డిజిటల్ ట్విన్ మ్యాపింగ్ అద్భుతమైన ఫలితాలను ఇస్తోంది. ఈ టెక్నాలజీనే ఔటర్ వరకు విస్తరించనున్నారు. ముంబై, జైపూర్, వారణాసి, పుణె తదితర నగరాల మాస్టర్‌ప్లాన్‌ల రూపకల్పనలో త్రీడీ టెక్నాలజీని వినియోగించినట్లు అధికారులు తెలిపారు.

త్వరలో టెండర్లు..

మాస్టర్‌ప్లాన్- 2050పై అధ్యయనం చేసి సమగ్ర నివేదికను అందజేసేందుకు త్వరలో కన్సల్టెన్సీని ఎంపిక చేయనున్నారు. ఆసక్తి గల సంస్థల నుంచి దరఖాస్తుల స్వీకరణకు త్వరలో ఆర్ఎఫ్‌పీ టెండర్ ప్రకటన విడుదల చేయనున్నారు. ఎంపికైన కన్సల్టెన్సీ అందజేసే నివేదిక ఆధారంగా మాస్టర్ ప్లాన్‌ను రూపొందించనున్నారు. ట్రిపుల్ ఆర్ వరకు సమగ్ర మాస్టర్‌ప్లాన్ అమల్లోకి రావడానికి ఏడాదికి పైగా సమయం పట్టే అవకాశం ఉంది.

ట్రిపుల్ ఆర్ వరకు టూడీ డిజిటల్..

హెచ్‌ఎండీఏలో కొత్తగా విలీనమైన ట్రిపుల్ ఆర్ వరకు అంటే సుమారు 11 వేల చదరపు కిలోమీటర్ల ప్రాంతాన్ని టూడీ డిజిటల్ టెక్నాలజీతో మ్యాపింగ్ చేస్తారు. ఇక్కడ రియల్ టైమ్ సమాచారం లభించదు. ట్రిపుల్ ఆర్ వరకు ఉన్న అన్ని ప్రాంతాల పొడవు, వెడల్పులను మ్యాపింగ్ చేస్తారు. ఆర్థిక అభివృద్ధి మండలాలను, నీటి వనరులు, అడవులు తదితర ప్రాంతాలను సమగ్రంగా మ్యాపింగ్ చేస్తారు. ట్రిపుల్ ఆర్ వరకు రవాణా సదుపాయాలను అభివృద్ధి చేసేందుకు అవసరమైన రోడ్లు, బస్‌ర్యాపిడ్ సిస్టమ్, మెట్రో, ఎంఎంటీఎస్ తదితర ప్రజా రవాణా సదుపాయాలను ఈ ప్రణాళికలో పొందుపరుస్తారు. పార్కులు, పచ్చదనం విస్తరణకు ఈ ప్రణాళిక దోహదం చేయనుంది.



ఏఓసీ ప్రత్యామ్నాయ రోడ్లకు టెండరు

అంచనా వ్యయం రూ. 307.74 కోట్లు

సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని కంటోన్మెంట్ ప్రాంతం గుండా రాకపోకలు సాగించే వారి ఇబ్బందులు త్వరలో తొలగిపోనున్నాయి. ఏఓసీ సెంటర్ చుట్టూ ప్రత్యామ్నాయ రహదారుల నిర్మాణానికి జీహెచ్ఎంసీ టెండరు నోటిఫికేషన్ జారీ చేసింది. పనుల అంచనా వ్యయం రూ.307.74 కోట్లు. ఈ పనులకు సంబంధించి ప్రీ బిడ్ సమావేశం ఈ నెల 12వ తేదీన జరగనుండగా, బిడ్ల స్వీకరణకు చివరి తేదీ ఈనెల 22గా నిర్ణయించారు. ఈ పనులు చేసేందుకు కంటోన్మెంట్‌లోని భూములు ఇవ్వాల్సిందిగా రాష్ట్రప్రభుత్వం ఎంతోకాలంగా కేంద్రంతో సంప్రదింపులు జరుపుతుండటం తెలిసిందే. కంటోన్మెంట్ పరిధిలోని దాదాపు రూ.440 కోట్ల విలువైన 134 ఎకరాల భూమికి బదులుగా అదే ధర పలికే జవహర్‌నగర్‌లో ప్రస్తుతం ఫైర్ రేంజ్ ప్రాంతంగా ఉన్న స్థలాన్ని కేంద్ర రక్షణశాఖకు కేటాయించే అంశంపై ఉభయుల మధ్య సఖ్యత కుదిరినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో పనులు త్వరితంగా చేపట్టేందుకు వీలుగా టెండర్లు ఆహ్వానించారు.

కేన్సర్ స్క్రీనింగ్ పద్ధతులు మెరుగుపర్చాలి

లక్డీకాపూల్: కేన్సర్ నియంత్రణకు స్క్రీనింగ్ పద్ధతులను మెరుగుపర్చాలని నేషనల్ సెంటర్ ఫర్ డిసీజ్ ఇన్ఫర్మేటిక్స్ అండ్ రీసెర్చ్(ఎన్‌సీడీఐఆర్), ఐసీఎంఆర్ డైరెక్టర్ డాక్టర్ ప్రశాంత్ మాథూర్ సూచించారు. ముఖ్యంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో క్యాన్సర్ స్క్రీనింగ్ పద్ధతుల విస్తరణపై దృష్టి పెట్టాలన్నారు. నిమ్స్ మెడికల్ ఆంకాలజీ విభాగాధిపతి డాక్టర్ గుండేటి సదాశివుడు ఆధ్వర్యంలో శనివారం కేన్సర్‌పై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన గెస్ట్ లెక్చర్ ఇచ్చారు. దేశంలో క్యాన్సర్ నియంత్రణ ప్రాధాన్యత, ప్రస్తుత పరిస్థితులు, వ్యూహాలతోపాటు ప్రజల్లో అవగాహన పెంపుదలకు చేపట్టాల్సిన చర్యలపై కీలక ప్రసంగం చేశారు. ఇందుకు క్యాన్సర్ రిజిస్ట్రీలు, ఆరోగ్య సమాచార వ్యవస్థలను బలోపేతం చేయాలని సూచించారు. ఎంఎన్‌జే క్యాన్సర్ హాస్పిటల్ ప్రొఫెసర్ డా. రఘునాథరావు మాట్లాడుతూ కేన్సర్ నియంత్రణ అనేది కేవలం వైద్య పరిధిలోని కాదని, సమాజంలో ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. కార్యక్రమంలో నిమ్స్ డైరెక్టర్ బీరప్ప, డీన్ డాక్టర్ లీజా రాజశేఖర్, ఎంఎస్ డా. నిమ్మ సత్యనారాయణ, ఈఆర్ డా. శాంతవీర్ ఉప్పీన్ తదితరులు పాల్గొన్నారు.

గ్రేటర్ వైశ్య బిజినెస్ లీడర్స్ ఆవిర్భావం



జీవీబీఎల్ లోగోను ఆవిష్కరిస్తున్న దృశ్యం

హిమాయత్‌నగర్: వైశ్య వ్యాపారవేత్తలను ప్రపంచ స్థాయిలో అనుసంధానించి, వారి అభివృద్ధికి సరికొత్త వేదికను అందించాలనే లక్ష్యంతో గ్రేటర్ వైశ్య బిజినెస్ లీడర్స్(జీవీబీఎల్) సంస్థను శనివారం ఘనంగా ప్రారంభించారు. సంస్థ లోగో, అధికారిక వెబ్‌సైట్‌ను వ్యవస్థాపకులు, సీఈవో రాజశేఖర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా 60 మంది సభ్యులతో ప్రణవ హైదరాబాద్ చాప్టర్‌ను ప్రారంభించారు. 2025–26 సంవత్సరానికి గాను సంస్థను నడిపించే టైటాన్ కౌన్సిల్‌ను ప్రకటించారు. అధ్యక్షుడిగా ప్రసాద్, కార్యదర్శిగా రవి కొండూరి, ట్రెజరర్‌గా తరుణ్ చింత బాధ్యతలు చేపట్టారు. అంతర్జాతీయ విస్తరణ కోసం ఇంటర్నేషనల్ గ్రోత్ వైస్ ప్రెసిడెంట్‌గా కె.భరత్ కుమార్‌ను నియమించారు.

బాంబు బెదిరింపు మెయిల్స్ చేసిన

యువతి రిమాండ్

పెళ్లికి నిరాకరించిన ప్రియుడిపై కోపంతో తప్పుడు ఈ-మెయిల్స్

- దేశవ్యాప్తంగా కలకలం రేపిన టెకీ
- కోర్టులో హాజరుపర్చిన ఆర్‌జీఐఏ ఔట్ పోస్టు పోలీసులు



రినే జోషిదా

శంషాబాద్: ప్రియుడిపై కోపంతో దేశవ్యాప్తంగా బాంబు బెదిరింపు ఈ-మెయిల్స్ పంపిన యువతిని శనివారం ఆర్‌జీఐఏ పోలీసులు కోర్టు ముందు హాజరుపరచి రిమాండ్‌కు తరలించారు. చెన్నైకు చెందిన రోబోటిక్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ రినే జోషిదా (30) చెన్నైకి చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌ను ప్రేమించింది. పెళ్లికి ప్రియుడు అంగీకరించకపోవడంతో అతడిపై పగబట్టిన జోషిదా అతడిని ఏదైనా నేరంలో ఇరికించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో భాగంగా గత ఏడు నెలలుగా దేశవ్యాప్తంగా సుమారు 11 విమానాశ్రయాలతో పాటు పలు విద్యాసంస్థలకు బాంబులున్నాయంటూ ప్రియుడికి సంబంధించిన మెయిల్‌తో సందేశాలు పంపింది. స్విట్జర్లాండ్ వేదికగా వచ్చిన వీటిపై విమానాశ్రయం అధికారులు లోతుగా దర్యాప్తు చేపట్టారు. ప్రపంచ వ్యాప్తంగా సంచలనం రేపిన అహ్మదాబాద్ ఎయిర్ ఇండియా దుర్ఘటన సైతం తామే చేసినట్లు పంపిన ఈమెయిల్‌ను కేంద్ర దర్యాప్తు అధికారులు తీవ్రంగా పరిగణించి రినే జోషిదాను అరెస్ట్ చేశారు. ఈమెపై ఆర్‌జీఐఏ ఔట్‌పోస్టు పోలీస్ స్టేషన్‌లో కూడా బాంబు బెదిరింపు మెయిల్స్ కేసులు ఉండడంతో శనివారం ఆర్‌జీఐఏ ఔట్‌పోస్టు సీఐ బాలరాజు ఆధ్వర్యంలో కోర్టు ముందు హాజరుపర్చి రిమాండ్ చేశారు.

రేపటి నుంచి పీజీ ప్రవేశ పరీక్షలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఈ నెల 4వ తేదీ నుంచి 44 పీజీ కోర్సులకు ప్రవేశ పరీక్షలు ప్రారంభంకానున్నట్లు సీపీగేట్-2025 కన్వీనర్ ప్రొ.పాండురంగారెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఓయూతో పాటు జేఎన్‌టీయూ, కేయూ, శాతవాహన, తెలంగాణ, మహాత్మాగాంధీ, పాలమూరు, వీరనారి చాకలి ఐలమ్మ మహిళా వర్సిటీలలో ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ ఇతర కోర్సులలో ప్రవేశాలకు 63,910 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా రాష్ట్ర వ్యాప్తంగా 27 కేంద్రాలలో పరీక్షలకు ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. ఎంఏ కన్నడ, మరాఠీ, అరబిక్, పర్షియన్, థియేటర్ ఆర్ట్స్, ఎమ్మెస్సీ ఎలక్ట్రానిక్స్, సెరికల్చర్ కోర్సులకు సీట్ల సంఖ్య కంటే తక్కువ మంది దరఖాస్తు చేసుకున్నందున ఎంట్రన్స్ పరీక్ష నిర్వహించకుండ నేరుగా ప్రవేశాలు కల్పించనున్నట్లు చెప్పారు. ప్రతి రోజు మూడు విడతలుగా జరిగే ప్రవేశ పరీక్షలకు నిర్ణీత సమయానికి గంట ముందుగా పరీక్ష హాల్‌కు చేరుకోవాలని కన్వీనర్ ప్రొ.పాండురంగారెడ్డి తెలిపారు.

బీసీ బిల్లును వారంలోగా ఆమోదించాలి



అభివాదం చేస్తున్న జాజుల, వీహెచ్, ప్రొఫెసర్ పీఎల్ తదితరులు

లేకుంటే కేంద్రమంత్రులను అడ్డుకుంటాం: జాజుల

పంజగుట్ట: బీసీ రిజర్వేషన్ల బిల్లును కేంద్ర ప్రభుత్వం వారం రోజుల్లో ఆమోదించకపోతే రాష్ట్రంలో కేంద్ర మంత్రుల పర్యటనలు ఎక్కడికక్కడే అడ్డుకుంటామని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. తెలంగాణ జన సమితి ఆధ్వర్యంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు- కేంద్ర ప్రభుత్వ వైఖరి అనే అంశంపై శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. డాక్టర్ నిజ్జన రమేష్ ముదిరాజ్, పల్లె వినయ్ కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జాజుల మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్ల కోసం బీజేపీ చేసేది ధర్నా కాదని అది రాజకీయ నాటకమని అభిప్రాయపడ్డారు. చిత్తశుద్ధి ఉంటే ఢిల్లీలో నిరసనలు చేయాలని, బీఆర్ఎస్ కూడా ఢిల్లీలో సభ పెట్టాలని డిమాండ్ చేశారు. 'రిజర్వేషన్ వ్యతిరేక పార్టీలు హటావో బీసీ రిజర్వేషన్ బచావో' ఉద్యమం మొదలు పెడతామని హెచ్చరించారు. తెలంగాణ ఉద్యమంలో మాదిరి త్వరలోనే రాష్ట్రంలో సడక్‌బంద్ నిర్వహిస్తామని పేర్కొన్నారు. మాజీ రాజ్యసభ సభ్యులు వి.హనుమంతరావు మాట్లాడుతూ ఇప్పుడు కాకపోతే మరెప్పుడూ 42 శాతం బీసీ రిజర్వేషన్లు సాధించుకోలేమని అన్నారు. టీజేఎస్ ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ పి.ఎల్. విశ్వేశ్వరరావు, బీసీ సంఘాల నేతలు దాసు సురేష్, మేకపోతుల నరేందర్ గౌడ్, కుందారం గణేష్ చారి, సాంబశివ గౌడ్, లక్ష్మణ్ యాదవ్ పాల్గొన్నారు.

5న కంప్యూటర్ ఇంజినీరింగ్‌పై సదస్సు

సాక్షి సిటీబ్యూరో: కంప్యూటర్ ఇంజినీరింగ్, కమ్యూనికేషన్ సిస్టమ్స్‌లో పురోగతిపై 6వ అంతర్జాతీయ కాన్ఫరెన్స్ ఈ నెల 5 నుంచి 7వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు వీఎన్ఆర్ విజ్ఞాన జ్యోతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ టెక్నాలజీ కళాశాల ప్రతినిధులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫ్రాన్స్‌కు చెందిన ఇన్‌స్టిట్యూట్ మైన్స్-టెలికాం బిజినెస్ స్కూల్, తిరుపతిలోని మోహన్ బాబు విశ్వవిద్యాలయం, విజ్ఞాన జ్యోతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌ల సహకారంతో వీఎన్ఆర్ విజ్ఞాన జ్యోతి కళాశాలలో మూడు రోజులపాటు ఈ సదస్సు నిర్వహిస్తారని పేర్కొన్నారు.

పాఠశాల నుంచి పారిపోయిన బాలిక.. పోలీసుల కౌన్సెలింగ్



తల్లి నాగలక్ష్మికి బాలికను అప్పగిస్తున్న బాలానగర్ పోలీసులు

బాలానగర్: చదువుల ఒత్తిడిని తట్టుకోలేక పాఠశాల నుంచి పారిపోయిన ఓ 12 ఏళ్ల బాలికను బాలానగర్ ఇన్‌స్పెక్టర్ నర్సింహరాజు రక్షించి..ఆమె తల్లికి అప్పగించారు. ఈ సంఘటన శనివారం బాలానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. చింతల్ చెరుకుపల్లి కాలనీకి చెందిన శివారెడ్డి, నాగలక్ష్మి దంపతుల కుమార్తె (12) లిటిల్ స్కాలర్ హైస్కూలులో 6వ తరగతి చదువుతోంది. శనివారం ఉదయం తల్లిదండ్రులు పనికి వెళ్లగా, బాలిక స్కూల్‌కు బయలుదేరింది. కానీ..సరిగ్గా మార్కులు రావటం లేదని ఉపాధ్యాయులు మందలించడంతో మనస్తాపం చెంది స్కూలుకు వెళ్లకుండా ఒంటరిగా రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తోంది. ఈ క్రమంలో అటుగా వెళుతున్న ఇన్‌స్పెక్టర్ నర్సింహరాజు ఫుట్‌పాత్‌పై రోదిస్తూ వెళ్తున్న బాలికను గమనించి ఆపారు. ఆమెతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం బాలిక తల్లి నాగలక్ష్మిని పిలిపించి, బాలికకు కౌన్సెలింగ్ ఇచ్చి తల్లికి అప్పగించారు.

ఇన్నోవా వాహనంలో ఆవును ఎత్తుకెళ్లిన దుండగులు



రాంగోపాల్‌పేట్: అర్ధరాత్రి వేళ ఇంటి ముందు పడుకుని ఉన్న ఓ ఆవును ఇన్నోవా వాహనంలో దుండగులు ఎత్తుకెళ్లారు. ఈ ఘటన గత నెల 29వ తేదీ అర్ధరాత్రి సమయంలో మార్కెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం బండిమెట్‌కు చెందిన చిన్నా అనే వ్యక్తికి ఆవులు ఉన్నాయి. ప్రతి రోజు రాత్రి వేళల్లో అవి ఇంటి చుట్టు పక్కల ఉండే రోడ్డు పరిసర ప్రాంతాల్లో నిద్రిస్తాయి. 29వ తేదీ రాత్రి నలుపు రంగు ఇన్నోవా వాహనంలో వచ్చిన ముగ్గురు దుండగులు అక్కడే ఉన్న ఆవును కారులోకి ఎక్కించారు. అలాగే పక్కనే ఉన్న దూడకు సైతం మత్తు మందివ్వగా అది అక్కడే స్పృహ తప్పి పడిపోయింది. ఆ తర్వాత కుక్కలు అరవడంతో దుండగులు దూడను వదిలిపెట్టి ఉడాయించారు. మరుసటి రోజు యజమాని ఫిర్యాదు మేరకు మార్కెట్ పోలీసులు కేసు నమోదు చేసికుని దర్యాప్తు ప్రారంభించారు.

ప్రత్యేక బృందాలతో గాలింపు: డీసీపీ

ఆవులను ఇన్నోవా వాహనంలో ఎత్తుకుని వెళ్తున్న ముఠా కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఉత్తర మండలం డీసీపీ రష్మి పెరుమాళ్ తెలిపారు. శనివారం మధ్యాహ్నం ఆమె తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టాస్క్‌ఫోర్స్ డీసీపీ సుధీంద్ర, అదనపు డీసీపీ శ్రీనివాస్‌రావుతో కలిసి మాట్లాడారు. అనుమానితులను గుర్తించామని, త్వరలోనే నిందితులను పట్టుకుంటామని చెప్పారు. గతంలో మారేడుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఇలాంటి కేసు నమోదు అయిందని, నిందితులను అరెస్టు కూడా చేశామని వివరించారు. సున్నితమైన, సెంటిమెంట్‌తో కూడిన అంశాల పట్ల సామాజిక మాధ్యమాల్లో ప్రజలను రెచ్చగొట్టేలా పోస్టులను పెట్టొద్దని సైబర్ క్రైం డీసీపీ ఒక ప్రకటనలో తెలిపారు. యూట్యూబ్ చానల్స్, ప్రధాన స్రవంతి వార్తా చానల్స్ ఇలాంటి వార్తలను ప్రసారం చేసే సమయంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.


బిల్డింగ్ పైనుంచి పడి విద్యార్థి మృతి

సంతోష్‌నగర్: బిల్డింగ్‌పై వాకింగ్ చేస్తుండగా..మూర్ఛ వ్యాధి రావడంతో అదుపుతప్పి విద్యార్థి మూడో అంతస్తు నుండి కిందపడి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ సంఘటన ఐఎస్ సదన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ..దుర్గా భవానీనగర్ ప్రాంతానికి చెందిన వ్యాపారి బద్రీనాథ్ రావు కుమారుడు గౌరవ్ రావు (17) ఇంటర్మీడియ్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. శుక్రవారం రాత్రి 8 గంటల సమయంలో భోజనం చేసిన అనంతరం వాకింగ్ చేసేందుకు మూడో అంతస్తుకు వెళ్లాడు. అక్కడ వాకింగ్ చేస్తుండగా ఒక్కసారిగా ఫిట్స్ రావడంతో అదుపుతప్పి భవనం నుంచి కిందపడిపోయాడు. దీన్ని గమనించిన కుటుంబ సభ్యులు తీవ్ర గాయాలకు గురైన గౌరవ్‌ను చికిత్స నిమిత్తం అపోలో ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

పోక్సో కేసులో నిందితునికి పదేళ్ల జైలు

హయత్‌నగర్: బాలికపై లైంగిక దాడికి పాల్పడిన నిందితునికి ఎల్‌బీనగర్ ఫాస్ట్ ట్రాక్ స్పెషల్ కోర్టు పదేళ్ల జైలు శిక్ష, రూ: 25 వేలు జరిమానా విధిస్తూ శనివారం తీర్పు ఇచ్చింది. హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన ఈ కేసు వివరాలు పోలీసుల కథనం ప్రకారం.. హయత్‌నగర్‌కు చెందిన శేషగాని అశోక్‌గౌడ్ ఆటో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. 2017 జులైలో ఆయన ఓ మైనర్(17) బాలికను ప్రేమ పేరుతో మభ్యపెట్టి సినిమాకు తీసుకెళ్లి, అనంతరం లాడ్జికి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు అప్పటి ఇన్‌స్పెక్టర్ నరేందర్‌గౌడ్ కేసు నమోదు చేశారు. అనంతరం ఇక్కడ పనిచేసిన మరో ఇన్‌స్పెక్టర్ సతీష్ కేసు దర్యాప్తు పూర్తి చేసి వివరాలు కోర్టుకు సమర్పించాడు. పూర్వాపరాలు పరిశీలించిన కోర్టు పైవిధంగా తీర్పు ఇచ్చింది. బాధితురాలికి రూ: 5 లక్షలు పరిహారం చెల్లించాలని కూడా తీర్పులో పేర్కొన్నారు.

అనుమానాస్పద స్థితిలో పారామెడికల్ విద్యార్థి మృతి



నితిన్ (ఫైల్)

నాగోలు: అనుమానాస్పద స్థితిలో పారామెడికల్ విద్యార్థి మృతి చెందిన సంఘటన ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు, మృతుడి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం..వరంగల్ జిల్లా రాయపర్తి మండలం వంకుడోత్ తండాకు చెందిన వాంకుడోతు నితిన్ (19) నగరంలో పారా మెడికల్ కోర్సు చదువుతూ ఎల్‌బీనగర్ చంద్రపురికాలనీలో నీలమ్మ అనే మహిళ ఇంట్లో పైఅంతస్తులో అద్దెకు నివాసం ఉంటున్నాడు. నితిన్ బంజారా భాషలో పాటలు, వీడియో సాంగ్స్ కూడా చేస్తున్నాడు. సొంతంగా యూట్యూబ్ చానల్ ఏర్పాటు చేసుకుని గిరిజన సాంగ్స్‌ను అందులో అప్‌లోడ్ చేస్తున్నాడు. గత నాలుగు రోజుల క్రితం ఇంటి యజమాని కుటుంబ సభ్యులతో బయటకు వెళ్లారు. శనివారం ఉదయం ఇంటి ఓనర్ నీలమ్మ అద్దె డబ్బులు అడిగేందుకు పైఅంతస్తుకు వెళ్లి చూడగా అప్పటికే నితిన్ మెడకు దుప్పటితో ఉరివేసుకుని కనిపించాడు. వెంటనే ఆమె ఎల్‌బీనగర్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని నితిన్‌ను పరిశీలించారు. అతడు మూడు రోజుల క్రితమే ఆత్మహత్య చేసుకున్నట్లు బాడీ పూర్తిగా ఉబ్బిపోయిందని పోలీసులు తెలిపారు. ఈ మేరకు పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా హాస్పిటల్‌కు తరలించారు. కాగా నితిన్‌ను హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారని వారి కుటుంబ సభ్యులు, బంజారా సంఘాల నాయకులు ఆరోపించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా...

సీసీ రోడ్డు పనులు షురూ



బంజారాహిల్స్ రోడ్డు నంబర్-14లో ప్రారంభమైన రోడ్డు పనులు

వెంకటేశ్వరకాలనీ: బంజారాహిల్స్ రోడ్డు నంబర్-14లోని ప్రధాన రహదారిలో రూ.24 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. శనివారం తెల్లవారుజామున సీసీ రోడ్డు పనులు ప్రారంభం కాగా పనులను జూబ్లీహిల్స్ సర్కిల్ ఈఈ విజయ్‌కుమార్ పరిశీలించారు. సాధ్యమైనంత త్వరగా పనులు పూర్తి చేసేవిధంగా ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నామని తెలిపారు.

ఆకట్టుకునేలా ఆక్మతి ప్రదర్శన



సాక్షి, సిటీబ్యూరో: రానున్న వరలక్ష్మీ వ్రతం, రాఖీ పండగల్ని పురస్కరించుకుని ఆకృతి ప్రదర్శన ఏర్పాటైంది. బంజారాహిల్స్‌లోని తాజ్ కృష్ణా హోటల్‌లో ఏర్పాటు చేసిన ఈ ప్రదర్శనను నిర్వాహకురాలు శశి నెహతా శనివారం ప్రారంభించారు. ప్రత్యేక సందర్భాలు, పండుగలకు నగరవాసులు కోరుకునే పలు ఉత్పత్తులు ఈ ప్రదర్శనలో అందుబాటులో ఉంటాయని, 3 రోజుల పాటు ఆకృతి కొనసాగుతుందని ఆమె తెలిపారు.

నా రాజకీయ జీవితానికి స్ఫూర్తి ఎన్టీఆర్: మంత్రి తుమ్మల

శ్రీనగర్‌కాలనీ: దివంగత ఎన్టీఆర్ స్ఫూర్తి, ఆశీస్సులతో నా రాజకీయ జీవితం మొదలైందని, కమ్మజాతి శక్తి తిరుగులేని విధంగా ఉందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. నగరంలో కమ్మ సంఘాల సమాఖ్య సమావేశంలో శనివారం ఆయన పాల్గొని మాట్లాడారు. సమాజ శ్రేయస్సు, ప్రజా ప్రయోజనాల దృష్ట్యా సరైన సమయంలో నిర్ణయం తీసుకొని నిర్ణయాత్మక శక్తిగా కమ్మజాతి ఎదగాలని, కాకతీయ వంశస్తులుగా తెలంగాణ అభివృద్ధిలో భాగం కావాలని ఆకాంక్షించారు. రాజకీయంగా కమ్మజాతి సంఘటితమై ఐక్యతతో తెలంగాణలో ప్రజాసంక్షేమానికి కృషి చేయాలని కోరారు. తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాల్లో కమ్మజాతి వైభవాన్ని తీసుకురావాలని, ఎన్టీఆర్‌తో పాటు కమ్మజాతికి వన్నెతెచ్చిన మహానుభావులను ఆదర్శంగా తీసుకొని ముందుకుసాగాలని సూచించారు.

గొప్ప రచయిత రాచకొండ విశ్వనాథశాస్త్రి

హిమాయత్‌నగర్: అందరి జీవన విధానాలపై అనేక రచనలు చేసిన గొప్ప రచయిత రాచకొండ విశ్వనాథ శాస్త్రి అని పలువురు రచయితలు కొనియాడారు. బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో రాచకొండ విశ్వనాథ శాస్త్రి ఉగాది కథ పురస్కారాలు 2025, కుమార్ కూనపరాజు 'తెలుగు కథ పూతోట', మోహన్ తలారి అనువాదం 'మాషా', వాడ్రేవు చిన వీరభద్రుడు 'కథల సముద్రం' పుస్తకాల ఆవిష్కరణ సభ శనివారం రాత్రి ఘనంగా జరిగింది. రాచకొండ విశ్వనాథ శాస్త్రి ఉగాది కథ పురస్కారాలను సినీ దర్శకులు కరుణ కుమార్, రచయిత రుబీనా పర్వీన్, ప్రముఖ కథా రచయిత మహి బెజవాడ అందుకున్నారు. రచయితలు సుధాకర్, అఫ్సర్, తాడి ప్రకాష్, ఖదీర్ బాబు మాట్లాడుతూ ఇటీవలి కాలంలో తెలుగులో యువ రచయితలు ఆత్మవిశ్వాసంతో ఎంతో బాగా రాస్తున్నారని అన్నారు. రచయితలు వై.వేణు గోపాల్ రెడ్డి, ఝాన్సీ, శేషు కొర్రపాటి, కుమార్ కూనప రాజు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం



రమేష్

బంజారాహిల్స్: అనుమానాస్పదస్థితిలో చీరల దుకాణంలో పనిచేస్తున్న సేల్స్‌మెన్ అదృశ్యమైన ఘటన జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్-36లోని సింఘానియా చీరల దుకాణంలో సేల్స్‌మెన్‌గా పనిచేస్తున్న నాగమళ్ల రమేష్(50) గత నెల 30వ తేదీన షాపుకు వెళ్లాడు. సాయంత్రం ఇంటికి రాకపోయేసరికి కొడుకు సాయికిరణ్‌తో పాటు కుటుంబసభ్యులు అన్ని ప్రాంతాల్లో వెతికారు. ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. 30వ తేదీన బజాజ్ ఫైనాన్స్ నుంచి తన తండ్రి చెల్లించాల్సిన వాయిదాల విషయంలో ఫోన్ వచ్చిందని, ఇదే విషయాన్ని తన తండ్రికి తెలియజేసినట్లు సాయికిరణ్ చెప్పాడు. ఈఎంఐల విషయంలో మనస్తాపానికి గురై అదృశ్యమై ఉంటాడని అనుమానిస్తూ కొడుకు ఫిర్యాదు చేశాడు. మిస్సింగ్ కేసు నమోదు చేసుకున్న పోలీసులు గాలిస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు ఫోన్: 87126 61278.

బస్తీలతో దోస్తీ చేస్తాం

- హైడ్రా అంటే కూల్చివేతలే కాదు
- పేదల పక్షపాతిగా పని చేస్తుంది
- హైడ్రా బస్తీతో దోస్తీ కార్యక్రమంలో కమిషనర్ రంగనాథ్



హైడ్రా కమిషనర్‌ను సత్కరిస్తున్న స్థానిక మహిళ



హైడ్రా బస్తీతో దోస్తీ కార్యక్రమంలో బస్తీవాసులు

బంజారాహిల్స్: హైడ్రా అంటే కూల్చివేతలు కాదని పేదల పక్షపాతిగా నిర్మాణాత్మకంగా హైడ్రా సంస్థ పని చేస్తోందని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ అన్నారు. ఫిలింనగర్‌లోని బసవతారకం నగర్ బస్తీలో హైడ్రా బస్తీతో దోస్తీ కార్యక్రమాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా బస్తీవాసులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన స్వయంగా వారితో మాట్లాడి తెలుసుకున్నారు. రెండు డివిజన్లు, మూడు నియోజకవర్గాల మధ్యలో ఉన్న ఈ బుల్కాపూర్ నాలాను సమూలంగా మార్చే విధంగా ప్రణాళికలు రూపొందిస్తామని ఆయన అన్నారు. అధికారులు ఎంత చేసినా కూడా బస్తీవాసుల మద్దతు కావాలన్నారు. తాము నాలాల్లోని చెత్తను పూర్తిగా తొలగించిన తర్వాత మళ్లీ అందులో చెత్త వేయకుండా చూసుకోవాల్సిన బాధ్యత బస్తీవాసులపై ఉంటుందన్నారు. ప్రతి ఇంటికీ సీసీ కెమెరా ఏర్పాటు చేసుకోవాలని, చెత్త వేసేందుకు ఎవరైనా వస్తే ఇంట్లోని సీసీ కెమెరా నుంచి చూసి వెంటనే వారిని మందలించాలని, ఇలా చేస్తే మంచి ఫలితాలతో పాటు మన పరిసరాలు బాగుంటాయని అన్నారు. త్వరలోనే ఈ నాలాలో కొన్ని చోట్ల బాక్స్ టైప్ డ్రైన్ నిర్మిస్తామని దీని వల్ల నాలాలో కింద బెడ్ లేమి సమస్యకు పరిష్కారం లభించినట్లు అవుతుందని, వ్యర్థాలు, చెత్తా చెదారం సులువుగా ముందుకు సాగుతుందన్నారు. తాము పోలీసు విభాగంలో ఉన్నప్పుడు మైత్రి కమిటీలు, పీస్ కమిటీలు వేసేవాళ్లమని ఇప్పుడు హైడ్రా నుంచి కూడా బస్తీ కమిటీలు, కాలనీ కమిటీలు వేస్తామని వాటి ద్వారా సమస్యల పరిష్కారం సులువు అవుతుందని చెప్పారు. పార్టీలు, కులాలు, మతాలు ఇవేవీ హైడ్రా పట్టించుకోదని, పేదల పక్షపాతిగా ఉంటూనే నాలాలు, చెరువులు, పార్కులను కాపాడుతుందని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా వారం రోజుల క్రితం బసవతారకం నగర్, విరాట్ నగర్ బస్తీల్లో పర్యటించిన ఆయన వారం రోజుల్లోనే సగానికి పైగా సమస్యను పరిష్కరించడంతో బస్తీవాసులు ఆయనను ఘనంగా సత్కరించారు. కార్పొరేటర్లు వెల్దండ వెంకటేష్, ఫరాజుద్దీన్, హైడ్రా అదనపు కమిషనర్ పాపయ్య, ఈఈ విజయ్‌కుమార్, డీఈ హరేరామ్, ఏఈలు మోహన్ రావు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

20 ఏళ్ల తర్వాత పూడిక తీశారు



మా బస్తీలోని బుల్కాపూర్ నాలాలో 20 ఏళ్ల తర్వాత పూడికను మొత్తం తొలగించారు. హైడ్రా అధికారులకు ధన్యవాదాలు. మొన్నటి వరకు ఇక్కడ భయంకరమైన పరిస్థితి ఉండేది. హైడ్రా వచ్చిన తర్వాత మా సమస్య దాదాపు తొలగిపోయినట్లు అయింది. నాలాలో చెత్త వేయకుండా ఇక మేం చూసుకుంటాం

– నసీమా బాను

శాశ్వత పరిష్కారం చూపించాలి



హైడ్రా అధికారులు స్పందించి నాలాలో పూర్తిస్థాయిలో వ్యర్థాలు తొలగించడంతో ఇప్పుడు నాలాలో నీరు సులువుగా ముందుకు సాగుతోంది. కానీ ఈ సమస్యకు శాశ్వత పరిష్కారాన్ని అధికారులు ఆలోచించాల్సిన అవసరం ఉంది. వర్షం వచ్చిన ప్రతీసారి మేం బిక్కుబిక్కుమంటూ బతకాల్సి వస్తోంది.

– రాజు

హైడ్రా అధికారులకు ధన్యవాదాలు



సమస్యను గుర్తించిన వెంటనే పూర్తిస్థాయి యంత్రాంగంతో హైడ్రా కమిషనర్ రంగనాథ్ రంగంలోకి దిగి సమస్యను పరిష్కరించారు. హైడ్రా అధికారులకు ధన్యవాదాలు. నాలాలో కొన్ని చోట్ల కల్వర్టులు నిర్మించాల్సిన అవసరం ఉంది. అధికారులు ఆ దిశగా ప్రణాళికలు రూపొందించాలి.

– అబ్దుల్ వాహెద్

గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఫౌండేషన్ సభ్యులు

వెంకటేశ్వరకాలనీ: విద్యార్థులు చిన్నతనం నుంచే ఆత్మవిశ్వాసం పెంచుకునేందుకు ప్రయత్నం చేయాలని టీజీటీఎఫ్ ఫౌండర్ రఘు సూచించారు. బంజారాహిల్స్ రోడ్ నం.14లోని నందినగర్‌లో ఉన్న ఖుష్బూ విద్యానికేతన్ స్కూల్‌లో టీజీటీఎఫ్ (ది గుడ్ టాక్ ఫ్యాక్టరీ ఫౌండేషన్) ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సును శనివారం నిర్వహించారు. వ్యక్తిత్వ వికాసంతో పాటు గుడ్ టచ్ బ్యాడ్ టచ్, ఎవరితో ఎలా మాట్లాడాలి, కాన్ఫిడెన్స్ లెవల్స్ పెంచుకునేందుకు ఏం చేయాలనే అనే అంశాలపై అవగాహన కల్పించారు. తమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బడ్జెట్ స్కూల్స్‌లో ప్రతి శనివారం విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామని, ఫీజులు చెల్లించుకోలేని విద్యార్థులకు ఆర్థికంగా తోడ్పాటు అందిస్తున్నామని ఫౌండేషన్ ప్రెసిడెంట్ సత్య మల్లాది తెలిపారు. స్కూల్ ప్రిన్సిపాల్ రాజ్‌దేవి, ట్రస్టీలు మంజరి, మాధురి, వంశీ, హర్షవర్ధన్, వలంటీర్లు శ్వేత, కౌశిక్, సాయి, అర్షిత, మనోజ్ఞ, మహిశ్రీ, సాహితి పాల్గొన్నారు.

స్పీడ్ బ్రేకర్స్ ఏర్పాటు చేయాలి

శ్రీనగర్‌కాలనీ: ప్రమాదాలను నివారించడానికి వెంగళరావునగర్‌కాలనీలో స్పీడ్ బ్రేకర్స్ ఏర్పాటు చేయాలని వెంగళరావునగర్ వెల్ఫేర్ అసోసియేషన్ చైర్మన్ డాక్టర్ పీవీ రవిశేఖర్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. వార్డు కార్యాలయంలో ఏఈ అవినాష్‌ను కలిసి వినతిని అందజేశారు. డివిజన్‌లో వృద్ధులు, మహిళలు, చిన్నారులను దృష్టిలో ఉంచుకొని స్పీడ్ బ్రేకర్స్ ఏర్పాటు చేయాలని కోరారు. అసోసియేషన్ ప్రెసిడెంట్ రిటైర్డ్ జైలర్ రంగారావు, ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ వరహాలరెడ్డి, జనరల్ సెక్రటరీ సారంగరావు, ట్రెజరర్ లక్ష్మీకాంతరావు, వాసు, ప్రదీప్ పాల్గొన్నారు.

అన్నదానం వద్దంటూ నిమ్స్ గేటు బంద్



నిమ్స్ పార్కింగ్ వద్ద గేటు బంద్ చేయడంతో బారులు తీరిన అన్నార్తులు

బంజారాహిల్స్: నిమ్స్ ఆస్పత్రి పార్కింగ్ స్థలం నుంచి బాలాపురి బస్తీ వైపు ఓ గేటు ఉంటుంది. ఈ గేటు వద్ద కొన్ని స్వచ్ఛంద సంస్థలు నిత్యం ఉదయం వేళల్లో 300 నుంచి 500 మందికి అన్నదానం చేస్తుంటాయి. గడిచిన మూడు రోజుల నుంచి నిమ్స్ అధికారులు ఈ గేటు మూసివేశారు. దీంతో రోగుల సహాయకులు ఆకలితో ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి అనారోగ్య సమస్యలతో వస్తుంటారని అలాంటి వారికి అన్నదానం చేస్తుంటే ఆపడం ఎంత వరకు సబబు అని బాలాపురి బస్తీవాసి, అన్నదాత బిట్ల శ్రీనివాస్ రాజు ప్రశ్నించారు. గేటు తెరవకపోతే ఈ విషయమై సంబంధిత శాఖా మంత్రిని కూడా కలిసి నిమ్స్ డైరెక్టర్, అధికారులపై ఫిర్యాదు చేస్తామని వారు హెచ్చరించారు.

ఎందరో ప్రముఖ పాత్రికేయులకు నెలవు త్రివేణి



త్రివేణి సంచికను ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్ శ్రీధర్ మూర్తి

పంజగుట్ట: భారత దేశ తొలితరం భాష సాంస్కృతిక చారిత్రక సామాజిక అంశాలపై నాటి ఉద్దండులైన ఎందరో ప్రముఖ పాత్రికేయులకు నెలవైంది త్రివేణి అని, 1927లో ప్రారంభమైన త్రివేణి ప్రచురణలు 97 సంవత్సరాలుగా దాదాపు 500లకు మించి సంచికలు వెలువడ్డాయని, వాటిని డిజిటలైజ్ చేసినట్లు ప్రొఫెసర్ శ్రీధర్ మూర్తి తెలిపారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అరవిందో, డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ, జవహర్‌లాల్ నెహ్రూ, జిడ్డు కృష్ణమూర్తి, పట్టాభి సీతారామయ్య, డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డి ఇలా ఎంతో మంది మహానుభావులు రాసిన వ్యాసాలు త్రివేణి సంచికలలో ఉన్నాయని తెలిపారు. ఎందరో పాత్రికేయులను పత్రికారంగానికి పరిచయం చేసిందని గుర్తుచేశారు.

జాతీయ చేనేత వస్త్ర ప్రదర్శన ప్రారంభం



జాతీయ చేనేత వస్త్ర ప్రదర్శనను ప్రారంభిస్తున్న సుశీల బొకాడియా

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డు నంబర్-12లోని కళింగ కల్చరల్ హాల్‌లో ఏర్పాటైన జాతీయ చేనేత వస్త్ర ప్రదర్శన-2025ను నగర సోషలైట్ సుశీల బొకాడియా శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె చేనేతకారుల వస్త్ర ఉత్పత్తులను తిలకిస్తూ, చేనేతకారులతో వాటి తయారీ విధానం, ప్రత్యేకత తెలుసుకుంటూ కలివిడిగా తిరిగారు. భారతీయ సంస్కృతిలో పట్టు, హ్యాండ్‌లూమ్ వస్త్ర ఉత్పత్తులకు ఎంతో ప్రత్యేకత ఉందని ఆమె అన్నారు. ఈ ఉత్పత్తులకు నేటికీ వన్నె తగ్గలేదని, నేటి తరం కూడా హ్యాండ్‌లూమ్ ఉత్పత్తులను ఎంతో ఆదరిస్తున్నారన్నారు. నిర్వాహకులు జయేష్‌గుప్తా మాట్లాడుతూ ఈ నెల 10 వరకు కొనసాగుతున్న ఈ ప్రదర్శనలో దేశంలోని 14 రాష్ట్రాల నుంచి చేనేతకారులు, చేతి పని బృందాలు తమ సిల్క్, హ్యాండ్‌లూమ్ చీరలు, డ్రెస్ మెటీరియల్ వంటి 75 వేల రకాల వస్త్ర ఉత్పత్తులను అందుబాటులో ఉంచారని వివరించారు.

1న రవీంద్రభారతిలో కృతజ్ఞత సభ

హిమాయత్‌నగర్: ఎస్సీ వర్గీకరణ అమలు చేసిన సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేస్తూ వచ్చేనెల 1న కృతజ్ఞత సభను రవీంద్రభారతిలో నిర్వహించనున్నట్లు మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు బ్రహ్మయ్య వెల్లడించారు. బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. మందకృష్ణ మాదిగ వర్గీకరణ అమలై ఏడాది పూర్తయినా రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు చెప్పకపోవడం విచారకరం అన్నారు. ఈ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఐదో అంతస్తు నుంచి దూకి వివాహిత ఆత్మహత్య

హిమాయత్‌నగర్: ఓ వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన నారాయణగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. నారాయణగూడ అడ్మిన్ ఎస్ఐ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం హిమాయత్‌నగర్ ఉర్దూ గల్లీలో సాయి కృష్ణ గ్రాండ్యువర్ అపార్ట్‌మెంట్‌లో అరుణ్ కుమార్ జైన్ తన భార్య పూజజైన్(43) ఇద్దరు పిల్లలతో కలిసి నివాసం ఉంటున్నాడు. కొంత కాలంగా పూజ జైన్ అనారోగ్య సమస్యలతో బాధపడుతోంది. దీంతో ఆమె తీవ్ర మానసిక వేదనకు గురైంది. శనివారం ఉదయం ఆమె భర్త అరుణ్ కుమార్ బయటకు వెళ్లగానే ఐదో అంతస్తు నుంచి దూకడంతో తీవ్ర గాయాలయ్యాయి. 108లో ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించినట్లు ఎస్ఐ నాగరాజు తెలిపారు.

విజయవంతంగా జేహెచ్‌పీఎస్ ఎంయూఎన్ 2.0



ఫిలింనగర్: జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్ తన రెండవ మోడల్ యునైటెడ్ నేషన్స్(ఎంయూఎన్) కాన్ఫరెన్స్‌ను రెండురోజుల పాటు విజయవంతంగా నిర్వహించారు. విద్యార్థుల్లో నాయకత్వం, దౌత్యం, బహిరంగ ప్రసంగ నైపుణ్యాలను పెంపొందిస్తూ, ప్రపంచ సమస్యలపై వారికి అవగాహన పెంచడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం అన్నారు. జంట నగరాల్లోని వివిధ పాఠశాలల నుంచి 8 నుంచి 12 తరగతుల వరకు 450 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు. సైబర్ ఉగ్రవాదం, అంతర్జాతీయ శాంతి, భద్రతపై సైబర్ నేరాల ప్రభావం, త్రికోణ గ్రహ సంక్షోభాన్ని ఎదుర్కోవడం, సంఘర్షణ ప్రాంతాల్లో సాంస్కృతిక వారసత్వం, విద్యా వ్యవస్థల రక్షణ తదితర అంశాలపై చర్చించారు. పాఠశాల డైరెక్టర్ వరలక్ష్మీ, ప్రిన్సిపాల్ కాంచన వల్లితో పాటు పాఠశాల మేనేజింగ్ కమిటీ సభ్యులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వండి



మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న మామిడి నర్సింగరావు

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ డివిజన్ పరిధిలోని ఫిలింనగర్ 18 బస్తీల్లో నివసిస్తున్న బలహీన వర్గాలకు చెందిన ఇళ్లు లేని 160 మంది దళిత కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని ఫిలింనగర్ 18 బస్తీల సంక్షేమ సంఘం అధ్యక్షుడు మామిడి నర్సింగరావు శనివారం మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతి పత్రం సమర్పించారు. జూబ్లీహిల్స్ డివిజన్ పరిధిలో గూడు లేని నిరుపేద కుటుంబాలు కొన్ని దశాబ్దాలుగా అద్దె ఇళ్లలో బతుకుతున్నాయని, వారికి ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాల్సిందిగా ఆయన విజ్ఞప్తి చేశారు. ఫిలింనగర్ నేతలు కాటూరి రమేష్, భాస్కర్, శివ, ప్రభాకర్, నగేష్ తదితరులు ఉన్నారు. ఇదిలాఉండగా ఫిలింనగర్‌లోని అపోలో రోడ్డులో దీన్‌దయాళ్‌నగర్ చౌరస్తా వరకు జీహెచ్ఎంసీ, ట్రాఫిక్ పోలీసులు చిరువ్యాపారులకు చెందిన వ్యాపారాలను తొలగించారని, వారు రోడ్డుపాలయ్యారని, ట్రాఫిక్ వేధింపుల నుంచి సుమారు 100 మంది వ్యాపారులను రక్షించాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు.

బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే జరిమానా



శ్రీరాంనగర్ బస్తీలో చెత్తను సేకరించడంలో నిర్లక్ష్యం చేస్తున్న రిక్షా కార్మికుడికి జరిమానా

బంజారాహిల్స్: చెత్తను చెత్త రిక్షాలకు ఇవ్వకుండా బహిరంగ ప్రదేశాల్లో వేసే నివాసితులతో పాటు ఆ ఇంటి యజమానికి సైతం జరిమానా విధిస్తామని జూబ్లీహిల్స్ సర్కిల్-18 డీఎంసీ సమ్మయ్య తెలిపారు. బంజారాహిల్స్ రోడ్-13లోని శ్రీరాంనగర్ బస్తీలో ఆయన మహిళా సమాఖ్యలు, ఆర్పీలతో కలిసి శనివారం ఇంటింటి సర్వే చేశారు. ఇంటింటికీ తిరుగుతూ చెత్త రిక్షా సేకరించే వ్యక్తి వస్తున్నారా లేదా..? చెత్తను ఇస్తున్నారా లేదా అంటూ విచారణ చేశారు. ఇందులో భాగంగా చెత్తను బయట వేస్తున్న కొంత మంది నివాసితులకు జరిమానా విధించడంతో పాటు చెత్త సేకరించడంలో నిర్లక్ష్యం చేసిన ఆటో డ్రైవర్‌కు రూ.500 జరిమానా విధించారు. డీపీవో ఆశా విరానిక తదితరులు పాల్గొన్నారు.

బీసీలను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం



ధర్నాచౌక్‌కు తరలివెళ్తున్న బీజేపీ నేతలు

బంజారాహిల్స్: కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి డిక్లరేషన్ పేరుతో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని ఇచ్చిన హామీని అమలుచేస్తామని మోసం చేస్తోందంటూ బీజేపీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో ఇందిరాపార్కు ధర్నాచౌక్ వద్ద జరిగిన ధర్నాకు బీజేపీ నేతలు తరలివెళ్లారు. కాంగ్రెస్ 42 శాతం రిజర్వేషన్ల పేరుతో బీసీలకు రావాల్సిన రిజర్వేషన్లను పరోక్షంగా 10 శాతం బీసీల పేరుతో ముస్లిం మైనార్టీలకు రిజర్వేషన్లు కల్పిస్తున్న కుహున లౌకికవాదులు మైనార్టీల సంతృప్తికరణకు, ఓటు బ్యాంకు రాజకీయాలకు నిదర్శనంగా నిలుస్తారని బీజేపీ నేతలు మండిపడ్డారు. బీసీ రిజర్వేషన్ల పట్ల కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి లేదన్నారు. భోజిరెడ్డి, గడ్డం వెంకటస్వామి, ముద్దంగుల శ్రీనివాస్, గందె అరుణ్‌కుమార్, సీతల అనిల్‌కుమార్, కస్తూరి మహిపాల్‌రెడ్డి, చెలిమిటి గిరి, లలితసాగర్, గుంటి ఆనంద్‌సాగర్ పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్లపై ప్రభుత్వ పోరాటానికి మద్దతు

హిమాయత్‌నగర్: బీసీ రిజర్వేషన్ల అంశం జాతీయ అంశంగా చేసి ఉద్యమించాలని రాష్ట్ర ప్రభుత్వం గత కేబినెట్ సమావేశంలో ఆమోదించి ప్రకటించిన కార్యచరణకు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నామని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ అన్నారు. బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో శనివారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.

బీసీ రిజర్వేషన్ల సాధనకు అఖిలపక్షాల సహకారం తీసుకొని ప్రభుత్వ ప్రతినిధి బృందంతో ప్రధానిని కలవాలన్నారు. కోలా జనార్దన్, శ్రీనివాస్ యాదవ్, జక్కుల వంశీకృష్ణ, పాండు యాదవ్, పి.సుధాకర్ ముదిరాజ్, నరహరి, నందగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా 'గీతాంజలి' అలుమ్ని



వేడుకలో గీతాంజలి స్కూల్స్ ఫౌండర్ చైర్మన్ డాక్టర్ గీతా కరణ్‌ను సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం.7లోని హిల్‌టాప్‌లో గీతాంజలి విద్యాసంస్థల విద్యార్థులు శనివారం నిర్వహించిన అలుమ్ని వేడుక ఘనంగా జరిగింది. ది నాయిర్ అండ్ గోల్డ్ పేరుతో నిర్వహించిన ఫండ్ రైజర్ వేడుక ద్వారా వచ్చిన మొత్తాన్ని సమాజ సేవకు వినియోగిస్తామని పూర్వ విద్యార్థులు తెలిపారు. ఈ సందర్భంగా ఆట, పాటలతో పాటు చక్కనైన సంగీతాన్ని ఆస్వాదిస్తూ పూర్వ విద్యార్థులు నాటిక జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. అనంతరం ఫౌండర్ చైర్మన్‌ను, అధ్యాపకులను ఘనంగా సత్కరించారు. ఫొటోలు, సెల్ఫీలు దిగుతూ సరదగా గడిపారు. కార్యక్రమంలో అల్యూమ్ని సభ్యులు ధరణికోట సుయోధన్, గౌతమి వీర్, మనీష్ గుప్తా, సాగర్ వేద్, అనుప్ యామ, ఆదిత్య కేడియ, కార్తీక్ రమణ, రోహిత్ టపాడియ, కుష్ ఎన్ లుల్లా, ఆదిత్య మంధన, నిశితా యోగేష్, స్పందన దుర్గ, కుష్ అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.

జీవో 99 రోస్టర్ విధానంతో మాలలకు అన్యాయం

- తెలంగాణ రాష్ట్ర మాల సంఘాల జేఏసీ

హిమాయత్‌నగర్: తెలంగాణలో జీవో 99 రోస్టర్ విధానం వల్ల సుమారు 40 లక్షల మంది మాల విద్యార్థులు, ఉద్యోగులకు అన్యాయం జరుగుతోందని తెలంగాణ రాష్ట్ర మాల సంఘాల జేఏసీ చైర్మన్ డాక్టర్ మందాల భాస్కర్ ఆవేదన వ్యక్తం చేశారు. బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో జేఏసీ గౌరవాధ్యక్షుడు చెరుకు రామచందర్, గ్రేటర్ హైదరాబాద్ మాల సంఘాల జేఏసీ చైర్మన్ బేర బాలకిషన్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. మాల, మాల ఉపకులాలను వర్గీకరణలో మూడో గ్రూపులో చేర్చి 22వ రోస్టర్ పాయింట్ కేటాయించడం వల్ల ఎంసెట్, నీట్ అడ్మిషన్లలో శాతవాహన యూనివర్సిటీ, హెల్త్ డిపార్ట్‌మెంట్ ఉద్యోగాల్లో మాలలకు అన్యాయం జరుగుతోందన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో 10, జీవో 99లను తక్షణమే సవరించి రోస్టర్ పాయింట్‌ను మూడు లేక 12గా నిర్ధారించాలని డిమాండ్ చేశారు.

ఉందానగర్ రైల్వేస్టేషన్ పనుల పరిశీలన



ఉందానగర్ రైల్వేస్టేషన్ వద్ద రైల్వే జీఎం సంజయ్‌కుమార్ శ్రీ వాత్సవ

శంషాబాద్: శంషాబాద్‌లోని (ఉందానగర్) రైల్వేస్టేషన్‌ను దక్షిణమధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాత్సవ శనివారం సందర్శించారు. రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి, ఆధునీకీకరణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికులు రైల్వేస్టేషన్‌లో రైళ్ల స్టాపింగ్ తదితర సమస్యలపై ఆయనకు విన్నవించారు.

'వైద్యశాఖ పదోన్నతుల్లో అక్రమాలు అవాస్తవం'

సుల్తాన్‌బజార్: డైరెక్టర్ ఆఫ్ హెల్త్ పరిధిలో ఇటీవల జరిగిన పదోన్నతుల్లో అవినీతి, అక్రమాలు జరిగాయనడం పూర్తిగా అవాస్తవమని ప్రజారోగ్య వైద్య ఉద్యోగుల సంఘం (ఐఎన్‌టీయూసీ 3194) జనరల్ సెక్రెటరీ బొందుగుల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన యూనియన్ రాష్ట్ర కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఈ ఏడాది ఆగస్టుతో ప్యానెల్ ఇయ్యర్ ముగుస్తున్నందున వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా వెంటనే సీనియార్టీ లిస్టులను తయారు చేయించి ఖాళీలకు వెబ్ కౌన్సెలింగ్ ద్వారా పారదర్శకంగా పదోన్నతులు కల్పించారని తెలిపారు. గుర్తింపు లేని సంఘం నాయకుడొకరు ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేసేందుకు నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. అసత్య ఆరోపణలు చేసిన ఉద్యోగులపై శాఖపరమైన కఠినచర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఇలాంటి అవగాహన లేని సంఘం నాయకుల ప్రకటనల వల్ల పదోన్నతులు అవకాశం ఉన్న ఉద్యోగులకు తీవ్రంగా నష్టం జరుగుతుందని అన్నారు.

'ఏఐ-డ్రివెన్ లీడర్‌షిప్' పుస్తకావిష్కరణ



ఏఐ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రచయిత వెంకటరమణ మూర్తి తదితరులు

గచ్చిబౌలి: స్వధర్మాన్ని పాటిస్తూ ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్‌ను ఉపయోగిస్తే అందరికీ మేలు జరుగుతుందని రచయిత కురువ వెంకటరమణ మూర్తి అన్నారు. శనివారం గచ్చిబౌలిలోని రాడిసన్ హోటల్‌లో ఆయన రచించిన 'ఏఐ-డ్రివెన్ లీడర్‌షిప్: లీడింగ్ విత్ ధర్మ ఇన్ ది ఏజ్ ఆఫ్ ఏఐ'తన మునుపటి పుస్తక పాఠకుల తల్లులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏఐ అనేది అద్దం లాంటి టూల్ అని, ఏ ఉద్దేశంతో యాప్‌ను క్రియేట్ చేస్తామో అవే ఫలితాలు వస్తాయన్నారు. యంత్రాలకు అమ్ముడు పోకుండా అందరికీ ఉపయోగపడే ధర్మాన్ని పాటిస్తే ఏఐ కూడా ధర్మాన్ని పాటిస్తుందని పేర్కొన్నారు. ఏఐ-డ్రివెన్ లీడర్‌షిప్: లీడింగ్ విత్ ధర్మ ఇన్ ది ఏజ్ ఆఫ్ ఏఐ'పుస్తకంలో పంచశీల సూత్రాలను వివరించినట్లు చెప్పారు. పుస్తకం నైతిక విలువలు, సమతుల్యతను ప్రోత్సహిస్తూ రోడ్‌మ్యాప్‌ను అందిస్తుందన్నారు.

నగరంలో నేడు

- బంజారాహిల్స్ రోడ్ నెం.12లోని కళింగ కల్చరల్ సెంటర్‌లో గణేష్ చతుర్థి స్పెషల్ పేరిట ఏర్పాటు చేసిన ఉదయం 10 నుంచి రాత్రి 8 గంటల వరకు నేషనల్ సిల్క్ ఎక్స్‌పో అందుబాటులో ఉంటుంది.
- బంజారా హిల్స్ రోడ్ నెం.1లోని తాజ్ కృష్ణా హోటల్‌లో ఆకృతి ఎలైట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వరలక్ష్మి, రాఖీ స్పెషల్ ఎగ్జిబిషన్ ఉదయం 10 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- సిరి ఆర్టిస్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ల్యాండ్ స్కేప్స్ పెయింటింగ్ ఎగ్జిబిషన్ మాసబ్ ట్యాంక్‌లోని జేఎన్ఏఎఫ్ఏయూ కాలేజీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్‌లో ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- శ్రీనగర్ కాలనీలోని శ్రీ సత్యసాయి నిగమాగమంలో గణేష్ చతుర్థి స్పెషల్ పేరిట నేషనల్ సిల్క్ ఎక్స్‌పో ఉదయం 10.30గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్‌లోని శిల్పారామంలో ఏర్పాటు చేసిన హస్తకళా మ్యూజియం ఉదయం 10.30 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్ శిల్పారామం సమీపంలోని ఇందిరా మహిళా శక్తి బజార్‌లో చేనేత ఉత్పత్తుల ప్రదర్శన ఉదయం 11 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.comకు మెయిల్ చేయగలరు.

అన్నింటా టాప్ ఆమె..

● వ్యవసాయ విద్యలో సత్తా చాటిన విద్యార్థినులు ● బంగారు పతకాల్లోనూ వారిదే పైచేయి



పట్టాలు అందుకున్న ఆనందంలో విద్యార్థినులు

ఏజీవర్సిటీ: 'ఒక్కప్పుడు అమ్మాయిలకు పైచదువులు ఎందుకు, ఒక ఇంటికి పంపిస్తే పోయేది'అని అనేవారు. కానీ, కాలం మారింది. మనుషుల ఆలోచనల్లోనూ మార్పు వచ్చింది. దానికి అనుగుణంగా బాలికల చదువు విషయంలోనూ జనాభిప్రాయం మారింది. ప్రభుత్వం కూడా చదువు, ఉద్యోగం, రాజకీయాలు.. ఇలా ప్రతి రంగంలోనూ రిజర్వేషన్లు కల్పిస్తోంది. ఈ నేపథ్యంలో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని పలు కోర్సుల్లో విద్యార్థినులు సత్తా చాటారు. శనివారం జరిగిన వ్యవసాయ విశ్వవిద్యాలయం 55వ స్నాతకోత్సవంలో గణనీయంగా పట్టాలు పొందారు. గోల్డ్‌మెడల్స్ సాధించారు. ఆ వివరాలు ఈ విధంగా ఉన్నాయి. అగ్రికల్చర్ బీఎస్సీలో, బీటెక్ అగ్రికల్చర్‌లో, ఇంజనీరింగ్, ఫుడ్ టెక్నాలజీ అన్ని విభాగాల్లో బాలిక సంఖ్యే ఎక్కువగా ఉంది. తాజాగా జరిగిన వర్సిటీ 55వ స్నాతకోత్సవంలో 519 మంది యూజీ, పీజీ, పీహెచ్‌డీల్లో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా పట్టాలు అందుకున్నారు. ఇందులో 322 మంది బాలికలు కాగా, 197 మంది మాత్రమే బాలురు ఉన్నారు. ప్రతిభ కనబరచిన 30 మంది విద్యార్థులకు బంగారు పతకాలు అందించగా, వారిలో 29 మంది బాలికలు కాగా, ఒకరు మాత్రమే బాలుడు ఉన్నారు. సంగారెడ్డి జిల్లా కందికి చెందిన భార్గవి ఏకంగా 6 గోల్డ్ మోడల్స్ సాధించింది.

నా జీవితంలో మరచిపోలేనిది...



ఈ రోజు నా జీవితంలో మరచిపోలేని రోజు ఇది. బాలికలు తక్కువ, బాలురు ఎక్కువ అనే భేదం ఇప్పుడు కనిపించడం లేదు. బాలికలు అనుకుంటే సాధించలేనిదేమీ లేదని రుజువు చేయాలి అనుకున్నాను. గోల్డ్ మెడల్ సాధించాలని కష్టపడి చదివాను. ఒక్కటి, రెండు కాదు 6 గోల్డ్ మెడల్స్ సాధించాను. చదువుతోపాటు క్రమశిక్షణ ఉంటే తప్పనిసరిగా బాలికలు అనుకున్నది సాధించగలరు. ఎంటెక్ చేసి ఇక్కడే పెద్ద ఉద్యోగం సాధిస్తా.

- జి.భార్గవి, అగ్రికల్చర్ ఇంజనీరింగ్ గోల్డ్ మెడలిస్టు

అమ్మానాన్నల నమ్మకాన్ని నిలబెడతా..



మా అమ్మానాన్న కష్టపడి చదివించారు. నాన్న చిన్న వ్యాపారం చేస్తున్నారు. నేను గవర్నమెంట్ ఉద్యోగం చేయాలనేది వారి కోరిక. అందుకే కష్టపడి చదివి గోల్డ్ మోడల్ సాధించాను. ఇప్పుడు ఇరిగేషన్ శాఖలో ఉద్యోగం చేస్తున్నాను. ఈ ఉద్యోగం చేస్తూనే ఇంకా పైస్థాయి ఉద్యోగం సాధిస్తాను. అమ్మానాన్నల నమ్మకం వమ్ము చేయను.

- కోమటి చందన, బీటెక్ అగ్రికల్చర్ గోల్డ్ మెడలిస్టు, కరీంనగర్

గోల్‌తో చదవాలి



మనం ఒక గోల్ పెట్టుకుని చదవాలి. తప్పనిసరిగా అనుకున్నది సాధిస్తాం. తల్లిదండ్రులు, ప్రొఫెసర్ల ప్రోత్సాహం ఉండాలి. గోల్ పెట్టుకొని చదివి గోల్డ్ మోడల్ సాధించాను. ఎంటెక్ చేసి మంచి ఉద్యోగం సాధించడం నా కోరిక. రాబోవు రోజుల్లో ఫుడ్‌కు సంబంధించిన మంచి కంపెని ప్రారంభించి ఇతరులకు పని కల్పించాలని భావిస్తున్నా.

- వర్షిణి, బీటెక్ ఫుడ్ టెక్నాలజీ, గోల్డ్ గోల్డ్ మెడలిస్టు

కేసుల సత్వర పరిష్కారానికి మధ్యవర్తిత్వం దోహదం

- హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సామ్ కోషి



సదస్సులో మాట్లాడుతున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సామ్ కోషి

కుషాయిగూడ: పెండింగ్ కేసుల సత్వర పరిష్కారానికి మధ్యవర్తిత్వం దోహదపడుతుందని హైకోర్టు జడ్జి, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ జస్టిస్ సామ్ కోషి అన్నారు. కుషాయిగూడలోని మేడ్చల్ జిల్లా కోర్టులో శనివారం నిర్వహించిన మధ్యవర్తిత్వం, బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. జస్టిస్ సామ్ కోషి మాట్లాడుతూ బాల్య వివాహాలు, మధ్యవర్తిత్వంపై ప్రజలకు అవగాహన కల్పించి చైతన్య పర్చాలన్నారు. ఆ దిశగా న్యాయవాదులు కార్యచరణ చేపట్టాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎస్.శ్రీదేవి, మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి బి.తిరుపతి, సీనియర్ సివిల్ జడ్జి డి.కిరణ్‌కుమార్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అమరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు భారీ విజయాన్ని అందించాలి

జూబ్లీహిల్స్ కాంగ్రెస్ కార్యకర్తలకు మంత్రుల పిలుపు



కార్యకర్తలతో ప్రతిజ్ఞ చేయిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

శ్రీనగర్‌కాలనీ: జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గంలో కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీకి భారీ విజయాన్ని అందించాలని, ఇక్కడి విజయం రాష్ట్రంతో పాటు దేశంలో పెనుసంచలనంగా మారాలని మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్ అన్నారు. శనివారం ఎల్లారెడ్డిగూడలో జూబ్లీహిల్స్ నియోజకవర్గ సోమాజిగూడ డివిజన్ ముఖ్యకార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తుమ్మల నాగేశ్వరావు మాట్లాడుతూ జూబ్లీహిల్స్ అభివృద్ధి పథంలో ఆదర్శంగా నిలవాలంటే కాంగ్రెస్‌ను గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ గెలుపే ధ్యేయంగా పనిచేస్తామంటూ కార్యకర్తలతో పొన్నం ప్రభాకర్ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డివిజన్ ఇంచార్జ్‌లు ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతమ్, రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ డాక్టర్ రియాజ్, సీనియర్ నేత అజారుద్దీన్, ఎన్ఎస్‌యూఐ ప్రెసిడెంట్ స్వామి, కార్పొరేటర్ వనం సంగీత తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్‌లను బీసీ 'ఏ'లోకి మార్చాలి



అభివాదం చేస్తున్న ముదిరాజ్ సంఘాల నాయకులు

పంజగుట్ట: కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీ మేరకు ముదిరాజ్‌లను బీసీ 'డి'నుంచి బీసీ 'ఏ'లోకి మార్చే ప్రక్రియను వెంటనే మొదలు పెట్టాలని తెలంగాణ ముదిరాజ్ జాయింట్ యాక్షన్ కమిటీ డిమాండ్ చేసింది. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివిధ ముదిరాజ్ సంఘాల జేఏసీ చైర్మన్ పాలకం లక్ష్మినారాయణ ముదిరాజ్, ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బి.జ్ఞానేశ్వర్ ముదిరాజ్, జేఏసీ ప్రధాన కార్యదర్శి అల్లంపల్లి రామకోటి, గోవర్ధన్, గుండ్లపల్లి శ్రీనివాస్ ముదిరాజ్ మాట్లాడారు. రాష్ట్ర జనాభాలో అధిక శాతం ఉన్న ముదిరాజ్‌లను ప్రభుత్వం విస్మరిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో 8 మంది శాసనసభ్యులు ఉండగా ప్రస్తుతం కేవలం ఒక్కరే ఉన్నారని అన్నారు. రాజకీయ ప్రాధాన్యత కోసం ఐక్యంగా పోరాడేందుకే అన్ని సంఘాలు ఐక్యమై జేఏసీగా ఏర్పడ్డామని తెలిపారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ముదిరాజ్ జనాభా ప్రకారం సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు రామస్వామి, నారాయణ, రొట్టం భూపతి, మల్లేష్, పండుగ బాలు, శ్రీను, కోట్ల పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

42 శాతం బీసీ రిజర్వేషన్లను 9వ షెడ్యూల్‌లో చేర్చాలి



42 శాతం బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించాలని హెచ్‌సీయూ క్యాంపస్‌లో ఆందోళన చేస్తున్న దృశ్యం

రాయదుర్గం: రాష్ట్ర శాసనసభలో ఆమోదం పొందిన బీసీల 42 శాతం రిజర్వేషన్ చట్టాన్ని భారత రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చాలని ఆలిండియా ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. గచ్చిబౌలి హెచ్‌సీయూ క్యాంపస్‌లోని నార్త్ షాపింగ్ కాంప్లెక్స్ వద్ద ఏఐఓబీసీఎస్ఏ ఆధ్వర్యంలో శనివారం రాత్రి ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఓబీసీఎస్ఏ జాతీయ అధ్యక్షుడు జి.కిరణ్‌కుమార్ మాట్లాడుతూ తమిళనాడు రిజర్వేషన్ చట్టాన్ని 1994లో 9వ షెడ్యూల్‌లో చేర్చిన విధంగా తెలంగాణ 42 శాతం బీసీ రిజర్వేషన్ చట్టానికి అదేరీతిలో రాజ్యాంగ రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. సబ్‌కా సాత్ సబ్‌కా వికాస్ నినాదం న్యాయంగా నిలవాలంటే బీసీ హక్కులను అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఎన్ఎఫ్ఓబీసీ ఫెలోషిప్ స్లాట్లను 5 వేలకు పెంచి వెంటనే విడుదల చేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ బోధన, బోధనేతర పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని కోరారు. న్యాయ వ్యవస్థలో బీసీలకు ప్రాతినిధ్య కల్పించేలా రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. బీసీ హక్కులపై నిర్లక్ష్యం కొనసాగితే దేశవ్యాప్తంగా ఉద్యమాన్ని ముమ్మరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో విద్యార్థి నాయకులు సాయికిరణ్, సూర్యవర్ధన్‌బాబు, లక్ష్మణ్, శివయాదవ్, ప్రవీణ్, చంద్రశేఖర్‌తోపాటు పలువురు పాల్గొన్నారు.

తక్కువ మార్కులు వచ్చాయని..

జీడిమెట్ల: సెమిస్టర్ ఎగ్జామ్స్‌లో తక్కువ మార్కులు వచ్చాయని ఓ ఇంజనీరింగ్ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న సంఘటన జీడిమెట్ల పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేష్ వివరాల ప్రకారం... సంజయ్‌గాంధీ నగర్‌కు చెందిన రమేష్ కుమారుడు అక్షయ్(18) దుండిగల్‌లోని ఓ కళాశాలలో ఇంజనీరింగ్ సెకండియర్ చదువుతున్నాడు. శనివారం ఉదయం తల్లిదండ్రులు డ్యూటీకి వెళ్లగా అక్షయ్ ఒక్కడే ఇంట్లో ఉన్నాడు. మధ్యాహ్నం తల్లికి ఫోన్ చేసి మాట్లాడాడు. సాయంత్రం 5 గంటలకు రమేష్ ఇంటికి వెళ్లి చూడగా అక్షయ్ సీలింగ్‌కు బెడ్‌షీట్‌తో ఉరేసుకుని మృతి చెంది ఉన్నాడు. 'నా చావుకు ఎవరూ కారణం కాదు, సెమిస్టర్ పరీక్షల్లో తక్కువ మార్కులు వచ్చాయి'అంటూ అక్షయ్ రాసిన లేఖ లభించింది. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం గాంధీ అస్పత్రికి తరలించారు.

విద్యార్థులకు ఆసక్తి కలిగించే కంటెంట్ సృష్టించాలి



మాట్లాడుతున్న వైస్ చాన్స్‌లర్ ప్రొ.బీజే రావు

రాయదుర్గం: విద్యార్థులను అన్నింటిలో నిమగ్నం చేసే, వారిని భవిష్యత్తుకు సిద్ధం చేసే బోధనా కంటెంట్‌ను ఉపాధ్యాయులు సృష్టించాలని హెచ్‌సీయూ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజేరావు సూచించారు. గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ క్యాంపస్‌లో డీటీహెచ్ స్వయంప్రభ అవుట్ రీచ్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బహళ అంతరాయాలు, సోషల్ మీడియా ఉన్న ప్రస్తుత యుగంలో విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్దడమే ఏకైక మార్గమని తెలిపారు. డీటీహెచ్ స్వయం ప్రభ చీఫ్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ అరుణ్ కె.తంగిరాల మాట్లాడుతూ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ వంటి అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలను నిరోధించవద్దని, దానిని నైతికంగా ఉపయోగించడం గురించి విద్యార్థులకు నేర్పించాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ ప్రొఫెసర్ బి.రాజశేఖర్, ఐఐటీ కాన్పూర్ ప్రొఫెసర్ సత్యకి రాయ్, జియో ప్లాట్‌ఫామ్స్ లిమిటెడ్ వైస్ ప్రెసిడెంట్ బాలసుబ్రమణ్యం అయ్యర్ తదితరులు పాల్గొన్నారు.

చేనేత రంగం అభివృద్ధికి కృషి

రాష్ట్ర చేనేత, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు



మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును చేనేత వస్త్రాలతో సత్కరిస్తున్న నిర్వాహకులు

కాచిగూడ: చేనేత రంగ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని చేనేత, వ్యవసాయ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు అన్నారు. వీవర్స్ వెల్ఫేర్ ట్రస్ట్, తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం మహిళా విభాగం ఆధ్వర్యంలో నారాయణగూడ పద్మశాలి భవన్‌లో ఏర్పాటు చేసిన 'వీవ్స్'చేనేత వస్త్ర ప్రదర్శనను శనివారం మంత్రి సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తమ ప్రభుత్వం చేనేత ఉత్పత్తులను ప్రోత్సహించడంతోపాటు నేతన్నల సంక్షేమం కోసం పలు పథకాలు అమలు చేస్తోందన్నారు. ప్రతి ఒక్కరూ చేనేత దుస్తులు ధరించి చేనేత కళాకారులను ప్రోత్సహించాలని సూచించారు. కార్యక్రమంలో పద్మశాలి మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు రూప, అఖిల భారత పద్మశాలి సంఘం జాతీయ అధ్యక్షుడు కందగట్ల స్వామి, జాతీయ ప్రధాన కార్యదర్శి గడ్డం జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

కౌండిన్య సత్రం నగదు దోచుకెళ్తున్నారు..

ఆర్య గౌడ, ఈడిగ అసోసియేషన్ నేతల ఆరోపణ



మాట్లాడుతున్న అనురాధ పాండురంగం

హిమాయత్‌నగర్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో శాంతి భద్రతలు కరువయ్యాయని ఆర్య గౌడ, ఈడిగ అసోసియేషన్ (శ్రీశైలం కౌండిన్య గౌడ సత్రం) అధ్యక్ష కార్యదర్శులు అనురాధ పాండురంగం, మల్లికార్జున ఆరోపించారు. బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో శనివారం వారు మీడియాతో మాట్లాడారు. గత కమిటీ కౌండిన్య గౌడ సత్రం నిర్వహణలో బ్యాంకు అకౌంట్ లేకుండా, డబ్బును దోచుకుందని ఆరోపించారు. తెలంగాణ ప్రాంతం నుంచి అధ్యక్షురాలిగా ఎన్నికైన తనను గత కమిటీ అధ్యక్ష కార్యదర్శులు కొంగ్రపాటి, విజయ్‌కుమార్, బుర్రా సత్యనారాయణ బెదిరిస్తున్నారని, వారి అనుచరులు దుర్భాషలాడుతూ చంపుతామని బెదిరిస్తున్నారని ఆరోపించారు. సత్రం క్యాష్ కౌంటర్‌లో వారి అనుచరులు ప్రతిరోజు దౌర్జన్యంగా నగదు దోచుకుని వెళ్తున్నారని, దీనిపై ఫిర్యాదు చేసినా శ్రీశైలం 1వ పట్టణ పోలీస్‌స్టేషన్ సీఐ ప్రసాద్‌రావు పట్టించుకోవడంలేదని ఆరోపించారు. తమను చంపుతామని బెదిరించిన ఉసిరికాయల సిద్ధార్థ గౌడ్, అతన్ని ప్రోత్సహిస్తున్న కమిటీ మాజీ అధ్యక్ష కార్యదర్శులపై తెలంగాణ మహిళా కమిషన్ చైర్మన్‌తోపాటు దోమలగూడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. సమావేశంలో అసోసియేషన్ సభ్యులు ఆత్మకూరు శ్రీనివాస్ గౌడ్, రవీందర్, శ్రవణ్ కుమార్, లింగాల రాజన్న, గంగపురపు పద్మ, ప్రజ్వల, శైలజ, రామన్న, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కేజ్రీవాల్ వద్దకు రేవంత్ ట్యూషన్‌కు వెళ్లాలి

ఆప్ జాతీయ అధికార ప్రతినిధి ప్రియాంక కక్కర్ ఎద్దేవా



మాట్లాడుతున్న ప్రియాంక కక్కర్, చిత్రంలో దిడ్డి సుధాకర్

హిమాయత్‌నగర్: తెలంగాణలో నాణ్యమైన విద్య అందించడంతోపాటు విద్యా సంస్కరణలకుగాను సీఎం రేవంత్‌రెడ్డి ఆప్ అధినేత, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ దగ్గర ట్యూషన్‌కు వెళ్లాలని, అందుకు అపాయింట్మెంట్ ఇప్పించేందుకు తాను సిద్ధంగా ఉన్నానని ఆ పార్టీ జాతీయ అధికార ప్రతినిధి, రాష్ట్ర బాధ్యులు ప్రియాంక కక్కర్ అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం గుడ్డిగా పాలన కొనసాగిస్తోందని ఆరోపించారు. దారుణమైన పరిస్థితుల్లో ఉన్న ప్రభుత్వ పాఠశాలల సమస్యలపై రేవంత్‌రెడ్డి సర్కార్ నిర్లక్ష్యం వహిస్తోందని ఆరోపించారు. బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆప్ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్‌తో కలసి ఆమె మాట్లాడారు. తెలంగాణలో ఏ ప్రభుత్వ పాఠశాలలు చుసినా కనీస మౌలిక సౌకర్యాలు లేవని, ఒక గదిలో నాలుగు క్లాసులు బోధించడం, ఉపాధ్యాయుల కొరత, టాయిలెట్లు లేకపోవడం, విరిగిన బ్లాక్ బోర్డులు, ముళ్లతో కూడిన చెక్క డెస్కులు, సీట్లు, సిమెంట్ లేని గోడలు, చెట్ల కింద చదువులు, స్కూళ్ల ముందు గుంతలు వంటి దారుణమైన సమస్యలు ఉన్నాయన్నారు. గత నెలలో కలుషితాహారం తిని ఒక విద్యార్థిని మరణించిందని గుర్తు చేశారు.

కాలానుగుణంగా వైద్యరంగంలో మార్పులు

- అపోలో జేఎండీ సంగీతా రెడ్డి



సదస్సును ప్రారంభిస్తున్న అపోలో ఆస్పత్రి జేఎండీ సంగీతారెడ్డి

బంజారాహిల్స్: దేశవ్యాప్తంగా కాలానుగుణంగా వస్తున్న ఆరోగ్య సమస్యలు, సవాళ్లకు అనుగుణంగా వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకుంటున్నాయని అపోలో హాస్పిటల్స్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ సంగీతారెడ్డి అన్నారు. శనివారం ఈ.ఎన్.టి. విభాగాధిపతి డాక్టర్ ఈ.సి.వినయ్ కుమార్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ 360ని ఈ.ఎన్.టి, స్కల్ బేస్ సదస్సు ను ఆమె అపోలో ఆసుపత్రిలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైద్యవృత్తిలో విజ్ఞానం పంచుకునేందుకు, ప్రపంచవ్యాప్తంగా వైద్యరంగంలో వస్తున్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అలవర్చుకునేందుకు ఇలాంటి సదస్సులు దోహదం చేస్తాయన్నారు. ఈ సదస్సులో దేశంలోని మొట్టమొదటి ఏఆర్(అగుమెంటెడ్ రియాల్టీ) ఆధారిత స్కల్ బేస్ క్యాడావర్ కోర్స్ నిర్వహించడం శస్త్రచికిత్సా శిక్షణలో ఓ మైలురాయిగా నిలిచిందని తెలిపారు.. సదస్సులో మలేషియాకు చెందిన ప్రఖ్యాత ఈ.ఎన్.టి, స్కల్ బేస్ సర్జన్ డాక్టర్ ప్రెపగేరన్ నారాయణన్, చెన్నై ఎంజీఎం హాస్పిటల్ ఈ.ఎన్.టి. విభాగాధిపతి డాక్టర్ సంజీవ్ మోహంతి లాంటి నిపుణులు ముఖ్య వక్తలుగా పాల్గొన్నారు. కాన్ఫరెన్స్ నిర్వహణాధ్యక్షులు, అపోలో హాస్పిటల్స్ ఈ.ఎన్.టి, స్కల్ బేస్ సర్జన్ డాక్టర్ వేమూరు తేజస్వి తదితరులు పాల్గొన్నారు.

మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ భారతికి ఓయూ డాక్టరేట్



లాలాపేట: నాంపల్లి కోర్టు జడ్జి(17వ అడిషనల్ చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్) ఈ.భారతికి ఉస్మానియా యూనివర్సిటీ లా విభాగం నుంచి పీహెచ్‌డీ డాక్టరేట్‌ను ప్రకటించింది. ఈ మేరకు ఓయూ లా కళాశాల ప్రొఫెసర్ కె.వంత్ నాయక్ పర్యవేక్షణలో 'భారత రాజ్యాంగం ప్రకారం సమాఖ్యవాదం, భారతదేశంలో శాసన వ్యవస్థకు ప్రత్యేక ప్రాధాన్యత - ఒక విమర్శనాత్మక అధ్యయనం'అనే అంశంపై సమగ్రమైన పరిశోధన గ్రంథాన్ని సమర్పించారు. ఇందుకుగాను యూనివర్సిటీ ఆమెకు డాక్టరేట్‌ను ప్రకటించింది. వరంగల్ జిల్లా దళిత సామాజిక వర్గానికి చెందిన కుటుంబం నుంచి అంచెలంచెలుగా ఎదుగుతూ ఉస్మానియా వర్సిటీ లా కళాశాల నుంచే మాస్టర్ ఆఫ్ లాను పూర్తి చేశారు. ఇక్కడి నుంచే పీహెచ్‌డీ పట్టా అందుకున్నారు.

జర్నలిస్టులపై సీఎం వ్యాఖ్యలు సరైనవి కావు

- క్రాంతిదళ్ అధ్యక్షుడు పృథ్వీరాజ్



డిజిటల్ మీడియా జర్నలిస్టుల సమావేశంలో పాల్గొన్న పృథ్వీరాజ్ తదితరులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: జర్నలిస్టులపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు సరైనవి కాదని తెలంగాణ క్రాంతిదళ్ అధ్యక్షుడు పృథ్వీరాజ్ విమర్శించారు. ముఖ్యమంత్రి స్థాయిలో ఉండి అమర్యాదగా, అసభ్యకరంగా మాట్లాడటం మంచిది కాదన్నారు. శనివారం డిజిటల్ మీడియా జర్నలిస్టులపై సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలను ఖండిస్తూ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పృథ్వీరాజ్ మాట్లాడుతూ అక్షరం ముక్కరాని వారు జర్నలిస్టులుగా కొనసాగుతున్నారని అనడం సరికాదన్నారు. 'మీరు ఎంత వరకు చదువుకున్నారు. శ్రీధర్‌బాబు, భట్టి విక్రమార్క కంటే ఎక్కువ చదివావా'అని ప్రశ్నించారు. 'మీకు, కేటీఆర్‌కు తేడా లేకుండా పోయింది, ఎన్నికల ముందు కాంగ్రెస్‌కు అడ్రస్ కూడా లేదు. యూట్యూబ్ చానల్స్ కేసీఆర్ అవినీతిని ఎండగట్టడం వల్లే మీరు అధికారంలోకి వచ్చిన విషయం గుర్తుకు తెచ్చుకోవాలి' అని అన్నారు. 'నా ముందే కాలు వేసుకుంటారా'అనేది అహంకారపూరితమైన మాటలని విమర్శించారు. కార్యక్రమంలో వైఆర్‌టీవీ ప్రతినిధి రంజిత్, కాళోజీ టీవీ ప్రతినిధి దాసరి శ్రీనివాస్, పక్కా తెలంగాణ టీవీ రాము, పీఎంఆర్‌టీవీ మహిపాల్ యాదవ్, మన తొలి వెలుగు ప్రతినిధి రఘుతోపాటు పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

సాక్షి సిటీ ప్లస్
11
హైదరాబాద్‌, ఆదివారం, 3, ఆగస్టు, 2025

నృత్యరూపకం.. నయనానందకరం..

- శిల్పారామంలో అలరించిన భరతనాట్యం
- అన్నమయ్యపురంలో కూచిపూడి నృత్యప్రదర్శన



మాదాపూర్‌: శిల్పారామంలో నిర్వహించే వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఏర్పాటుచేసిన నృత్యరూపకం నయనానందకరంగా సాగింది. కళాకారులు భరతనాట్య ప్రదర్శనతో సందర్శకులను ఆలరించారు. తిల్‌లై నాట్యాలయ గురువు కనిమొళి బాలగణేశం శిష్యబృందం భరతనాట్య ప్రదర్శన శనివారం అకట్టుకుంది. ఇందులో పుష్పాంజలి, అలరిపు, బొమ్మబొమ్మత, గణేశకౌతం, మురుగన్‌ కౌతం, జతిస్వరం, కీర్తన, జగజనని, భో శంభో, తిల్లాన వంటి అంశాలను ప్రదర్శించారు. కళాకారులు మహాశ్వేత, కిరుపహరి, సిరిచందన, అక్షయ, శ్రీవల్లి, లాసియా, దీక్షిత, గీతికా ప్రదర్శించారు. కూచిపూడి గురువులు మరణిసిద్ధి, మంథా మాదవి శర్మలు కళాకారులను అభినందించారు.

అన్నమయ్యపురంలో..

అన్నమయ్యపురంలో నిర్వహించే అన్నమాస్వరార్చనలో భాగంగా కళాకారులు కూచిపూడి నృత్యాంశాలను ప్రదర్శించారు. అందెల రవళి కూచిపూడి గురువు బొడ్డపాటి సాయిరవళి ప్రిధు శిష్యబృందం ఆకట్టుకున్నారు. ఇందులో శ్రీగణనాథ, బాలకృష్ణమోహన, జవ్వాది మేతినాది, రారా వేణుగోపబాల, పరమపురుషుడు, చిత్తజ గరుడా వంటి కీర్తనలకు నృత్యప్రదర్శన చేశారు. కళాకారులు సాక్షినిప్రభ, రిషిక, మహతి, ఆశ్లేష, తితిక్ష, ముక్తేశ్వరీ, జీవిక, వర్షశ్రీ, ప్రపూర్ణ, వైష్ణవి, హస్మిత, మనస్వి, హయాతి, తన్వి, సాత్విక, ప్రేరణ, నక్షత్ర, రసజ్ఞ, నిత్య, శ్రీకరి, ఆర్యాహి, అనన్య, గ్రేతిక, స్నిగ్ధ, పరిష ప్రదర్శించారు. కళాకారులను సంస్థ వ్యవస్థాపకులు పద్మశ్రీ పురస్కార గ్రహీత డాక్టర్‌ శోభ రాజు, సంస్థ మేనేజింగ్‌ డైరెక్టర్‌ నందకుమార్‌ జ్ఞాపికలను అందజేశారు.



ఓక్రిడ్జ్‌లో స్ప్లాష్‌

డ్రాయింగ్‌, స్విమ్మింగ్‌తో విద్యార్థుల సందడి



రాయదుర్గం: 'ఫ్రెండ్‌షిప్‌ డే' పురస్కరించుకుని ఓక్రిడ్జ్‌ అంతర్జాతీయ పాఠశాలలో విద్యార్థులు సందడి చేశారు. స్పెషల్‌ కేర్‌ స్కూల్‌ విద్యార్థులు గచ్చిబౌలి డివిజన్‌ ఖాజాగూడలోని ఓక్రిడ్జ్‌ అంతర్జాతీయ పాఠశాలలో చదివే విద్యార్థులతో కలిసి గడిపేలా 'స్ప్లాష్‌' పేరిట ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు కార్యక్రమాలు నిర్వహించారు. స్విమ్మింగ్‌, వాటర్‌గన్‌ గేమ్స్‌తో ఆటలాడారు. అనంతరం చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. విజువల్‌ ఆర్ట్స్‌ ఉపాధ్యాయులు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించి అత్యుత్తమ చిత్రాలను ఎంపికచేసి బహుమతులు అందించారు. 'కాస్‌' కో–ఆర్డినేటర్‌, సోషల్‌ ఇంపాక్ట్‌ లీడ్‌ శాలిని శ్యాముల్‌, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. విద్యార్థులు చేసిన నృత్యాలు అందరినీ అలరించాయి.

దునియా మెచ్చే.. దోస్తీ..

- తరాలు, అంతరాలు దాటొచ్చిన స్నేహం
- వయసు భేదాన్ని చెరిపేస్తున్న నయా ట్రెండ్‌
- పిల్లలతో కలిసిపోతున్న నేటి తరం తల్లిదండ్రులు
- అరమరికల్లేని ఫ్రెండ్‌షిప్‌వైపు అడుగులు
- పరస్పరం విశ్వసనీయమైన నేస్తాలుగా
- ప్రతిదీ షేర్‌ చేసుకుంటున్న పిల్లలు
- స్నేహం..ఆరోగ్యం.. మహాభాగ్యం అంటున్న సైకాలజిస్టులు



'నీ బెస్ట్‌ ఫ్రెండ్‌ ఎవరు? అంటే.. నీతూ, రీతూ, కాదు కాదు శ్వేత.. అంటూ ఇప్పుడు కొందరు అమ్మాయిలు/అబ్బాయిలు తల బద్ధలు కొట్టుకోవడం లేదు.. మై మమ్‌/డాక్‌ ఈజ్‌ మై బెస్ట్‌ ఫ్రెండ్‌ అని ఠక్కున సమాధానం చెబుతున్నారు. అవును మరి జిమ్‌లో వెయిట్స్‌ లేపాలన్నా, పబ్‌లో ఛీర్స్‌ చెప్పాలన్నా కఠినమైన ట్రెక్కింగ్‌కి వెళ్లాలన్నా, కాలక్షేపంగా కార్డ్స్‌ ఆడాలన్నా.. ఇప్పుడు బయటకు వెళ్లి ఫ్రెండ్స్‌ని వెదుక్కోవాల్సిన పనిలేదు. నిన్న కనీ పెంచిన తల్లిదండ్రులే నేడు కంటి ముందున్న స్నేహితులుగా మారిపోతున్నారు. పిల్లలు కూడా భయంతో వణికిపోకుండా.. ప్రతిదీ తల్లిదండ్రులకు షేర్‌ చేసుకుంటూ.. దునియా మెచ్చే దోస్తీ అనిపించుకుంటున్నారు. నేడు స్నేహితుల దినోత్సవం నేపథ్యంలో పలువురి నగరవాసుల మనోగతం..

– సాక్షి, సిటీబ్యూరో





'అంతకు ముందేమో గానీ మా నాన్న వయసు 70 అంటే ఇప్పుడు అస్సలు నమ్మబుద్ధి కాదు. ఎందుకంటే ఆయన నాకన్నా యంగ్‌ అండ్‌ యాక్టివ్‌..' అంటూ చెప్పారు సింధు. రిటైర్‌ అయిన తర్వాత తండ్రికి కాలక్షేపం కోసం ట్రెక్కింగ్‌ పరిచయం చేశా అనుకున్న ఈ యువతి.. ఆ తర్వాత ఆయన తనతోనే పోటీపడే ట్రెక్కింగ్‌ ఫ్రెండ్‌గా మారతారు.. అని అప్పట్లో అనుకోలేదు మరి. 'ఇప్పుడు ఏ అడ్వెంచర్‌ చేయాలన్నా నా దృష్టిలో ఫస్ట్‌ గుర్తుకొచ్చే ఫ్రెండ్‌ మా నాన్నే' అంటున్నారీమె. గత కొంత కాలంగా అడ్వెంచర్‌ యాక్టివిటీస్‌లో తరచూ పాల్గొంటున్న మణికొండ నివాసి సింధు. తండ్రితో కలిసి జాగింగ్‌ నుంచి జిమ్‌ వరకూ, సైక్లింగ్‌ నుంచి ట్రెక్కింగ్‌ వరకూ కలిసి పంచుకుంటారు. 'షి ఈజ్‌ మై బెస్ట్‌ ఫ్రెండ్‌' అంటున్నారు ఆమె తండ్రి..

ఫ్రెండ్స్‌గా ఉంటేనే ట్రెండ్స్‌ తెలుస్తాయి..

పిల్లలతో కలిసి ఫ్రెండ్స్‌గా ఉంటేనే నేటి ట్రెండ్స్‌ తెలుస్తాయనేది నగరంలోని పలువురు తల్లిదండ్రుల అభిప్రాయం. ప్రస్తుతం పిల్లల ఆలోచనాధోరణులు, వాళ్లను ఆకర్షిస్తున్న కొత్త కొత్త విషయాల గురించి తెలుసుకోవాలంటే తమ పిల్లలకి స్నేహితులుగా మారడాన్ని మించిన మార్గం లేదని తల్లిదండ్రులు స్పష్టం చేస్తున్నారు. 'మా అబ్బాయి శశాంక్‌కి షాపింగ్‌ సహా ప్రతి విషయంలోనూ నేను తోడుండాల్సిందే' అని గర్వంగా చెబుతున్నారు నగర వాసి సుమన్‌ కృష్ణ. తనకి యుక్త వయసు వచ్చిన దగ్గర నుంచే ఒక తల్లిలాగా కాకుండా ఓ ఫ్రెండ్‌లా ట్రీట్‌ చేస్తూ వచ్చానని ఇటీవలే తన కొడుకుతో కలిసి ఓ ఫారెస్ట్‌ ట్రెక్‌ పూర్తి చేసిన సుమన్‌ అంటున్నారు. నగరవాసి ముంతాజ్‌ పటేల్‌ కూడా అదే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. తన కుమార్తె తారిణ్‌ పటేల్‌తో కలిసి డియోరియేటల్‌ చంద్రశిల అనే ప్రాంతంలో ట్రెక్కింగ్‌ చేసి తిరిగొచ్చిన అనుభవాలు మరచిపోలేనివి అంటున్నారామె.







నేను యంగ్‌గా మారిపోయా..

సోషల్‌ మీడియా సాక్షిగా వన్‌ ఆఫ్‌ ది స్టైలిస్ట్‌ ఫాదర్‌ అంటూ ప్రశంసలు అందుకునే అలీ సాగర్‌..నేను యంగ్‌గా మారిపోయా అంటూ చెబుతున్నారు. ఫ్యాషన్‌ విషయంలో తన కుమారుడు అమ్మార్‌కి కూడా టిప్స్‌ అందిస్తుంటారు. గాగుల్స్‌ ధరించడం దగ్గర నుంచి థ్రిల్స్‌లో పాల్గొనడం వరకూ ఈ ఫాదర్‌ అండ్‌ సన్‌ ఇద్దరూ పోటా పోటీగా రెడీ అవుతుంటారు. తరచూ బైక్‌ రైడ్స్‌ వేసే తామిద్దరి మధ్య మాట్లాడుకోకూడనివేవీ లేవని, అసలు సీక్రెట్స్‌ అనేవే లేవని సగర్వంగా చెబుతారు అలీ సాగర్‌.

'మా పిల్లలు మా మాట వినడం లేదండీ', 'అసలు వాళ్ల లోకంలో వాళ్లుంటున్నారు. ఇలాగైతే ఏమైపోతారో'. 'ఎంత చెప్పినా వినడం లేదు. అసలు మమ్మల్ని లెక్కే చేయడం లేదు' ఇలాంటి కంప్లైయింట్స్‌తో తమను రోజూ పదుల సంఖ్యలో కలుస్తున్న తల్లిదండ్రులకు తాము చెప్పే ఏకైక సలహా.. పిల్లలతో స్నేహం చేయడమే.. అంటున్నారు నగరానికి చెందిన సైకాలజిస్ట్స్‌. టెక్‌ యుగంలో చాలా త్వరగా పిల్లలు పేరెంట్స్‌ మధ్య గ్యాప్‌ పెరిగిపోవడం సహజమని, ఇప్పుడిప్పుడే కొందరు తల్లిదండ్రుల్లో కనిపిస్తున్న ఈ ట్రెండ్‌ స్వాగతించదగ్గ పరిణామమని, ఈ తరహా పరిస్థితి మరింతగా బలోపేతం కావాల్సి ఉందని అంటున్నారు.

బెస్ట్‌ ఫ్రెండ్స్‌ కావాలంటే..

- పిల్లలతో గడిపే సమయంలో వ్యక్తిగత వ్యవహారాలను పూర్తిగా పక్కన పెట్టేయాలి.
- పిల్లలతో మాట్లాడేటప్పుడు తరచూ నేను నీ నాన్నని/అమ్మని అనే మాట పదే పదే గుర్తు చేయకూడదు.
- పిల్లల ప్రతి మూడ్‌నీ షేర్‌ చేసుకోవాలి. అది మనకు ఎంత నచ్చకున్నా వారికి ఇష్టమైన దేనినీ పదే పదే విమర్శించవద్దు.
- వాకింగ్‌, జిమ్‌ వర్కవుట్స్‌, డ్యాన్స్‌.. లాంటి పనుల్లో తరచూ వారితో మమేకం అవ్వాలి.
- వారికి నచ్చిన ఫ్రెండ్స్‌ని, వారి అభిమాన క్రీడాకారుల్ని వీలైనంత వరకూ మనమూ ప్రశంసిస్తుండాలి.
- వండిపెట్టాలి, ఇంటిని సర్దాలి.. ఇలా తల్లిదండ్రుల పనులు అని విభజించకుండా అన్ని పనులూ అందరివీ అనే భావన వారిలో కలిగేలా చేయాలి.
- వారి ఫెయిల్యూర్స్‌ సమయంలో తప్పనిసరిగా పక్కనే అండగా ఉండాలి. వీలైనంత ఎక్కువగా వారితో కమ్యూనికేట్‌ అవ్వాలి. అయితే అదేదో వారిపై నిఘా ఉంచిన భావన రానీయకుండా చేయాలి అని నగరానికి చెందిన పలువురు సైకాలజిస్టులు పేరెంట్స్‌కి సూచిస్తున్నారు.

అతని వయసు పదేళ్లు. విద్యార్థిగా చదువు కొనసాగిస్తూనే.. బాల నటుడిగా సినిమా రంగంలో దూసుకుపోతున్నాడు. ఉత్తమ క్యారెక్టర్‌ ఆర్టిస్టుగా, యాక్టర్‌, డబ్బింగ్‌ ఆర్టిస్టుగానూ పేరు తెచ్చుకున్నాడు. క్రీడల్లో సైతం రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో మూడు గోల్డ్‌మెడల్స్‌ సాధించాడు. చదువుల్లోనూ క్లవర్‌.. 90 శాతం మార్కులు తెచ్చుకుంటున్నాడని తల్లిదండ్రులు చెబుతున్నారు. ఇలా బహుముఖ రంగాల్లో దూసుకుపోతూ ఔరా అనిపిస్తున్నాడు నగరానికి చెందిన ధృవన్‌ సత్యవర్మ.

– సాక్షి, సిటీబ్యూరో

సినిమాల్లో నటిస్తా.. క్రీడల్లో రాణిస్తా..

40 సినిమాలు, 15 ప్రకటనల్లో నటన



- రెండు జాతీయ పతకాలు, ఒక రాష్ట్ర స్థాయి పతకం
- చదువుల్లోనూ ఎప్పుడూ టాపరే
- బహుముఖ రంగాల్లో రాణిస్తున్న ధృవన్‌ సత్యవర్మ

హైదరాబాద్‌లోని కొండాపూర్‌ ప్రాంతంలో నివసించే చిరు వ్యాపారి వెంకట రామరాజు, అపర్ణ (గృహిణి) ధృవన్‌ సత్యవర్మ తల్లిదండ్రులు. ప్రస్తుతం ఐదో తరగతి చదువుతున్నాడు ధృవన్‌. 2018లో టీఎఫ్‌ఐలో చేరాడు. ఆర్‌ఆర్‌ఆర్‌ సినిమాతో సినీ రంగ ప్రవేశం చేశాడు. బాల నటుడిగా పుష్ప–1, 2, ఏటిగట్టు, స్కైలాబ్‌, వారియర్‌, 18 పేజెస్‌, మాచర్ల నియోజకవర్గం, బ్రో, విమానం, రావణాసుర, ఈగల్‌, మాస్‌జాతర, రాబిన్‌హుడ్‌ వంటి మొత్తం 40 సినిమాల్లో నటించాడు. నటనతో పాటు డబ్బింగ్‌ ఆర్టిస్టుగానే ఎదుగుతున్నాడు. ఇవే కాకుండా ప్రైవేటు ప్రకటనల్లోనూ రాణిస్తున్నాడు. ఇప్పటి వరకు 13 ప్రకటనల్లో బాల నటుడిగా ధృవన్‌ కనిపించాడు. త్వరలో స్వయంభు, తేజ్‌, ఘాటి, మరో రెండు సినిమాలు విడుదలకు సిద్ధంగా ఉన్నాయి.



మూడు గోల్డు మెడల్స్‌..

ధృవన్‌ సత్యవర్మ బాలనటుడిగానే కాకుండా క్రీడల్లోనూ తనదైన ముద్ర వేస్తున్నాడు. జాతీయ స్థాయిలో రెండు గోల్డ్‌ మెడల్స్‌ సాధించగా, రాష్ట్ర స్థాయిలోనూ గోల్డ్‌ మెడల్‌ సొంతం చేసుకున్నాడు. 2025 ఏప్రిల్‌లో రెజ్లింగ్‌ పోటీల్లో శిక్షణ తీసుకోవడం మొదలు పెట్టాడు. తక్కువ సమయంలోనే హైదరాబాద్‌లో జరిగిన సమ్మర్‌ క్యాంప్‌లో రాష్ట్ర స్థాయి పోటీల్లో మొదటి స్థానంలో నిలిచాడు. ఇటీవల ఛత్తీస్‌గఢ్‌లో నిర్వహించిన జాతీయ రెజ్లింగ్‌ పోటీల్లో అండర్‌ –11 కేటగిరీలో రెండు గోల్డ్‌మెడల్స్‌ సాధించాడు. ఈ పోటీలో మొత్తం 16 రాష్ట్రాల నుంచి సుమారు 800 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఇందులో గుజరాత్‌, హరియాణా, మధ్యప్రదేశ్‌, ఇతర రాష్ట్రాల క్రీడాకారులతో తలపడ్డాడు. గ్రాప్లింగ్‌.. నోగి కేటగిరీల్లో రెండు పతకాలు సొంతం చేసుకున్నాడు.

సహకారం కోసం..

ధృవన్‌కి క్రీడలంటే ఇష్టం. అందులోనూ రెజ్లింగ్‌ పట్ల ఆసక్తి ఎక్కువ. ఈ క్రమంలోనే ఈ ఏడాది ఏప్రిల్‌లో శిక్షణ తీసుకున్నాడు. తక్కువ సమయంలోనే రాష్ట్ర, జాతీయ స్థాయి గోల్డ్‌మెడల్స్‌ సాధించాడు. అయితే తదుపరి పోటీల్లో పాల్గొనేందుకు శిక్షణ, ఇతర అవసరాల కోసం ఆర్థిక స్తోమత తల్లిదండ్రులకు లేదంటున్నారు. స్పాన్సర్స్‌ ఉంటే తనేంటో నిరూపించుకుంటానని చెబుతున్నాడు. ఇటీవల జీసీఐ వారు గోల్డెన్‌ రికార్డులో నమోదు చేశారు. సినిమాల్లో బిజీగా ఉండటం వల్ల అందులో చేర్చలేకపోయామని తల్లిదండ్రులు చెబుతున్నారు. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన ఓ అధికారి వచ్చి అడిగారని, అయితే తెలంగాణ నుంచి ప్రాతినిధ్యం వహించాలన్నదే తమ ఉద్దేశమని ధృవన్‌ తల్లి అపర్ణ తెలిపారు. ప్రభుత్వ సహకారం ఉంటే జాతీయ స్థాయిలో రాణిస్తానని చెబుతున్నాడు.

జూబ్లీహిల్స్‌లో ఓరా.. ఔరా..

నూతన కలెక్షన్‌ ఆవిష్కరించిన జ్యువెలరీ సంస్థ

బంజారాహిల్స్‌: జూబ్లీహిల్స్‌ రోడ్‌ నెం.36లో ఓరా ఫైన్‌ జ్యువెల్స్‌ స్టోర్‌ని ఓరా మేనేజింగ్‌ డైరెక్టర్‌ దీపు మెహతా, ఓరా వినియోగదారులతో కలిసి శనివారం పునఃప్రారంభించారు. ఈ సందర్భంగా డిజైనర్లు రూపొందించిన విభిన్నమైన డైమండ్‌ జ్యువెల్స్‌ ఆవిష్కరించారు. గతంతో పోలిస్తే జూబ్లీహిల్స్‌ స్టోర్‌ విస్తీర్ణాన్ని పెంచడంతో పాటు వినియోగదారులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు ప్రసిద్ధి చెందిన భిన్నమైన జ్యువెలరీని అందుబాటులోకి తెచ్చామని ఓరా ప్రతినిధులు వెల్లడించారు. దేశంలోని ప్రత్యేక పేటెంట్‌ కలిగిన 72 ముఖాల వజ్రాన్ని తాము అందిస్తున్నట్లు వారు తెలిపారు. ప్రస్తుత అవసరాలకు, కార్యక్రమాలకు అనువుగా సమకాలిన డిజైన్లతో ఆభరణాలు అందిస్తున్నట్లు ఓరా రీజినల్‌ బిజినెస్‌ మేనేజర్‌ అజయ్‌ ప్రతాప్‌ సింగ్‌ తెలిపారు. పునఃప్రారంభం వేడుక సందర్భంగా జూబ్లీహిల్స్‌ స్టోర్‌లో డైమండ్‌ ఫెస్టివల్‌తో పాటు ప్రత్యేకమైన బ్రైడల్‌ లాంజ్‌ అందుబాటులోకి తీసుకొచ్చామని, జ్యువెల్స్‌ మేకింగ్‌పైనా పలు ఆఫర్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఓరా జ్యువెల్స్‌ ఏరియా బిజినెస్‌ మేనేజర్‌ షకీరున్నీసా షేక్‌, రియాజుద్దీన్‌, స్టోర్‌ మేనేజర్‌ కేదార్‌, రీజినల్‌ ట్రైనర్‌ దేవయాని పాల్గొన్నారు.



క్లుప్తంగా...

పునర్నిర్మించిన భవనంలోనే సమావేశాలు

- శాసనమండలి చైర్మన్ 'గుత్తా'



సాక్షి, హైదరాబాద్: వచ్చే శాసనమండలి సమావేశాలను.. అసెంబ్లీ ప్రాంగణం పక్కనే పునర్నిర్మిస్తున్న భవనంలో నిర్వహించనున్నట్లు శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి చెప్పారు. అసెంబ్లీ ప్రాంగణంలోని శాసనమండలి భవన పునర్నిర్మాణ పనులపై ఆర్‌అండ్‌బీ శాఖ ఉన్నతాధికారులు, ఆగాఖాన్ సంస్థ ప్రతినిధులు, అసెంబ్లీ అధికారులతో కలిసి ఆయన శనివారం సమీక్ష నిర్వహించారు. అనంతరం పునర్నిర్మాణ పనుల తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా సుఖేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. భవన పునర్నిర్మాణ పనులపై ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డి ఆరా తీశారని చెప్పారు. మండలి సమావేశాలను ఈ భవనంలోనే నిర్వహించాలని ఆదేశించారని చెప్పారు. ఈ నేపథ్యంలో పనుల్లో ఎలాంటి జాప్యం జరగవద్దని, త్వరగా పూర్తి చేసి భవనాన్ని శాసనమండలి అధికారులకు అప్పగించాలని ఆదేశించారు. ఆయన వెంట అసెంబ్లీ కార్యదర్శి డాక్టర్ వి.నరసింహాచార్యులు తదితరులు ఉన్నారు.

సీఎం బానిసల్లా సివిల్ సర్వెంట్లు

- బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ శ్రవణ్



సాక్షి, హైదరాబాద్: కొందరు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు నిబంధనలు అతిక్రమిస్తూ.. సీఎం రేవంత్‌రెడ్డికి బానిసల్లా పనిచేస్తున్నారని బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ డాక్టర్ దాసోజు శ్రవణ్ ఆరోపించారు. సీఎం, మంత్రులను ప్రసన్నం చేసుకునేందుకే సివిల్ సర్వెంట్లు తాపత్రయ పడుతున్నారని వ్యాఖ్యానించారు. ఆయన శనివారం తెలంగాణ భవన్‌లో ఎమ్మెల్యే ముఠా గోపాల్, బీఆర్‌ఎస్ నేతలు ఆనంద్ గౌడ్, బొమ్మెర రామమూర్తిలతో కలిసి విలేకరులతో మాట్లాడారు. నిష్పక్షపాతంగా వ్యవహరించాల్సిన సివిల్ సర్వెంట్లు పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. ఖైరతాబాద్ నియోజకవర్గంలో రేషన్ కార్డుల పంపిణీలో ఐపీఎస్ దేవేంద్ర సింగ్ చౌహాన్, ఐఏఎస్ హరిచందన.. కాంగ్రెస్ కండువాలు కప్పుకున్నట్టు మాట్లాడారని విమర్శించారు. పన్నెండేళ్ల క్రితం సబ్ కలెక్టర్‌గా ఉన్నప్పుడు రేషన్ కార్డులు ఇవ్వడం చూశానని, మళ్లీ ఇపుడే చూస్తున్నానని హైదరాబాద్ కలెక్టర్ దాసరి చందన వ్యాఖ్యానించడమేమిటని ప్రశ్నించారు. పౌర సరఫరాల శాఖ కమిషనర్ దేవేంద్ర చౌహాన్ కూడా.. పదేళ్లలో ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదని అబద్ధం చెప్పారన్నారు. కేసీఆర్ హయాంలో 6.47 లక్షల రేషన్ కార్డులు ఇచ్చారని, రికార్డులు తెప్పించుకోకుండా అబద్ధాలు చదివారని మండిపడ్డారు. సర్వీస్ నిబంధనలు ఉల్లంఘించిన దేవేంద్ర చౌహాన్, హరిచందనలపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఫిర్యాదు చేస్తానని దాసోజు తెలిపారు.

పింఛన్లను పెంచుతారా.. దిగిపోతారా?

- కొడంగల్ మహాగర్జన సభలో మంద కృష్ణ మాదిగ



బొంరాస్‌పేట: ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న ప్రకారం పేదలకు అందజేస్తామన్న అన్ని రకాల పెన్షన్లను పెంచాలని, లేదంటే పాలన నుంచి దిగిపోవాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు, మంద కృష్ణమాదిగ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం కొడంగల్‌లోని కేఎస్‌వీ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన మహాగర్జన సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా కొత్తగా 50 లక్షల మంది పింఛన్లకు అర్హులుగా ఉన్నారన్నారు. తన ఉద్యమ ప్రస్థానంలో నిరుపేదల స్థితిగతులు కలచివేశాయని ఆవేదన వ్యక్తంచేశారు. ఇందుకు సంబంధించి 'సాక్షి'లో ప్రచురితమైన కథనాలను మంద కృష్ణ వేదికపై చూపించారు. అనంతరం డాక్టర్ భీంరాజ్ కుటుంబం ఆయన్ను గజమాలతో సన్మానించారు. కార్యక్రమంలో వీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కాళ్ల జంగయ్య, ముసాయిదా కమిటీ చైర్మన్ నాగభూషణం అంబేడ్కర్ ప్రజాసంఘాల తాలూకా అధ్యక్షుడు రమేశ్‌బాబు తదితరులున్నారు.

కేటీఆర్ తరహాలో రేవంత్ దొంగతనంగా ఢిల్లీకి వెళ్లడు

కాంగ్రెస్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ప్రజలు, తెలంగాణ సమాజం కోసం 100 సార్లు కాదు, అవసరమైతే 500 సార్లయినా సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీకి వెళ్తారని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ వ్యాఖ్యానించారు. అయితే, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ లాగా దొంగతనంగా వెళ్లే అలవాటు రేవంత్‌కు లేదన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కృష్ణా, గోదావరి జల వివాదాల శాశ్వత పరిష్కారానికి కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని, ఈ విషయంలో రాష్ట్రంలోని ప్రతిపక్ష రాజకీయ పార్టీలు వీలుంటే తమకు సహకరించాలని, తప్పుడు ప్రచారం మాత్రం చేయొద్దని కోరారు. నీళ్లు, నిధులు, నియామకాలన్నింటినీ తన కుటుంబం వైపు మలుచుకున్న కేసీఆర్ కుటుంబానికి మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ వత్తాసు పలుకుతున్నాడని, బనకచర్ల కడతామని చెప్పినప్పుడు మంత్రిగా ఉన్న ఆయన నోరెందుకు మెదపలేదని ప్రశ్నించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు బీసీల గురించి మాట్లాడే అర్హత కోల్పోయారని దయాకర్ మండిపడ్డారు.

పెన్షన్.. టెన్షన్..!



పెన్షన్ కోసం వస్తున్న వృద్ధురాలు



మా వంతు ఎప్పుడు వస్తుందో అని ఎదురుచూస్తున్న పెన్షన్ దారులు



ఫేస్ రికగ్నిషన్ చేస్తున్న సిబ్బంది



పెన్షన్ కోసం వరుసలో పెట్టిన బ్యాంక్ బుక్కులు

పెన్షన్ పంపిణీలో ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా ఉండేందుకు ప్రభుత్వం కొత్తగా ఫేస్ రికగ్నిషన్ పద్ధతి అమలుచేస్తోంది. కానీ ఈ ముఖ గుర్తింపు విధానంలో పెన్షన్ పొందేందుకు ఎక్కువ సమయం తీసుకుంటోంది. దీంతో పింఛన్‌దారులు రోజుల తరబడి పింఛన్ కోసం రాకపోకలు కొనసాగించాల్సి వస్తోందని వాపోతున్నారు. మావల గ్రామపంచాయతీ కార్యాలయంలో పింఛన్ పంపిణీ చేస్తుండటంతో ఆటో ఖర్చుల కోసం ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో వేలిముద్రలు సరిగా పడక పింఛన్ పొందడం ఇబ్బందిగా మారగా.. ఈ నూతన విధానంతో కూడా వారికి ఇక్కట్లు ఎదురవుతున్నాయి. వివిధ కాలనీలకు చెందిన పింఛన్‌దారులు ఆయా కాలనీల్లోనే పింఛన్ అందించేలా చూడాలని అధికారులను కోరారు. – సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

ఔటర్ పరిధిలో సమీకృత సబ్‌రిజిస్ట్రార్ ఆఫీస్‌లు

- నాలుగైదు కార్యాలయాలకు ఒకే చోట సొంత భవనం
- సీఎంతో చర్చించి నమూనాలకు తుది రూపు
- ప్రతి కార్యాలయంలో కార్పొరేట్ స్థాయిలో వసతులు
- రిజిస్ట్రేషన్ల శాఖ సమీక్షలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి
- శేరిలింగంపల్లి, గండిపేట కార్యాలయాలకు గచ్చిబౌలిలో భూమి
- రంగారెడ్డి జిల్లా రిజిస్ట్రార్‌కు అనుమతిస్తూ ఉత్తర్వులు



సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ భవనాల పునర్వ్యవస్థీకరణలో ప్రభుత్వం మరో ముందడుగు వేసింది. ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల స్థానంలో సమీకృత (ఇంటిగ్రేటెడ్) భవనాలు నిర్మించాలని నిర్ణయించింది. ఈ మేరకు శనివారం సచివాలయంలో స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రంలోని 144 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు గాను 37 మాత్రమే సొంత భవనాలు ఉన్నాయని ఈ సమావేశంలో ఉన్నతాధికారులు తెలిపారు. అందుకు మంత్రి స్పందిస్తూ.. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను ఆధునిక సౌకర్యాలతో తీర్చిదిద్దే ఆలోచన ప్రభుత్వానికి ఉందని చెప్పారు. మొదటి విడతలో ఔటర్ రింగు రోడ్డు పరిధిలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ భవనాలను పునర్వ్యవస్థీకరించాలని ఆదేశించారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని నాలుగైదు కార్యాలయాలకు కలిపి సమీకృత భవనాలను నిర్మించి కార్పొరేట్ స్థాయి వసతులు కల్పించాలని సూచించారు.

గచ్చిబౌలి ఆఫీస్ రోల్‌మోడల్

హైదరాబాద్ జిల్లాలోని 11 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు కలిపి రెండు చోట్ల, రంగారెడ్డిలోని 14 కార్యాలయాలకు 3 చోట్ల, మేడ్చల్ జిల్లాలో 12 కార్యాలయాలకు 3 చోట్ల, సంగారెడ్డి, పటాన్‌చెరు కలిపి ఒక చోట ఇంటిగ్రేటెడ్ కార్యాలయాలు ఏర్పాటు చేయాలని పొంగులేటి ఆదేశించారు. జిల్లా కలెక్టర్లతో సమన్వయం చేసుకుని అవసరమైన ప్రభుత్వ భూమిని గుర్తించాలని సూచించారు. హైదరాబాద్ పరిధిలోని గండిపేట, శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్, బాలానగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను కలిపి గచ్చిబౌలిలోని తాలిమ్ కార్యాలయ ప్రాంగణంలో ఇంటిగ్రేటెడ్ కార్యాలయం నిర్మిస్తున్నామని, ఇది మిగిలిన వాటికి రోల్‌మోడల్‌గా ఉంటుందని చెప్పారు. ఈ భవనాలు ఎలా ఉండాలన్న దానిపై త్వరలోనే సీఎం రేవంత్‌రెడ్డితో చర్చిస్తానని, అనంతరం భవన నమూనాలకు తుది రూపు ఇస్తామని తెలిపారు. ప్రజలకు సంతృప్త స్థాయిలో సేవలందించడమే లక్ష్యంగా ఈ భవనాలను నిర్మించాలని సూచించారు. ఈ సమీక్షలో రెవెన్యూ శాఖ కార్యదర్శి డి.ఎస్. లోకేశ్‌కుమార్, స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ప్రత్యేక కమిషనర్ రాజీవ్‌గాంధీ హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

ఒక ఇంటిగ్రేటెడ్ భవనానికి భూమి..

శేరిలింగంపల్లి మండలంలోని గచ్చిబౌలి గ్రామంలో ఉన్న సర్వే నంబర్ 91/2లో గల మూడెకరాల ప్రభుత్వ భూమిని ముందస్తు స్వాధీనం చేసుకునేందుకు గాను రంగారెడ్డి జిల్లా రిజిస్ట్రార్‌కు అనుమతినిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. శేరిలింగంపల్లి, గండిపేట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు నిర్మించేందుకు ఈ భూమిని కేటాయిస్తున్నామని, ఈ భూమిని జిల్లా రిజిస్ట్రార్ స్వాధీనం చేసుకునేందుకు అవసరమైన చర్యలు జిల్లా కలెక్టర్ తీసుకోవాలని ఆదేశించింది. వెంటనే భూబదలాయింపు ప్రక్రియను పూర్తి చేసేందుకు సీసీఎల్‌ఏ తగిన చర్యలు తీసుకోవాలని రెవెన్యూ శాఖ కార్యదర్శి డి.ఎస్. లోకేశ్‌కుమార్ శనివారం జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

కేంద్ర నిధులతో సంబంధం లేకుండా ఇందిరమ్మ ఇళ్లు

గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి

సాక్షి, హైదరాబాద్: పేదల ఇళ్ల పథకానికి కేంద్రప్రభుత్వం ప్రతిపాదించిన యూనిట్‌కాస్ట్ నామమాత్రంగానే ఉన్నందున.. కేంద్రం నిధులపై ఆధారపడకుండా సొంతంగా ఇందిరమ్మ ఇళ్లను పూర్తి చేస్తామని గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణ ప్రాంత ఇళ్ల యూనిట్ కాస్ట్‌గా రూ.1.52 లక్షలు, గ్రామీణ ప్రాంత ఇళ్ల యూనిట్ కాస్ట్‌గా రూ.72 వేలు మాత్రమే కేంద్రం ప్రతిపాదించిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం యూనిట్‌కాస్ట్‌ను రూ.5 లక్షలుగా నిర్ధారించిందని గుర్తు చేశారు. ఆ ఇచ్చే అరకొర నిధుల కేటాయింపులో కూడా కొర్రీలు పెడుతూ సతాయిస్తోందని, దీంతో కేంద్ర నిధులతో ప్రమేయం లేకుండా సొంత నిధులతో ఇందిరమ్మ ఇళ్లను పూర్తి చేసేందుకు సిద్ధంగా ఉన్నట్టు వెల్లడించారు. గత ప్రభుత్వం అసంపూర్తిగా వదిలేసిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను కూడా పూర్తి చేసి లబ్ధిదారులకు అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని మంత్రి పొంగులేటి తెలిపారు.

ఫిరాయింపు ఎమ్మెల్సీలపై బీఆర్‌ఎస్ నజర్

- మండలి చైర్మన్‌పై ఒత్తిడి పెంచే యోచన
- పార్టీ ముఖ్య నేతలతో కేసీఆర్ చర్చలు
- మండలి చైర్మన్ వైఖరిపై అవసరమైతే హైకోర్టుకు..!



సాక్షి, హైదరాబాద్: ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపులపై సుప్రీంకోర్టు కీలక తీర్పు నేపథ్యంలో పార్టీ మారిన ఎమ్మెల్సీలపై అనర్హత వేటు అంశంపై బీఆర్‌ఎస్ దృష్టి సారించింది. ఆ పార్టీ తరఫున గెలిచి కాంగ్రెస్‌లో చేరిన పది మంది ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై మూడు నెలల్లోగా నిర్ణయం తీసుకోవాలని స్పీకర్‌ను సుప్రీంకోర్టు ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో 3 నెలల్లో నిర్ణయం తీసుకునేలా స్పీకర్‌ను కోరాలని, అదే సమయంలో ఫిరాయించిన ఎమ్మెల్సీలపైనా అనర్హత వేటు వేసేలా శాసనమండలి చైర్మన్‌పై ఒత్తిడి తేవాలని బీఆర్‌ఎస్ భావిస్తోంది. నాలుగు రోజుల పాటు ఎర్రవల్లి నివాసంలో కీలక నేతలతో నిర్వహించిన భేటీలో బీఆర్‌ఎస్ అధినేత, మాజీ సీఎం కె.చంద్రశేఖర్‌రావు ఈ అంశంపై లోతుగా చర్చించినట్లు తెలిసింది. శాసనమండలి చైర్మన్ వైఖరిపై అవసరమైతే హైకోర్టును ఆశ్రయించాలని ఆదేశించినట్లు సమాచారం.

8 మంది ఎమ్మెల్సీల ఫిరాయింపు

బీఆర్‌ఎస్ తరఫున ఎమ్మెల్సీలుగా ఎన్నికైన 8 మంది వివిధ సందర్భాల్లో కాంగ్రెస్‌లో చేరారు. 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరి తన కుమారుడు రాజేశ్ రెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపించుకున్నారు. 2024 మార్చిలో ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి దంపతులు కాంగ్రెస్‌లో చేరారు. వివిధ సందర్భాల్లో ఎగ్గె మల్లేశం, బస్వరాజు సారయ్య, బొగ్గారపు దయానంద్, దండె విఠల్, భానుప్రసాద్‌రావు, ఎంఎస్ ప్రభాకర్‌రావు బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు. గవర్నర్ కోటాలో నామినేట్ అయిన బొగ్గారపు దయానంద్, బస్వరాజు సారయ్యను మినహాయించి మిగతా ఆరుగురు ఎమ్మెల్సీలను అనర్హులుగా ప్రకటించాలని కోరుతూ శాసనమండలి చైర్మన్‌కు బీఆర్‌ఎస్ పిటిషన్ సమర్పించింది.

మిగిలింది నలుగురే..!

హైదరాబాద్ స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ ఎంఎస్ ప్రభాకర్‌రావు, ఎమ్మెల్యే కోటాలో ఎన్నికైన ఎగ్గె మల్లేశం ఇప్పటికే తమ పదవీ కాలం పూర్తి చేసుకున్నారు. దీంతో ప్రస్తుతం పార్టీ ఫిరాయింపునకు పాల్పడిన ఎమ్మెల్సీల్లో పట్నం మహేందర్ రెడ్డి (రంగారెడ్డి), భానుచందర్‌రావు (కరీంనగర్), కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి (మహబూబ్‌నగర్), దండె విఠల్ (ఆదిలాబాద్) మాత్రమే పదవిలో కొనసాగుతున్నారు. వీరి పదవీ కాల పరిమితి 2028 జనవరిలో ముగియనుంది. అంటే దాదాపు మరో మూడున్నరేళ్లు వారు పదవిలో కొనసాగే అవకాశం ఉండటంతో వారిని అనర్హులుగా ప్రకటించాలంటూ ఒత్తిడి పెంచాలని బీఆర్‌ఎస్ భావిస్తోంది.

శుష్కప్రియాలు.. శూన్య హస్తాలు

రాష్ట్రానికి నయాపైసా లాభం లేకున్నా సీఎం 50 సార్లు ఢిల్లీ వెళ్లారంటూ కేటీఆర్ ఎద్దేవా



సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇప్పటివరకు 50 సార్లు ఢిల్లీకి వెళ్లినా.. తెలంగాణకు నయాపైసా లాభం లేకపోయినా.. అయిననూ పోయి రావలె హస్తినకు అన్నట్లుగా సీఎం వైఖరి ఉందని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె. తారక రామారావు ఎద్దేవా చేశారు. రేవంత్ తీరు శుష్కప్రియాలు.. శూన్య హస్తాలుగా ఉందని శనివారం ఆయన 'ఎక్స్'వేదికగా విమర్శించారు. రాష్ట్రాన్ని ఫైల్స్‌తో కాకుండా ఫ్లైట్ బుకింగ్స్‌తో నడిపిస్తున్నారని.. టూరిస్టు సీఎంగా దేశ చరిత్రలో రేవంత్‌రెడ్డి మిగిలిపోతారన్నారు. రాహుల్ గాంధీ, నరేంద్ర మోదీ, చంద్రబాబుల ముద్దుల బానిసగా తెలంగాణ ప్రయోజనాలను రేవంత్‌రెడ్డి తాకట్టు పెట్టారని మండిపడ్డారు. ఢిల్లీ బాసుల కాళ్ల దగ్గర తెలంగాణ ఆత్మగౌరవాన్ని రేవంత్ తాకట్టు పెట్టారని దుయ్యబట్టారు.

పాలించే ముఖ్యమంత్రి కావాలి..

రాష్ట్రానికి పాలించే ముఖ్యమంత్రి కావాలి కానీ.. ఢిల్లీకి విహారయాత్రలు చేసే టూరిస్ట్ సీఎం అవసరం లేదని కేటీఆర్ పేర్కొన్నారు. రాహుల్ గాంధీకి నోట్ల కట్టల మూటలు మోస్తూ పదవిని కాపాడుకుంటున్నారని.. రెండో యజమాని మోదీకి సన్నిహితులైన వ్యాపారవేత్తలకు రాష్ట్రాన్ని తాకట్టు పెట్టి కేసుల నుంచి తప్పించుకుంటున్నారన్నారు. ఇక మన అన్నదాతల కడుపు కొట్టి తెలంగాణ జల సంపదను తన మూడో యజమాని చంద్రబాబుకు దోచి పెడుతున్నారన్నారని ఆరోపించారు. సీఎంకు, పీసీసీ చీఫ్‌కు బేసిన్లు, బేసిక్స్ తెలియవని.. ఇద్దరూ జాతిరత్నాలేనని ఎద్దేవా చేశారు.

ముందు మా ప్రాజెక్టులు పూర్తవ్వాల్సిందే

- ఎట్టి పరిస్థితుల్లో ప్రాణహిత-చేవెళ్ల కడతాం
- మా నీళ్లను మేము తప్పనిసరిగా కాపాడుకుంటాం
- బీఆర్‌ఎస్, టీడీపీ కూడబలుక్కుని తెలంగాణపై కుట్ర చేయబోతున్నాయి
- కొల్లాపూర్ సభలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



సోమశిలలో బోటులో విహరిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి జూపల్లి

కొల్లాపూర్: 'ఆంధ్రాలో ఉన్న ఓ పెద్దాయన మాట్లాడుతున్నారు. నేను బనకచర్ల కడతాం అంటున్నడు. పోలవరం తర్వాత వృథాగా పోయే నీళ్లేగదా.. మేం ప్రాజెక్టు కట్టుకుంటే మీకేం బాధ అంటున్నడు. అవేం వృథాగా పోయే నీళ్లు కాదు. మనం ఇంకా కట్టుకోవాల్సిన ప్రాజెక్టులు పూర్తి చేయకపోవడం వల్ల కిందికి నీళ్లు వృథాగా పోతున్నాయి. మన దురదృష్టం కొద్దీ గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం గోదావరి నదిపై ప్రాజెక్టులు పూర్తి చేయకపోవడం వల్ల నీళ్లు కిందికి పారుతున్నాయి. ఇప్పుడు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ తిరిగి అధికారంలోకి వచ్చింది. మాటిస్తున్నాం. తప్పనిసరిగా ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును కడతాం. మిగతా ప్రాజెక్టుల్ని కూడా పూర్తి చేస్తాం. గోదావరి నీళ్లను తెలంగాణ ప్రాంతానికి పారిస్తాం. అలా పారించిన తర్వాత మిగిలే వరద జలాల్లో ఏ ఒక్కరికో కాదు.. నదీ పరీవాహక రాష్ట్రాలన్నింటికీ వాటా ఉంటుంది. తెలంగాణ వాటా పూర్తయిన తర్వాత, మిగులు జలాల్లో కూడా మా వాటా పూర్తయిన తర్వాత బనకచర్ల కడతారో ఇంకేం చర్ల కడతారో ఆలోచన చేయండి. తెలంగాణలో మా ప్రాజెక్టులేవీ పూర్తి కాకుండానే బనకచర్ల కడతాం అంటే ఒప్పుకోం..' అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. శనివారం కొల్లాపూర్ నియోజకవర్గంలో పలు సంక్షేమ పథకాలను ఆయన లబ్ధిదారులకు అందజేశారు. అంతకుముందు రాజాబంగ్లా ముందు ఏర్పాటు చేసిన సభలో మాట్లాడారు.

వాళ్లు ఢిల్లీ వెళ్లినందుకే బనకచర్ల ఆగింది..

'సముద్రంలోకి పోయే నీళ్లే కదా అని ఏపీ మంత్రి లోకేశ్ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు. మరోవైపు ఇక్కడ ప్రాజెక్టులు కట్టకుండా వారికి అవకాశం ఇచ్చిన దొంగలే.. ఈ రోజు బనకచర్ల కడుతుంటే కాంగ్రెస్ వాళ్లు ఏం చేస్తున్నారని అంటున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఢిల్లీ వెళ్లి చంద్రబాబుతో లోపాయికారి ఒప్పందం చేసుకుని వచ్చారని చెబుతున్నారు. కానీ రేవంత్‌రెడ్డి, ఉత్తమ్ ఢిల్లీ వెళ్లారు కాబట్టే బనకచర్ల ఆగింది.

పోలవరం ఆర్డినెన్స్‌ను ప్రశ్నిస్తాం

'బీఆర్‌ఎస్, టీడీపీ కూడ బలుక్కొని తెలంగాణ మీద కుట్ర చేసే కార్యక్రమం చేయబోతున్నారు. గతంలో టీఆర్‌ఎస్ ప్రభుత్వం, బీజేపీ కుమ్మక్కై తెలంగాణకు చెందిన అమాయక గిరిజనుల భూములు మునిగిపోయేలా ఆర్డినెన్స్ తెచ్చారు. ఈ ఆర్డినెన్స్‌ను మేం ప్రశ్నిస్తాం. గిరిజనుల భూములు ముంపునకు గురవుతుంటే చూస్తూ ఊరుకోవడానికి మేం సిద్ధంగా లేము..' అని భట్టి అన్నారు. సభలో రాష్ట్ర ఎక్సైజ్ మంత్రి జూపల్లి కృష్ణారావు, నాగర్ కర్నూల్ ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యేలు వంశీకృష్ణ, మేఘారెడ్డి, యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, కసిరెడ్డి నారాయణరెడ్డి, కూచుకుళ్ల రాజేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

సభాధ్యక్షుడిపై మల్లు రవి ఆగ్రహం

కొల్లాపూర్‌లో నిర్వహించిన సభకు దండు నర్సింహ (పెద్దకొత్తపల్లి మార్కెట్‌కి కాబోయే చైర్మన్) అధ్యక్షత వహించారు. ఎంపీ మల్లు రవి ప్రసంగించే సమయంలో స్పీచ్ ముగించాలంటూ ఆయన చీటీ ఇవ్వడంతో రవి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ఎవడు వాడు. నేను ఈ రోజు ఢిల్లీలో రాహుల్‌గాంధీ, మల్లికార్జున ఖర్గే, సీఎం రేవంత్‌రెడ్డి హాజరయ్యే కార్యక్రమానికి వెళ్లాలి. నేనే దానికి కన్వీనర్. కొల్లాపూర్‌లో సభ ఉందంటే దాన్ని వదులుకుని ఇక్కడికి వచ్చా. ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలను నేను ప్రజలకు తెలియజేస్తుంటే స్పీచ్ ఆపమని నాకు చీటీ ఇస్తాడా? జూపల్లి గారు (మంత్రి) ఇలాంటి బ్యాచ్‌ను ఇంకోసారి నా దగ్గరికి రానివ్వొద్దు..' అంటూ మండిపడ్డారు.

సోమశిలలో డిప్యూటీ సీఎం

డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క కొల్లాపూర్‌లో సభలో పాల్గొన్న అనంతరం సోమశిలకు వెళ్లారు. అక్కడే నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాలకు చెందిన పలు శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. కృష్ణానదిలో మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యేలతో కలిసి కృష్ణానదిలో హుషారుగా బోటులో విహరించారు. రాత్రి టూరిజం కాటేజీలో బస చేశారు.

మోదీ సారథ్యంలో అగ్రగామిగా భారత్

- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



నరేంద్రమోదీ ప్రసంగాన్ని టీవీలో వీక్షిస్తున్న కేంద్ర బొగ్గు, గనుల శాఖమంత్రి జి.కిషన్‌రెడ్డి, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తదితరులు

యాచారం: ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో భారతదేశం ప్రపంచంలోనే అగ్రగామిగా మారబోతోందని, బలమైన ఆర్థిక వ్యవస్థ కలిగిన దేశాల్లో ప్రస్తుతం నాలుగో స్థానంలో ఉన్న భారత్ త్వరలోనే మూడో స్థానానికి చేరనుందని కేంద్ర బొగ్గు, గనుల శాఖమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. కిసాన్ సమ్మాన్ పథకంలో భాగంగా 9.7 కోట్ల మంది రైతులకు ప్రధాని మోదీ వారణాసిలో చేపట్టిన నిధుల విడుదల కార్యక్రమాన్ని యాచారం రైతు వేదికలో ఆన్‌లైన్ ద్వారా వీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతాంగ ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా మోదీ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కరోనాతో ప్రపంచ దేశాలు తల్లడిల్లిన వేళ హైదరాబాద్‌లోనే వ్యాక్సిన్ తయారు చేసి అమెరికాతో పాటు 50 దేశాలకు ఉచితంగా వ్యాక్సిన్ పంపిణీ చేసిన ఘనత మోదీకే దక్కిందని కిషన్‌రెడ్డి కొనియాడారు. ఆపరేషన్ సిందూర్ ద్వారా ఉగ్రవాదులను తుద ముట్టించామని పేర్కొన్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు సమయంలో ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణను అప్పుల కుప్పగా మార్చారని కిషన్‌రెడ్డి ఆవేదన వ్యక్తంచేశారు. కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, క్రీడా డైరెక్టర్ వీకే సింగ్, భువనగిరి మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్, కృషి విజ్ఞాన్ కేంద్రం ఇన్‌చార్జి చంద్రకాంత్, జిల్లా వ్యవసాయాధికారి ఉష, ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మిగులు జలాలు లేవు.. వరద జలాలు లేవు

- గోదావరిలో మిగులు ఉంటే అన్ని పరీవాహక రాష్ట్రాలకు హక్కు
- గోదావరి జలాల్లో రాష్ట్ర హక్కుల విషయంలో రాజీపడం
- కేసీఆర్ సూచించటం వల్లే ఏపీలో బనకచర్లకు పునాది
- మీడియాతో చిట్‌చాట్‌లో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: గోదావరి నదిలో మిగులు జలాలుగానీ, వరద జలాలుగానీ లేవని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టంచేశారు. ఒకవేళ ఉంటే వాటి లభ్యతను నిర్ధారించి నది పరీవాహక ప్రాంతంలోని అన్ని రాష్ట్రాలకు వాటా హక్కులు కల్పించాల్సి ఉంటుందని తెలిపారు. సముద్రంలోకి వృథాగా కలిసే వరద జలాలనే తాము ప్రతిపాదిత గోదావరి-బనకచర్ల అనుసంధానం ప్రాజెక్టు ద్వారా తరలించుకుంటామని, అందులో తప్పేముందని ఏపీ మంత్రి నారా లోకేశ్ చేసిన వ్యాఖ్యలను ఉత్తమ్ తప్పుబట్టారు. సముద్రంలోకి వెళ్లే నీళ్లన్నీ తమవే అని ఏపీ అనుకోవడం తప్పు అని స్పష్టంచేశారు. శనివారం ఆయన సచివాలయంలో మీడియాతో చిట్‌చాట్ నిర్వహించారు. గోదావరి జలాల్లో తెలంగాణకు ఉన్న 968 టీఎంసీల నికర జలాల కేటాయింపులపై ఆధారపడి తాము కట్టుకుంటున్న ప్రాజెక్టులకు పదేపదే అభ్యంతరం తెలిపిన ఏపీ.. వరద జలాల ఆధారంగా ప్రాజెక్టులను ఎలా కట్టుకుంటుందని ప్రశ్నించారు.

కేసీఆర్ సూచనతోనే బనకచర్లకు పునాది

బనకచర్ల ప్రాజెక్టు విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి మౌనంగా ఉన్నారని తప్పుడు ప్రచారం చేస్తున్నారని బీఆర్‌ఎస్ నేతలపై మంత్రి ఉత్తమ్ మండిపడ్డారు. ఏటా 3 వేల టీఎంసీల గోదావరి జలాలు సముద్రంలో కలుస్తున్నాయని తొలి అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో నాటి సీఎం కేసీఆర్ ప్రస్తావించి, ఆ నీళ్ల వినియోగానికి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచన చేయడం వల్లే బనకచర్ల ప్రాజెక్టుకు బీజం పడిందని ఆరోపించారు. తమ ఫిర్యాదు ఆధారంగానే ఆ ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతులను కేంద్రం తిరస్కరించిందని పేర్కొన్నారు. 1980లో గోదావరి ట్రిబ్యునల్ పోలవరం ప్రాజెక్టుకు చేసిన కేటాయింపులకు విరుద్ధంగా బనకచర్ల ప్రాజెక్టును ఏపీ ప్రతిపాదించిందని తప్పుబట్టారు. గోదావరిపై తుమ్మిడిహెట్టి, ఇచ్చంపల్లి, సమ్మక్కసాగర్ ప్రాజెక్టుల నిర్మాణానికి అనుమతులతోపాటు నిధులను ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గోదావరి-కావేరీ అనుసంధానం ప్రాజెక్టును ఇచ్చంపల్లి నుంచే ప్రారంభించాలని కోరారు.

నేడు కాళేశ్వరం నివేదికపై సమావేశం..

కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ 650 పేజీలతో నివేదిక ఇచ్చిందని మంత్రి ఉత్తమ్ వెల్లడించారు. ఈ నివేదికపై అధ్యయనం కోసం ఏర్పాటు చేసిన ఐఏఎస్ అధికారుల కమిటీతో ఆదివారం సమావేశమై చర్చిస్తానని చెప్పారు. నివేదికపై సోమవారం జరగనున్న మంత్రివర్గ సమావేశంలో చర్చించాల్సిన అంశాలను ఈ భేటీలో ఖరారు చేస్తామని తెలిపారు. నీటిపారుదల శాఖలో గత 30 ఏళ్లలో తొలిసారి ఇంజనీర్లకు శాశ్వత ప్రాతిపదికన పదోన్నతులు కల్పించినట్లు వెల్లడించారు. త్వరలో కౌన్సెలింగ్ ద్వారా బదిలీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

బీజేపీ పాలనలో ప్రజాస్వామ్యం ఖూనీ

- రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్



సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి/ఆర్మూర్: బిహార్‌లో 65 లక్షల ఓట్లను గల్లంతు చేయటం ద్వారా ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసే కుట్ర జరుగుతోందని కాంగ్రెస్ పార్టీ తెలంగాణ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ ఆరోపించారు. కేంద్రంలోని బీజేపీ సర్కారు పాలనలో పేదల ఓట్లు గల్లంతయ్యాయని విమర్శించారు. ప్రజల ఓటు హక్కు కోసం కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ పోరాటం చేస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ చేపట్టిన జనహిత పాద యాత్రలో భాగంగా శనివారం ఆర్మూర్‌లోని పెర్కిట్ చౌరస్తాలో ఏర్పాటుచేసిన కార్నర్ మీటింగ్‌లో ఆమె మాట్లాడుతూ.. రాజ్యాంగాన్ని రక్షించడమే లక్ష్యంగా రాహుల్‌గాంధీ పని చేస్తున్నారని చెప్పారు.

బనకచర్ల పాపం కేసీఆర్‌దే: పీసీసీ చీఫ్

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్మిస్తున్న బనకచర్ల ప్రాజెక్టు పాపం మాజీ సీఎం కేసీఆర్‌దే అని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ ఆరోపించారు. 2016లోనే కేసీఆర్ సీఎం హోదాలో తెలంగాణ హక్కులను ఏపీకి రాసి ఇచ్చారని ధ్వజమెత్తారు. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ సామర్థ్యాన్ని 88 వేల క్యూసెక్కులకు పెంచిన పాపం హరీశ్‌రావుది కాదా అని ప్రశ్నించారు. సంగారెడ్డి జిల్లా ఆందోల్‌లో శనివారం నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణ నిర్వహించిన పీసీ ఘోష్ కమిషన్ మాజీ సీఎం కేసీఆర్‌ను దోషిగా తేల్చిందని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో మంత్రులు సీతక్క, దామోదర రాజనర్సింహ, ఎంపీ సురేశ్‌షెట్కార్, కాంగ్రెస్ నేతలు సంపత్, షబ్బీర్ అలీ, బల్మూరి వెంకట్, జగ్గారెడ్డి, సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
ఆదివారం ॥ 3-8-2025

● ఆగస్ట్ 7 వరకు తల్లిపాల వారోత్సవాలు



● హ్యాపీ ఫ్రెండ్‌షిప్ డే



మాట కటువైతే...
మురిపాలు విరుగుతాయ్!

"తొమ్మిది నెలల బొజ్జుతాడు అకస్మాత్తుగా అలా కోసేస్తే ఎలా...?" అనుకున్నాడో ఏమో దేముడు! "పేగుబంధమిలా తెంచినందుకేనేమో... ఆహారంగా పాల బంధం పెట్టి స్తన్యబంధమేర్పాటు చేశాడనిపిస్తోంది!!

ప్రసవవేదనతో ప్రాణాల్ని తోడేసిన ఆ కొత్తబిడ్డలోకి తన ప్రాణాలు నింపి... తనలోంచి బయటకు తోడిన ప్రాణాలను మళ్లీ నెమ్మది నెమ్మదిగా పునఃప్రతిష్ఠించుకుంటూ ఉంటుంది అమ్మ. అలా అప్పడప్పుడే కోలుకుంటున్న కీలక తరుణంలో ఆ అమ్మ పట్ల జడ్జిమెంటల్‌గా కొన్ని కామెంట్స్ చేయవద్దని కోరుతున్నారు మానసికవేత్తలు.

ఆ పోస్ట్‌పార్టమ్ 'బ్లూ'స్ తాలూకు 'నీలి'నీడల్ని క్రమంగా బిడ్డపై ప్రేమ పెంచుకుంటూ ఇంద్రధనుస్సు లాంటి ఫ్లయింగ్ కలర్స్‌గా మార్చుకునే తరుణంలో ఆ కామెంట్లు ఆమెలో అపరాధభావం నింపుతాయంటూ హెచ్చరిస్తున్నారు. సూచన అనే మారువేషం వేసుకుని కర్కశాన్ని కనిపించకుండా కప్పేస్తూ ఉండే... పలకకూడని ఆ పరుష పదాలేమిటో చూద్దాం.

ఈనెల మొదటి తేదీతో మొదలై ఈ వారమంతా తల్లిపాల వారోత్సవాలు కొనసాగుతుంటాయి. ఈ సందర్భంగా బుజ్జాయికి తల్లిపాలే పట్టమంటూ సిఫార్సు చేస్తుంటారు డాక్టర్లు. 'బాటిల్‌పాలు బొజ్జ నింపుతాయేమోగానీ... అమ్మపాలు కడుపునింపడంతో పాటూ ఆత్మనూ నింపుతాయం టున్నారు' వైద్య నిపుణులు. ఈ సమయంలో కొన్ని మాటలు కొత్త తల్లితో చెప్పకూడదంటూ వారు సూచిస్తున్నారు.

***

"అమ్మా! నువ్వు పీరియడ్స్‌లో ఉండి మైలతో ఉంటే బిడ్డకు పాలుపట్టకు"

– కొందరు పెద్దాళ్ల పెడసరం మాట

ఇది ఎంతమాత్రమూ తల్లితో చెప్పకూడని మాట. బిడ్డకు తల్లిపాలను మించిన ఆహారం లేదు. డాక్టర్లు నిర్దిష్టంగా వద్దని చెబితే మినహా బిడ్డకు పాలుపట్టకుండా ఉండనే కూడదు. పైగా మురిపాలతో పట్టే ముర్రుపాలు ఇంకా ఇంకా మేలూ మంచీ చేసేవే. ఆ ముర్రుపాలనే కొలెస్ట్రమ్ అంటారు. తల్లిని దేవత అన్నాక అమ్మ అమృతం పట్టకపోతే ఎలా! అందుకే అనేక అనారోగ్యాలూ... ఎప్పుడో వృద్ధాప్యంలో బిడ్డకు వచ్చే ఎన్నో జబ్బుల్నించి రక్షించే ఆ పాలు అమృతాలు కాకుండా ఎలా పోతాయి. అమృతానికి అంటు ఏమిటి? పాలకు మైలేమిటి? అందుకే తల్లి ఏ పరిస్థితుల్లో ఉన్నా బిడ్డకు అమ్మ పాలు పట్టాల్సిందే.

***

"పాప ఏడుస్తోంది... పాలు సరిగా పట్టావా? ఏమో.... పట్టావో లేదో?"

– అనుభవజ్ఞురాలంటూ ఆరా తీసే మహిళ

పాలు తాగుతుండే పాపాయి చక్కగా బరువు పెరుగుతుంటే చాలు. పాలు తన ఒంటికి పడుతున్నట్టే లెక్క. తల్లి ఇచ్చే ఆ పాలబువ్వనంతా బిడ్డ ఒంటికంతా పట్టేలా ఏర్పాటు చేస్తుంది ప్రకృతి. అందుకే నెలల పాపాయిలకు మలవిసర్జన అంతగా కాకపోవచ్చు. కొన్నిసార్లు మల విసర్జనకు రెండు మూడురోజులూ పట్టవచ్చు లేదా రోజులో రెండుసార్లు కూడా కావచ్చు. కానీ మూత్రంతో రోజుకు ఆరుసార్లైనా డయపర్ తడిపేస్తుంది బేబీ! అలా రోజూ పాలు తాగే పసిపాప... రోజులో ఐదారుసార్లు పక్కతడిపేస్తుంటే చాలు.

ఇక పాపాయి ఏడుస్తుందంటే అర్థం పాలు సరిపోలేదని కాదు... అది కోలిక్ అని పిలిచే కడుపునొప్పి వల్ల కావచ్చు. చెప్పుకోలేని చెవినొప్పి ఉండచ్చు. అందుకే... పాప అదేపనిగా ఏడుస్తుంటే ఒకసారి చిన్నపిల్లల డాక్టర్ దగ్గరికి తీసుకెళ్లాలి. అంతేతప్ప జడ్జిమెంటల్‌గా కామెంట్స్ పాస్ చేయకూడదు.

***

"ఏమిటీ...? పాలు పట్టడం అప్పడే మానేశావా? మా కాలంలో బిడ్డకు మూడేళ్లు వచ్చే వరకూ పట్టేవాళ్లమమ్మా..."

– తమ కాలమైన గతమంతా గొప్పేనంటూ చెప్పే ఓ పెద్దావిడ మాట

బిడ్డకు ఆర్నెల్లు వచ్చేవరకూ పాలు పట్టడం తప్పనిసరి. చిన్నారి పాపాయికి పాలే సరైన ఆహారం. ఆర్నెల్ల తర్వాత నెయ్యీ పప్పూతో గుజ్జుగుజ్జుగా కలిపిన అన్నం గోరుముద్దలతోనూ, గుజ్జుగా నలిపే పండ్ల బువ్వతో క్రమంగా ఘనాహారమంటూ అలవాటు చేయడాన్ని ఇంగ్లిష్‌లో 'వీనింగ్' అంటారు. ఇలా చేస్తూ కూడా ఏడాది ఏడాదిన్నర వరకూ పాలు పడుతూనే ఉండవచ్చు. డాక్టర్ చెప్పిన ఏ కారణాల వల్లనో లేదా బిడ్డకు సరిపడా పాలు తల్లికి పడకనో ఆపేయాల్సి వస్తే... అందుకు అనేక కారణాలుండవచ్చు. అందుకే అదేదో నిష్ఠూరంగా ఎలా పడితే అలా మాట్లాడాల్సిన మాట కాదు.

***

"బిడ్డ బరువు సరిగా పెరుగుతున్నట్టుగా లేదు... పాలు సరిగా పట్టడం లేదా?"

– పెత్తనం చేస్తున్నట్టుగా పెదవి దాటించే ఓ పెద్దావిడ ఆరా!

బిడ్డకు పాలు సరిపోయాయంటే... కడుపు నిండిన వెంటనే పాపాయి కనీసం గంటా గంటన్నరపాటు నిద్రపోతుంది. పాలు తాగాక కనీసం గంటసేపైనా పాపాయి పడుకుందంటే చిన్నారికి కడుపు నిండినట్టే లెక్క. కొందరు బిడ్డలు కాస్త పీలగా ఉండొచ్చు. అందరూ బొద్దుగానే ఉండరు కదా. అలా చూసి... ఇలా నిష్ఠూరాలు ఆడకూడదు. మొదట్లో ఒకవైపు పాలు తాగడానికి బిడ్డకు 20 నిమిషాల నుంచి 25 నిమిషాలూ పట్టవచ్చు. పాలు తాగే నైపుణ్యం పెరుగుతున్నకొద్దీ పాపాయి 5 – 10 నిమిషాల్లోనే పాలు తాగేస్తుంటుంది. అయితే... పాలు పట్టేటప్పుడు మొదట వచ్చే పాలను ఫోర్ మిల్క్ అంటారు. అందులో నీటి మోతాదు ఎక్కువగా ఉంటుంది. అది తాగేశాకే హైండ్ మిల్క్ అనే పాలొస్తాయి. ఇందులో బిడ్డ పెరుగుదలకు కావాల్సిన కొవ్వులు ఎక్కువగా ఉంటాయి. అవన్నీ కొవ్వులే అయినా పాప ఒంటికి హాయిగా పట్టేలా చేస్తుంది ప్రకృతి.

కొత్త తల్లితో కినుక మాటలు ఎందుకు మాట్లాడకూడదంటే...

కొత్త తల్లికి అంతా కొత్తే. కొంగులో బంగారు బిడ్డతో కొత్త తల్లికి అసలే కంగారు. పాప పుట్టే సమయంలో అనుభవించే వేదనతో కొన్నిసార్లు పాపపై కోపం వచ్చేలాంటి 'పోస్ట్‌పార్టమ్ బ్లూస్' వర్కవుట్ అవుతూ ఉంటాయి. అవి క్రమంగా తగ్గుతుండే సమయంలో ఇలాంటి నిష్ఠూరాలతో అమ్మమనసుకు కష్టం కలిగిస్తాయి. అలాంటి వ్యాఖ్యలు ఆమెను మానసికంగా దెబ్బతీసి గిల్ట్‌ను నింపవచ్చు. మొదటే తెలియని తనం... అసలే అనుభవలేమి... పైగా ఇలాంటి మాటలు!! వీటితో ఆమెలో ఆత్మస్థైర్యం, ఆత్మవిశ్వాసం దెబ్బతింటే ఇంకా ఇంకా సమస్యలు రావచ్చు. అందుకే అలాంటిలాంటి అనుచిత వ్యాఖ్యలు వద్దంటూ సూచిస్తున్నారు సైకియాట్రిస్టులు, సైకాలజిస్టులు.

హార్ట్ ఆఫ్ లివింగ్

యాసీన్

అదేదో సినిమాలో ''హ్యాపీ ఫ్రెండ్‌షిప్ డే రా చారీ'' అంటూ బ్రహ్మానందం విష్ చేయగానే ''నేను మీకు ఫ్రెండేమిటి గురువుగారూ'' అంటాడు జూ. ఎన్టీఆర్ కాస్తంత గురుగౌరవ భావంతో. దానికి బ్రహ్మానందం మళ్లీ ''ఫ్రెండ్‌షిప్‌కు ఏజ్ లిమిటేదీ ఉండదురా'' బదులిస్తాడు.

అవును. ఫ్రెండ్‌షిప్‌కు వయసుపరంగా చిన్నా పెద్దా అనే ఏజ్ లిమిటు లేనట్టే... సైజు పరంగా కూడా చిన్నా పెద్దా తేడా ఉండదు. అందుకే శ్రీరాముడంతటి వాడికి భక్తితో ఉడత హెల్ప్ చేస్తే... ''నాకే హెల్ప్ చేశావంటే నీ ఫ్రెండ్షిప్ మామూలుది కాదూ... నీ ఫ్రెండ్షిప్పూ, నా ఫ్రెండ్షిప్పూ లోకానికి ఎప్పటికీ తెలియాలం''టూ దానికి వీపు మీద పర్మనెంట్ ఫ్రెండ్షిప్ బ్యాండ్‌ను వదిలాడు. అదేంటో గానీ శ్రీరామచంద్రుడికి టాప్ టు బాటమ్... సుగ్రీవుడు మొదలుకొని ఉడత వరకు ఎందరో ఫ్రెండ్సు.

పాపం... అంత ఫ్రెండ్షిప్ చేస్తే అర్జునుడికి భగవద్గీత... ఒక్కటే 'గీత'!

కానీ చిన్న హెల్ప్‌తో పెద్ద క్రెడిట్ కొట్టేసిన ఉడుతగారికి మాత్రం మర్యాదాపురుషోత్తముడి నుంచి మాంచి మార్కింగ్‌లైన్స్ 'మూడు గీతలు'!!

***

స్నేహం గొప్పదనాల ఉదంతాలకూ... స్నేహం ఔన్నత్యాల గురించి 'నేస్తమ... నేస్తమా' లాంటి పాటలకూ... కర్ణ సుయోధన, కృష్ణకుచేల, పార్థుడూ ఆయన సారథీ లాంటి స్నేహ తార్కాణాలకు కొదవేవీ లేదు.

స్నేహభావన గొప్పది కాబట్టే మొదట... తెలివితేటల కంటే ముందుగా 'చెలిమి' చేతలనూ... నెనరు–నెయ్యాలనూ... కూరిమి–పేరిమిలనూ, మమతా–మైత్రీ భావాలను జీవుల పరిణామానికి ముందునుంచే సృష్టించి పెట్టిందేమో ప్రకృతిమాత! అదెలాగంటారా...

- ఆక్సిజనూ... కార్బన్ డై యాక్సైడ్ ఇచ్చిపుచ్చుకుంటూ మొక్కలూ, జంతువులూ...
- పండ్లూ ఫలాలూ ఇచ్చుకుంటూ చెట్టుచేమలూ... ఫారెస్టు యానిమల్సూ...
- పూల తేనెతేటల ఊటలు పంచుకుంటూ హనీబీలూ–బటర్‌ఫ్లైసూ..

ఇలా ప్రకృతి నిండా బడ్డీస్ అండ్ 'బ్రో'లే!

***

పురాణాలూ... ప్రకృతీ వదిలేసి పిక్చర్లూ మూవీలకు వద్దాం.

ఎందుకంటే... పురాణాలూ ప్రకృతీ లాంటి సీరియస్ వ్యవహారాలు కాస్త భారంగా ఉంటాయి కాబట్టి... జనాల ట్రెండును నిర్దేశించేవీ, సమాజానికి అద్దం పట్టేవైన సినిమాలతోనే మొదలుపెట్టాం కాబట్టి... వాటితోనే ముగిద్దాం.

అప్పట్లో... మిస్సమ్మ మొగుడు ఎన్టీ రామారావు పక్కనే రేలంగీ...

అడవిరాముడి పక్కనే ఉండి నవ్విస్తుండే రాజబాబూ...

సినీ మధ్యయుగాన... అనేక మంది హీరోల స్క్రీన్‌మేటు బ్రహ్మానందం...

ఇప్పటి ట్రెండుకు తగ్గట్టు మహేశ్‌బాబు 'మహర్షి' అయితే పాల్ అల్లరి నరేషూ

అదే మహేషు 'శ్రీమంతుడై'పోతే పక్కనుండే ఫ్రెండే వెన్నెల కిషోరూ...

అంతెందుకు... ఎర్ర గంధపు చెక్క పుష్పరాజ్ గాడి వెంట ఎప్పుడూ వెన్నంటి ఉండే మంచి ఫ్రెండ్షిప్పు తురుపు ముక్క కేశవ...

సినిమాలో ఫ్రెండనే ఫార్ములా సూపర్ డూపర్ బంపర్ హిట్టైతే...

జీవితంలో ఫ్రెండ్సంటే కామన్‌మేన్ కరేజ్‌కు తోడుండే పెద్ద జట్టు.

హ్యాపీ ఫ్రెండ్షిప్ డే...

ఉద్యమ స్నేహం



ఉద్యమ నేపథ్యమే వారి స్నేహానికి విత్తనమయింది. వృక్షం అయింది. స్వీడిష్ పర్యావరణ ఉద్యమకారిణి గ్రేటా థన్‌బర్గ్‌కు తోటి ఉద్యమకారులు మలాలా యూసఫ్‌జాయ్, వెనెస్సా నకేట్‌లతో మంచి స్నేహం ఉంది. ఉద్యమకారులైనంత మాత్రాన గంభీరంగా ఉండాలని ఏమీ లేదు. ఈ ముగ్గురు మరికొందరు యాక్టివిస్ట్‌లు చాలా సరదాగా ఉంటారు.

బాల్యజ్ఞాపకాల నుంచి సోషల్ మీడియా సరదాల వరకు ఎన్నో విషయాలను షేర్ చేసుకుంటారు.

'చైతన్యం మూర్తీభవించిన స్నేహితురాలు' అని ఉగాండ పర్యావరణ ఉద్యమకారిణి వెనెస్సా నకేట్ గురించి గొప్పగా చెబుతుంది గ్రేటా థన్‌బర్గ్.

ఆక్స్‌ఫర్డ్ యూనివర్శిటీలోని లేడీ మార్గరెట్ హాల్‌లో ఉపన్యాసం ఇవ్వడానికి వెళ్లిన గ్రేటా థన్‌బర్గ్‌కు తన నేస్తం మలాలాతో కలిసి బోలెడు ముచ్చట్లు చెప్పుకోవడం ఎంతో సంతోషాన్ని ఇచ్చింది.

'షీ ఈజ్ ది ఓన్లీ ఫ్రెండ్...' అనే కాప్షన్‌తో గ్రేటాతో దిగిన ఫోటోను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసింది మలాలా.

'నైంటీస్ స్కూల్' ఫ్రెండ్స్

'అప్పుడెప్పుడో కలిసి నటించాం. ఇక అంతే. పెద్దగా మా మధ్య కమ్యూనికేషన్ లేదు' అన్నట్లుగా ఉండరు నైంటీస్ టాలీవుడ్, కోలివుడ్ స్టార్స్. ఇప్పటికీ బెస్ట్‌ఫ్రెండ్స్‌గానే ఉన్నారు. వీరి రీయూనియన్ ఎక్కడో ఒకచోట జరుగుతుంటుంది. ప్రతి సంవత్సరం ఒక డ్రెస్‌కోడ్ పాటిస్తారు. ఈసారి వీరి రీయూనియన్‌కి గోవా కేంద్రం అయింది. జగపతిబాబు, శ్రీకాంత్, మీనా, సిమ్రాన్, శ్వేత మీనన్, సంగీత, ఊహ, ప్రభుదేవ, దర్శకులు శంకర్, కె.ఎస్.రవికుమార్, లింగుస్వామి. మోహన్‌రాజాలాంటి వారు ఈ రీయూనియన్ వేడుకలో భాగం అయ్యారు. 'మెమొరీస్ మేడ్. నైంటీస్ రీయూనియన్' కాప్షన్‌తో బోలెడు ఫోటోలను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసింది మీనా.



ఒకప్పుడు స్కూల్లో చదువుకున్న ఫ్రెండ్స్ చాలాకాలం తరువాత కలుసుకున్నప్పుడు... కబుర్లే, కబుర్లు. నవ్వులే నవ్వులు! 'ఆ రోజు షూటింగ్‌లో నువ్వు ఎన్ని టేకులు తీసుకున్నావో...' అని ఒకరు అనేలోపే, మరొకరు 'నువ్వు మాత్రం తక్కువ తిన్నావేమిటీ. నన్ను మించిపోయావు' అని మరొకరు అనగానే... నవ్వులే నవ్వులు! 'అచ్చం ఆరోజుల్లాగే ఉన్నావు. ఏమిటీ నీ ఫిట్‌నెస్ మంత్రా' అని ఒకరు మరొకరిని అడగగానే అందరూ సైలెంటైపోయి అతడు/ఆమె చెప్పే ఫిట్‌నెస్ రహస్యాలను శ్రద్ధగా వింటారు. పిల్లల చదువు. కెరీర్ నుంచి తమ కెరీర్ వరకు ఈ రీయూనియన్‌లో ఎన్నో విషయాలు ప్రస్తావనకు వస్తాయి. ఒక్కముక్కలో చెప్పాలంటే 'నైంటీస్ స్కూల్'లోని సినీ స్నేహితుల సందడి ఇది.

స్నేహ వాక్యం



ఒకరినొకరు అర్థం చేసుకోవడం, పరస్పర గౌరవం అనే పునాదిపైనే స్నేహం నిలబడుతుంది.
– స్వామి వివేకానంద



స్నేహం అనేది ఒకరి వ్యక్తిత్వానికి, ఆత్మ జ్ఞానానికి అద్దం లాంటిది.
– రామకృష్ణ పరమహంస

స్నేహం అనేది స్కూల్‌లో నేర్చుకునేది కాదు. స్నేహం ఇంటే ఇది' అని వివరించడం కష్టమైన పని. అయితే స్నేహం గురించి తెలుసుకోలేని వారు ఏమీ తెలుసుకోలేరు. ఏమీ నేర్చుకోలేరు.
– మహమ్మద్ అలీ, ప్రఖ్యాత బాక్సర్, సామాజిక కార్యకర్త




పరిపూర్ణ వ్యక్తులు మాత్రమే మీ స్నేహితులుగా ఉండాలని ఆశించకండి. వారిని పరిపూర్ణ వ్యక్తులుగా తీర్చిదిద్దడంలో సహాయపడండి. నిజమైన స్నేహం అంటే అదే!
– మదర్ థెరెసా



అద్దం నా నిజమైన ఫ్రెండ్. ఎందుకంటే నేను ఏడ్చినప్పుడు అది నవ్వదు.
– చార్లీ చాప్లిన్





స్నేహం అంటే రెండు శరీరాల ఒకే ఆత్మ
– మెన్సియస్, చైనా తత్వవేత్త



స్నేహం అంటే స్వచ్ఛమైన ప్రేమ
– ఓషో

హెల్త్

అరుదైన 'స్ట్రోక్'తో...
మెడుల్లాపై దాడి!



డాక్టర్ శైలేష్ మోడి
సీనియర్ న్యూరాలజిస్ట్
విశాఖపట్నం

స్ట్రోక్ అంటే మనకు తెలిసింది మెదడుకు వచ్చే బ్రెయిన్ స్ట్రోక్. అయితే చిన్నప్పట్నుంచీ మనం చదువుకున్న మెదడులోని భాగాలైన పెద్ద మెదడు, చిన్న మెదడు, మెడుల్లా అబ్లాంగేటాలలో... మెడుల్లా అనే భాగానికి కూడా స్ట్రోక్ వచ్చే అవకాశముంది. ఆ భాగానికి స్ట్రోక్ వచ్చినప్పుడు కలిగే కొన్ని నరాల మార్పుల (న్యూరలాజికల్ కండిషన్స్) వల్ల దేహంలోని ఓ పక్క భాగం (అంటే లాటరల్ భాగం) అచేతనమైపోయే అవకాశం ఉంది. ఇలా మెదడులోని మెడుల్లా అనే భాగానికి వచ్చే స్ట్రోక్ వల్ల కలిగే మార్పుల కారణంగా కళ్లు తిరుగుతున్నట్లు ఉండటం (డిజ్జీనెస్), సరిగా నిలబడలేకపోవడం, గుటక వేయలేకపోవడం వంటి లక్షణాలతో కనిపించే ఈ అనారోగ్యాన్ని 'ల్యాటరల్ మెడుల్లరీ సిండ్రోమ్' అంటారు. ఈ సమస్యపై అవగాహన కోసమే ఈ కథనం.

ల్యాటరల్ మెడుల్లరీ సిండ్రోమ్ అనే ఈ సమస్య... సాధారణంగా మెదడుకు రక్తాన్ని సరఫరా చేసే పోస్టీరియర్ ఇన్‌ఫీరియర్ సెరెబెల్లార్ ఆర్టరీ (పీఐసీఏ)లో రక్తప్రవాహం ఆగడం వల్ల వస్తుంది. దాంతో మెడుల్లా (బ్రెయిన్ స్టెమ్)లోని ఒక పక్క భాగం (పార్శ్వం) ప్రభావితమవుతుంది.

ఇవీ లక్షణాలు... ● బాధితులకు నొప్పి, వేడిమి, ఉష్ణబాధలు తెలియకపోవడం ● బాలెన్స్ కోల్పోవడం, నడుస్తున్నప్పుడు సరైన రీతిలో నడవలేకపోవడం (గెయిట్ సరిగా లేకపోవడం) ● తల, కళ్లు తిరుగుతుండటం ● గుటకవేయలేకపోవడం, గొంతు బొంగురుపోవడం, మాట ముద్దముద్దగా రావడం. (మెదడులోని మింగే వ్యవస్థనూ, మాట్లాడే కేంద్రాన్ని నియంత్రించే 'న్యూక్లియస్ యాంబిగస్' అనే భాగం ఆయా వ్యవస్థలపై అదుపు కోల్పోవడంతో ఈ పరిణామం సంభవిస్తుంది) ● కను రెప్ప దానంతట అదే వాలిపోవడం, కనుపాప దగ్గరగా ముడుచుకోవడం (ప్యూపిల్ కన్‌స్ట్రిక్షన్), కొన్నిసార్లు కళ్లు (నల్లగుడ్డు) వాటంతటవే కదుతుండటం ● కొందరిలో వికారం, వాంతులు, ఎక్కిళ్లు.

కారణాలు... ● మెదడులోని కొన్ని భాగాలకు రక్తం అందించే ధమనులు గట్టిబారిపోయి సన్నబడటం లేదా ఆ గోడల్లో పగుళ్లు రావడం వల్ల ● మెడను సరిగా ఉపయోగించకుండా రఫ్‌గా వాడినప్పుడు అక్కడి వర్టెబ్రల్ ఆర్టరీస్‌లో పగుళ్లు రావడం వల్ల లేదా మార్ఫాన్స్ సిండ్రోమ్, ఎహ్లెర్‌–డ్యాన్లస్ సిండ్రోమ్, ఫైబ్రోమస్క్యులార్ డిస్‌ప్లేసియా (రక్తనాళాల లోపలివైపున కణాలు పెరగడం వల అవి సన్నబారిపోవడం) వంటి కారణాలతో ఈ సమస్య వస్తుంది. అయితే మిగతా కారణాలతో పోలిస్తే ఈ అంశాలు చాలా అరుదు.

నిర్ధారణ... మెదడు ఎమ్మారై ద్వారా అలాగే లక్షణాలను బట్టి దీన్ని నిర్ధారణ చేస్తారు. అయితే చాలా సందర్భాల్లో నిర్ధారణ సరిగా జరగక... ఈ సమస్యను ఇతర సమస్యగా పొరబడటం జరుగుతుంటుంది. ప్రధానంగా వికారం, వాంతులు, తలతిరగడం, కళ్లుతిరగడం వంటి లక్షణాలను బట్టి దీన్ని ఈఎన్‌టీ సమస్యగా పొరబడుతుంటారు.

చికిత్స... స్ట్రోక్ అనేది ఈ తరహాదైనప్పటికీ దానికి అత్యంత త్వరగా చికిత్స అందడం అవసరం. అప్పుడే వీలైనంత తక్కువ నష్టం జరుగుతుంటుంది. ఈ తరహా స్ట్రోక్ మొదలుకొని అది ఎలాంటిదైనప్పటికీ వీలైనంత త్వరగా హాస్పిటల్‌కు తీసుకురావాలి. బాధితుల్ని కనీసం మూడు నుంచి నాలుగు గంటల లోపు తీసుకొస్తే డాక్టర్లు థ్రాంబోలిటిక్ థెరపీ (అంటే ధమనుల్లో రక్తసరఫరాను పునరుద్ధరించేందుకు ఇంజెక్షన్ ద్వారా మందును ఇచ్చే చికిత్స)ని బాధితులకు అందించడానికి ప్రయత్నిస్తారు. ఇదే కాకుండా కొన్ని సందర్భాల్లో కొందరికి 'మెకానికల్ థ్రాంబెక్టమీ' అనే (రక్తనాళాల్లో పేరుకుపోయిన క్లాట్‌ను తొలగించడానికి చేసే) శస్త్రచికిత్సతో పరిస్థితిని చక్కబరుస్తారు.

ఇటీవల ఈ సమస్యపట్ల కొంత అవగాహన పెరగడంతో మునపటిలా కాకుండా సంబంధిత చికిత్సలు సత్వరమే జరుగుతున్నాయి.

అయితే ముందుగా చెప్పినట్లుగా థ్రాంబోలిటిక్ థెరపీ చేయడానికి అవకాశం లేకుండా కాస్తంత ఆలస్యంగా వచ్చినవారికి క్లాట్స్ ఏర్పడకుండా ఉంచేందుకు రక్తం గడ్డకట్టి ఉండలుగా మారకుండా యాంటీ ప్లేట్‌లెట్ ఏజెంట్స్‌ను ఇవ్వడం, రక్తపోటు (బీపీ) అదుపులో ఉంచడం, కొలెస్ట్రాల్ వంటి కొవ్వులను తగ్గించడం, రక్తాన్ని పలచబరిచేలా యాంటీ కోయాగ్యులెంట్స్ ఇవ్వడం వంటి మేనేజ్‌మెంట్ చికిత్సలూ అవసరమవుతాయి.

రీ–హ్యాబిలిటేషన్... ఇక్కడ పేర్కొన్నవే కాకుండా బాధితులు కోలుకునేందుకు వీలుగా ఫిజియో వంటి 'రీ–హ్యాబిలిటేషన్' వంటి కాస్త సుదీర్ఘ చికిత్సలతో పాటు బ్యాలెన్స్‌డ్‌గా నడక ప్రాక్టీస్ చేయించడం, మాట ముద్దగా వస్తున్న వారికి స్పీచ్ థెరపీ వంటివి కూడా అవసరమవుతాయి.

భవిష్యత్తు ఆశారేఖలివి... ఇప్పుడున్న మందులు కాకుండా న్యూరో ప్రొటెక్టివ్ మెడిసిన్, స్టెమ్‌సెల్ చికిత్సల వంటి వాటిపైనా విస్తృతంగా పరిశోధనలు జరుగుతున్నాయి.

ఈ లక్షణాలతో స్ట్రోక్‌ను గుర్తించి వీలైనంత త్వరగా బాధితులను హాస్పిటల్‌కు తరలించడం వల్ల బ్రెయిన్ స్ట్రోక్ వల్ల జరిగే నష్టాన్ని వీలైనంతగా తగ్గించవచ్చు.



ఆఖరి పోరులో గెలవాలన్నా... సిరీస్‌ను సమం చేయాలన్నా... ఇప్పుడు భారత్ భారమంతా బౌలర్లమీదే ఉంది. బ్యాట్ పట్టి అర్ధశతకాలతో రెండో ఇన్నింగ్స్‌లో నిలబెట్టిన బౌలర్లే... ఇప్పుడు 9 వికెట్లు తీస్తే 2–2తో 'అండర్సన్–టెండూల్కర్ ట్రోఫీ' సిరీస్‌ను సమం చేసిన గర్వంతో భారత్ స్వదేశానికి బయల్దేరుతుంది. ఇదే జరిగితే టీమిండియా టెస్టుల భవిష్యత్తుకు ఇక ఏమాత్రం ఢోకా ఉండదు. ఈ ఫార్మాట్ నుంచి స్టార్ బ్యాటర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి తప్పుకోవడంతో డీలాపడిన టెస్టు జట్టుకు నూతనోత్సాహాన్ని ఇంగ్లండ్ పర్యటన ఇచ్చినట్లు అవుతుంది. భారత్ నిర్దేశించిన 374 పరుగుల విజయలక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన ఇంగ్లండ్ ఆట ముగిసే సమయానికి 13.5 ఓవర్లలో ఒక వికెట్ కోల్పోయి 50 పరుగులు చేసింది. మరో రెండు రోజుల ఆట మిగిలి ఉన్న ఈ మ్యాచ్‌లో ఇంగ్లండ్ గెలవాలంటే మరో 324 పరుగులు చేయాలి. భారత్ నెగ్గాలంటే మరో 9 వికెట్లు పడగొట్టాలి. మొత్తానికి సిరీస్‌లోని చివరి టెస్టులోనూ ఫలితం రావడం ఖాయమైంది.

పోరాడి ఓడిన తరుణ్



మకావ్: కెరీర్‌లో తొలిసారి వరల్డ్ టూర్ సూపర్–300 బ్యాడ్మింటన్ టోర్నీలో ఫైనల్ చేరే అవకాశాన్ని భారత షట్లర్, హైదరాబాద్ ప్లేయర్ తరుణ్ మన్నేపల్లి చేజార్చుకున్నాడు. మకావ్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–300 టోర్నీలో తరుణ్ పోరాటం సెమీఫైనల్లో ముగిసింది. శనివారం జరిగిన పురుషుల సింగిల్స్ సెమీఫైనల్లో ప్రపంచ 47వ ర్యాంకర్ తరుణ్ 21–19, 16–21, 16–21తో ప్రపంచ 45వ ర్యాంకర్ జస్టిన్ హో (మలేసియా) చేతిలో పోరాడి ఓడిపోయాడు. భారత్‌కే చెందిన లక్ష్య సేన్ కూడా సెమీఫైనల్ అడ్డంకిని దాటలేకపోయాడు. లక్ష్య సేన్ 16–21, 9–21తో అల్వీ ఫర్హాన్ (ఇండోనేసియా) చేతిలో ఓటమి చవిచూశాడు. సెమీఫైనల్లో ఓడిన తరుణ్, లక్ష్య సేన్‌లకు 5,365 డాలర్ల (రూ. 4 లక్షల 68 వేలు) చొప్పున ప్రైజ్‌మనీతోపాటు 4900 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. జస్టిన్‌తో 81 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో తరుణ్ తొలి గేమ్‌ను దక్కించుకున్నా... ఆ తర్వాత అదే జోరును కొనసాగించలేకపోయాడు. ఈ గెలుపుతో ఇటీవల థాయ్‌లాండ్ ఓపెన్ తొలి రౌండ్‌లో తరుణ్ చేతిలో ఎదురైన ఓటమికి జస్టిన్ హో బదులు తీర్చుకున్నాడు. 24 ఏళ్ల తరుణ్ గతేడాది డిసెంబర్‌లో ఒడిశా మాస్టర్స్–100 టోర్నీలో రన్నరప్‌గా నిలువగా... సెయింట్ డెనిస్ రీయూనియన్ ఓపెన్ ఇంటర్నేషనల్ చాలెంజ్ టోర్నీలో టైటిల్ సాధించాడు.

దివ్యకు రూ. 3 కోట్ల నజరానా



నాగ్‌పూర్: మహిళల చెస్ ప్రపంచకప్ టైటిల్ గెలిచిన భారత క్రీడాకారిణి దివ్య దేశ్‌ముఖ్‌కు మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ రూ. 3 కోట్ల నగదు బహుమతిని అందించారు. జార్జియాలో ఇటీవల జరిగిన వరల్డ్‌కప్ ఫైనల్లో భారత స్టార్ కోనేరు హంపిపై 'టైబ్రేక్'లో నెగ్గి చాంపియన్‌గా అవతరించిన 19 ఏళ్ల దివ్యను శనివారం ఏర్పాటు చేసిన పౌర సన్మాన కార్యక్రమంలో ఫడ్నవీస్ ప్రత్యేకంగా అభినందించారు. నాగ్‌పూర్‌కు చెందిన దివ్య యావత్ దేశాన్ని గర్వపడేలా చేసిందని ఫడ్నవీస్ అన్నారు. చిన్న వయసులోనే పెద్ద ఘనత సాధించిన దివ్యను సత్కరించడం ఆనందంగా ఉందని వెల్లడించారు. ఈ సందర్భంగా దివ్య మాట్లాడుతూ... 'ఇది నాకు ప్రత్యేకమైన సందర్భం. చిన్నారులకు స్ఫూర్తిగా నిలవడంలో భాగమైనందుకు ఆనందంగా ఉంది. సహకరించిన ప్రభుత్వానికి ధన్యవాదాలు' అని వెల్లడించింది. ఇదే కార్యక్రమంలో మహారాష్ట్ర చెస్ సంఘం దివ్యకు రూ. 11 లక్షల నజరానా అందించింది. ఒక్క జీఎం నార్మ్ కూడా లేకుండా ప్రపంచకప్ బరిలోకి దిగిన దివ్య... టైటిల్‌తో పాటు నేరుగా గ్రాండ్‌మాస్టర్ హోదా సైతం దక్కించుకుంది. మరోవైపు భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ భూషణ్ గవాయ్ శనివారం దివ్య దేశ్‌ముఖ్ ఇంటిని సందర్శించి... వరల్డ్‌కప్ టైటిల్ గెలిచిన సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. దివ్య కుటుంబంతో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్న చీఫ్ జస్టిస్... భవిష్యత్తులో దివ్య మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

9 తీస్తారా... సమం చేస్తారా?



జైస్వాల్ సెంచరీ సంబరం

గెలుపు భారమంతా భారత బౌలర్లపైనే

- ఇంగ్లండ్ విజయ లక్ష్యం 374
- ప్రస్తుతం రెండో ఇన్నింగ్స్‌లో 50/1
- రెండో ఇన్నింగ్స్‌లో భారత్ 396
- యశస్వి జైస్వాల్ శతకం
- ఆకాశ్‌దీప్, జడేజా, సుందర్ అర్ధ సెంచరీలు


లండన్: కేఎల్ రాహుల్, సాయి సుదర్శన్, శుబ్‌మన్ గిల్, కరుణ్ నాయర్... వీళ్లంతా స్పెషలిస్టు బ్యాటర్లు. కానీ కీలకమైన చివరి టెస్టులో బ్యాట్లెత్తారు. పేసర్ ఆకాశ్‌దీప్ సహా రవీంద్ర జడేజా, వాషింగ్టన్ సుందర్‌లు ప్రధానంగా బౌలర్లు. బౌలింగ్ ఆల్‌రౌండర్లు అయినా భారత బ్యాటింగ్ భారాన్ని మోశారు. ప్రధాన బ్యాటింగ్ బలగమే కనీసం 20 పరుగులైనా చేయలేకపోయిన చోటు ఈ ముగ్గురు అర్ధసెంచరీలతో అదరగొట్టారు. ఓపెనర్ యశస్వి జైస్వాల్ (118; 14 ఫోర్లు, 2 సిక్స్‌లు) సెంచరీ సాధించగా... ఆకాశ్‌దీప్, జడేజా, సుందర్ తమ విలువైన అర్ధశతకాలతో ఈ టెస్టులో పోరాడే స్కోరును జత చేశారు. దీంతో భారత్ రెండో ఇన్నింగ్స్‌లో 88 ఓవర్లలో 396 పరుగులు చేసింది. ఆకాశ్‌దీప్ (66; 12 ఫోర్లు), జడేజా (53; 5 ఫోర్లు), వాషింగ్టన్ సుందర్ (53; 4 ఫోర్లు, 4 సిక్స్‌లు) రాణించారు. ప్రత్యర్థి బౌలర్లలో జోష్ టంగ్ 5 వికెట్లు, అట్కిన్సన్ 3 వికెట్లు, ఓవర్టన్ 2 వికెట్లు తీశారు. అనంతరం లక్ష్యఛేదనకు దిగిన ఇంగ్లండ్ మూడో రోజు ఆట నిలిచే ముగిసే సమయానికి 13.5 ఓవర్లలో ఒక వికెట్ కోల్పోయి 50 పరుగులు చేసింది. క్రాలీ (14)ని సిరాజ్ బౌల్డ్ చేయగా, డకెట్ (34 బ్యాటింగ్; 4 ఫోర్లు) క్రీజులో ఉన్నాడు.

ఊహించని ఫిఫ్టీ...

ఓవర్‌నైట్ స్కోరు 75/2 శనివారం మూడో రోజు ఆట రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన భారత్‌కు, ఓపెనర్ జైస్వాల్‌కు ఆకాశ్‌దీప్ కొండంత అండగా నిలిచాడు. 'నైట్ వాచ్‌మన్'గా వచ్చిన ఆకాశ్‌దీప్ ఊహించని విధంగా ఆతిథ్య బౌలర్లను ఎదుర్కొన్నాడు. తొలిసెషన్‌లో తేలిగ్గానే అతని వికెట్‌ను దక్కించుకుందామనుకున్న ప్రధాన పేసర్లు అట్కిన్సన్, టంగ్‌లకు కొరకరాని కొయ్యగా మారాడు. మరోవైపు జైస్వాల్ కూడా అడపాదడపా బౌండరీలతో స్కోరుబోర్డును కదిలించాడు. మూడో వికెట్‌కు 100 పరుగులు జతయ్యాక 70 బంతుల్లో ఆకాశ్‌దీప్ టెస్టుల్లో తొలి ఫిఫ్టీని పూర్తి చేసుకున్నాడు. ఆ తర్వాతే జట్టు స్కోరు 177 వద్ద వెనుదిరిగాడు. వికెట్‌ను సమర్పించుకున్నాడు.

జైస్వాల్ 'శత'క్కొట్టినా...

రెండో సెషన్‌లో ఇంగ్లండ్ బౌలర్లు ప్రభావం చూపెట్టారు. గిల్ (11), కరుణ్ నాయర్ (17)లను అట్కిన్సన్ పెవిలియన్ చేర్చాడు. ఈ దశలో జైస్వాల్... జడేజా అండతో పరుగులు చక్కబెట్టాడు. ఈ క్రమంలో జైస్వాల్ టెస్టుల్లో ఆరో సెంచరీని 127 బంతుల్లో పూర్తిచేసుకున్నాడు. భాగస్వామ్యం బలపడుతుండగానే టంగ్... జైస్వాల్ వికెట్ తీసి దెబ్బకొట్టాడు. ధ్రువ్ జురేల్ (34; 4 ఫోర్లు)తో కలిసి జడేజా జట్టు స్కోరును 300 దాటించాడు. 304/6 స్కోరు వద్ద రెండో సెషన్ ముగిసింది. ఆఖరి సెషన్ మొదలైన కొద్దిసేపటి తర్వాత జురేల్ అవుటవ్వగా... జడేజా, సుందర్ టీమిండియాను నడిపించారు. జడేజా 71 బంతుల్లో అర్ధసెంచరీ పూర్తయిన వెంటనే వికెట్‌ను సమర్పించుకోగా, సుందర్ భారీ సిక్సర్లతో విరుచుకుపడ్డాడు. 39 బంతుల్లో మెరుపు ఫిఫ్టీని సాధించి స్కోరు పెంచే క్రమంలో అవుట్‌కావడంతో భారత్ ఇన్నింగ్స్ ముగిసింది.


సుందర్



ఆకాశ్‌దీప్


జడేజా

స్కోరు వివరాలు

భారత్ తొలి ఇన్నింగ్స్: 224; **ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్:** 247; **భారత్ రెండో ఇన్నింగ్స్:** జైస్వాల్ (సి) ఓవర్టన్ (బి) టంగ్ 118; రాహుల్ (సి) రూట్ (బి) టంగ్ 7; సాయి సుదర్శన్ (ఎల్బీడబ్ల్యూ) (బి) అట్కిన్సన్ 11; ఆకాశ్‌దీప్ (సి) అట్కిన్సన్ (బి) ఓవర్టన్ 66; శుబ్‌మన్ (ఎల్బీడబ్ల్యూ) (బి) అట్కిన్సన్ 11; నాయర్ (సి) స్మిత్ (బి) అట్కిన్సన్ 17; జడేజా (సి) బ్రూక్ (బి) టంగ్ 53; ధ్రువ్ జురేల్ (ఎల్బీడబ్ల్యూ) (బి) ఓవర్టన్ 34; సుందర్ (సి) క్రాలీ (బి) టంగ్ 53; సిరాజ్ (ఎల్బీడబ్ల్యూ) (బి) టంగ్ 0; ప్రసిధ్‌కృష్ణ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 26; **మొత్తం (88 ఓవర్లలో ఆలౌట్) 396. వికెట్ల పతనం:** 1–46, 2–70, 3–177, 4–189, 5–229, 6–273, 7–323, 8–357, 9–357, 10–396. **బౌలింగ్:** అట్కిన్సన్ 27–3–127–3, టంగ్ 30–4–125–5, ఓవర్టన్ 22–2–98–2, బెథెల్ 4–0–13–0, రూట్ 5–1–15–0. **ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్:** క్రాలీ (బి) సిరాజ్ 14; డకెట్ (బ్యాటింగ్) 34; ఎక్స్‌ట్రాలు 2; **మొత్తం (13.5 ఓవర్లలో వికెట్ నష్టానికి) 50. వికెట్ల పతనం:** 1–50. **బౌలింగ్:** ఆకాశ్‌దీప్ 5–1–15–0, ప్రసిధ్ 5–1–23–0, సిరాజ్ 3.5–0–11–1.

సాక్షి సినిమా




● రజనీకాంత్, నాగార్జున

కావాల్సింది... ఆ ఒక్క కూలీ!

'ఇక్కడున్న 14,400 మందిలో నాకు కావాల్సింది... ఆ ఒక్క కూలీ, వాడు మీకు నాన్న... కానీ నాకు ప్రాణ స్నేహితుడు, ఈ దేవా గురించి తెలిసి కూడా గేమ్స్ ఆడతావురా..' అనే డైలాగ్స్ 'కూలీ' సినిమా తెలుగు ట్రైలర్‌లో ఉన్నాయి. రజనీకాంత్ హీరోగా నటించిన తాజా చిత్రం 'కూలీ'. ఈ చిత్రంలో నాగార్జున, శ్రుతీహాసన్, సత్యరాజ్, ఉపేంద్ర, సౌబిన్ సాహిర్ ప్రధాన పాత్రల్లో నటించగా, ఆమిర్ ఖాన్ గెస్ట్ రోల్ చేశారు. లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో కళానిధి మారన్ నిర్మించిన ఈ చిత్రం ఆగస్టు 14న విడుదల కానుంది. ఏషియన్ మల్టీప్లెక్సెస్ సంస్థ ఈ సినిమాను తెలుగులో రిలీజ్ చేయనుంది. శనివారం ఈ సినిమా ట్రైలర్‌ను రిలీజ్ చేశారు.

ఫైర్ స్టార్మ్ అంటున్న శింబు!



● పవన్ కల్యాణ్

పవన్ కల్యాణ్ హీరోగా నటిస్తున్న చిత్రం 'ఓజీ'. సుజీత్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో ఇమ్రాన్ హష్మీ, ప్రియాంకా మోహన్, అర్జున్ దాస్, ప్రకాశ్ రాజ్, శ్రియా రెడ్డి కీలక పాత్రలు పోషిస్తున్నారు. డీవీవీ దానయ్య నిర్మిస్తున్న ఈ సినిమా సెప్టెంబర్ 25న విడుదల కానుంది. తమన్ సంగీతం అందించిన ఈ చిత్రం నుంచి 'ఫైర్ స్టార్మ్...' అంటూ సాగే తొలి పాటని శనివారం విడుదల చేశారు. ''ఓజీ' చిత్రంలో పవన్ కల్యాణ్ గ్యాంగ్‌స్టర్ పాత్రలో కనిపిస్తారు. తమన్ స్వరపరిచిన 'ఫైర్ స్టార్మ్..' పాటకి ప్రముఖ నటుడు శింబు శక్తివంతమైన గాత్రాన్ని అందించారు. విశ్వ, శ్రీనివాస్ మౌళి సాహిత్యం అందించిన ఈ పాటకి శాండి మాస్టర్ కొరియోగ్రఫీ చేశారు'' అని మేకర్స్ తెలిపారు.

గాంధీ తాత చెట్టు నాకు చాలా ప్రత్యేకం



● సుకృతి వేణి

ప్రముఖ దర్శకుడు సుకుమార్ కుమార్తె సుకృతి వేణి బండ్రెడ్డి ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'గాంధీ తాత చెట్టు'. పద్మావతి మల్లాది దర్శకత్వంలో తబితా సుకుమార్ సమర్పణలో నవీన్ ఎర్నేని, యలమంచిలి రవిశంకర్, శేష సింధూరావు నిర్మించిన ఈ సినిమా జనవరి 24న విడుదలైంది. కాగా శుక్రవారం ప్రకటించిన 71వ జాతీయ చలనచిత్ర అవార్డుల్లో ఉత్తమ బాలనటిగా సుకృతి వేణి బండ్రెడ్డి ('గాంధీ తాత చెట్టు') ఎంపికైన విషయం తెలిసిందే. అమెరికాలో ఉన్న ఆమె ఈ సందర్భంగా ఓ వీడియో విడుదల చేశారు. ''ఉత్తమ బాలనటిగా నన్ను ఎంపిక చేసిన జ్యూరీకి థ్యాంక్స్. 'గాంధీ తాత చెట్టు' నాకు చాలా ప్రత్యేకం.. ఎందుకంటే నా మొదటి సినిమా కాబట్టి. పద్దు, సింధు అక్కలకు, భాను, నేహాల్‌కి... ఇలా ఈ ప్రయాణంలో ఉన్న ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు. నా స్నేహితులకు, నా సపోర్టర్స్‌కి థ్యాంక్స్. ప్రత్యేకించి మా అమ్మ, నాన్నలకి థ్యాంక్స్'' అన్నారు.

ఇస్కితడి ఉస్కితడి...



● ఉదయభాను

సత్యరాజ్, 'సత్యం' రాజేశ్, ఉదయభాను, వశిష్ఠ ఎన్. సింహా, సాంచీ రాయ్ కీలక పాత్రలు పోషించిన చిత్రం 'త్రిబాణధారి బార్బరిక్'. మోహన్ శ్రీవత్స దర్శకత్వంలో మారుతీ టీమ్ ప్రొడక్ట్ సమర్పణలో విజయపాల్ రెడ్డి అడిదల నిర్మించిన ఈ సినిమా త్వరలో విడుదల కానుంది. ఇన్‌ఫ్యూజన్ బ్యాండ్ సంగీతం అందించిన ఈ సినిమా నుంచి 'ఇస్కితడి ఉస్కితడి...' అంటూ సాగే పాటని రిలీజ్ చేశారు. రఘురామ్ రాసిన ఈ పాటను రాహుల్ సిప్లిగంజ్ పాడారు. ఈ స్పెషల్ సాంగ్‌లో ఉదయ భాను నర్తించారు. ''సరికొత్త కథతో మైథలాజికల్ టచ్‌తో రూపొందిన చిత్రం 'త్రిబాణధారి బార్బరిక్'. 'ఇస్కితడి' పాటలో ఉదయ భాను స్టెప్పులు ప్రత్యేక ఆకర్షణ అవుతాయి'' అని యూనిట్ పేర్కొంది.

అభిమానుల కళ్లల్లో ఆనందం చూశాను

- విజయ్ దేవరకొండ



''కెరీర్ ప్రారంభంలో ఓ సినిమా హిట్ అయితే ఇంకో సినిమా చేసే అవకాశం వస్తుందనే ఆశ మాత్రమే ఉంటుంది. 'పెళ్ళి చూపులు' సినిమా హిట్ అయినప్పుడు ఇంకొన్ని అవకాశాలు వస్తాయని ఆనందపడ్డాను. కానీ, ఇప్పుడు అలా కాదు. సినిమా హిట్ అయితే ఆనందం కంటే కూడా మరిన్ని మంచి సినిమాలు చేయాలనే బాధ్యత ఎక్కువగా ఉంటుంది. 'కింగ్‌డమ్' రిలీజ్‌కి ముందు మా యూనిట్‌కి కాస్త ఒత్తిడి ఉండేది. మొదటి షో పూర్తయ్యి, పాజిటివ్ టాక్ రాగానే చాలా సంతోషం కలిగింది'' అని విజయ్ దేవరకొండ తెలిపారు. గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో విజయ్ దేవరకొండ హీరోగా నటించిన చిత్రం 'కింగ్‌డమ్'. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించిన ఈ సినిమా జూలై 31న విడుదలైంది. ఈ నేపథ్యంలో శనివారం విలేకరుల సమావేశంలో విజయ్ దేవరకొండ పంచుకున్న విశేషాలు.

● 'కింగ్‌డమ్' కథ విన్న తర్వాత పాత కాలంలో ఎలా మాట్లాడేవారు? ఎలాంటి దుస్తులు వేసుకునేవారు? వంటి విషయాలు తెలుసుకోవడం మొదలుపెట్టాను. రిఫరెన్స్ కోసం వెబ్ సిరీస్‌లు చూశాను. అలాగే లుక్ పరంగానూ మరింత దృఢంగా కనిపించే ప్రయత్నం చేశాను. ఈ సినిమాకి తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా ఓవర్సీస్‌లో, ఇతర రాష్ట్రాల్లో ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభిస్తుండటం చాలా సంతోషంగా ఉంది.

● అన్నదమ్ముల అనుబంధం నేపథ్యంలో గ్యాంగ్‌స్టర్ డ్రామా అని గౌతమ్ తిన్ననూరి 'కింగ్‌డమ్' ఐడియా చెప్పగానే ఆసక్తిగా అనిపించింది. హీరో పాత్ర, షాట్ కంపోజిషన్, మ్యూజిక్... ఇలా ప్రతి దాని మీద తను ఎంతో శ్రద్ధ తీసుకుంటాడు. 'కింగ్‌డమ్'లో ఏదో యాక్షన్ సన్నివేశం పెట్టాలి కదా అన్నట్టుగా ఎక్కడా పెట్టలేదు. దాని చుట్టూ బలమైన భావోద్వేగం ఉండేలా చూసుకున్నాడు. ఈ కథలో అన్నదమ్ముల అనుబంధం, దేశభక్తి, ఒక తెగకు చెందిన నాయకుడి గురించి ఉంటుంది. ఇన్ని అంశాలను ఒకే భాగంలో చెప్పడం సాధ్యం కాదు. అందుకే రెండు భాగాలుగా చెప్పాలని నిర్ణయించుకున్నాం. రెండవ భాగానికి సంబంధించి గౌతమ్ దగ్గర గొప్ప ఆలోచనలు ఉన్నాయి. రెండో భాగం ఇంకా అద్భుతంగా ఉంటుంది.

● 'కింగ్‌డమ్' పై ప్రేక్షకులు, అభిమానులు కురిపిస్తున్న ప్రేమే నా దృష్టిలో గొప్ప ప్రశంస. చాలా రోజుల తర్వాత నా అభిమానుల కళ్లల్లో ఆనందాన్ని చూశాను. అలాగే 'కింగ్‌డమ్' చూసిన సుకుమార్ గారు ఫోన్ చేసి, సినిమా బాగా నచ్చిందని చెప్పడం ఆనందాన్నిచ్చింది. 'అర్జున్ రెడ్డి' సమయం నుంచే నేను, సుకుమార్‌గారు కలిసి ఓ సినిమా చేయాలనుకుంటున్నాం. భవిష్యత్‌లో మా కలయికలో సినిమా వస్తుందని ఆశిస్తున్నాను.

● ఈ చిత్రంలో నేను షిప్ లాగే సన్నివేశాన్ని మే నెలలో మండుటెండలో చిత్రీకరించాం. అప్పుడు చాలా ఇబ్బంది పడ్డాం. అయితే ఓ మంచి సన్నివేశం చేస్తున్నామన్న సంతృప్తితో చేశాం. ఆ సన్నివేశం 'జెర్సీ' మూమెంట్ అని ప్రేక్షకులు గొప్పగా మాట్లాడటం చాలా సంతోషాన్నిస్తోంది. 'అర్జున్‌రెడ్డి'కి ఉత్తమ నటుడిగా అవార్డు తీసుకున్నప్పుడు గర్వంగా అనిపించింది. నాకు వచ్చిన అవార్డును వేలం వేస్తే రూ. 25 లక్షలు వచ్చాయి... వాటిని మంచి పనులకు ఉపయోగించాను. 'అర్జున్ రెడ్డి'కి నేను తీసుకున్న పారితోషికం రూ. 5 లక్షలు. అప్పట్లో అంత పెద్ద డబ్బుని నేను చూడటం అదే మొదటిసారి.

● నేను ఏ డైలాగ్ చెప్పినా తెలంగాణ యాసలో ఉందని అంటున్నారు. 'కల్కి'లో అర్జునుడి పాత్రధారిగా నాగ్ అశ్విన్ రాసిన డైలాగ్‌నే చెప్పాను. ఏం చేస్తాం.. దేవుడు నాకిచ్చిన గొంతు అది. అసలు అర్జునుడి మాతృభాష ఏంటి? ఎలా మాట్లాడతాడు? ఏమైనా రిఫరెన్స్‌లు ఉంటాయా? ప్రతి విషయంలోనూ యాస గురించి మాట్లాడితే నేనేం చెప్పను? నా తర్వాతి సినిమాల్లో రాయలసీమ, ఆంధ్ర యాసల్లో మాట్లాడనున్నాను. ప్రస్తుతం రాహుల్ సంకృత్యాన్ దర్శకత్వంలో ఓ సినిమా, రవి కిరణ్ కోలా దర్శకత్వంలో ఓ సినిమా చేస్తున్నాను.

నవ్వుని వాయిదా వేసుకోకూడదు

- సుధీర్ బాబు

''ప్రవీణ్ మంచి నటుడే కాదు... మంచి వ్యక్తి కూడా. అందరి మంచి కోరుకుంటాడు. 'బకాసుర రెస్టారెంట్' చిత్రంతో తను హీరోగా మారాడు. ఈ సినిమా తనకి మంచి బ్రేక్ తీసుకురావాలి. నవ్వుని ఎప్పుడూ వాయిదా వేయకూడదు. అందుకే వినోదం నేపథ్యంలో రూపొందిన ఈ చిత్రం విడుదలైన వెంటనే కుటుంబమంతా కలిసి చూడాలి'' అని హీరో సుధీర్ బాబు అన్నారు. హాస్య నటుడు ప్రవీణ్ హీరోగా నటించిన తొలి చిత్రం 'బకాసుర రెస్టారెంట్'. ఎస్‌జే శివ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో వైవా హర్ష టైటిల్ రోల్‌లో నటించారు. లక్ష్మయ్య ఆచారి, జనార్ధన్ ఆచారి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 8న రిలీజ్ కానుంది. ఈ చిత్రం ప్రీ రిలీజ్ వేడుకలో సుధీర్ బాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.



● జనార్ధన్ ఆచారి, రాజేశ్, ప్రవీణ్, సుధీర్ బాబు, ఎస్‌జే శివ

జనార్ధన్ ఆచారి మాట్లాడుతూ– ''ఈ సినిమాకు కథే హీరో. శివ చాలా బాగా తెరకెక్కించాడు. అందరికీ మా సినిమా నచ్చుతుందనుకుంటున్నాను. మా చిత్రాన్ని 'దిల్' రాజుగారి బ్యానర్ ఎస్వీసీ ద్వారా రిలీజ్ చేస్తున్నాం'' అని తెలిపారు. ఎస్‌జే శివ మాట్లాడుతూ– ''విరూపాక్ష' చిత్రానికి దర్శకత్వ శాఖలో చేశాను. నా కోసమే మా అన్నయ్య నిర్మాతగా మారి, ఈ సినిమా నిర్మించారు. అందరూ ఫ్యామిలీతో చూడదగ్గ సినిమా ఇది'' అని చెప్పారు. ''బకాసుర రెస్టారెంట్' అందరూ చూడాల్సిన ఎంటర్‌టైనర్ అండ్ ఎమోషనల్ ఫిల్మ్'' అన్నారు ప్రవీణ్. ఈ వేడుకలో కెమెరామేన్ బాల సరస్వతి, సంగీత దర్శకుడు వికాస్ బడిస, ఎగ్జిక్యూటివ్ నిర్మాత వినయ్ కొట్టి, నటి ప్రాచీ ఠాకూర్ తదితరులు పాల్గొన్నారు.

కల నెరవేరిన అనుభూతి కలుగుతోంది

- ఆనంద్ దేవరకొండ



● పీవీఎస్ఎన్ రోహిత్, సాయి రాజేశ్, వైష్ణవి, ఆనంద్, ఎస్‌కేఎన్

''బేబి' చిత్రం కోసం టీమ్ మొత్తం ప్రాణం పెట్టి పని చేశాం. మా చిత్రం జాతీయ అవార్డు గెల్చుకోవడం ఆనందంగా ఉంది. నా సినిమా పోస్టర్ మీద నేషనల్ అవార్డ్ విన్నర్ అనే పేరు చూడటంతో నా కల నెరవేరిన అనుభూతి కలుగుతోంది'' అని హీరో ఆనంద్ దేవరకొండ తెలిపారు. సాయి రాజేశ్ దర్శకత్వంలో ఆనంద్ దేవరకొండ, విరాజ్ అశ్విన్ హీరోలుగా, వైష్ణవీ చైతన్య హీరోయిన్‌గా నటించిన చిత్రం 'బేబి'. ఎస్‌కేఎన్ నిర్మించిన ఈ చిత్రం 2023 జూలై 13న విడుదలైంది. తాజాగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన జాతీయ అవార్డ్స్‌లో ఈ సినిమాకి ఉత్తమ స్క్రీన్ ప్లే రైటర్‌గా సాయి రాజేశ్, ఉత్తమ ప్లే బ్యాక్ సింగర్‌గా పీవీఎన్ఎస్ రోహిత్ జాతీయ అవార్డుకి ఎంపికయ్యారు. ఈ నేపథ్యంలో శనివారం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో సాయి రాజేశ్ మాట్లాడుతూ– ''బేబి' సినిమాకు ప్రతి ఒక్కరూ హీరోనే... అంతా ప్రాణం పెట్టి పని చేశారు. మాకు వచ్చిన బెస్ట్ స్క్రీన్ ప్లే అవార్డ్ మా ఎడిటర్ విప్లవ్‌గారికి కూడా చెందాలి. నన్ను ఎవరూ నమ్మని రోజు ఎస్‌కేఎన్ నమ్మినందుకు థ్యాంక్స్'' అని చెప్పారు. ''బేబి'లో 'ప్రేమిస్తున్నా...' పాటకి బెస్ట్ సింగర్‌గా జాతీయ అవార్డు అందుకోనుండటం సంతోషంగా ఉంది'' అని పీవీఎన్ఎస్ రోహిత్ పేర్కొన్నారు. ''బేబి'లో నేనూ భాగమైనందుకు చాలా హ్యాపీ'' అన్నారు వైష్ణవీ చైతన్య. ఎస్‌కేఎన్ మాట్లాడుతూ– ''బేబి'కి జాతీయ అవార్డులు రావడంతో మరిన్ని మంచి చిత్రాలు చేయాలనే బాధ్యత మాపై పెరిగింది'' అని చెప్పారు. నిర్మాత ధీరజ్ మొగిలినేని, ఎడిటర్ విప్లవ్, లిరిక్ రైటర్ సురేష్ బనిశెట్టి మాట్లాడారు.

క్లుప్తంగా...

యూఏఈకి ఉచిత వీసాలు

- 16న జగిత్యాల, 17న నిజామాబాద్‌లలో ఇంటర్వ్యూలు

మోర్తాడ్ (బాల్కొండ): యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) పరిధిలోని అబుదాబిలో ఉపాధి కల్పనకు ఉచిత వీసాల జారీకి ఏడీఎన్‌హెచ్, జీటీఎం సంస్థలు మరోసారి నియామకాల మేళా నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నాయి. ఈనెల 16న జగిత్యాలలో, 17న నిజామాబాద్‌లలో ఇంటర్వ్యూలను నిర్వహించనున్నారు. క్లీనింగ్ విభాగంలో పని కల్పించడానికి ఇంటర్వ్యూలను నిర్వహించనుండగా.. 21 ఏళ్లు నిండి, 38 ఏళ్లలోపు వయసున్న వారు ఈసీఎన్ఆర్ పాస్‌పోర్టు కలిగి ఉంటే నియామకాల మేళాకు హాజరు కావచ్చు. ఎంపికైన వారికి మన కరెన్సీలో రూ.22 వేల వేతనం ప్రతి నెలా చెల్లించనున్నారు. ఉచిత వసతి, ఉచిత భోజన సదుపాయాన్ని కల్పించనున్నారు. వివరాలకు ఆర్మూర్ (8332062299), సిరిసిల్ల (9347661522), నిజామాబాద్ (8686860999), జగిత్యాల్ (8332042299)లోని జీటీఎం సంస్థ శాఖలను సంప్రదించాలని సంస్థ చైర్మన్ చీటీ సతీశ్‌రావు వెల్లడించారు. ఉచిత వీసాలతో పాటు ఉచిత టికెట్ల కోసం నిర్వహిస్తున్న ఈ నియామకాల మేళాను నిరుద్యోగ యువకులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఎవరికి నయాపైసా చెల్లించాల్సిన అవసరం లేదని సతీశ్‌రావు స్పష్టం చేశారు.

కల్లు నిషేధిస్తే ఊరుకోం

- మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్



పంజగుట్ట (హైదరాబాద్): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం లిక్కర్ మాఫియాకు తలొగ్గి.. కల్లు నిషేధానికి ప్రయత్నిస్తోందని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఆరోపించారు. హైదరాబాద్‌లో అనధికారికంగా మూసిన కల్లు దుకాణాలను పది రోజుల్లో తెరిపించాలని.. లేనిపక్షంలో వేలాదిమందితో ఇందిరాపార్క్ వద్ద ధర్నా నిర్వహిస్తామని ఆయన హెచ్చరించారు. తెలంగాణలో కల్లుగీత వృత్తి సమస్యలపై శనివారం తెలంగాణ రాష్ట్ర గౌడ సమన్వయ వేదిక ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ .. గీతవృత్తిదారుల సంక్షేమానికి కేసీఆర్ ప్రభుత్వ హయాంలో తయారు చేసిన సేఫ్టీ మోకులను.. ఎన్నికల కోడ్ రావడంతో పంపిణీ చేయలేద న్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు.. జనగామ జిల్లాకు సర్దార్ సర్వాయి పాపన్న జిల్లాగా మార్చాలని కోరారు. ఆగస్టు 18న పాపన్న గౌడ్ జయంతి సందర్భంగా.. ట్యాంక్‌బండ్‌పై ఆయన విగ్రహానికి భూమిపూజ చేయాలని డిమాండ్ చేశారు.

రైతన్నకు సేవ చేయండి

వ్యవసాయ రంగ పట్టభద్రులకు గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ పిలుపు

- గ్రామీణ యువత పేదరికం నుంచి బయటపడేలా చేయూతనివ్వాలని సూచన
- జయశంకర్ విశ్వవిద్యాలయ 55వ స్నాతకోత్సవానికి హాజరు.. పట్టాల ప్రదానం



స్నాతకోత్సవంలో మాట్లాడుతున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

ఏజీ వర్సిటీ: వ్యవసాయ రంగంలో పట్టాలు అందుకుంటున్న యువ పట్టభద్రులు రైతులకు నిరంతర సేవలు అందించాలని రాష్ట్ర గవర్నర్, విశ్వవిద్యాలయ కులపతి జిష్ణుదేవ్ వర్మ పిలుపునిచ్చారు. శనివారం హైదరాబాద్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయ 55వ స్నాతకోత్సవంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత మహిళలు, యువత ఉపాధి పొంది పేదరికం నుంచి బయటపడేలా చేయూతనివ్వాలని కోరారు. దేశ గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంలో వ్యవసాయానిది ప్రధాన పాత్ర అన్నారు. 1965లో నాటి ప్రధాని లాల్‌బహదూర్ శాస్త్రి జాతికి అంకితం చేసిన ఈ విశ్వవిద్యాలయం బహుముఖాలుగా విస్తరించడం గర్వకారణమన్నారు. వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న సవాళ్లకు దీటుగా పనిచేస్తూ వర్సిటీ తన ప్రయాణాన్ని సాగిస్తోందని గవర్నర్ చెప్పారు. దేశంలోనే తొలిసారిగా పీజేటీఏయూ సెంటర్ ఫర్ డిజిటల్ అగ్రికల్చర్ ఏర్పాటు కావడం అభినందనీయమన్నారు. వర్సిటీ వీసీ జానయ్య మాట్లాడుతూ బోధన, పరిశోధన విస్తరణల్లో విశ్వవి ద్యాలయం బహుముఖ ప్రతిభ కనబరుస్తోందని పేర్కొన్నారు. దేశ, విదేశాలకు చెందిన ప్రముఖ సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకోవడం ద్వారా అగ్రిహబ్, ఇతర ల్యాబ్‌లను విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేశామని తెలిపారు. అనంతరం పీజీ, పీహెచ్‌డీ విద్యార్థులకు పట్టాల పంపిణీతోపాటు అత్యుత్తమ ప్రతిభ కనపరిచిన 30 మంది విద్యార్థు లకు బంగారు పతకాలను గవర్నర్ అందించారు. కంది అగ్రికల్చర్ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన భార్గవ అత్యధికంగా 6 బంగారు పతకాలు సాధించారు. స్నాతకోత్సవంలో ఐసీఏఆర్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ మంగీలాల్ జాట్, రిజిస్ట్రార్ విద్యాసాగర్, వర్సిటీ పాలక మండలి సభ్యులు, అధికారులు, పూర్వ వీసీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

4 యాప్‌లతో రూ. 300 కోట్లు హాంఫట్!

- రాష్ట్రంలో వెలుగులోకి మరో ఆన్‌లైన్ పెట్టుబడుల స్కాం
- ప్రధాన నిందితుడు అరెస్ట్.. పోలీసుల అదుపులో మరో నలుగురు



సాక్షి ప్రతినిధి, కరీంనగర్: రాష్ట్రంలో మరో ఆన్‌లైన్ పెట్టుబడుల కుంభకోణం వెలుగులోకి వచ్చింది. కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మంచిర్యాల, వరంగల్ తదితర జిల్లాల్లో నాలుగు క్రిప్టో కరెన్సీ యాప్‌ల ద్వారా కేటుగాళ్లు సుమారు రూ. 300 కోట్లు కొల్లగొట్టి జనాన్ని నిండా ముంచారు. ఈ వ్యవహారంలో పరారీలో ఉన్న ముంబైకి చెందిన ప్రధాన నిందితుడు హిమాన్ష్‌ను గత నెల 31న హైదరాబాద్‌లోని ఉప్పల్ పరిధిలో మేడిపల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. మరో నలుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. ముంబైకి చెందిన డాక్టర్ హిమాన్ష్ మొదట ఓ క్రిప్టో యాప్ ద్వారా సుమారు రూ. 150 కోట్ల మేర పెట్టుబడులు సేకరించాడు. ఆపై ఉన్నపళంగా దాన్ని మూసేసి దుబాయ్ పరారయ్యాడు. కొన్ని రోజులకు తిరిగివచ్చి ఇంకో యాప్‌లో సుమారు రూ. 130 కోట్ల మేర పెట్టుబడులు రాబట్టాడు. ఆ యాప్‌ను కూడా 6 నెలల క్రితం మూసేసి మళ్లీ దుబాయ్ చెక్కేశాడు. ఇటీవలే మళ్లీ వచ్చి ఇంకో యాప్ ద్వారా పెట్టుబడులు సేకరించాడు. పెట్టుబడి పెట్టిన వారిలో 40 మందిని ఇటీవలే విహార యాత్ర కోసం బ్యాంకాక్‌కు తీసుకెళ్లాడు. గత నెల 31న హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో పెట్టుబడిదారులతో సమావేశం నిర్వహిస్తుండగా మేడిపల్లి పోలీసులు హిమాన్ష్‌ను అరెస్ట్ చేశారు. కరీంనగర్‌కు చెందిన జమీల్, అనిల్, సిరిసిల్లకు చెందిన వంశీ, నిజామాబాద్‌కు చెందిన శ్రీనివాస్‌లను సైతం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పెట్టుబడుల సొమ్మును హిమాన్ష్ దుబాయ్ మళ్లించడంతో ఈ స్కాం వెనుక అంతర్జాతీయ ముఠా ప్రమేయం ఉందన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేపడుతున్నారు. నిందితులు నెక్స్‌బిట్ అనే క్రిప్టో కరెన్సీ యాప్ ద్వారా రూ. 19 కోట్లు సేకరించినట్లు సుమారు 400 మంది బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారంలో హిమాన్ష్‌కు రికీ ఫామ్ (ఫారిన్ ఆపరేటర్), అశోక్ శర్మ (థాయ్‌లాండ్ ఆపరేటర్), డీజే సొహైల్ (రీజినల్ రిక్రూటర్), మోహన్ (సహాయకుడు), అశోక్‌కుమార్ సింగ్ (హిమాన్ష్ సహాయకుడు) సహకరించినట్లు పోలీసులు గుర్తించారు. అలాగే హిమాన్ష్ గతంలో రిక్సోజ్ అనే క్రిప్టో యాప్‌ను నడిపించినట్లు కనుగొన్నారు. అయితే బాధితులు మాత్రం హిమాన్ష్ మరో రెండు యాప్‌లను సైతం నిర్వహించి తమను మోసగించారని ఆరోపిస్తున్నారు.

త్వరలో మెటా యాప్‌పైనా చర్యలు..

ఇదే తరహాలో కరీంనగర్, జగిత్యాల, సిరిసిల్లలో మెటా యాప్ పేరుతో రూ. 100 కోట్ల వరకు కొల్లగొట్టిన మెటా యాప్ నిర్వాహకులపైనా పోలీసులు దృష్టిపెట్టారు. దీనిపై ఇప్పటికే డీజీపీ కార్యాలయానికి ఫిర్యాదులు వెళ్లాయి. నిఘా వర్గాలు సైతం ఈ కేసులో సూత్రధారిగా ఉన్న లోకేశ్, ఓ మాజీ కార్పొరేటర్, ప్రకాశ్, రమేశ్, రాజు అనే వ్యక్తులపై పూర్తి వివరాలు సేకరించారు. లోకేశ్ ప్రస్తుతం దేశం విడిచి పరారయ్యాడని పోలీసులు నిర్ధారించుకున్నారని సమాచారం. ఈ కేసులో అరెస్టుల పర్వం మొదలైతే నిందితుడిని ఇండియాకు రప్పించడం ప్రహసనంగా మారనుంది.

డ్యూటీ మీట్‌ల వల్ల మెరుగైన పోలీసింగ్

- డీజీపీ జితేందర్



విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న డీజీపీ జితేందర్, సౌమ్యా మిశ్రా తదితరులు

సాక్షి, వరంగల్: డ్యూటీ మీట్‌ల ద్వారా పోలీసింగ్‌లో మరిన్ని మెళకువలు వస్తాయని డీజీపీ జితేందర్ అన్నారు. వరంగల్ జిల్లా మామునూరు పోలీస్ ట్రెనింగ్ సెంటర్‌లో శనివారం జరిగిన రెండో తెలంగాణ పోలీస్ డ్యూటీ మీట్ ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. డ్యూటీమీట్‌లో జరిగిన పోటీల ద్వారా పోలీసులకు శారీరక దృఢత్వంతోపాటు ఆలోచన దృక్పథంలో మార్పు వస్తుందన్నారు. ఓవరాల్ చాంపియన్‌షిప్ దక్కించుకున్న సైబరాబాద్ పోలీసులను అభినందించారు. జైళ్లశాఖ డీజీపీ సౌమ్యామిశ్రా మాట్లాడుతూ త్వరలోనే జైళ్ల విభాగంలోనూ డ్యూటీ మీట్ నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో మల్టీ జోన్ ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి, సీఐడీ డీఐజీ నారాయణనాయక్, వరంగల్ పోలీసు కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్, వరంగల్, హనుమకొండ జిల్లా కలెక్టర్లు సత్య శారద, స్నేహ శబరీశ్, ఎస్పీలు కిరణ్ ఖరే, సుధీర్ కేకన్, పీటీసీ ప్రిన్సిపాల్ పూజ పాల్గొన్నారు.

మంత్రి కొండా సురేఖపై క్రిమినల్ కేసు నమోదు చేయండి

- కేటీఆర్ పరువు నష్టం కేసులో పోలీసులకు నాంపల్లి కోర్టు ఆదేశం
- 21లోపు కేసు నమోదు చేసి నోటీసులు జారీ చేయండి



సిటీ కోర్టులు: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దాఖలు చేసిన పరువు నష్టం కేసులో మంత్రి కొండా సురేఖపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని పోలీసులను నాంపల్లి కోర్టు ఆదేశించింది. ప్రాథమిక సాక్ష్యాలను పరిశీలించిన అనంతరం ఆమెపై క్రిమినల్ కేసు నమోదు చేసి ఆగస్టు 21లోపు నోటీసులు జారీ చేయాలని పేర్కొంది. కొండా సురేఖ తనపై అసంబద్ధమైన వ్యాఖ్యలు చేశారని, ఆ వ్యాఖ్యలతో తన పరువుకు భంగం కలిగిందంటూ కేటీఆర్ పరువునష్టం కేసు దాఖలు చేసిన సంగతి తెలిసిందే. ఎలాంటి ఆధారాలు లేకుండానే తనపై అసత్యపు ఆరోపణలు చేసినందుకు క్రిమినల్ చర్యలు తీసుకోవాలని పిటిషన్‌లో కోరారు. ఈ కేసు విచారణ శనివారం నాంపల్లిలోని స్పెషల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో జరిగింది. ఈ కేసులో కేటీఆర్‌తోపాటు ఇతర సాక్షుల వాంగ్మూలాలను కోర్టు ఇప్పటికే నమోదు చేసింది. కేటీఆర్ తరపు న్యాయవాది సిద్ధార్థ్ పోగుల వాదనలు వినిపిస్తూ.. ఫోన్ ట్యాపింగ్, డ్రగ్స్, సినీ నటి సమంత విడాకుల వ్యవహారంతోపాటు చిత్ర పరిశ్రమలో చాలా విడాకులకు కేటీఆర్ కారణమంటూ నిరాధార ఆరోపణలు చేశారని చెప్పారు. కేటీఆర్ గతంలో ఐటీ మంత్రిగా రాష్ట్రానికి ఎన్నో పరిశ్రమలు తీసుకొచ్చి మంచి పేరును సంపాదించుకున్నారని, ప్రస్తుతం ఆయన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యేగా ఉన్నారని చెప్పారు. అలాంటి వ్యక్తిపై తప్పుడు వ్యాఖ్యలు చేసినందుకు కొండా సురేఖపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కోరారు.

అభ్యంతరాలను తోసిపుచ్చిన కోర్టు

కొండా సురేఖ తరపు న్యాయవాది వ్యక్తం చేసిన అభ్యంతరాలను కోర్టు పట్టించుకోలేదు. కేటీఆర్ ఫిర్యాదు ఊహాగానాలతో చేసిందని, సరైన సమాచారం లేదని, ఫిర్యాదు చేసిన పోలీస్ స్టేషన్ పరిధి తదితర అంశాలపై లేవనెత్తిన అంశాలను కోర్టు తోసిపుచ్చింది. కేటీఆర్ తరపు న్యాయవాది చేసిన వాదనతో ఏకీభవించిన కోర్టు, నిందితురాలిపై కేసు నమోదు చేయొచ్చని తేల్చిచెప్పింది. ఇరువురి వాదనలు, సాక్ష్యుల వాంగ్మూలాలు, డాక్యుమెంట్లను పరిశీలించిన తర్వాత కొండా సురేఖపై సెక్షన్ 356 ప్రకారం క్రిమినల్ కేసు నమోదు చేసి నోటీసు జారీ చేయాలని పోలీసులను ఆదేశించింది. సురేఖ చేసిన వ్యాఖ్యలు ఇంతకుముందే మీడియాలో వచ్చాయనడానికి ఎలాంటి ఆధారం లేదని, ఈ నిర్దిష్ట ప్రకటనలు, ఆమె స్వయంగా చేసినవిగా సూచిస్తున్నాయని కోర్టు నిర్ధారించింది.

నిజం ఎప్పటికైనా బయటపడుతుంది

మంత్రి కొండా సురేఖపై కేసు నమోదుకు నాంపల్లి కోర్టు ఆదేశించడంపై కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: అర్థంలేని దూషణలు, దుష్ప్రచారాలతో నిజాన్ని ఎంతో కాలం దాచలేరని.. కాస్త ఆలస్యమైనా నిజం ఎప్పటికైనా బయటపడుతుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. ఫోన్ ట్యాపింగ్, డ్రగ్స్ ఆరోపణలతోపాటు సమంత విడాకుల వ్యవహారంలో కేటీఆర్‌పై నిరాధార ఆరోపణలు చేసిన మంత్రి కొండా సురేఖపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని నాంపల్లి కోర్టు పోలీసులను ఆదేశించిన నేపథ్యంలో కేటీఆర్ 'ఎక్స్' వేదికగా స్పందించారు. ప్రజలు అధికారం ఇచ్చింది వదంతులు పుట్టించడానికి, ప్రత్యర్థులపై దుమ్మెత్తి పోసేందుకు కాదన్నారు. రాజకీయాల పేరుతో విషం చిమ్మి తప్పించుకోగలమనుకొనే ప్రతి ఒక్కరికీ ఇది ఒక పాఠంగా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఇది చాలా సుదీర్ఘమైన యుద్ధమని, మనం సగం మాత్రమే పూర్తి చేశామని.. ఈ పోరాటం కొనసాగుతూనే ఉంటుందన్నారు.

అనారోగ్య కారణాన్ని తీవ్రంగా పరిగణించొద్దు

- విద్యార్థిని పరీక్షలకు అనుమతించండి
- అధికారులకు హైకోర్టు



సాక్షి, హైదరాబాద్: అనారోగ్య కారణంతో విద్యార్థి హాజరు శాతం తగ్గడాన్ని తీవ్రంగా పరిగణించొద్దని ఉన్నత విద్యా శాఖాధికారులకు హైకోర్టు స్పష్టం చేసింది. ఇంజనీరింగ్ పరీక్షలు రాసేందుకు పిటిషనర్‌ను అనుమతించాలని ఆదేశించింది. ఇంజనీరింగ్ మూడో సంవత్సరం (2024–25) సెకండ్ సెమిస్టర్ పరీక్షలు రాయకుండా కాలేజీ సర్క్యులర్ జారీ చేయడాన్ని సవాల్ చేస్తూ.. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కీసరలోని గీతాంజలి కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ (అటానమస్) బీటెక్ (సీఎస్ఈ) విద్యార్థిని కొండపర్తి మాన్విత హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. పిటిషన్‌పై జస్టిస్ కె.శరత్ ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరపు న్యాయవాది టి.శ్రీకాంత్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. పరీక్ష రుసుము వసూలు చేసిన కాలేజీ, అధికారులు పిటిషనర్ అనారోగ్య కారణాలను, వైద్య సర్టిఫికెట్లను పరిగణనలోకి తీసుకోలేదన్నారు. పలుమార్లు వినతిపత్రాలు సమర్పించినా పట్టించుకోకుండా 65 శాతం హాజరు లేదని 49.33 శాతమే ఉందంటూ సర్క్యులర్ జారీ చేశారన్నారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. కాలేజీ జారీ చేసిన సర్క్యులర్‌ను రద్దు చేశారు. పరీక్షలు రాసేందుకు పిటిషనర్‌ను అనుమతించాలని కాలేజీకి, ఉన్నత విద్యా శాఖాధికారులకు ఉత్తర్వులు జారీ చేశారు.

పిల్లలు పుట్టలేదని సంతాన సాఫల్య కేంద్రానికి వెళ్లిన మహిళకు భర్త శుక్ర కణాలతో కాకుండా వేరే వ్యక్తి శుక్రకణాలతో సంతానం కలిగించిన ఘటన సికింద్రాబాద్‌లో వెలుగులోకి వచ్చింది. తెలుగు రాష్ట్రాల్లో సంచలనం 'సృష్టి'ంచింది. ఇటీవలి కాలంలో జంటల్లో సంతాన సాఫల్యత తగ్గడమే.. ఇలాంటి కేంద్రాలు పెరగడానికి కారణం. ఈ సమస్య తీవ్రత ఎంత ఎక్కువంటే... ప్రతి ఆరు వివాహిత జంటల్లో ఒకరు సంతానలేమితో బాధ పడుతున్నారని అంచనా. దీంతో పలువురు దంపతులు కృత్రిమ గర్భధారణకు మొగ్గుచూపుతున్నారు. ఈ డిమాండ్‌ను ఆసరా చేసుకున్న కొన్ని ఫెర్టిలిటీ సెంటర్లు దంపతుల పట్ల అనైతికంగా వ్యవహరిస్తున్నాయి. ఈ నేపథ్యంలో కృత్రిమ గర్భధారణలో ఐవీఎఫ్ (టెస్ట్‌ట్యూబ్ బేబీ) ప్రాధాన్యమేమిటి? అది ఎప్పుడు, ఎందుకు చేస్తారు? దంపతులు ఎక్కడ మోసపోయే అవకాశం ఉంటుంది? ప్రభుత్వం నియమ నిబంధనలూ, మార్గదర్శకాలు ఏమిటి?

సాక్షి, ఫీచర్స్ - హెల్త్ డెస్క్



ఇటీవల మనదేశంలో సంతానలేమితో బాధపడుతున్నవారి సంఖ్య విపరీతంగా పెరుగుతోంది. దీనికి ప్రధానంగా రెండు రకాల కారణాలున్నాయి. మొదటిది.. సామాజిక కారణాలు. యువత పై చదువుల కోసం, మంచి ఉద్యోగాలంటూ తమ కెరీర్ కోసం ఎక్కువ సమయం కేటాయించడం; ఉద్యోగాల్లో తీవ్రమైన ఒత్తిడి, వేళాపాళా లేని పనివేళలు, మారుతున్న ఆహారపు అలవాట్లు, వ్యాయామం, శారీరక శ్రమ లేకపోవడం; అధిక బరువు (స్థూలకాయం), మద్యపానం, పొగతాగడం, డ్రగ్స్ వంటి అనారోగ్యకర అలవాట్లు. ఇక రెండోది ఆరోగ్య పరమైనవి.. మహిళల్లోని హార్మోన్లలో అసమతాల్యత, ఇన్ఫెక్షన్లు, స్త్రీలలో పుట్టుకతోనే అండాల సంఖ్య తక్కువగా ఉండటం; మగవారిలో వీర్యకణాల సంఖ్య, కదలిక తక్కువగా ఉండటం, నాణ్యతలేమి.



'టెస్ట్ ట్యూబ్'లో.. మీ 'బేబీ'యేనా?

దాతలకు నియమ నిబంధనలివి..

- కేంద్ర / రాష్ట్ర ఏఆర్‌టీ బోర్డు ఆధ్వర్యంలో నమోదు చేసుకున్న ఏఆర్‌టీ బ్యాంకుల నుంచే క్లినిక్‌లు అండాలను / శుక్రకణాలను స్వీకరించాలి.
- ఇటీవల ఎవరో బిచ్చగాళ్లు, ఆరోగ్యం సరిగా లేని వారిని దాతలుగా కొన్ని సంస్థలు శాంపిళ్లు సేకరించినట్లు వార్తలొచ్చాయి. ఇది కఠిన శిక్షార్హమైన నేరం. దాతల ఎంపికకూ, అండాలు ఇచ్చే మహిళా దాతలుగానీ లేదా శుక్రకణాలను ఇచ్చే పురుషుల అర్హతల గురించీ స్పష్టమైన మార్గదర్శకాలు ఉన్నాయి.
- దాతల నుంచి అండాలు లేదా శుక్రకణాలను స్వీకరించే సమయంలో స్వీకర్తలకు దాతల గురించి, ఈ విషయంపై ఉన్న నియమ నిబంధనలూ తెలుపుతూ కౌన్సెలింగ్ చేయాలి.



– డాక్టర్ ప్రీతీ రెడ్డి, సంతాన సాఫల్య నిపుణురాలు, హైదరాబాద్

ఐవీఎఫ్ పేరిట క్లినిక్‌ల నయా మోసాలు

దాతల విషయంలో అప్రమత్తత అవసరం

చట్టాలపై అవగాహనతో అక్రమాలకు అడ్డుకట్ట

వివరాలన్నీ క్లినిక్‌లు దంపతులకు చెప్పాల్సిందే

పేషెంట్ల వివరాలు గోప్యంగా ఉంచాల్సిందే

కృత్రిమ గర్భధారణ ప్రక్రియలు

ఇంట్రా యుటెరైన్ ఇన్‌సెమినేషన్ (ఐయూఐ)

అండం విడుదలలో లోపాలు, పురుషుల వీర్యకణాల సంఖ్య, కదలికల్లో లోపాలు ఉన్నప్పుడు ఈ పద్ధతి ద్వారా వీర్యకణాలను నేరుగా గర్భాశయంలోకి పంపుతారు.

ఐవీఎఫ్ : 'ఇన్ విట్రో ఫెర్టిలైజేషన్'కు సంక్షిప్త రూపమే ఐవీఎఫ్. జనసామాన్యంలో దీనికి 'టెస్ట్‌ట్యూబ్ బేబీ' అని పేరు. స్త్రీ, పురుషులిద్దరిలోనూ ఫలదీకరణ విషయంలో సమస్యలు ఉన్నప్పుడు ఈ మార్గాన్ని సూచిస్తారు. ఇందులో ముందుగా మహిళలో అండాలు పెద్దమొత్తంలో పెరిగేందుకు మందులిస్తారు. అలా పెరిగిన అండాల్లోంచి ఆరోగ్యంగా ఉన్న కొన్నింటిని సేకరించి, పురుషుడి నుంచి సేకరించిన వీర్యకణాలతో ల్యాబ్‌లోని 'టెస్ట్ ట్యూబ్'లో ఫలదీకరణం చేస్తారు. ఇందులో కొన్నిసార్లు ఒకటి కంటే ఎక్కువ పిండాలు పెరగవచ్చు (అందుకే ఈ పద్ధతిలో చాలా మందిలో కవలలు పుడుతుంటారు). ఇలా రూపొందించిన వాటిల్లో ఆరోగ్యకరమైన పిండాలను మళ్లీ మహిళ గర్భంలోకి ప్రవేశపెడతారు. రెండువారాలకు నిర్ధారణ పరీక్షలు చేస్తారు. నాలుగు వారాల తర్వాత అల్ట్రాసౌండ్ పరీక్ష చేసి, గర్భం నిలిచిందా లేదా అన్నది నిర్ధారణ చేసుకుంటారు. గర్భం నిలవకపోతే కారణాలను విశ్లేషించి, మళ్లీ కొన్ని నెలలు ఆగి ప్లాన్ చేస్తారు. ఇలా రెండుమూడు సార్లు ప్రయత్నిస్తారు.

ఇంట్రా సైటోప్లాస్మిక్ స్పెర్మ్ ఇంజెక్షన్ (ఐసీఎస్ఐ): పురుషుల్లో సమస్య ఉంటే అనుసరించే మార్గమిది. మగవారి నుంచి ఎంపిక చేసుకున్న ఆరోగ్యంగా ఉన్న శుక్రకణాన్ని నేరుగా అండంలోకి ప్రవేశపెడతారు.

పిండాలను భద్రపరిచి..: ఐవీఎఫ్ ప్రక్రియలో రూపొందిన పిండాల సంఖ్యను బట్టి, ఒకసారి ఒకటి లేదా రెండు పిండాలను గర్భాశయంలోకి పంపి, మిగతా వాటిని 'విట్రిఫికేషన్' అనే పద్ధతి ద్వారా ఫ్రీజ్ చేసి భద్రపరుస్తారు. ఐవీఎఫ్ ప్రక్రియ మొదటిసారి సఫలం కానప్పుడు, అలా భద్రపరచిన పిండాలను తీసుకొని మళ్లీ మళ్లీ వాడుకోవచ్చు. లేదా ఇంకొకసారి గర్భం దాల్చాలనుకున్నప్పుడు కూడా వాడుకోవచ్చు. పరిశోధనలకు ఇవ్వవచ్చు. లేదా వాటిని నిర్వీర్యపరచమని కోరవచ్చు. క్లినిక్‌లు వీటిలో ఏది చేయాలన్నా దంపతుల అనుమతితోనే చేయాలి. ఈ విషయంపై కూడా దంపతులకు పూర్తి అవగాహన లేకపోవడం వల్ల మోసాలు జరిగే అవకాశం ఉంది.

ఐవీఎఫ్ ఎవరి కోసమంటే..



- సాధారణ చికిత్సలతో గర్భం రాక.. ఇంకా వేచిచూసేంత ఓపిక లేనివాళ్లకి.
- వయసు 38 – 40 ఏళ్లు దాటిన వారికి
- అండాల సంఖ్య, నాణ్యత బాగా తగ్గిపోతున్నవారికి
- వీర్యకణాల సంఖ్య, కదలిక, నాణ్యత బాగా తక్కువగా ఉన్నప్పుడు.
- భార్య లేదా భర్తలో ఏవైనా జన్యుపరమైన సమస్య ఉండి, అది పిల్లలకూ వచ్చే అవకాశం ఉన్నప్పుడు, ఐవీఎఫ్ ద్వారా తయారైన పిండాలనుంచి ఒక దాన్ని తీసి, ప్రీ-ఇంప్లాంటేషన్ జెనెటిక్ డయాగ్నసిస్ (పీజీడీ) ద్వారా పరీక్ష చేసి, జన్యు సమస్య లేని పిండాలను వేరుపరచి, తల్లి గర్భాశయంలోకి పంపిస్తారు.
- కొందరు కెరీర్ కోసమో లేదా వ్యక్తిగత కారణాల వల్లో గర్భధారణను వాయిదా వేస్తారు. వాళ్లలో కొందరు ముందుగానే ఐవీఎఫ్ పద్ధతి ద్వారా తయారైన పిండాలను భద్రపరచుకొని, ఆ తర్వాత వీలైనప్పుడు ఫ్రోజెన్ ఎంబ్రియో ట్రాన్స్‌ఫర్ ద్వారా గర్భాశయంలోకి ప్రవేశింపచేయడం ద్వారా గర్భం ధరిస్తారు. ఈ సందర్భంలో కూడా దంపతులు అప్రమత్తంగా ఉండాలి. పిండాలు మారిపోయే అవకాశం ఇక్కడ కూడా ఉంటుంది.

ఐవీఎఫ్ విజయావకాశాలు

ఇవి ప్రధానంగా మహిళ వయసు మీద ఆధారపడి ఉంటాయి. 40 ఏళ్లు దాటాక.. వయసు పెరిగే కొద్దీ సక్సెస్ రేటు తగ్గుతుంది. అండాలు, పిండం నాణ్యత తక్కువగా ఉంటే ఆ మేరకు సక్సెస్ రేటూ తగ్గిపోతుంది.

- దంపతుల జీవనశైలి కూడా ప్రభావం చూపుతుంది. ధూమపానం, మద్యపానం అలవాటున్నవారు, ఊబకాయం ఉన్నవారిలో అండాల సంఖ్య, నాణ్యత సహజంగా తక్కువగా ఉండవచ్చు. దాంతో సక్సెస్‌రేటూ తగ్గుతుంది.


ఇవీ నియమ నిబంధనలు

కృత్రిమ గర్భధారణ విషయంలో ఇన్‌ఫెర్టిలిటీ కేంద్రాలకూ, అలాగే ప్రజల కోసం కేంద్ర ప్రభుత్వం 'ద ఏఆర్‌టీ (అసిస్టెడ్ రీప్రొడక్టివ్ టెక్నాలజీస్) యాక్ట్ ఆఫ్ 2021', అలాగే 'సరోగసీ యాక్ట్ ఆఫ్ 2021' వంటి చట్టాలు చేసింది. ఇన్‌ఫెర్టిలిటీ క్లినిక్‌లు ఈ నియమ నిబంధనలను పాటించాలి. దంపతులు కూడా ఈ చట్టాలపై కొంత అవగాహన కలిగి ఉంటే మంచిది.

- దేశంలోని ప్రతి ఐవీఎఫ్ సెంటర్.. కేంద్ర, రాష్ట్ర ఏఆర్‌టీ బోర్డు కింద నమోదు చేసుకుని ఉండాలి.
- ఐవీఎఫ్ చికిత్సకు తాము అంగీకరిస్తున్నట్టుగా దంపతులు ఆమోదపత్రం ఇవ్వాలి. ఈ ప్రక్రియ నిర్వహిస్తున్న నిపుణులు.. ఐవీఎఫ్ ప్రక్రియ గురించి పూర్తి వివరాలు దంపతులకు తెలియజేయాలి.
- తమ దగ్గర చికిత్స తీసుకుంటున్న దంపతుల వివరాలను, వారి మెడికల్ రికార్డులను క్లినిక్‌లు గోప్యంగా ఉంచాలి.
- తమకు జరుగుతున్న చికిత్స, వైద్యపరీక్షల వంటి పూర్తి వివరాలు పేషెంట్లు తెలుసుకోవచ్చు. క్లినిక్ నిర్వాహకులు / డాక్టర్లు అన్ని వివరాలనూ పేషెంట్లకు వివరించాలి. చికిత్సకు సంబంధించిన అన్ని రికార్డులూ పేషెంట్లకు ఇవ్వాలి.
- తమకు కలిగే అసౌకర్యాల విషయంలో ఫిర్యాదు చేసేందుకు ప్రతి క్లినిక్ తమ దగ్గర ఓ ఫిర్యాదుల కేంద్రాన్ని (గ్రీవెన్స్ సెల్) ఏర్పాటు చేయాలి.



ఐటీ భళీ.. ఆరోగ్యం బలి



దీర్ఘకాలిక వ్యాధుల బారిన ఐటీ ఉద్యోగులు

హైదరాబాద్‌లో 84% ఉద్యోగులకు ఫ్యాటీ లివర్ సమస్య

34 శాతం మందికి మెటబాలిక్ సిండ్రోమ్

పని ఒత్తిడి, క్రమం తప్పిన జీవనశైలే ప్రధాన కారణం

ఆఫీసుల్లో 'యోగా బ్రేక్'తప్పనిసరి చేసిన కేంద్రం

సాక్షి, హైదరాబాద్: ఐటీ ఉద్యోగులంటే.. వాళ్లకేంటి బాబూ లక్షల్లో జీతం.. వీకెండ్స్ హాలీడేస్.. కాస్మోపాలిటన్ వర్క్ కల్చర్.. విలాసవంతమైన జీవనం అని తక్కువ అనేయకండి. నాణేనికి రెండో వైపులాగే ఐటీ ఉద్యోగులను తీవ్ర అనారోగ్య సమస్యలు వేధిస్తున్నాయి. జీవనశైలి, అధిక పని ఒత్తిడితో రకరకాల వ్యాధుల బారినపడుతున్నారు. హైదరాబాద్‌లో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ) ఉద్యోగులలో 84% మంది ఫ్యాటీ లివర్ (కాలేయంలో అధిక కొవ్వు) బారిన పడ్డారని ఏకంగా కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జగత్ ప్రకాశ్ నడ్డా లోక్‌సభలో ప్రకటించారు. ఇదొక నిశ్శబ్ద మహమ్మారిగా మారిందని, దీనిని నియంత్రించేందుకు అన్నివర్గాల సమన్వయంతో తక్షణ చర్యలు అవసరమని నొక్కి చెప్పారు. 2025లో నేచర్ సైంటిఫిక్ రిపోర్ట్స్ జర్నల్‌లో ప్రచురితమైన ఓ అధ్యయనాన్ని కేంద్ర మంత్రి ఉదహరించారు.

క్రమం తప్పిన జీవన శైలి

ఐటీ పరిశ్రమలో ఉండే పని ఒత్తిడికి తోడు క్రమం తప్పిన పని వేళలు, ఆహార అలవాట్లతో ఉద్యోగులు దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడుతున్నారు. సరైన సమయంలో ఆహారం తీసుకోకపోవటంతో జీవక్రియ దెబ్బతింటోంది. దానివల్ల కాలేయంలో కొవ్వు (ఫ్యాటీ లివర్- ఎంఏఎఫ్ఎల్‌డీ) పెరిగిపోయి వ్యాధులకు దారితీస్తోంది. హైదరాబాద్‌లో సర్వే చేసిన ఐటీ ఉద్యోగులలో 71 శాతం మందికి ఊబకాయం, 34 శాతం మందికి మెటబాలిక్ సిండ్రోమ్ సమస్యలు ఉన్నట్లు తేలింది. వీటి వల్ల మధుమేహం, గుండె సంబంధిత వ్యాధులు, అధిక రక్తపోటు వంటి సమస్యలు పెరుగుతున్నాయి. వయసు పెరిగే కొద్దీ ఈ అనారోగ్య సమస్యలు కూడా పెరుగుతున్నాయి. సాధారణంగా హృద్రోగం, మధుమేహం, కేన్సర్, శ్వాస సంబంధ సమస్యలు వంటి నాన్ కమ్యూనికబుల్ డిసీజ్ (ఎన్‌సీడీ)లన్నీ 40 ఏళ్ల తర్వాతే వస్తుంటాయి. కానీ, ఐటీ ఉద్యోగుల్లో మాత్రం అవి 30 ఏళ్ల లోపే వస్తున్నాయి. ఐటీ ఉద్యోగులు ఎక్కువగా జంక్ ఫుడ్, ప్రాసెస్డ్, రెడీమేడ్ ఆహారం తీసుకోవటం, కదలకుండా గంటల కొద్దీ ఒకే చోట కూర్చోవటం కూడా ఈ అనారోగ్యాలకు కారణాలని సర్వేలో తేలింది.

యోగా బ్రేక్ తప్పనిసరి..

సంస్థల యాజమాన్యాలకే కాదు దేశ ఆర్థిక వ్యవస్థకు కూడా యువ, పట్టణ శ్రామిక శక్తి ఆరోగ్యాన్ని కాపాడుకోవటం అత్యంత కీలకం. అందుకే నేషనల్ ప్రోగ్రామ్ ఫర్ ప్రివెన్షన్ అండ్ కంట్రోల్ ఆఫ్ నాన్-కమ్యూనికబుల్ డిసీజెస్ (ఎన్‌పీ-ఎన్‌సీడీ) కింద ఆరోగ్య మంత్రిత్వ శాఖ కంపెనీల యాజమాన్యాలకు పలు మార్గదర్శకాలను జారీ చేసింది. ఉద్యోగులకు తప్పనిసరిగా 5 నిమిషాల పాటు ఆసనాలు, ప్రాణాయామం, ధ్యానంతో కూడిన 'యోగా బ్రేక్' ఇవ్వాలని ఆదేశించింది. ఇది శారీరక, మానసిక శ్రేయస్సుకు అత్యవసరం. దీంతోపాటు ఆరోగ్యకరమైన ఆహారం, క్రమం తప్పకుండా వ్యాయామం, బరువు నియంత్రణ, చక్కెర, అధిక కొవ్వు పదార్థాలను తగ్గించడం వంటి జాగ్రత్తలు తీసుకోవాలని ఉద్యోగులకు సూచించింది.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.

‘ఉపాధి’.. కావాలి నిధుల ‘హామీ’!

కేంద్రం కేటాయింపుల్లో జాప్యం.. రాష్ట్రాలపై నిధుల భారం

- ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధుల కట్టడి
- సకాలంలో కూలీలకు అందని వైనం
- దేశవ్యాప్తంగా రూ.14,604.02 కోట్ల బకాయిలు
- ఆరు రాష్ట్రాలకు రూ.10,187.29 కోట్లు
- తెలంగాణకు రావాల్సింది రూ.939.47 కోట్లు
- కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ నివేదికల్లో స్పష్టం
- ఉపాధి హామీకి నిధుల గండం.. నత్తనడకన పనులు





ములుగు జిల్లా ఏటూరునాగారం మండలంలో ఉపాధి హామీ పథకం పనుల్లో కూలీలు

సాక్షి ప్రతినిధి, వరంగల్: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి (ఎంజీఎన్ఆర్‌జీఏ) నిధుల గండం వెంటాడుతోంది. కేంద్ర ప్రభుత్వం విడుదల చేయాల్సిన ఈజీఎస్ నిధులను.. పెండింగ్‌లో పెట్టడంతో రాష్ట్రాలు ఆ నిధుల భారం మోయలేకపోతున్నాయి. గతంలో నేరుగా ఉపాధి హామీ కూలీల ఖాతాలకే బదిలీ అయ్యే డబ్బులు.. కొంతకాలం ఆలస్యంగా చేతికందాయి. సుమారు మూడు నెలలుగా డబ్బులు సరిగా రావడం లేదని ఉపాధి కూలీలు వాపోతున్నారు. ఎన్నడూ లేని విధంగా బకాయిలు పెరిగిపోతున్నాయని క్షేత్రస్థాయిలో కూలీలు చెబుతున్నారు. కేంద్రం నుంచి నిధులు సకాలంలో విడుదల చేయకపోవడమే ఇందుకు కారణమని అధికారులు స్పష్టం చేస్తున్నారు. కాగా దేశవ్యాప్తంగా రాష్ట్రాలు/యూటీలకు చెల్లించాల్సిన ఉపాధి హామీ నిధులు రూ.14,604.02 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని.. జూలై 22న రాజ్యసభలో సమర్పించిన నివేదికలో కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ వెల్లడించింది.

ఆరో స్థానంలో తెలంగాణ

దేశవ్యాప్తంగా ఉపాధి కూలీలకు కేంద్ర ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిల మొత్తం బకాయిలు రూ.14,604.02 కోట్లకు చేరగా.. ఆరు రాష్ట్రాలకే అత్యధికంగా చెల్లించాల్సి ఉంది. కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ నివేదికలో పేర్కొన్న ప్రకారం ఆంధ్రప్రదేశ్‌కు అత్యధికంగా 2,864.31 కోట్లు కూలీలకు చెల్లించాల్సి ఉంది. ఆ తర్వాత ఉత్తరప్రదేశ్ రూ.1,765.15 కోట్లతో రెండో స్థానంలో ఉపాధి హామీ బకాయిలు రావాల్సిన రాష్ట్రాలుగా ఉన్నాయి. రాజస్తాన్‌కు రూ.1,687.39 కోట్లు, బిహార్‌కు రూ.1,680.13 కోట్లు, మహారాష్ట్రకు రూ.1,250.84 కోట్లు, తెలంగాణకు రూ.939.47 కోట్లు చెల్లించాల్సి ఉన్నట్లు వెల్లడించారు. మధ్యప్రదేశ్‌కు రూ.870.94 కోట్లు, కేరళకు రూ.377.57 కోట్లు, కర్ణాటకకు రూ.374.80 కోట్లు, జార్ఖండ్‌కు రూ.54.84 కోట్లు, పంజాబ్‌కు రూ.331.48 కోట్లు, అస్సాంకు రూ.305.49 కోట్లు.. ఇలా మిగతా రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు రూ.4,416.73 కోట్లు చెల్లించాల్సి ఉంది. కాగా పెద్దమొత్తంలో ఉపాధి హామీ వేతనాల చెల్లింపులో జాప్యం కారణంగా పథకంపై గ్రామీణ ప్రజల్లో నిరాశ పెరుగుతోందన్న చర్చ కూడా జరుగుతోంది.

ఉమ్మడి వరంగల్‌పై ప్రభావం

తెలంగాణలో మొత్తం 1,10,54,678 మంది కూలీలు నమోదు చేసుకోగా.. 55,87,619 (50.55 శాతం) మంది కూలీలే పనుల్లో పాల్గొంటున్నట్లు అధికారుల గణాంకాలు చెబుతున్నాయి. కాగా కూలీల హాజరు శాతం పడిపోవడానికి సకాలంలో డబ్బులు అందకపోవడం కూడా కారణంగా చెబుతున్నారు. ఈ ప్రభావం ఉమ్మడి వరంగల్‌లోనూ కనిపిస్తోంది. ఉమ్మడి వరంగల్‌లో 7.59 లక్షల జాబ్‌కార్డులపై 16.02 లక్షల మంది ఉపాధి హామీ పథకంలో నమోదు చేసుకున్నారు. వంద రోజుల పని కల్పించడం, పని ప్రదేశాల్లో సౌకర్యాల ఏర్పాటులో లోపాలు.. సరైన సమయంలో వేతనాలు అందక 7.39 లక్షల మందే ఉపాధి హామీ పనుల్లో పాల్గొన్నట్లు అధికార వర్గాల సమాచారం. కాగా ఉపాధి కూలీలకు 100 రోజుల పని కల్పించడంతో పాటు సకాలంలో వేతనాలు అందేలా అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక శ్రద్ధ వహించి ఉపాధి కల్పించాలని కూలీలు కోరుతున్నారు.

దేశ వ్యాప్తంగా ‘ఉపాధి’ జిల్లాలు:	741
గ్రామ పంచాయతీలు:	2,69,236
మొత్తం జాబ్ కార్డులు (రూ.కోట్లలో..):	15.40
నమోదైన ‘ఉపాధి’ కార్మికులు:	27,89,04,835
పని చేస్తున్న ఉపాధి కూలీలు:	12,10,97,300
తెలంగాణలో నమోదైన కూలీలు:	1,10,54,678
ప్రస్తుతం ఉపాధి హామీ పనులు చేస్తున్నవారు:	55,87,619
‘ఉపాధి’ పనులకు హాజరవుతున్న కూలీల శాతం:	50.55

అత్యధికంగా ఆరు రాష్ట్రాల బకాయిలు

రాష్ట్రం	‘ఉపాధి’ బకాయి (రూ.కోట్లలో)
ఆంధ్రప్రదేశ్	2,864.31
ఉత్తరప్రదేశ్	1,765.15
రాజస్తాన్	1,687.39
బిహార్	1,680.13
మహారాష్ట్ర	1,250.84
తెలంగాణ	939.47
మొత్తం	10,187.29

డబ్బులు వెంటనే రావడం లేదు



వారం రోజులపాటు ఉపాధి హామీ పనులకు వెళ్లాం. కానీ ఇంతవరకు డబ్బులు రాలేదు. పనులు చేసి కూడా మూడు నెలలు అవుతోంది. ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్‌లు మా హాజరు నమోదు చేసుకున్నారు. కానీ ఇంత వరకు డబ్బులు రాకపోవడంతో తీవ్ర ఇబ్బంది పడుతున్నాం. ఇంతకుముందు వెంటవెంటనే వస్తుండే.

– కుమ్మరి భాగ్యలక్ష్మి, ఏటూరునాగారం, ములుగు జిల్లా

వెంటనే డబ్బులు వేయాలి



ఉపాధి హామీలో పేదవారికి మరిన్ని పనులు కల్పించి ఆర్థికంగా ఆదుకోవాలి. చేసిన డబ్బులు రాక, పనులు లేక తీవ్ర ఇబ్బంది పడుతున్నాం. కుటుంబాలు గడవాలంటే ఉపాధి హామీ పనులను మరింత విస్తరించే విధంగా చూడాలి. గతంలో పనిచేసిన డబ్బులు తొందరగా ఇప్పించాలని వేడుకుంటున్నాం.

– దుర్గం రజిత, ఏటూరునాగారం, ములుగు జిల్లా

బొగ్గు ఉత్పత్తి 87 శాతమే..



ఓపెన్ కాస్ట్ గనిలో బొగ్గు లోడ్ చేస్తున్న యంత్రం

ఏరియాల వారీగా జూలైలో నమోదైన బొగ్గు ఉత్పత్తి

ఏరియా	నిర్దేశిత లక్ష్యం (టన్నుల్లో)	ఉత్పత్తి (టన్నుల్లో)	శాతం
కొత్తగూడెం	9,56,607	10,05,971	105
ఇల్లెందు	2,04,808	1,28,602	63
మణుగూరు	7,30,408	6,30,320	86
మందమర్రి	1,95,482	1,21,920	62
శ్రీరాంపూర్	4,71,178	4,17,670	89
ఆర్జీ-1	3,09,015	3,22,072	104
ఆర్జీ-2	6,55,296	7,07,341	108
ఆర్జీ-3	4,23,704	3,07,249	73
బెల్లంపల్లి	1,92,593	1,89,105	98
భూపాలపల్లి	2,80,704	2,09,781	75
ఆంద్రియాల	1,30,289	12,485	10
మొత్తం	45,50,084	40,52,516	87

సింగరేణి వ్యాప్తంగా జూలైలో ఇదీ తీరు

- మూడు ఏరియాల్లో మాత్రమే 100 శాతం నమోదు
- సీఎండీ పర్యవేక్షిస్తున్నా మారని తీరు

సింగరేణి (కొత్తగూడెం): సింగరేణి సంస్థ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26)లో 76 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకుంది. ఇందులో ఏరియాల్లో నెలల వారీగా లక్ష్యాలు నిర్దేశించగా.. ఆశించిన స్థాయిలో ఉత్పత్తి నమోదు కావడం లేదు. జూలైలో సింగరేణి వ్యాప్తంగా 11 ఏరియాల్లోని 19 ఓపెన్ కాస్ట్ గనులు, 21 భూగర్భ గనులకు 45.50 మిలియన్ లక్షల టన్నుల లక్ష్యానికి 40.52 లక్షల టన్నుల (87 శాతం) ఉత్పత్తే నమోదైందని సంస్థ విడుదల చేసిన గణాంకాల్లో వెల్లడించింది. భూగర్భ గనుల్లో 5.94 లక్షల టన్నుల లక్ష్యానికి 3.37 లక్షల టన్నులు (57 శాతం), ఓసీల్లో 39.55 లక్షల టన్నులకు 37.14 లక్షల టన్నుల (94 శాతం) ఉత్పత్తి సాధించారు. అయితే వర్షాల నేపథ్యాన ఉత్పత్తికి ఆటంకం ఏర్పడకుండా.. ఏప్రిల్ నెలారంభం నుంచే సింగరేణి సీఎండీ బలరామ్ అధికారులతో సమీక్షలు నిర్వహించారు. యాడ్ కోల్ పెంచాలని, నెలసరి ఉత్పత్తి లక్ష్యాల్లో తేడా రాకుండా చూసుకోవాలని ఆదేశించినా ఫలితం రాకపోవడం గమనార్హం. ప్రతీ మంగళ, శనివారాల్లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రోజు, నెలవారీ లక్ష్యాలపై సమీక్షిస్తున్నా.. కొందరు అధికారుల తీరుతో ఈ పరిస్థితి నెలకొందనే విమర్శలు వస్తున్నాయి. కొన్ని ఏరియాల్లో అధికారులు గనుల్లోకి రాకపోగా, కిందిస్థాయి అధికారులతో కనీసం పర్యవేక్షించక ఉత్పత్తిలో విఘాతం ఏర్పడుతోందని చెబుతున్నారు.

మూడు ఏరియాల్లోనే..

సింగరేణి వ్యాప్తంగా 11 ఏరియాలకు యాజమాన్యం ప్రతీ నెల బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని నిర్దేశిస్తుంది. ఈ మేరకు జూలైలో కొత్తగూడెం ఏరియా 105, ఆర్జీ-1 ఏరియా 104, ఆర్జీ-2 ఏరియా 108 శాతం ఉత్పత్తి సాధించాయి. మిగతావన్నీ వెనుకబడటం గమనార్హం. ఇల్లెందు ఏరియా 63 శాతం, మణుగూరు ఏరియా 86, బెల్లంపల్లి ఏరియా 98, మందమర్రి 62, శ్రీరాంపూర్ 89 శాతం, ఆర్జీ-3 ఏరియా 73 శాతం, ఆంద్రియాలా 10 శాతం, భూపాలపల్లి 75 శాతానికే పరిమితమయ్యాయి.

నాలుగు నెలల్లోనూ అంతంతే..

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం గడిచిన నాలుగు నెలల్లోనూ ఉత్పత్తి ఆశాజనకంగా నమోదు కాలేదు. నాలుగు మాసాల్లో కొత్తగూడెం ఏరియా 103 శాతం, మణుగూరు ఏరియా 108 శాతం, ఆర్జీ-2 ఏరియా 134 శాతం ఉత్పత్తి సాధించగలిగాయి. ఇక ఇల్లెందు 85 శాతం, బెల్లంపల్లి 94, మందమర్రి 67, శ్రీరాంపూర్ 93, ఆర్జీ-1 ఏరియా 83, ఆర్జీ-3 ఏరియా 88, ఆంద్రియాలా 20, భూపాలపల్లి ఏరియా 77 శాతంతో వెనుకబడ్డాయి. రోజువారీ ఉత్పత్తి 1.75 లక్షల టన్నులకు 1.50 లక్షల టన్నుల ఉత్పత్తి మాత్రమే నమోదవుతుండడం గమనార్హం.

వంద శాతం ఉత్పత్తికి ప్రణాళికలు



కొన్ని ఏరియాల్లోని ఓసీల్లో 100 శాతం ఉత్పత్తి నమోదవడం.. మరికొన్ని ఏరియాల్లో వెనకబడడానికి కారణాలపై ఆరా తీసు _న్నాం. గనుల్లో ఉద్యోగుల పని గంటల పెంపు, భూగర్భ గనుల్లో యంత్రాల సమస్యలపై సమీక్షిస్తాం. వీటన్నింటిని పరిష్కరిస్తూ లక్ష్యం మేర ఉత్పత్తికి ప్రణాళికలు రూపొందిస్తాం.

– ఎల్వీ సూర్యనారాయణ, సింగరేణి డైరెక్టర్ (ఆపరేషన్స్)

కొత్తగూడెం ఏరియాది పెద్దన్న పాత్ర



బొగ్గు ఉత్పత్తిలో సింగరేణి వ్యాప్తంగా కొత్తగూడెం ఏరియా పెద్దన్న పాత్ర పోషిస్తోంది. రోజుకు 35 వేల టన్నులు, నెలకు 10 లక్షల టన్నుల ఉత్పత్తితో నాలుగు మాసాల్లో 48,34,076 టన్నుల ఉత్పత్తి నమోదైంది. సుమారు 50 లక్షల టన్నుల బొగ్గు రవాణా పూర్తయింది. ఇదే ఒరవడి ఎప్పటికీ కొనసాగిస్తాం.

– శాలేం రాజు, జనరల్ మేనేజర్, కొత్తగూడెం ఏరియా



తెలంగాణ చరిత్ర, ఉద్యమం, కళలు అనే పుస్తకాన్ని రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి శనివారం సచివాలయంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పుస్తక రచయిత, మంత్రి వ్యక్తిగత సహాయకుడు డిప్యూటీ తహసీల్దార్ డాక్టర్ పైళ్ల నవీన్ రెడ్డి, మంత్రి కార్యాలయ సిబ్బంది శ్రీలక్ష్మి, పోరెడ్డి వెంకట్ రెడ్డి, మేడిశెట్టి రమేశ్‌లు పాల్గొన్నారు.

పనిచేయని కేసీఆర్‌కు రూ.49.5 లక్షల జీతం

ఫిషర్‌మెన్ సొసైటీ చైర్మన్ సాయికుమార్



సాక్షి, హైదరాబాద్: జీతం తీసుకుని కూడా పనిచేయని వ్యక్తి ప్రపంచంలో కేసీఆర్ ఒక్కడేనని తెలంగాణ రాష్ట్ర ఫిషర్‌మెన్ సొసైటీ చైర్మన్ మెట్టు సాయికుమార్ వ్యాఖ్యానించారు. ఆయన శనివారం గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడారు. గత 18 నెలల్లో కేసీఆర్ రూ.49.5 లక్షల వేతనం తీసుకున్నారని చెప్పారు. తీసుకుంటున్న జీతానికి పనిచేయాలని, ఈసారైనా అసెంబ్లీకి వచ్చి ప్రజాసమస్యలపై మాట్లాడాలని డిమాండ్ చేశారు.

రంగారెడ్డి అదనపు కలెక్టర్‌గా చంద్రారెడ్డి

అదనపు కలెక్టర్లు, స్పెషల్‌గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్లకు పోస్టింగులు

సాక్షి, హైదరాబాద్: హెచ్ఎండీఏ పరిధిలోని బుద్ధపూర్ణిమ ప్రాజెక్టు ఓఎస్డీ కె.చంద్రారెడ్డిని.. రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు పలువురు అదనపు కలెక్టర్లు, స్పెషల్‌గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్లకు పోస్టింగులిస్తూ రెవెన్యూ శాఖ కార్యదర్శి డి.ఎస్.లోకేశ్‌కుమార్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.

అధికారి పేరు	ప్రస్తుత పోస్టింగ్	తాజా పోస్టింగ్
ఎస్.భీమ్యా నాయక్	వెయిటింగ్	అదనపు కలెక్టర్, వనపర్తి
కె.చంద్రారెడ్డి	ఓఎస్డీ, బుద్ధపూర్ణిమ, హెచ్ఎండీఏ	అదనపు కలెక్టర్, రంగారెడ్డి
ఎల్.రమాదేవి	ఈవో, భద్రాచలం దేవస్థానం	రహదారులు, భవనాల శాఖ
బి.రాజాగౌడ్	వెయిటింగ్	డీఆర్వో, హనుమకొండ
ఎల్.సుధ	వెయిటింగ్	పీఏ, స్పెషల్ కలెక్టర్, నల్లగొండ
ఎస్.అశోక్ చక్రవర్తి	వెయిటింగ్	రహదారులు, భవనాలు
ఎల్.రాజేందర్‌గౌడ్	వెయిటింగ్	స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (భూసేకరణ) నారాయణపేట
సీహెచ్.కోమల్‌రెడ్డి	వెయిటింగ్	స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (భూసేకరణ) మహబూబ్‌నగర్
కె.దామోదర్‌రావు	వెయిటింగ్	దేవాదాయ శాఖ
పి.హరికృష్ణ	వెయిటింగ్	రహదారులు, భవనాలు
ఎం.పి.జనార్దనరెడ్డి	మైనార్టీ సంక్షేమం	ఆర్డీవో, కల్వకుర్తి
ఎం.జయమ్మ	ఎస్ఏఎం, కాలుష్య నియంత్రణ	డీఆర్వో, యాదాద్రి

బనకచర్లను ఆపే దమ్ము మాకుంది: మేడిపల్లి సత్యం



సాక్షి, హైదరాబాద్: బనకచర్ల ప్రాజెక్టును ఆపే దమ్ము కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉందని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం స్పష్టం చేశారు. ఆయన శనివారం సీఎల్పీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. బనకచర్ల పేరుతో మాజీ మంత్రి హరీశ్‌రావు తెగ హడావుడి చేస్తున్నారన్నారు. ఆయనకు అంత కష్టం అవసరం లేదని, బనకచర్లను ప్రభుత్వం ఆపి తీరుతుందని చెప్పారు. నారా లోకేశ్ మాటలను పట్టించుకోవాల్సిన అవసరంలేదని, తమను కాదని ఆయన బనకచర్ల ఎలా కడతారో చూస్తామని సవాల్ చేశారు. లోకేశ్ మాటలను బూచిగా చూపి హరీశ్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శిస్తుంటే.. కేటీఆర్ మాత్రం లోకేశ్ తనకు తమ్ముడి లాంటివాడని సన్నాయి నొక్కులు నొక్కుతున్నారని ఎద్దేవా చేశారు. అసలు లోకేశ్‌ను కేటీఆర్ ఎందుకు కలిశారో హరీశ్‌రావు చెప్పాలని డిమాండ్ చేశారు.

కాంగ్రెస్ పార్టీ అంటేనే లంబాడాలు

దేవరకొండ ఎమ్మెల్యే బాలూనాయక్



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ అంటేనే తెలంగాణలో లంబాడాలు అని, తెలంగాణ ప్రాంత లంబాడాలు దివంగత మాజీ ప్రధాని ఇందిరాగాంధీకి రుణపడి ఉంటారని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలూనాయక్ వ్యాఖ్యానించారు. అందుబాటులో ప్రజాప్రతినిధులు కార్యక్రమంలో భాగంగా శనివారం ఆయన గాంధీభవన్‌లో ప్రజల నుంచి పలు సమస్యలపై వినతిపత్రాలు స్వీకరించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బీఆర్ఎస్ హయాంలో ప్రజల సమస్యలను ఏకరువు పెట్టుకునేందుకు కూడా అనుమతి ఉండేది కాదని, కాంగ్రెస్ హయాంలో ప్రజలకు ప్రజాప్రతినిధులు అందుబాటులో ఉండి వారి సమస్యలను విని, దరఖాస్తులను స్వీకరించి వాటి పరిష్కారం కోసం కృషి చేస్తున్నామని చెప్పారు. బీజేపీ అధ్యక్ష పదవిని రాంచందర్‌రావుకు ఇవ్వడంతోనే ఆ పార్టీకి బీసీల పట్ల ఉన్న చిత్తశుద్ధి అర్థమైందని బాలూనాయక్ విమర్శించారు. దళిత నేతను పార్టీ దేశాధ్యక్షుడిగా నియమించిన ఘనత కాంగ్రెస్ పార్టీకి దక్కుతుందని పేర్కొన్నారు. తెలంగాణ నీటి వాటాను తాకట్టు పెట్టింది బీఆర్ఎస్ నేతలేనని, వారి హయాంలోనే బనకచర్ల ప్రాజెక్టును ఏపీ ప్రభుత్వం ప్రారంభించిందని ఆరోపించారు.

రెండు లక్షల ఉద్యోగాలేవి?

బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుంగబాలు

సాక్షి, హైదరాబాద్: అధికారంలోకి వస్తే రెండు లక్షల ఉద్యో గాలు ఇస్తామన్న హామీ ఏమైందని సీఎం రేవంత్‌రెడ్డిని.. బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుంగబాలు ప్రశ్నించారు. జాబ్ క్యాలెండర్ ప్రకటించి నేటికి ఏడాది గడుస్తున్నా.. ఇప్పటి వరకు అతీగతి లేదని శనివారం ఒక ప్రకటనలో విమర్శించారు. రోజురోజుకూ నిరుద్యోగులకు భ్రమలు కల్పిస్తూ.. వారి తల్లిదండ్రులను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు.

క్లుప్తంగా

'ఈవెంట్ మేనేజ్‌మెంట్'కి ఏపీ ప్రోత్సాహం

పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్

సాక్షి, అమరావతి: పర్యాటక, ఆతిథ్య రంగాల్లో కీలకపాత్ర పోషిస్తోన్న ఈవెంట్ మేనేజ్‌మెంట్ రంగానికి ఏపీలోని కూటమి ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తుందని రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. రాజస్తాన్‌లో నిర్వహిస్తోన్న ఈవెంట్ అండ్ ఎంటర్ టైన్ మెంట్ మేనేజ్ మెంట్ అసోసియేషన్ వార్షికోత్సవ కార్యక్రమంలో ఆయన శనివారం మాట్లాడారు. ఏపీ టూరిజం అథారిటీ 21 ఈవెంట్ మేనేజ్ మెంట్ ఏజెన్సీలను రెండు కేటగిరీల కింద ఎంప్యానెల్‌మెంట్ చేసిందని చెప్పారు. కేటగిరీ-ఏ లో మెగా, జిల్లా స్థాయి ఈవెంట్స్, కేటగిరీ-బీలో జిల్లా స్థాయి ఈవెంట్స్ ఉంటాయని వివరించారు. వివిధ పర్యాటక పండగల ద్వారా ఏపీలో పర్యాటకులను ఆకర్షించాలని భావిస్తున్నట్లు చెప్పారు. ఈ నేపథ్యంలో ఈవెంట్ క్యాలెండర్‌ను సిద్ధం చేశామన్నారు. గడిచిన 6 నెలల్లో ఏపీ ప్రభుత్వం 85కి పైగా ప్రఖ్యాత హోటళ్లతో, ఎంఐసీఈలతో ఎంవోయూలు చేసుకున్నట్లు తెలిపారు.

ఎఫ్ఏ-1 పరీక్షలు వాయిదా వేయండి

సాక్షి, అమరావతి : ఆగస్టు 15 వేడుకల నేపథ్యంలో ఎఫ్ఏ-1 పరీక్షలను వాయిదా వేయాలని ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర అధ్యక్షుడు సీవీ ప్రసాద్ విద్యాశాఖను కోరారు. దాదాపు అన్ని స్కూళ్లలో విద్యార్థులకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారని, ఇందుకోసం ముందు నుంచే ఏర్పాట్లు చేస్తారని పేర్కొన్నారు. ఈ నెల 11వ తేదీ నుంచి ఎఫ్ఏ-1 పరీక్షలు నిర్వహిస్తే పాఠశాలల్లో వేడుకలకు అవరోధంగా ఉంటాయని.. ఈ నేపథ్యంలో పరీక్షలను వాయిదావేయాలని విజ్ఞప్తి చేశారు.

పింఛన్ల పంపిణీ పొడిగింపు

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం పింఛన్ల పంపిణీని ఈ నెల 4వ తేదీ వరకు పొడిగించింది. ఈ మేరకు గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) అన్ని మండలాల్లో పింఛన్లు పంపిణీ చేసే సిబ్బందికి సమాచారం పంపించింది.

స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ఉపసంహరించాలి

నారాయణ డిమాండ్

సాక్షి, హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్‌లో స్మార్ట్ మీటర్ల ఏర్పాట్లను కూటమి ప్రభుత్వం వెంటనే ఉపసంహరించాలని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ డిమాండ్ చేశారు. అవి స్మార్ట్ మీటర్లు కావని, విష్ణుచక్రాలని విమర్శించారు. హైదరాబాద్‌లోని సీపీఐ రాష్ట్ర కార్యాలయం మగ్దూంభవన్‌లో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బిల్లులను నాలుగేళ్లుగా పెండింగ్‌లో పెట్టడం శోచనీయమని పేర్కొన్నారు. తెలుగు రాష్ట్రాల్లో వెంటనే ఫీజు రీయింబర్స్‌మెంట్ చేయాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వ విద్యాసంస్థల్ని రాజకీయాలకు వాడుకుంటున్నది కూటమి నేతలే

వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం నేతలు పానుగంటి చైతన్య, ఎ.రవిచంద్ర

సాక్షి, అమరావతి: ప్రభుత్వ విద్యాసంస్థల్లో కూటమి నేతలే రాజకీయ కార్యకలాపాలు నిర్వహిస్తున్నారని ముందు వారిపై చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎ.రవిచంద్ర శనివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లోకి హెడ్మాస్టర్, ప్రిన్సిపాల్ అనుమతుల్లేకుండా ఎవ్వరూ రాకూడదని పాఠశాల విద్యా శాఖ జారీ చేసిన ఉత్తర్వుల్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని కోరారు. మెగా, టీచర్ పేరెంట్ మీటింగ్‌లను టీడీపీ కార్యక్రమంలాగా చంద్రబాబు, లోకేశ్ నిర్వహించారని ధ్వజమెత్తారు. హరిహర వీరమల్లు చిత్ర ఈవెంట్ కోసం ఆంధ్రా యూనివర్సిటీ కాన్వకేషన్ హాలును ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఎలా వినియోగించుకున్నారని ప్రశ్నించారు. ప్రభుత్వ విద్యాసంస్థల్ని కూటమి రాజకీయ కేంద్రాలుగా వాడుకుంటున్నారని దుయ్య బట్టారు.

స్వేచ్ఛ, ప్రజాస్వామిక హక్కులు హరించడమే: ఎస్ఎఫ్ఐ

పాఠశాల విద్యాశాఖ ఇచ్చిన ఆదేశాలు విద్యార్థుల స్వేచ్ఛ, ప్రజాస్వామిక హక్కులను హరించేలా ఉన్నాయని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆంధ్రప్రదేశ్ కమిటీ ఓ ప్రకటనలో విమర్శించింది. తక్షణమే ఆ ఉత్తర్వులు వెనక్కి తీసుకోవాలని కమిటీ డిమాండ్ చేసింది.

డిగ్రీ ప్రవేశాలు చేపట్టాలి

ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పవన్‌కుమార్

సాక్షి, అమరావతి : డిగ్రీ కోర్సుల్లో వెంటనే ప్రవేశాలు చేపట్టాలని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మల్లవరపు పవన్‌కుమార్ శనివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 14 నెలలు గడుస్తున్నా.. ఇప్పటికీ గత ప్రభుత్వాలపై విమర్శలకే పరిమితమై.. తన బాధ్యతలను విస్మరించిందని విమర్శించారు. ఇంటర్ ఫలితాలొచ్చి నాలుగు నెలలైనా ఇప్పటికీ డిగ్రీ ప్రవేశాలకు నోటిఫికేషన్ ఇవ్వకపోవడం దారుణమన్నారు. ఉన్నత విద్యా మండలి, ఉన్నత విద్యాశాఖ అధికారులు పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వం స్పందించకుంటే ఏబీవీపీ ఆధ్వర్యంలో ఉద్యమిస్తామని హెచ్చరించారు.

స్మార్ట్ షాక్



కొనసాగుతున్న స్మార్ట్ మీటర్ల బిగింపు

కోనసీమ జిల్లాలో 6.32 లక్షల విద్యుత్ సర్వీసులు / తొలి దశలో కేటగిరీ-2 సర్వీసులకు ఏర్పాటు / వినియోగదారుల ఆవేదన

సాక్షి, అమలాపురం: తమపై విద్యుత్ భారం పడుతుందని వినియోగదారులు.. తమ ఉపాధికి ఇబ్బంది కలుగుతుందని అని మీటర్ రీడర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నా స్మార్ట్ మీటర్ల ఏర్పాటుపై ఏపీఈపీడీసీఎల్ వెనక్కు తగ్గడం లేదు. ఎంత మంది వేడుకున్నా, ఆందోళనకు దిగుతామని హెచ్చరిస్తున్నా పట్టించుకోవడం లేదు. బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో స్మార్ట్ మీటర్ల బిగింపును వేగవంతం చేశారు. దీనితో ఈ నెల 5వ తేదీ నుంచి ఆందోళనలకు ప్రజా సంఘాలకు సిద్ధమవుతున్నాయి.

49,325 సర్వీసులకు ఏర్పాటు

కోనసీమ జిల్లాలో స్మార్ట్ మీటర్ల ఏర్పాటు వినియోగదారులు గుండెల్లో ప్రకంపనలు సృష్టిస్తోంది. జిల్లా వ్యాప్తంగా వివిధ క్యాటగిరీలలో 6.32 లక్షల విద్యుత్ సర్వీసులున్నాయి. తొలి విడతలో క్యాటగిరీ-2 పరిధిలో ఉన్న షాపులు, పరిశ్రమలు, సినిమా హాళ్లు, ఎక్కువ విద్యుత్తు వినియోగించే వ్యాపార సంస్థలకు సర్వీసులకు స్మార్ట్ మీటర్లు వేస్తున్నారు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా 63,686 సర్వీసులు క్యాటగిరి- 2 పరిధిలో ఉండగా, ఇంత వరకు 49,325 విద్యుత్ సర్వీసులకు స్మార్ట్ మీటర్లు వేయడం పూర్తి చేశారు. ఈ మీటర్ల ఏర్పాటుపై వ్యాపార సంఘాల నుంచి వ్యతిరేకత వస్తున్నా విద్యుత్ శాఖ అధికారులు వెనకడుగు వేయడం లేదు. కొన్ని ప్రాంతాల్లో మీటర్లు వేయవద్దని అడ్డుకుంటున్నా లెక్క చేయడం లేదు. జిల్లా వ్యాప్తంగా 5,43,481 సర్వీసులు క్యాటగిరీ-1లో ఉన్నాయి. వీటికి స్మార్ట్ మీటర్లు వేసేది లేదని అధికారులు చెబుతున్నా వినియోగదారులలో నమ్మకం కలగడం లేదు. ఇటు రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం, అటు కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం ఒక కార్పొరేట్ సంస్థకు మేలు చేయాలనే బలమైన సంకల్పంతో ఉండడం వల్ల కేటగిరీ-1లో ఉన్న గృహాలకు కూడా రెండో దశలో స్మార్ట్ మీటర్లు బిగిస్తారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

అభ్యంతరాలు ఇవే

స్మార్ట్ మీటర్ల బిగింపు భారం వినియోగదారులపై ఉండదని ఏపీఈపీడీసీఎల్ అధికారులు చెబుతున్నారు. అయితే ఆ భారం ఏదో ఒక రూపంలో తమపై వేస్తారని వినియోగదారుల ఆందోళన చెందుతున్నారు. స్మార్ట్ మీటర్ ఖర్చు సింగిల్ ఫేజ్‌కు రూ.9 వేలు, త్రీఫేజ్‌కు రూ.17 వేల చొప్పున మొత్తం 93 నెలల్లో వాయిదాల పద్ధతిలో వినియోగదారుల నుంచే వసూలు చేస్తారనే ప్రచారం జరుగుతోంది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇందన సర్దుబాటు చార్జీల పేరుతో వినియోగదారుల నడ్డి విరుస్తున్న విషయాన్ని వినియోగదారులు గుర్తు చేస్తున్నారు.

- ఏదైనా కారణాల వల్ల స్మార్ట్ మీటర్ పాడైపోతే సొమ్ములు చెల్లించి కొత్త మీటర్ మార్చుకోవాలి.
- స్మార్ట్ మీటర్ పెట్టిన తర్వాత గంట గంటకూ రీడింగ్ తీస్తారు. పగలు కంటే రాత్రి వాడే కరెంటుకు అధిక బిల్లులు వేస్తారు. వేసవి కాలంలో ఎక్కువ రేట్లు వసూలు చేస్తారని వినియోగదారుల అనుమానం.
- విద్యుత్ బిల్లులలో తప్పులకు సమాధానం చెప్పే నాథుడే ఉండడు. ఈ మీటర్లతో ప్రజల వ్యక్తిగత గోప్యతకు ప్రమాదం ఏర్పడుతుందనే అనుమానాలున్నాయి.



అమలాపురం దేవాంగుల వీధిలో ఏర్పాటు చేసిన స్మార్ట్ మీటర్

5న సబ్ స్టేషన్ల ముట్టడి

కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఒక వైపు విద్యుత్ చార్జీల బాదుడు, మరో వైపు స్మార్ట్ మీటర్ల భారంతో వినియోగదారులు సతమతమవుతున్నారు. దీనిపై ఈ నెల 5వ తేదీన విద్యుత్ సబ్ స్టేషన్ల ముట్టడికి ప్రజా సంఘాలు సిద్ధమవుతున్నాయి. బలవంతంగా బిగిస్తున్న స్మార్ట్ మీటర్లను తక్షణం నిలుపుదల చేయాలని డిమాండ్ చేస్తూ ప్రజావేదిక ఆధ్వర్యంలో అమలాపురం సీఐటీయూ కార్యాలయంలో ఇటీవల రౌండ్ టేబుల్ సమావేశం జరిగిన విసయం తెలిసిందే. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జి.దుర్గా ప్రసాద్, ఏఐటీయూసీ నాయకుడు వాసంశెట్టి సత్తిరాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో సీఐటీయూ, ఏఐటీయూసీ, వ్యవసాయ కార్మిక సంఘం, కౌలు రైతు సంఘం తదితర ప్రజా సంఘాల ముఖ్య నాయకులు హాజరయ్యారు.

ఉపాధికి ఎసరు

స్మార్ట్ మీటర్ల వల్ల తాము ఉపాధి కోల్పోతామనే ఆందోళనలో మీటర్ రీడర్లు ఉన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు 500 మంది వరకు ఉండగా కోనసీమ జిల్లాలో సుమారు 180 మంది వరకు ఉన్నారని అంచనా. వీరికి నెలకు సగటున రూ.పది వేల వరకు వస్తోంది. స్మార్ట్ మీటర్ల వల్ల తమ ఉద్యోగాలకు ఇబ్బంది ఏర్పడుతుందని వీరు ఆందోళన చెందుతున్నారు. వీరందరూ పొట్టకూటి కోసం పోరుబాట పట్టారు. ఇప్పటికే కలెక్టరేట్ల వద్ద ఆందోళనకు దిగి, రాష్ట్ర వ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు చేస్తున్నారు.

భవిష్యత్తులో ఇబ్బందులు



విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటు వల్ల వినియోగదారులకు భవిష్యత్తులో పలు రకాల ఇబ్బందులు రానున్నాయి. ఇది వినియోగదారులకు మోయలేని భారంగా మారనుంది. స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు నిరసనగా ఈనెల 5న చేపట్టే ఆందోళనకు అన్నివర్గాల ప్రజలు ముందుకు రావాలి.

– కొప్పుల సత్తిబాబు, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఏఐటీయూసీ అధ్యక్షుడు

అపోహలొద్దు



విద్యుత్ స్మార్ట్ మీటర్ల బిగింపుపై అపోహలు వద్దు. వినియోగదారులపై ఎలాంటి అదనపు చార్జీల భారం ఉండదు. పాత మీటర్లతో పోలిస్తే స్మార్ట్ మీటర్ల ద్వారా వ్యవస్థలో పారదర్శక పెరుగుతుంది. స్మార్ట్ మీటర్ కన్స్యూమర్ యాప్ ద్వారా 247కు కనెక్ట్ అయి ఉంటాయని, ఫలితంగా వినియోగదారులు తమ వినియోగాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చు.

– బి రాజేశ్వరి, ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ, కోనసీమ



స్మార్ట్ మీటర్ల వల్ల తాము ఉద్యోగాలు కోల్పోతామని కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న విద్యుత్ రీడర్లు (ఫైల్)



స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా అమలాపురంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశం (ఫైల్)

వాణిజ్యం వనితలదే!

- ఐఐఎం విశాఖ ఎంబీఏ కోర్సుల్లో రికార్డు స్థాయిలో మహిళలు
- ఈసారి ఏకంగా 52 శాతం మంది చేరిక
- మొత్తం347 సీట్లకు గాను 181 సీట్లుఅతివలకే..
- 2015లోకేవలం
- 10–15 శాతం మాత్రమే.. మహిళా ప్రాధాన్యం
- ఎక్కువగా ఉన్న ఐఐఎంల్లో విశాఖ రెండోస్థానం



ఐఐఎం విశాఖపట్నంలో ఎంబీఏలో చేరిన మహిళలు

సాక్షి, విశాఖపట్నం : ఔత్సాహిక మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్-విశాఖపట్నం(ఐఐఎంవీ) విభిన్న ఆలోచనలతో ముందుకెళ్తోంది. మహాత్మాగాంధీ నేషనల్ ఫెలోషిప్ పొందిన తర్వాత ఐఐఎంలో చేరేందుకు మహిళలు ఎక్కువగా ఆసక్తి చూపిస్తున్నారు. 2015లో ప్రారంభమైన తర్వాత మొదటిసారిగా ఐఐఎం విశాఖపట్నంలో ఫ్లాగ్‌షిప్ ఎంబీఏ పోస్ట్ గ్రాడ్యుయేషన్ ప్రోగ్రామ్‌లో నారీశక్తి పెరిగింది. 2025–27 విద్యా సంవత్సరంలో మహిళా విద్యార్థులు పైచేయి సాధించారు. ఇటీవలే కోర్సుకు సంబంధించి ప్రవేశాల కౌన్సెలింగ్ ప్రక్రియ పూర్తయింది. ఎంబీఏలో మొత్తం 347 సీట్లుండగా 181 సీట్లు మహిళా అభ్యర్థులు పొందగా.. 166 సీట్లు పురుషులకు దక్కాయి. అంటే 52.16 శాతం సీట్లు వనితలకే దక్కినట్లయింది. ఇందులో 26 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన వారున్నారు. వాణిజ్య, మానవ వనరులు, మార్కెటింగ్, తదితర రంగాల్లో రాణించేందుకు మొగ్గు చూపుతున్నారు.

దశాబ్ది కాలంలో ఇదే అత్యధికం

2015లో కోర్సులను ప్రారంభించిన తర్వాత ఐఐఎం విశాఖపట్నంలో పీజీపీ ఎంబీఏ కోర్సులో మహిళాధిక్యత పెరగడం ఇదే తొలిసారి. ఐఐఎంవీలో మిగిలిన అన్ని కోర్సుల్లో స్త్రీ-పురుషుల అడ్మిషన్ బేధం 35 నుంచి 40 శాతం ఉండేది. 2015–16లో 10 నుంచి 15 శాతం మంది మహిళలు మాత్రమే కోర్సులో చేరారు. క్రమంగా ఈ అంతరం తగ్గుతూ వస్తోంది. మహిళల్ని ప్రోత్సహించేందుకు వుమెన్ స్టార్టప్స్, సూపర్ న్యూమరీ మొదలైన అవుట్ రీచ్ కార్యక్రమాలు నిర్వహిస్తూ అవగాహన కల్పిస్తోంది. అందుకే 2025–26లో 52.16 శాతం మంది మహిళల ప్రవేశాల వెనుక ఐఐఎం అధికారుల శ్రమ ఎంతో ఉంది. ఐఐఎం కోజికోట్‌లో ఫుల్ టైమ్ పీజీపీలో 51 శాతం మంది మహిళలు చేరారు. ఐఐఎం అహ్మదాబాద్, ఐఐఎం లక్నోలో 30 శాతం మహిళలు అడ్మిషన్లు పొందారు. బాలికా విద్యకు కుటుంబాల్లో ప్రోత్సాహం పెరుగుతుండటం, రోల్ మోడల్స్‌ను ఎంపిక చేసుకుని.. వారి లక్ష్యాలకు అనుగుణంగా అడుగులు వేయాలని మహిళల్లో సంకల్పం పెరగడం.. కార్పొరేట్ సెక్టార్‌లో పెరుగుతున్న డిమాండ్ వనితలను ఇటువైపుగా అడుగులు వేయిస్తోంది.

60 శాతం ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్స్

ఈ విద్యా సంవత్సరంలో అడ్మిషన్లు పొందిన వారిలో ఇంజనీరింగ్ విద్యార్థులు ఎక్కువగా ఉన్నారు. మొత్తం విద్యార్థుల్లో 60 శాతం మంది ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్స్ ఉండగా.. 16 శాతం మంది కామర్స్, 11 శాతం మంది మేనేజ్‌మెంట్ డిసిప్లిన్స్ అకౌంట్, 8 శాతం సైన్స్ విద్యార్థులు, 6 శాతం ఆర్ట్స్ విద్యార్థులు ఉన్నారు. ఇప్పటికే వివిధ రంగాల్లో విధులు నిర్వర్తించి.. పీజీపీ ఎంబీఏ ప్రోగ్రామ్‌లో చేరిన వారు 32 శాతం మంది ఉండటం విశేషం. ఐటీ రంగంలో ఉద్యోగాలు చేసి ఎంబీఏలో చేరిన వారు 32 శాతం మంది ఉన్నారు.

మహిళా ప్రొఫెసర్ల సంఖ్య పెరుగుతోంది



స్త్రీ, పురుషులకు సమాన అవకాశాలు కల్పించడంలో ఐఐఎం విశాఖపట్నం ముందు వరసలో ఉంది. ఈ ఏడాది తొలిసారిగా పీజీపీ అభ్యర్థుల ప్రవేశాల కోసం ప్రతి ఇంటర్వ్యూ ప్యానెల్‌లో ప్రత్యేకంగా మహిళా ఫ్యాకల్టీని నియమించాం. మహిళలను ప్రోత్సహించేందుకు అన్ని ప్రోగ్రామ్స్‌లోనూ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. ఐఐఎం విశాఖపట్నంలో కోర్సులో చేరుతున్న అభ్యర్థుల లోనే కాకుండా.. మహిళా ప్రొఫెసర్ల సంఖ్య కూడా పెరిగింది. గతేడాది మహిళా ఫ్యాకల్టీ 41 శాతం ఉండగా.. ఈసారి 50 శాతానికి చేరుకుంది. ఇది విద్యా విధానంలో శుభపరిణామం.

– ప్రొ.ఎం చంద్రశేఖర్, ఐఐఎంవీ డైరెక్టర్

చీనీ కాయలు తరలించారు.. డబ్బులు ఎగ్గొట్టారు!


అమరావతి శంకుస్థాపనకు పులివెందుల నుంచి తరలిన 150 టన్నుల చీనీ కాయలు / డబ్బులు చెల్లించని అధికారులు



విక్రయానికి సిద్ధంగా ఉన్న చీనీ కాయలు

పులివెందుల రూరల్ : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అమరావతిలో నూతన రాజధాని నిర్మాణ పనులకు ఈ ఏడాది జూన్ 2వ తేదీన భారత ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శంకుస్థాపన చేయించారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులు వైఎస్సార్ జిల్లా పులివెందుల నియోజకవర్గంలోని చీనీ కాయల రైతుల వద్ద నుంచి సుమారు రూ.25 లక్షలు విలువచేసే 150 టన్నుల చీనీ కాయలను విజయవాడకు 11 లారీలలో తరలించారు. మూడు నెలలవుతున్నప్పటికీ అధికారులు చీనీ కాయల మండి యజమానులు, రైతులకు డబ్బులు చెల్లించలేదు. ప్రభుత్వం నుంచి వచ్చిన చీనీ కాయల డబ్బులను అధికారులు మండి యజమానులకు చెల్లిస్తే వారు రైతులకు చెల్లించాల్సి ఉంది. మూడు నెలల నుంచి చీనీ కాయల డబ్బులు ఇవ్వాలని అడుగుతున్నా అటు ప్రభుత్వ అధికారులు కానీ, ఇటు ప్రజాప్రతినిధులు గానీ పట్టించుకోవడంలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులను చీనీ కాయల డబ్బులు చెల్లించాలని అడిగితే ఒకరి మీద ఒకరు చెప్పుకుంటున్నారని వారు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి విజయవాడకు తరలించిన చీనీ కాయలకు సంబంధించిన డబ్బులు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని మండి యజమానులు, రైతులు కోరుతున్నారు.

చీనీ కాయల డబ్బులను వెంటనే చెల్లించాలి



ప్రధాని మోదీ అమరావతి శంకుస్థాపనకు వస్తున్నారని కూటమి నాయకులు, సంబంధిత అధికారులు పులివెందుల ప్రాంతంలోని పలు మండలాల నుంచి సుమారు 150 టన్నుల చీనీ కాయలను తరలించారు. మూడు నెలలవుతున్నా ఒక్క పైసా కూడా ఇవ్వ లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చీనీ కాయలకు సంబంధించిన డబ్బులను వెంటనే ఇవ్వాలి.

– సూరారెడ్డి, చీనీ కాయల మండీ అసోసియేషన్ అధ్యక్షుడు, పులివెందుల.

ప్రపంచ టాప్ పోర్టులలో విశాఖ

పోర్ట్ అధికారి ఎస్.శ్రీధర్

అమీర్‌పేట: ప్రపంచ వ్యాప్తంగా ఉన్న టాప్ పోర్టులలో విశాఖపట్నం ఒకటని పోర్ట్ అధికారి, కస్టమ్స్ ప్రిన్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీధర్ తెలిపారు. తెలంగాణ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఎఫ్‌టీసీసీఐ)తో కలిసి హైదరాబాద్‌లో శుక్రవారం రాత్రి నిర్వహించిన ట్రేడ్ మీట్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2025–26 ఆర్థిక సంవత్సరానికి విశాఖ పోర్టు 90 మిలియన్ టన్నుల కార్గో నిర్వహణ లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. త్వరిత టర్న్ రౌండ్ టైమ్, యాంత్రీకరణ, రియల్ టైమ్ కార్గో మానిటరింగ్ కారణంగా విశాఖ పోర్ట్ ప్రస్తుతం భారతదేశంలోనే వేగవంతమైన పోర్ట్‌గా నిలిచిందన్నారు. ఎఫ్‌టీసీసీఐ అధ్యక్షులు ఆర్.రవికుమార్ మాట్లాడుతూ భారత్ ఎగుమతుల్లో పరిమాణంగా 95 శాతం, విలువ పరంగా 70 శాతం పోర్టుల ద్వారానే జరుగుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పలువురు సీనియర్ అధికారులతోసహా దేశ నలుమూలల నుండి 200 మందికి పైగా ఎగుమతి, దిగుమతి దారులు పాల్గొన్నారు.

మహిళా కానిస్టేబుల్‌కు ఎస్ఐ వేధింపులు

డీజీపీ కార్యాలయానికి అటాచ్ చేస్తూ ఉత్తర్వులు

సూర్యాపేట టౌన్: మహిళా కానిస్టేబుల్‌ను లైంగికంగా వేధించారన్న ఆరోపణలపై.. సూర్యాపేట జిల్లా నూతనకల్ ఎస్ఐ వి.ప్రవీణ్‌కుమార్‌ను డీజీపీ కార్యాలయానికి అటాచ్ చేశారు. ఈ మేరకు శనివారం మల్టీజోన్ -2 ఇన్‌చార్జి ఐజీ తఫ్సీర్ ఇక్బాల్ ఉత్తర్వులు జారీ చేశారు. ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తనను లైంగికంగా వేధిస్తున్నట్లు.. అదే పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న మహిళా కానిస్టేబుల్ పోలీస్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై ప్రాథమిక విచారణ జరిపిన అధికారులు.. ఆ ఎస్ఐను డీజీపీ కార్యాలయానికి అటాచ్ చేశారు. పూర్తి విచారణ అనంతరం చర్యలు తీసుకోనున్నట్లు తెలిసింది. ఈ ఎస్ఐ గతంలో శాలిగౌరారం మండలంలో విధులు నిర్వర్తిస్తున్నప్పుడు.. ఒక మహిళను వేధించినట్లు ఆరోపణలు రావడంతో పోలీస్ ఉన్నతాధికారులు బదిలీ వేటు వేశారు.

ఏజెన్సీ ప్రాంతాల్లోని స్కూళ్లకు పక్కా భవనాలు నిర్మించాలి

సాక్షి, అమరావతి : ఏజెన్సీ ప్రాంతాల్లో రేకుల షెడ్లలో నిర్వహిస్తున్న ప్రభుత్వ స్కూళ్లకు పక్కా భవనాలు నిర్మించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని కోరారు. ఈ విషయమై విద్యాశాఖ మంత్రి లోకేశ్‌కు రాసిన లేఖను శ్రీనివాసరావు శనివారం మీడియాకు విడుదల చేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లా హుకుంపేట మండలం మారుమూల ఓల్డా పంచాయతీ పేడిరాయి గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలను జూలై 24వ తేదీన పరిశీలించామని, దానికి పక్కా భవనం లేక రేకుల షెడ్డులో నిర్వహిస్తున్నారని తెలిపారు. 2020–21లో నాడు–నేడు పథకంలో రూ.25 లక్షలు మంజూరుకావడంతో ఆ స్కూల్‌కు పక్కా భవన నిర్మాణ పనులు చేపట్టారని.. వెంటనే భవన నిర్మాణాన్ని పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. పాడేరు జిల్లా పరిధిలోని ఏజెన్సీలో మొత్తం 250 పాఠశాలలకు పక్కా భవనాల్లేవని తక్షణమే వాటికి భవనాలు నిర్మించాలని కోరారు.

ఎస్వీయూలో బీటెక్ (స్వీడన్) ప్రవేశాలకు ఆహ్వానం

తిరుపతి సిటీ: ఎస్వీయూ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ (స్వీడన్) కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం- స్వీడన్‌లోని 'బ్లెకింగ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ'తో జరిగిన పరస్పర అంగీకార ఒప్పందం ప్రకారం ఎస్వీయూ బీటెక్ నాలుగేళ్ల కోర్సు కొనసాగుతోందని తెలిపారు. అయితే ఈ ప్రోగ్రాం మూడేళ్లు ఎస్వీయూలో, ఒక సంవత్సరం స్వీడన్‌లోని బెక్లింగ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో విద్యార్థులు చదవాల్సి ఉంటుందని పేర్కొన్నారు. కావున 2025–26 విద్యా సంవత్సరానికి ఈ ప్రోగ్రాంలో చేరదలచిన విద్యార్థులు ఈనెల 4 వ తేదీ నుంచి 14 వతేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. వర్సిటీ డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్ల విభాగం ద్వారా ఆసక్తిగల విద్యార్థులు ఈ కోర్సులో ప్రవేశాలు పొందవచ్చని తెలిపారు. మరిన్ని వివరాలకు వర్సిటీ అధికారిక వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

వైభవంగా అగ్నిగుండ ప్రవేశం

నారాయణవనం : భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం సాయంత్రం వైభవంగా అగ్నిగుండ ప్రవేశం నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు అగ్నిగుండ ప్రవేశం చేసి మొక్కులు చెల్లించుకున్నారు. రాత్రి ఉత్సవర్లకు పులివాహన సేవ చేపట్టారు. వీరభద్రస్వామివారు కోటవీధి, సెంగుందర్ వీధుల్లో విహరిస్తూ కర్పూ హారతులు అందుకున్నారు. ఏఈఓ రవి, సూపరింటెండెంట్ ధర్మయ్య, ఆలయ అధికారి నాగరాజు, అర్జితం అధికారి భరత్ తదితరులు పర్యవేక్షించారు. ఆదివారం సాయంత్రం గజవాహనంపై ఉత్సవర్లు ఊరేగనున్నట్లు ఆలయ అధికారి నాగరాజు తెలిపారు.

వెంగమాంబకు పుష్పాంజలి

తిరుపతి అన్నమయ్యసర్కిల్ : మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ 208వ వర్ధంతిని పురస్కరించుకుని శనివారం ఎమ్మార్‌పల్లె సర్కిల్ వద్ద వెంగమాంబ విగ్రహానికి టీటీడీ శ్వేతా విభాగం అధికారులు ఘనంగా పుష్పాంజలి ఘటించారు. అనంతరం అన్నమాచార్య కళామందిరంలో బి. మంజుల, టి. తేజోవతి బృందం, అన్నమాచార్య ప్రాజెక్ట్ కళాకారుల బృందం వెంగమాంబ కీర్తనలతో సంగీత కచేరి నిర్వహించారు. అనంతరం శ్రీనివాస కల్యాణంపై కె. చంద్రశేఖర్ బృందం హరికథను గానం చేశారు. ఈ క్రమంలోనే అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు భక్తి సంగీత కార్యక్రమాలు నిర్వహించారు.


● ఎన్టీఆర్


● ప్రభాస్


● విజయ్ దేవరకొండ

మాస్ కాదు... ఫ్యాంటసీ

'వీరసింహారెడ్డి' వంటి హిట్ ఫిల్మ్ తర్వాత హీరో బాలకృష్ణ, దర్శకుడు గోపీచంద్ మలినేని కాంబినేషన్‌లో మరో సినిమా రానుంది. అయితే ఈ సారి ఓ చారిత్రక కథను సిద్ధం చేశారు గోపీచంద్ మలినేని. బాలకృష్ణ హీరోగా నటించిన 'గౌతమీపుత్ర శాతకర్ణి' సినిమా తరహాలో ఈ సినిమా కూడా ఉంటుందని, ఈ హిస్టారికల్ డ్రామాలో మరో హీరోకి కూడా స్కోప్ ఉందని ఫిల్మ్‌నగర్ సమాచారం. ఈ సినిమాలో రెండో హీరోగా వెంకటేశ్ నటిస్తారని తెలిసింది. అలాగే 'గౌతమీపుత్ర శాతకర్ణి' సినిమా తర్వాత హీరో బాలకృష్ణ–దర్శకుడు క్రిష్ కాంబినేషన్‌లో మరో సినిమా రానుందని, ఇది హిస్టారికల్ డ్రామా అనే టాక్ వినిపిస్తోంది. అయితే ఈ విషయాలపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

తండ్రీకొడుకుల ఎమోషన్

'ఎల్2: ఎంపురాన్, తుడరుమ్' వంటి బ్లాక్‌బస్టర్ సినిమాల సక్సెస్‌తో ఈ ఏడాది మంచి జోరు మీద ఉన్నారు మలయాళ హీరో మోహన్ లాల్. అలాగే మోహన్‌లాల్ నటించిన మరో రెండు సినిమాలు 'వృషభ, హృదయపూర్వం' విడుదలకు సిద్ధం అవుతున్నాయి. కాగా 'వృషభ' సినిమా హిస్టారికల్ మూవీ అని ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్ స్పష్టం చేస్తోంది. తండ్రీకొడుకుల ఎమోషన్ నేపథ్యంలో సాగే ఈ సినిమాను ఈ ఏడాది అక్టోబరు 16న రిలీజ్ చేయనున్నట్లుగా

వెండితెరపై హిస్టరీ రిపీట్ అవుతోంది. అవును... వందల సంవత్సరాల క్రితం జరిగిన కొన్ని చారిత్రక సంఘటనలను వెండితెరపై ఆవిష్కరిస్తున్నారు ఫిల్మ్ మేకర్స్. ఇందుకోసం స్టార్ హీరోలు రంగంలోకి దిగారు. భారీ బడ్జెట్‌లతో నిర్మాతలు, సూపర్ టేకింగ్‌తో దర్శకులు తీస్తున్న ఆ సినిమాల వివరాలు, ఆ చారిత్రక సంఘటనల విశేషాలను తెలుసుకుందాం.


● బాలకృష్ణ


● గోపీచంద్

వెండితెరపై హిస్టరీ రిపీట్!

● హిస్టారికల్ సినిమాలు చేస్తున్న స్టార్ హీరోలు


● మోహన్‌లాల్


● రిషబ్ శెట్టి

మేకర్స్ ఆల్రెడీ ప్రకటించారు. తెలుగు, కన్నడ భాషల్లో ఏకకాలంలో రూపొందిన ఈ సినిమాకు నందకిశోర్ దర్శకత్వం వహించారు. శోభా కపూర్, ఏక్తా ఆర్. కపూర్, సీకే పద్మకుమార్, వరుణ్ మాథుర్, సౌరభ్ మిశ్రా, అభిషేక్ ఎస్. వ్యాస్, విశాల్ గుర్నాని, జూహి పరేఖ్ మెహతా ఈ సినిమాను నిర్మించారు.

సైనికుడి పోరాటం

బ్రిటిష్ పరిపాలన కాలంలో ఓ సైనికుడి వీరోచిత పోరాటం, త్యాగం, ప్రేమ... వంటి అంశాలతో ఓ హిస్టారికల్ డ్రామా సినిమా రానుంది. ఈ సినిమాలో ప్రభాస్ హీరోగా నటిస్తారు. హను రాఘవపూడి ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రంలో ప్రభాస్ సైనికుడి పాత్రలో నటిస్తున్నారని, 1940 నేపథ్యంలో ఈ సినిమా కథనం సాగుతుందని తెలిసింది. భాగ్యనగరం, నైజాంలో రజాకార్ల ఆకృత్యాలు వంటి అంశాల నేపథ్యంలో ఈ సినిమా కథనం ఉంటుందట. ఈ చిత్రం షూటింగ్ సగానికిపైగా పూర్తయిందని తెలిసింది. వచ్చే ఏడాది వేసవిలో ఈ సినిమా విడుదలయ్యే అవకాశాలు ఉన్నాయి. ఇమాన్వీ ఇస్మాయిల్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమాలో జయప్రద, మిథున్ చక్రవర్తి, అనుపమ్ ఖేర్ ఇతర ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ ఈ సినిమాను నిర్మించారు.

బెంగాల్‌లో డ్రాగన్

హీరో ఎన్టీఆర్–దర్శకుడు ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో 'డ్రాగన్' (పరిశీలనలో ఉన్న టైటిల్) సినిమా రానుంది. ఇది హిస్టారికల్ డ్రామా మూవీ అని తెలిసింది. కొన్ని వాస్తవ సంఘటనల ఆధారంగా ఈ సినిమా తెరకెక్కనుందని సమాచారం. ప్రధానంగా ఈ సినిమాలో బెంగాల్, బంగ్లాదేశ్‌ల నేపథ్యం కనిపిస్తుందట. 1850 టైమ్‌లైన్‌లో ఈ సినిమా మేజర్ కథనం ఉంటుందనే ప్రచారం సాగుతోంది. ఈ సినిమా కాన్సెప్ట్ అనౌన్స్‌మెంట్ పోస్టర్ ఈ విషయాన్ని పరోక్షంగా స్పష్టం చేస్తోంది. అయితే ఈ విషయాలపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ఇక ఈ సినిమాలో రుక్మిణీ వసంత్ హీరోయిన్‌గా నటిస్తున్నారని, విలన్‌గా మలయాళ నటుడు టొవినో థామస్ కనిపిస్తారనే ప్రచారం సాగుతోంది. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై కల్యాణ్ రామ్, కొసరాజు హరికృష్ణ, నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. తొలుత ఈ సినిమాను 2026 జనవరి 9న విడుదల చేయాలనుకున్నారు. కానీ... ఆ తర్వాత 2026 జూన్ 25కు విడుదలను వాయిదా చేశారు. ఈ సినిమాకు రవిబస్రూర్ సంగీతం అందిస్తున్నారు.


● నిఖిల్

రాయలసీమ నేపథ్యంలో...

రాయలసీమలో జరిగిన కొన్ని చారిత్రక సంఘటనలతో హీరో విజయ్ దేవరకొండ ఓ హిస్టారికల్ సినిమా చేస్తున్నారు. 2018లో విజయ్ దేవరకొండతో 'టాక్సీవాలా' రూపంలో ఓ హిట్ అందించిన రాహుల్ సంకృత్యాన్ ఈ సినిమాకు దర్శకుడు. అతి త్వరలోనే ఈ సినిమా చిత్రీకరణ ప్రారంభం కానుంది. కొద్ది రోజులుగా ఈ సినిమా చిత్రీకరణ కోసం ఓ భారీ సెట్‌ను రెడీ చేస్తున్నారు మేకర్స్. 1854–1878 మధ్య కాలంలో రాయలసీమలో జరిగిన కొన్ని సంఘటనల ఆధారంగా, ఇప్పటివరకు ఎవరూ వెండితెరపై చెప్పని ఓ సరికొత్త పాయింట్‌తో ఈ సినిమాను తెరకెక్కిస్తున్నట్లుగా మేకర్స్ ఆల్రెడీ తెలిపారు. విజయ్ దేవరకొండ సరసన రష్మికా మందన్నా హీరోయిన్‌గా నటిస్తారనే ప్రచారం సాగుతోంది. ఇదే నిజమైతే... 'గీతగోవిందం, డియర్ కామ్రేడ్' చిత్రాల తర్వాత విజయ్ దేవరకొండ–రష్మికా మందన్నా ముచ్చటగా మూడోసారి స్క్రీన్ షేర్ చేసుకున్నట్లవుతుంది. నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్, భూషణ్ కుమార్, క్రిషణ్ కుమార్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు.

రాజుల కథ

హీరో నిఖిల్ రెండు హిస్టారికల్ సినిమాలు చేస్తున్నారు. అందులో మొదటిది 'స్వయంభూ'. 'బాహుబలి' తరహా మాదిరి రాజుల కాలం నాటి కల్పిత కథతో 'స్వయంభూ' సినిమా కథనం ఉంటుంది. సంయుక్త, నభా నటేశ్ ఈ చిత్రంలో హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఈ సినిమా చిత్రీకరణ తుది దశకు చేరుకుంది. తాజా షెడ్యూల్ చిత్రీకరణ ఆంధ్రప్రదేశ్‌లో ప్రారంభం కానుందని తెలిసింది. ఠాగూర్ మధు సమర్పణలో ఈ భారీ బడ్జెట్ సినిమాను భరత్ కృష్ణమాచారి దర్శకత్వంలో భువన్, శ్రీకర్ నిర్మిస్తున్నారు. ఈ సినిమా రెండు భాగాలుగా విడుదలయ్యే అవకాశం ఉంది. త్వరలోనే ఈ సినిమా విడుదల తేదీపై ఓ స్పష్టత రానుంది. అలాగే నిఖిల్ హీరోగా చేస్తున్న మరో సినిమా 'ది ఇండియా హౌస్'. 1905 నేపథ్యంలో కొన్ని వాస్తవ చారిత్రక సంఘటనల ఆధారంగా రామ్ వంశీకృష్ణ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. ఇటీవల సెట్స్‌లో జరిగిన ఓ చిన్న ప్రమాదం కారణంగా ఈ సినిమా చిత్రీకరణ తాత్కాలికంగా వాయిదా పడింది. రామ్‌చరణ్ సమర్పణలో అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్, వి. మెగా పిక్చర్స్ సంస్థలు నిర్మిస్తున్న 'ది ఇండియా హౌస్' సినిమాలో సయీ మంజ్రేకర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, అనుపమ్ ఖేర్ ఓ కీలక పాత్రలో నటిస్తున్నారు. ఈ సినిమా 2026 చివర్లో విడుదలయ్యే అవకాశం ఉంది. 1905లో లండన్‌లో జరిగిన కొన్ని సంఘటనలు భారతదేశ స్వాతంత్ర్యంపై ఏ విధంగా ప్రభావితం చూపాయి అనే కోణంలో ఈ సినిమా కథనం సాగుతుందట. స్వాతంత్ర్య సమరయోధుడు వీర్ సవార్కర్‌కు చెందిన సంఘటనలు కూడా ఈ సినిమాలో హైలైట్‌గా ఉంటాయట.

శతాబ్దాల క్రితం నాటి కథలు కాదు... కానీ సెమీ పీరియాడికల్ సినిమాలు (50-60 సంవత్సరాల క్రితం నేపథ్యంలో) మరి కొన్ని ఉన్నాయి. రామ్‌చరణ్ హీరోగా బుచ్చిబాబు దర్శకత్వంలో రూపొందుతున్న మల్టీస్పోర్ట్స్ డ్రామా 'పెద్ది', 'దసరా' తర్వాత హీరో నాని, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లోని 'ది ప్యారడైజ్', దుల్కర్ సల్మాన్ 'కాంత', ఆది సాయికుమార్ 'శంబాల', రోషన్ మేకా 'చాంపియన్'... ఈ కోవకి చెందిన సినిమాలే.

గోపీచంద్ శూల

ప్రేక్షకులను ఏడో శతాబ్దంలోకి తీసుకుని వెళ్లనున్నారు గోపీచంద్. 'ఘాజీ, అంతరిక్షం' వంటి సినిమాలతో ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించిన సంకల్ప్ రెడ్డి డైరెక్షన్‌లో ఓ హిస్టారికల్ వార్ డ్రామా చిత్రం తెరకెక్కుతోంది. ఈ చిత్రంలో గోపీచంద్ వారియర్‌గా నటిస్తున్నారు. కశ్మీర్‌లో ఓ లాంగ్ షూటింగ్ షెడ్యూల్‌ను ఆ మధ్య పూర్తి చేశారు. ఈ సినిమా ఏడో శతాబ్దం నేపథ్యంలో సాగుతుందని, ఇప్పటివరకు చరిత్రలో ఎవరూ టచ్ చేయని ఓ పాయింట్‌తో తాము ఈ సినిమా చేస్తున్నామని చిత్రయూనిట్ పేర్కొంది. గోపీచంద్ కెరీర్‌లోని ఈ హిస్టారికల్ సినిమాను భారీ బడ్జెట్‌తో పవన్ కుమార్ సమర్పణలో శ్రీనివాసా సిల్వర్ స్క్రీన్ పతాకంపై శ్రీనివాసా చిట్టూరి నిర్మిస్తున్నారు. కాగా ఈ సినిమాకు 'శూల' అనే టైటిల్‌ను మేకర్స్ పరిశీలిస్తున్నారని తెలిసింది. ఈ సినిమా 2026 ద్వితీయార్థంలో విడుదలయ్యే అవకాశం ఉంది.

ఒకటి కాదు... రెండు కాదు... ఏకంగా మూడు హిస్టారికల్ సినిమాల్లో రిషబ్ శెట్టి నటించడం విశేషం. అది కూడా ఈ సినిమాల వరుసగా చేయడం అంటే చిన్న విషయం కాదు.

పీరియాడికల్ కథలపై కన్నడ నటుడు–దర్శక–హీరో రిషబ్ శెట్టి ఎక్కువ మక్కువ చూపిస్తున్నట్లుగా ఉన్నారు. రిషబ్ వరుసగా శతాబ్దాల క్రితం నాటి కథలతో సినిమాలు చేస్తున్నారు. రిషబ్ శెట్టి హీరోగా నటించి, స్వీయ దర్శకత్వంలో రూపొందిన తాజా సినిమా 'కాంతార: చాప్టర్ 1'. రిషబ్ శెట్టి హీరోగా నటించి, దర్శకత్వం వహించిన 'కాంతార' సినిమాకు ఇది ప్రీక్వెల్‌గా రానుంది. 'కాంతార' సినిమా కథ 1847లో మొదలై 1970లో జరిగే కొన్ని సన్నివేశాలతో కొనసాగుతుంది. అయితే ప్రధానంగా 1990 బ్యాక్‌

కాంతార ప్రీక్వెల్

డ్రాప్‌లో మేజర్ సినిమా కథనం సాగుతుంది. 'కాంతార' సినిమా కథ 1847లో మొదలైంది కనుక 'కాంతార' ప్రీక్వెల్ ఇంకా ముందు జరిగిన కథగా ఉంటుంది. ఈ ప్రకారం 'కాంతార: చాప్టర్ 1' సినిమా కనీసం రెండు వందల సంవత్సరాల క్రితం జరిగిన కథగా ప్రేక్షకుల ముందుకు రావొచ్చు. ఆల్రెడీ ఈ సినిమా చిత్రీకరణ ముగిసింది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ జరుగుతున్నాయి. ఈ చిత్రం అక్టోబరు 2న గాంధీ జయంతి సందర్భంగా విడుదల కానుంది.



తిరుగుబాటుదారుడి కథ: 'జై హనుమాన్' సినిమా తర్వాత రిషబ్ శెట్టి తెలుగులో మరో సినిమా చేసేందుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. కన్నడ, తెలుగు భాషల్లో ఏకకాలంలో చిత్రీకరణ జరుపుకోనున్న ఈ సినిమాకు అశ్విన్ గంగరాజు దర్శకత్వం వహిస్తారు. 18వ శతాబ్దంలో భారత్‌లో అల్లకల్లోలంగా ఉన్న బెంగాల్ ప్రావిన్స్‌లో ఒక తిరుగుబాటుదారుడు ఎదిగిన క్రమం నేపథ్యంలో ఈ సినిమా చేయనున్నారు రిషబ్ శెట్టి. ఈ ఫిక్షనల్ హిస్టారికల్ డ్రామాలో రిషబ్ శెట్టి హీరోగా నటిస్తారు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ఈ సినిమాను నిర్మించనున్నారు. త్వరలోనే ఈ సినిమా చిత్రీకరణ ప్రారంభం కానుంది.

మొఘల్ సామ్రాజ్యాన్ని సవాల్ చేసిన యోధుడు: ఛత్రపతి శివాజీ మహారాజ్ జీవితం ఆధారంగా 'ది ప్రైడ్ ఆఫ్ భారత్: ఛత్రపతి శివాజీ మహారాజ్' సినిమా తెరకెక్కనుంది. ఈ బయోపిక్‌కు సందీప్ సింగ్ దర్శకత్వం వహించనున్నారు. ఈ హిస్టారికల్ డ్రామా 1630– 1680 మధ్యకాలంలో ఈ సినిమా కథ సాగుతుంది. ఆల్రెడీ ఈ సినిమా ఫస్ట్ లుక్‌ను రిలీజ్ చేశారు మేకర్స్. మొఘల్ సామ్రాజ్యాన్ని సవాల్ చేసి అసమానతలకు వ్యతిరేకంగా పోరాడిన ఓ యోధుడి కథగా 'ది ప్రైడ్ ఆఫ్ భారత్: ఛత్రపతి శివాజీ మహారాజ్' సినిమా రానుందని, తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ, బెంగాలీ, మరాఠీ భాషల్లో ఏకకాలంలో 2027 జనవరి 21న రిలీజ్ చేస్తామని ఈ చిత్ర సంగీత దర్శకుడు సందీప్ రాజ్ ఆ మధ్య ఓ సందర్భంలో పేర్కొన్నారు. ఇలా.. రెండు సంవత్సరాల వ్యవధిలో మూడు హిస్టారికల్ డ్రామా కథలను ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు రిషబ్ శెట్టి.

ఇలా హిస్టారికల్ బ్యాక్‌డ్రాప్‌లో రూపొందుతున్న సినిమాలు మరికొన్ని ఉన్నాయి.

- ముసిమి శివాంజనేయులు


● ఖుషీ కపూర్



శభాష్ ఖుషీ!

ఇండస్ట్రీలో రాణించాలంటే యాక్టింగ్ ప్రతిభతో పాటు స్క్రీన్‌పై ఫిట్‌గా కూడా కనిపించాల్సి ఉంటుంది. ఆ ఫిట్‌నెస్ కోసం కఠినమైన కసరత్తులు చేస్తుంటారు తారలు. ఇందులో భాగంగా వెయిట్ లిఫ్టింగ్ కూడా చేస్తుంటారు. అయితే ఓ అమ్మాయి ఓ వంద కేజీలు బరువు ఎత్తితేనే హాట్ టాపిక్ అయిపోతుంది. అలాంటిది ఖుషీ కపూర్ జిమ్‌లో ఏకంగా 290 కేజీల బరువును లిఫ్ట్ చేయడంతో చాలామంది షాక్ అయ్యారు. దివంగత ప్రముఖ తార శ్రీదేవి చిన్న కుమార్తె ఖుషీ కపూర్ హిందీ సినిమాలు చేస్తున్నారు. ఓ హీరోయిన్‌గా ఫిట్‌గా ఉండటం కోసం ఆమె వర్కౌట్స్ చేస్తుంటారు. ఈ క్రమంలోనే హిప్ థ్రస్ట్ వర్కౌట్‌లో భాగంగా 290 కిలోల బరువును ఖుషీ కపూర్ లిఫ్ట్ చేశారు. ఈ వీడియోను ఆమె తన ఇన్‌స్టా స్టేటస్‌లో షేర్ చేయగా వైరల్ అవుతోంది. ఈ వీడియోపై నెటిజన్లు, ఆమె సోషల్ మీడియా ఫాలోయర్స్ విభిన్నరకాలుగా కామెంట్స్ చేస్తున్నారు. కొందరు శభాష్ ఖుషీ అని మెచ్చుకుంటుంటే, మరికొందరు ఈ ముద్దుగుమ్మకు ఎంత కష్టం వచ్చిందో అన్నట్లుగా కామెంట్స్ చేస్తున్నారు. ఇక ఖుషీ కపూర్ సినిమాలు ఎంపిక చేసుకునే విషయంలో చాలా పర్టిక్యులర్‌గా ఉంటున్నారట. మంచి మాస్ కమర్షియల్ సబ్జెక్ట్ లేదా డిఫరెంట్ క్యారెక్టర్స్ చేయడానికి ఆమె ఇష్టపడుతోందని రెగ్యులర్ లవ్‌స్టోరీ, గాళ్ నెక్ట్స్ డోర్... వంటివి చేసే ఆలోచన ప్రస్తుతానికి ఖుషీకి లేదని బాలీవుడ్‌లో ప్రచారం సాగుతోంది.


● గ్రామ ప్రజలతో ఆమిర్ ఖాన్

పాతికేళ్ల తర్వాత...!

పాతికేళ్ల క్రితం విడుదలైన 'లగాన్' సినిమా లొకేషన్స్‌కు వెళ్లారు బాలీవుడ్ నటుడు, దర్శక–నిర్మాత ఆమిర్ ఖాన్. ఆయన హీరోగా నటించిన తాజా హిందీ చిత్రం 'సితారే జమీన్ పర్'. జెనీలియా హీరోయిన్‌గా నటించిన ఈ సినిమాకు ఆర్‌ఎస్ ప్రసన్న దర్శకత్వం వహించగా, ఆమిర్ ఖాన్ నిర్మించారు. జూన్ 20న విడుదలైన ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా దాదాపు రూ. 300 కోట్లు సాధించి, సూపర్‌హిట్‌గా నిలిచింది. ఈ ఆగస్టు 1 నుంచి 'ఆమిర్ ఖాన్ టాకీస్–జనతా కా థియేటర్' యూట్యూబ్ చానల్‌లో పే పర్ వ్యూ విధానంలో ఈ సినిమా స్ట్రీమింగ్ అవుతోంది. కాగా ఈ సినిమాను గుజరాత్‌లోని భుజ్ నగరానికి దగ్గర్లో ఉన్న కునారియా గ్రామ ప్రజలకు ఉచితంగా ప్రదర్శించారు ఆమిర్ ఖాన్. వారితో కలిసి ప్రేక్షకుడిగా ఆమిర్ ఖాన్ ఈ సినిమాను చూసి, స్క్రీనింగ్ అనంతరం మాట్లాడారు. అలాగే అక్కడి లొకేషన్స్‌లో 'లగాన్' సినిమా చిత్రీకరించిన విషయాలను ఆమిర్ ఖాన్ గుర్తు చేసుకున్నారు. అలా పాతికేళ్ల తర్వాత 'లగాన్' సినిమాను చిత్రీకరించిన లొకేషన్స్‌కు వెళ్లి ఆమిర్ ఖాన్ నాటి విశేషాలను అక్కడి ప్రజలతో పంచుకోవడం విశేషం.

బిజినెస్ రీల్

జీఆర్‌టీ జువెలర్స్‌కు 'ప్లాటినం సీజన్ ఆఫ్ లవ్' అవార్డు



హైదరాబాద్: ప్రముఖ జ్యువెలరీ బ్రాండ్ 'జీఆర్‌టీ జువెలర్స్'ను ప్రతిష్ఠాత్మక అవార్డు వరించింది. ప్లాటినం గిల్డ్ ఇంటర్నేషనల్(పీజీఐ) నిర్వహించిన పోటీలో వరుసగా తొమ్మిదోసారి 'ప్లాటినం సీజన్ లవ్ 2025' అవార్డు సొంతం చేసుకుంది. జాతీయ స్థాయిలో జరిగిన అవార్డు ప్రదానోత్సవంలో చెన్నైకి చెందిన కోట్స్ రోడ్ షోరూం బృందం చైన్ స్టోర్ విభాగం విజేతగా నిలిచింది. అదే విధంగా సేల్స్ సాఫ్ట్ విభాగంలో విజేతగా కూడా గుర్తింపు పొందింది. విజయాలపై కంపెనీ ఎండీ ఆనంద్ అనంత పద్మనాభన్ మాట్లాడుతూ ''సుమారు 1,650 మంది రిటైలర్ల మధ్య జరిగిన పోటీలో జీఆర్‌టీ జ్యువెలర్స్ మరోసారి ప్రత్యేకతను చాటుకుంది. ఇది చాలా ఆనందాన్ని కలిగిస్తోంది. విజయంలో కీలక పాత్ర పోషించిన మా బృంద సభ్యుల స్థిర నిబద్ధతకు హృదయపూర్వ కృతజ్ఞతలు'' అని తెలిపారు.

టీవీఎస్ మోటార్ విక్రయాల్లో 29% వృద్ధి



చెన్నై: టీవీఎస్ మోటార్ విక్రయాలు 2025 జూలై నెలలో మొత్తం 29 శాతం పెరిగి 4,56,350 యూనిట్లకు చేరుకున్నాయని కంపెనీ తెలిపింది. గతేడాది ఇదే జూలైలో డీలర్లకు 3,39,676 వాహనాలు సరఫరా చేసినట్లు పేర్కొంది. దేశీయంగా(భారత్‌లో) 3,08,720 వాహన అమ్మకాలు నమోదవ్వగా, 2024 జూలైలో విక్రయాలు 2,54,250 యూనిట్లగా ఉన్నాయి. ఇందులో మోటార్‌సైకిల్ విభాగ విక్రయాల వృద్ధి 25 శాతంగా ఉంది. గతేడాది జూలైలో 1,61,074 యూనిట్లుగా ఉండగా, 2025 జూలైలో 2,01,494 యూనిట్లకు చేరాయి. ఇదే జూలైలో మొత్తం 198,265 స్కూటర్లు అమ్ముడయ్యాయి. గతేడాది జూలైలో విక్రయించిన 1,39,995 యూనిట్లతో పోలిస్తే ఇవి 42% అధికంగా ఉన్నాయి. ఎలక్ట్రానిక్ వాహన(ఈవీ) విభాగం అమ్మకాల వృద్ధి 10 శాతంగా ఉంది. మొత్తం 21,442 యూనిట్ల నుంచి 23,605 యూనిట్లకు చేరింది. జూలైలో మొత్తం 1,42,629 యూనిట్లు ఎగుమతి కాగా, గతేడాది ఇదే నెలలో 97,589 యూనిట్లు విదేశాలకు తరలించారు.

ఏఐ ఆధారిత సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ మోడల్

ఆవిష్కరించిన ఏడబ్ల్యూఎస్



బెంగళూరు: అమెజాన్ వెబ్ సర్వీసెస్ (ఏడబ్ల్యూఎస్) కొత్తగా ఏఐ డ్రివెన్ డెవలప్‌మెంట్ లైఫ్‌సైకిల్ (ఏఐ-డీఎల్‌సీ) మోడల్‌ను ఆవిష్కరించింది. కైరో, అమెజాన్ క్యూ డెవలపర్‌లాంటి టూల్స్‌ను ఉపయోగించి, కృత్రిమ మేధ (ఏఐ)తో సాఫ్ట్‌వేర్‌ను రూపొందించేందుకు ఇది ఉపయోగపడుతుంది. దీనితో మానవ పర్యవేక్షణలో కోడింగ్, టెస్టింగ్‌లాంటి పనులను ఆటోమేట్ చేయడం ద్వారా సాఫ్ట్‌వేర్‌ను అభివృద్ధి చేసే వ్యవధిని నెలల నుంచి రోజుల స్థాయిలోకి కుదించవచ్చని సంస్థ తెలిపింది. అలాగే మెరుగైన ఏఐ విధానాలను షేర్ చేసుకునేందుకు ఏఐ-నేటివ్ బిల్డర్స్ కమ్యూనిటీని కూడా ప్రవేశపెట్టినట్లు వివరించింది. అటు ఏడబ్ల్యూఎస్ స్కిల్ బిల్డర్ ద్వారా అంతర్జాతీయంగా 27 లక్షల మంది విద్యార్థులకు, ఉచితంగా ఏఐ ట్రైనింగ్ యాక్సెస్ అందిస్తున్నట్లు ఏడబ్ల్యూఎస్ తెలిపింది. జనరేటివ్ ఏఐని ఉపయోగించి వాస్తవ ప్రపంచపు సవాళ్లను పరిష్కరించే డెవలపర్లకు 2 మిలియన్ డాలర్ల విలువ చేసే క్రెడిట్స్‌ను ఇచ్చేలా ఏడబ్ల్యూఎస్ ఏఐ లీగ్‌ను కూడా ప్రకటించింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

3-8-2025

విశాఖ	465-00
చిత్తూరు	513-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	465-00
విజయవాడ	475-00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	430-00
వరంగల్	432-00
రిటైల్ ధర	4.90

కార్యాలయ ఉద్యోగులకు డిమాండ్

- జూలైలో 7 శాతం అధిక నియామకాలు
- ఆతిథ్యం, బీమాలో మెరుగు.. ఐటీలో స్థిరం
- ఏఐ-ఎంఎల్ నిపుణులకు అధిక డిమాండ్
- నౌకరీ జాబ్‌స్పీక్ ఇండెక్స్ వెల్లడి



ముంబై: కార్యాలయ ఉద్యోగుల నియామకాలు జూలైలో మెరుగయ్యాయి. ఈ మార్కెట్ 7 శాతం వృద్ధిని చూసినట్టు నౌకరీ జాబ్‌స్పీక్ ఇండెక్స్ అధ్యయన నివేదిక ప్రకటించింది. ముఖ్యంగా నాన్ ఐటీ రంగాల్లో వైట్‌కాలర్ ఉద్యోగ నియామకాలు (శారీరక శ్రమ పెద్దగా అవసరం లేకుండా, సృజనాత్మకతతో చేసే పనులు) జరిగాయి. ఆతిథ్య రంగంలో 26 శాతం, బీమా రంగంలో 22 శాతం, విద్యా రంగంలో 16 శాతం, ఆయిల్ అండ్ గ్యాస్ రంగంలో 13 శాతం చొప్పున నియామకాలు పెరిగినట్టు ఈ నివేదిక వెల్లడించింది. గతేడాది జూలై నెలతో పోల్చితే ఐటీ రంగంలో నియామకాలు స్థిరంగా ఉన్నాయి. కృత్రిమ మేధ- మెషిన్ లెర్నింగ్ (ఏఐ-ఎంఎల్) నిపుణులకు ఎక్కువ డిమాండ్ కనిపించింది. ఈ విభాగంలో నియామకాలు 41 శాతం పెరిగాయి. ''నాన్ ఐటీ రంగాల్లో బలమైన నియామకాల ధోరణి కనిపించింది. ముఖ్యంగా ఫ్రెషర్ల నియామకాలు ఎక్కువగా ఉన్నాయి. ఆతిథ్యం, బీమా, విద్యా రంగాల నుంచి స్థిరమైన డిమాండ్ కొనసాగడం ప్రోత్సాహాన్నిస్తోంది'' అని నౌకరీ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ పవన్ గోయల్ తెలిపారు. నౌకరీ డాట్ కామ్ తన డేటా బేస్ ఆధారంగా ఉద్యోగ నియామకాల తీరుపై ప్రతి నెలా నౌకరీ జాబ్ స్పీక్ ఇండెక్స్ నివేదికను విడుదల చేస్తుంటుంది.

ఫ్రెషర్లకు చాన్స్..

- ఫ్రెషర్ల నియామకాలు జూలైలో క్రితం ఏడాది ఇదే నెలతో పోల్చి చూస్తే 8 శాతం పెరిగాయి.
- 16 ఏళ్లకు పైగా అనుభవం ఉన్న సీజనల్ నిపుణుల నియామకాలు 13% వృద్ధి చెందాయి.
- యూనికార్న్ కంపెనీల్లో 23 శాతం, స్టార్టప్‌లలో 10 శాతం చొప్పున అధిక నియామకాలు నమోదయ్యాయి.
- పశ్చిమాదిన నియామకాలు గణనీయంగా పెరిగాయి. గుజరాత్, మహారాష్ట్ర, రాజస్థాన్ వ్యాప్తంగా వృద్ధి కనిపించింది.
- రాజస్థాన్‌లోనూ ఉదయ్‌పూర్‌లో 12 శాతం, జోధ్‌పూర్‌లో 11 శాతం చొప్పున నియామకాలు పెరిగాయి.
- మహారాష్ట్రలోని కోల్హాపూర్‌లో 21 శాతం అధికంగా ఉద్యోగ నియామకాలు నమోదయ్యాయి. ఆ తర్వాత ఔరంగాబాద్, నాగ్‌పూర్‌లో 15 శాతం వృద్ధి కనిపించింది.
- గ్లోబల్ కేపబులిటీ కేంద్రాల్లో (జీసీసీలు) నియామకాలు 5 శాతం పెరిగాయి.
- మెట్రోల్లో అత్యధికంగా 18 శాతం నియామకాల వృద్ధితో ముంబై అగ్రస్థానంలో నిలిచింది.

జీసీసీల్లో కొలువుల సందడి

- హైరింగ్‌పై సానుకూలంగా 48 శాతం సంస్థలు
- సీఐఐ, జేఎల్ఎల్, ట్యాగ్డ్ నివేదికలో వెల్లడి



న్యూఢిల్లీ: దేశీయంగా గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు (జీసీసీ) ఈ ఆర్థిక సంవత్సరంలో పెద్ద ఎత్తున నియామకాలు చేపట్టనున్నాయి. భారతీయ పరిశ్రమల సమాఖ్య సీఐఐ, జేఎల్ఎల్ ఇండియాతో కలిసి ట్యాగ్డ్ రూపొందించిన నివేదికలో ఈ విషయం వెల్లడైంది. దీని ప్రకారం 48 శాతం జీసీసీల్లో హైరింగ్‌ను పెంచుకోవడంపై సానుకూల సెంటిమెంటు నెలకొంది. 19 శాతం సంస్థలు 2024 ఆర్థిక సంవత్సరం స్థాయిలోనే నియామకాలను కొనసాగించే యోచనలో ఉన్నాయి. ఇటు ఖర్చులు, అటు సమర్థత మధ్య సమతౌల్యాన్ని పాటించేలా 1-5 ఏళ్ల అనుభవం గల వారిని రిక్రూట్ చేసుకోవడంపై జీసీసీలు ప్రధానంగా దృష్టి పెడుతున్నాయి. కెరియర్‌లో పెద్దగా పురోగతి లేకుండా 18-24 నెలల పాటు ఒకే హోదాలో ఉండిపోవడానికి జెనరేషన్ జెడ్ ప్రొఫెషనల్స్ ఇష్టపడకపోతుండటంతో, ఉద్యోగంలో కొనసాగే సగటు వ్యవధి గణనీయంగా తగ్గిపోతున్నట్లు నివేదిక పేర్కొంది. వివిధ రంగాల వ్యాప్తంగా 100కు పైగా జీసీసీలపై అధ్యయనం ఆధారంగా ఈ రిపోర్ట్ రూపొందింది.

ప్రధాన హబ్‌లలోనే రిక్రూట్‌మెంట్..

ప్రధాన హబ్‌లుగా ఉంటున్న నగరాల నుంచే ఎక్కువగా రిక్రూట్ చేసుకోవాలని 60 శాతం జీసీసీలు భావిస్తున్నాయి. 29 శాతం సంస్థలు మాత్రం ప్రథమ శ్రేణి, ద్వితీయ శ్రేణి నగరాల మేళవింపుతో నియామకాలు చేపట్టే యోచనలో ఉన్నాయి. ఇక 13 శాతం జీసీసీలు ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల నుంచి రిక్రూట్ చేసుకోనున్నాయి. కృత్రిమ మేధ (ఏఐ) కారణంగా జీసీసీల్లో నియామకాల ప్రక్రియలో గణనీయంగా మార్పులు వస్తున్నట్లు నివేదిక తెలిపింది. 48 శాతం జీసీసీలు ఏఐ ఆధారిత హైరింగ్ టూల్స్‌ను ఉపయోగించే యోచనలో ఉండగా, ఇప్పటికే 24 శాతం సంస్థలు వివిధ స్థాయుల్లో వాటిని ఉపయోగిస్తున్నట్లు పేర్కొంది.

ఆగస్టు 7న జేఎస్‌డబ్ల్యూ సిమెంట్ ఐపీఓ

- ఇష్యూ పరిమాణం రూ.3,600 కోట్లకు కుదింపు



ముంబై: జేఎస్‌డబ్ల్యూ గ్రూప్‌నకు చెందిన జేఎస్‌డబ్ల్యూ సిమెంట్ పబ్లిక్ ఇష్యూ ఆగస్టు 7న ప్రారంభమై 9న ముగిస్తుంది. తొలుత ఇష్యూ సైజ్ రూ.4,000 కోట్లు ఉండగా..., దాన్ని రూ.3,600 కోట్లకు కుదించినట్లు ముసాయిదా పత్రాల్లో వెల్లడైంది. యాంకర్ ఇన్వెస్టర్ల బిడ్డింగ్ ఆగస్టు 6న ఉంటుంది. ఇష్యూలో భాగంగా రూ.1,600 కోట్ల విలువైన తాజా ఈక్విటీలు, ఆఫర్ ఫర్ సేల్ ద్వారా రూ.2,000 కోట్లు విలువైన షేర్లను విక్రయించనుంది. సమీకరించిన నిధుల్లో రూ.800 కోట్లతో రాజస్థాన్ నాగూర్‌లో ఇంటిగ్రిటెడ్ సిమెంట్ యూనిట్ నిర్మాణానికి, రూ.520 కోట్లు రుణ చెల్లింపులకు, మిగిలిన మొత్తాన్ని సాధారణ కార్పొరేట్ అవసరాలకు వినియోగిస్తున్నట్లు కంపెనీ తెలిపింది. కంపెనీ ఆర్థిక సంవత్సరం 2025లో రూ.163.77 కోట్ల నష్టాన్ని ప్రకటించింది. నిర్వహణ ద్వారా ఆదాయం రూ.6,028 కోట్ల నుంచి రూ.5,813 కోట్లను దిగివచ్చింది. మొత్తం రుణాలు రూ. 6,166 కోట్లు ఉన్నాయి.

ఐపీఓకు ఏఆర్‌సీఐఎల్

అసెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీ(ఇండియా) లిమిటెడ్ (ఏఆర్‌సీఐఎల్), ఐపీఓ ద్వారా నిధుల సమీకరణకు అనుమతి కోరుతూ సెబీకి ముసాయిదా పత్రాలు సమర్పించింది. ఈ ఇష్యూ పూర్తిగా ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) కింద ఉంటుంది. కావున కంపెనీకి నిధులేవీ రావు. సంస్థ ప్రమోటార్లు, ఇతర షేర్ హోల్డర్లు ఓఎఫ్ఎస్‌లో భాగంగా కంపెనీ 10.54 కోట్ల ఈక్విటీలను ఇష్యూ ద్వారా విక్రయించనున్నారు. ప్రమోటర్ సంస్థలు అవెన్యూ ఇండియా రిసర్జెన్స్ పీటీఈ లిమిటెడ్ 6.87 కోట్ల ఈక్విటీలు, ఎస్‌బీఐ 1.94 కోట్ల షేర్లు, ఫెడరల్ బ్యాంక్ 10.35 లక్షలు షేర్లను విక్రయించనున్నాయి. సింగపూర్‌కు చెందిన లాథే ఇన్వెస్ట్‌మెంట్ పీటీఈ లిమిటెడ్ తన మొత్తం 1.62 కోట్లు(5% వాటాకు సమానం) ఈక్విటీలను విక్రయించనుంది. ఇష్యూకు ఐఐఎఫ్ఎల్ క్యాపిటల్ సర్వీసెస్, ఐడీబీఐ క్యాపిటల్ మార్కెట్స్, జేఎం ఫైనాన్స్‌లు బుక్ రన్నింగ్ లీడ్ మేనేజర్లుగా, ఎంయూఎఫ్‌జీ ఇన్‌టైం ఇండియాలు రిజిస్ట్రార్‌గా పనిచేయనున్నాయి.

ఏటా 24 బిలియన్ చిప్‌ల తయారీ

- కేంద్ర ఎలక్ట్రానిక్స్ శాఖ అదనపు సెక్రటరీ అమితేష్ సిన్హా

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం ఇప్పటి వరకు ఆమోదం తెలిపిన సెమీకండక్టర్ పరిశ్రమల ద్వారా ఏటా 24 బిలియన్ చిప్‌లు దేశీయంగా తయారు కానున్నట్లు కేంద్ర ఎలక్ట్రానిక్స్ శాఖ అదనపు సెక్రటరీ, ఇండియా సెమీకండక్టర్ మిషన్ సీఈవో అమితేష్ సిన్హా ప్రకటించారు. ఓ కార్యక్రమంలో భాగంగా ఆయన మాట్లాడుతూ.. టాటా ఎలక్ట్రానిక్స్‌కు చెందిన ఒక వేఫర్ ఫ్యాబ్రికేషన్ ప్లాంట్ సహా మొత్తం ఆరు ప్రాజెక్టులకు ప్రభుత్వం ఆమోదం తెలిపినట్టు వెల్లడించారు. ''ఈ ఫ్యాబ్ నెలకు 50,000 వేఫర్లను తయారు చేస్తుంది. మిగిలిన ఐదు ప్యాకేజింగ్ యూనిట్లు 24 బిలియన్ చిప్స్‌ను ఏటా ఉత్పత్తి చేస్తాయి. మరిన్ని ప్రతిపాదనలను మదింపు దశలో ఉన్నాయి. కనుక సమీప కాలంలో మరిన్ని ప్రతిపాదనలకు అనుమతులు ఇవ్వనున్నాం''అని సిన్హా తెలిపారు. విధానాలు దీర్ఘకాలం పాటు కొనసాగుతాయని భరోసానిస్తూ.. సెమీకండక్టర్ రంగంలో భారత్ దీర్ఘకాల మార్కెట్‌గా కొనసాగుతుందన్నారు. సెమీకండక్టర్ పరిశ్రమకు మద్దతుగా కేంద్రం రూ.76,000 కోట్లతో పథకాన్ని ప్రకటించడం తెలిసే ఉంటుంది. సరఫరా వ్యవస్థను సైతం ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు. అంతర్జాతీయ సరఫరా వ్యవస్థలో భారత్ విశ్వసనీయమైన భాగస్వామిగా పేర్కొన్నారు.

రెట్టింపు కానున్న అఫర్డబుల్ హౌసింగ్ రుణాలు

- వచ్చే మూడేళ్లలో రూ.2.5 లక్షల కోట్లు
- రూ.20 లక్షల కోట్లకు మార్ట్‌గేజ్ రుణాలు
- రేటింగ్ ఏజెన్సీ ఇక్రా నివేదిక వెల్లడి

ముంబై: అందుబాటు ధరల ఇళ్ల రుణాలు వచ్చే మూడేళ్లలో గణనీయంగా పెరగనున్నాయి. అఫర్డబుల్ హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీల (ఏహెచ్ఎఫ్‌సీ) నిర్వహణలోని ఆస్తులు ప్రస్తుతం రూ.1.4 లక్షల కోట్లుగా ఉంటే, మూడేళ్లలో రూ.2.5 లక్షల కోట్లకు చేరుకుంటాయని రేటింగ్ ఏజెన్సీ ఇక్రా అంచనా వేసింది. నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీల మార్ట్‌గేజ్ రుణాలు (ఇల్లు, ఇళ్ల స్థలాలకు సంబంధించి) 2025 మార్చి నాటికి రూ.13 లక్షల కోట్లుగా ఉంటే, 2028 మార్చి నాటికి రూ.20 లక్షల కోట్లకు పెరుగుతాయని తెలిపింది. అన్‌సెక్యూర్డ్ రుణాల్లో సమస్యలు నెలకొనడంతో ప్రత్యామ్నాయ రుణాల మంజూరు పరంగా నియంత్రణలు నెలకొన్నట్టు పేర్కొంది. దీంతో రిటైల్ మార్ట్‌గేజ్ రుణాలను బలమైన వృద్ధి నడిపించనున్నట్టు ఇక్రా ఫైనాన్షియల్ రంగ రేటింగ్స్ కో గ్రూప్ హెడ్ ఎం.కార్తీక్ తెలిపారు. సంప్రదాయంగా మార్ట్‌గేజ్ రుణ విభాగం బలమైన పనితీరు చూపిస్తోందంటూ.. నష్టాలు (రుణ ఎగవేతలు) తక్కువగా ఉండడంతోపాటు రాబడులు మెరుగ్గా ఉంటున్నట్టు వివరించింది. మొత్తం మార్ట్‌గేజ్ రుణాల్లో హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీలు (హెచ్ఎఫ్‌సీలు) మూడింట రెండొంతుల వాటా కలిగి ఉండడం గమనార్హం. ఇక మొత్తం మార్ట్‌గేజ్ రుణాల్లో అఫర్డబుల్ హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీల (ఏహెచ్ఎఫ్‌సీ) వాటా 11 శాతంగా ఉంది.



చిన్న రుణాల్లో ఏహెచ్ఎఫ్‌సీలకు అధిక వాటా

స్వయం ఉపాధిలోని రుణ గ్రహీతలు తీసుకునే గృహ రుణాల్లో హెచ్ఎఫ్‌సీలతో పోల్చి చూస్తే ఏహెచ్ఎఫ్‌సీలు అధిక వాటా కలిగి ఉన్నట్టు ఇక్రా నివేదిక వెల్లడించింది. ముఖ్యంగా తక్కువ మొత్తం రుణాల్లో ఏహెచ్ఎఫ్‌సీలకు అధిక వాటా ఉందని.. ఇటీవలి కాలంలో వీటి ఏయూఎం వేగంగా పెరిగినట్టు తెలిపింది. వ్యాపార నమూనా రీత్యా బకాయిలు పెరిగిపోతే వాటి వసూలుకు వీలుగా ఏహెచ్ఎఫ్‌సీలకు విస్తృతమైన శాఖల నెట్‌వర్క్‌తోపాటు సిబ్బంది అవసరమని పేర్కొంది. స్థిరమైన కార్యకలాపాలకు తోడు మెరుగైన రుణ విధానాలు అనుసరించాలని సూచించింది. వసూలు కాని మొండి రుణాలు (ఎన్‌పీఏలు) ఏహెచ్ఎఫ్‌సీల మొత్తం రుణాల్లో 1.1-1.3 శాతంగానే గత మూడేళ్ల కాలంలో ఉన్నట్టు తెలిపింది. సగటు లోన్ టు వ్యాల్యూ (ఇంటి విలువలో ఇచ్చే రుణం) 55 శాతంగా ఉండడం, రుణాల్లో 40 శాతం సొంత ఇల్లు నిర్మాణం కోసమే ఇస్తుండడంతో రుణ ఆస్తుల నాణ్యత నియంత్రణల్లోనే ఉంటుందని అంచనా వేసింది. రుణ వ్యయాలు తక్కువగా ఉండడంతో ఆస్తులపై రాబడి 3.5-.36 శాతం స్థాయిలో ఉండొచ్చని తెలిపింది. రానున్న రోజుల్లో ఈ రంగంలో బడా సంస్థల నుంచి తీవ్ర పోటీ ఎదురుకానున్న నేపథ్యంలో మార్జిన్ల క్షీణత రిస్క్ ఉంటుందని.. నిర్వహణ సామర్థ్యాలను మెరుగుపరుచుకోవాలని సూచించింది.

క్యూ1 ఫలితాలు

ఫెడరల్ బ్యాంకు లాభంలో 15% క్షీణత

రూ.862 కోట్లు నమోదు



న్యూఢిల్లీ: ప్రైవేటు రంగ ఫెడరల్ బ్యాంకు జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికంలో రూ.862 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. 2024-25 ఇదే క్యూ1లో ఆర్జించిన రూ.1,010 కోట్ల నికర లాభంతో పోలిస్తే ఇది 15% తక్కువ. మార్జిన్లపై ఒత్తిళ్లు, మొండి బకాయిల(ఎన్‌పీఏలు)కు అధిక కేటాయింపులు ప్రతికూల ప్రభావాన్ని చూపినట్లు బ్యాంకు తెలిపింది. కీలకమైన నికర వడ్డీ ఆదాయం(ఎన్ఐఐ) స్వల్పంగా 2% పెరిగి రూ.2,337 కోట్లుగా నమోదైంది. నికర వడ్డీ మార్జిన్ 3.16% నుంచి 2.94 శాతానికి దిగివచ్చింది. మొత్తం కేటాయింపులు రూ.173 కోట్ల నుంచి రూ.437 కోట్లకు పెరిగాయి. త్రైమాసికంగా స్థూల నిరర్థక ఆస్తుల నిష్పత్తి 1.84% నుంచి 1.91 శాతానికి చేరింది. అయితే ప్రధాన ఫీజులు, ట్రెజరీ ఆదాయం పెరగడంతో ఇతర ఆదాయం 22% వృద్ధి చెంది మునుపెన్నడూ లేని విధంగా రూ.1,113 కోట్లకు చేరింది. ''బ్యాంకింగ్ వ్యవస్థలోని మైక్రోఫైనాన్స్ సంబంధించి సమస్యల కారణంగా స్థూల నిరర్థక ఆస్తులు పెరిగాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ద్వితీయార్థంలో బ్యాంకు రుణ వృద్ధి, నికర వడ్డీ మార్జిన్లు పెరుగుతాయని ఆశిస్తున్నాము. రుణ వృద్ధి 12-13% మేర పుంజుకోవచ్చు'' అని బ్యాంకు ఎండీ, సీఈవో కేవీఎస్ మణియన్ తెలిపారు.

బ్రూక్‌ఫీల్డ్ రీట్స్‌కు రూ.498 కోట్ల ఆదాయం

రూ.1,000 కోట్ల సమీకరణకు ఆమోదం



ముంబై: బ్రూక్‌ఫీల్డ్ ఇండియా రియల్ ఎస్టేట్ ట్రస్ట్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025-26) తొలి త్రైమాసికంలో మెరుగైన ప్రదర్శన కనబరిచింది. నికర నిర్వహణ ఆదాయం(ఎన్ఓఐ) 13% పుంజుకొని రూ.498 కోట్లు తాకింది. గతేడాది ఇదే కాలంలో రూ.439 కోట్లు ఆర్జించింది. జూన్ త్రైమాసికానికి రూ.319 కోట్లను వాటాదారాలకు పంపిణీ చేయాలని (ఒక్కో యూనిట్ రూ.5.25 చొప్పున) నిర్ణయించింది. ఇదే క్యూ1లో 6.51 లక్షల చదరపు అడుగులు లీజ్‌కు ఇచ్చింది. ఆక్యూపెన్సీ లెవల్ 89 శాతానికి మెరుగుపడింది. ఇన్వెస్టర్లకు రూ.310 ధర వద్ద 3.23 కోట్ల ప్రిఫరెన్షియల్ యూనిట్లను జారీ చేసి రూ.1,000 కోట్ల నిధుల సమీకరణకు సిద్ధమైంది. ''ఆశావహ లీజింగ్, ఆక్యూపెన్సీ స్థాయిలు పెరగడం, పంపిణీ వృద్ధి కొనసాగడంతో తొలి త్రైమాసికంలో మెరుగైన ఫలితాలు సాధించాము. కీలక మార్కెట్లలో అధిక నాణ్యత కలిగిన ఆస్తులకు డిమాండ్ కొనసాగడంతో కంపెనీ ఆపరేటింగ్ పనితీరు స్థిరంగా ఉంది. భారీ వృద్ధి అవకాశాల సృష్టికి నిధుల సమీకరణ మద్దతుగా నిలుస్తుంది.'' అని బ్రూక్‌ఫీల్డ్ ఇండియా రీట్ ఎండీ, సీఈవో అలోక్ అగర్వాల్ తెలిపారు. బెంగుళూరు, చెన్నైల్లో గ్రేడ్-ఏ ఆస్తుల కొనుగోలుకు చర్చలు జరుపుతున్నట్లు కంపెనీ తెలిపింది.

అంబుజా సిమెంట్స్ లాభం రూ.970 కోట్లు



న్యూఢిల్లీ: అదానీ గ్రూప్ సంస్థ అంబుజా సిమెంట్స్ జూన్ త్రైమాసికంలో రూ.970 కోట్ల లాభాన్ని ఆర్జించింది. క్రితం ఏడాది ఇదే కాలంలో లాభం రూ.783 కోట్లుగా ఉంది. కన్సాలిడేటెడ్ ఆదాయం రూ.8,292 కోట్ల నుంచి రూ.10,244 కోట్లకు వృద్ధి చెందింది. హైదరాబాద్‌కు చెందిన పెన్నా సిమెంట్, తమిళనాడుకు చెందిన మై హోమ్ ఇండస్ట్రీస్, ఓరియెంట్ సిమెంట్‌లను కొనుగోలు చేయడంతో.. గతేడాది జూన్ త్రైమాసికం ఫలితాలతో పోల్చి చూడరాదని కంపెనీ కోరింది. కంపెనీ చరిత్రలో ఒక త్రైమాసికంలోనే అత్యధికంగా 18.4 మిలియన్ టన్నుల సిమెంట్ విక్రయాలు.. ఒక త్రైమాసికంలో అత్యధికంగా రూ.10,000 కోట్ల ఆదాయాన్ని నమోదు చేసినట్లు కంపెనీ ప్రకటించింది.

ఫలితాల నేపథ్యంలో బీఎస్ఈలో అంబుజా సిమెంట్స్ షేరు ధర 4 శాతానికి పైగా నష్టంతో రూ.590 వద్ద స్థిరపడింది.

డాబర్ పర్వాలేదు

3 శాతం పెరిగిన లాభం



న్యూఢిల్లీ: ఎఫ్ఎంసీజీ సంస్థ డాబర్ ఇండియా లిమిటెడ్ జూన్ త్రైమాసికానికి రూ.508 కోట్ల కన్సాలిడేటెడ్ లాభాన్ని ప్రకటించింది. క్రితం ఏడాది ఇదే కాలంలో లాభం రూ.494 కోట్లతో పోల్చి చూస్తే 3 శాతం పెరిగింది. ఆదాయం ఇదే కాలంలో 2 శాతం మేర పెరిగి రూ.3,404 కోట్లకు చేరింది. నడి వేసవిలో అకాల వర్షాలు తమ ఉత్పత్తుల విక్రయాలపై (వేసవిలో వినియోగించేవి) ప్రభావం చూపించినట్టు కంపెనీ తెలిపింది. ముఖ్యంగా పానీయాలు, గ్లూకోజ్ అమ్మకాలు ప్రభావితమైనట్టు వెల్లడించింది. వ్యయాలు సైతం 2 శాతం వరకు పెరిగి రూ.2,886 కోట్లకు చేరాయి. ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు నెలకొన్నప్పటికీ రెండు శాతం మేర వృద్ధిని సాధించినట్టు డాబర్ ఇండియా సీఈవో మోహిత్ మల్హోత్రా తెలిపారు. వరుసగా ఐదు త్రైమాసికాల నుంచి పట్టణాలతో పోల్చితే గ్రామీణ మార్కెట్లల్లో మెరుగైన అమ్మకాలు నమోదవుతున్నట్టు చెప్పారు. పట్టణాల్లోనూ జూన్ క్వార్టర్‌లో పురోగతి కనిపించినట్టు తెలిపారు. 95 ఉత్పత్తులకు సంబంధించి మార్కెట్ వాటాను పెంచుకున్నట్టు ప్రకటించారు.

ఫలితాల నేపథ్యంలో బీఎస్ఈలో కంపెనీ షేరు ఒక శాతానికి పైగా లాభపడి రూ.530 వద్ద ముగిసింది.

చోళమండలం ఇన్వెస్ట్‌మెంట్ భళా..!

క్యూ1లో రూ.1,136 కోట్లు



చెన్నై: జూన్ త్రైమాసికానికి చోళమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ రూ.1,136 నికర లాభాన్ని ఆర్జించింది. కిందేడాది ఇదే క్యూ1లో నమోదైన రూ.942.23 కోట్లతో పోలిస్తే ఇది 21% అధికం. మొత్తం ఆదాయం రూ.5,828.97 కోట్ల నుంచి పెరిగి రూ.7,330.78 కోట్లకు చేరింది. ఇదే క్యూ1 కాలంలో రుణాల పంపిణీ ఫ్లాటుగా రూ.24,332 కోట్ల నుంచి రూ.24,325 కోట్లుగా నమోదైంది. వాహన ఫైనాన్స్, తనఖా వ్యాపార విభాగాల్లో మెరుగైన పనితీరు కనబరిచింది. గృహ, ఎస్ఎంఈ వ్యాపార విభాగాల పనితీరు నిరాశపరిచింది. 2025 జూన్ 30 నాటికి ఈ సంస్థ నిర్వహణలోని ఆస్తుల విలువ రూ.2,07,663 కోట్లకు పెరిగింది.



ఫైనల్లో అనిరుధ్ జోడీ


లెక్సింగ్టన్: భారత టెన్నిస్ ప్లేయర్, హైదరాబాద్‌కు చెందిన అనిరుధ్ చంద్రశేఖర్ కెరీర్‌లో ఈ ఏడాది మూడో ఏటీపీ చాలెంజర్ డబుల్స్ టైటిల్ సాధించేందుకు విజయం దూరంలో నిలిచాడు. అమెరికాలోని కెంటకీ రాష్ట్రంలో జరుగుతున్న లెక్సింగ్టన్ ఓపెన్ ఏటీపీ చాలెంజర్-100 టోర్నీలో భారత్‌కే చెందిన రామ్‌కుమార్ రామనాథన్‌తో కలిసి అనిరుధ్ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. సెమీఫైనల్లో అనిరుధ్-రామ్‌కుమార్ ద్వయం 7-6 (7/3), 4-6, 10-3తో 'సూపర్ టైబ్రేక్'లో ప్రణవ్ కుమార్ (అమెరికా)-కోడీ పియర్సన్ (ఆస్ట్రేలియా) జంటపై గెలిచింది. నేడు జరిగే ఫైనల్లో యు సియో సు-సుంగ్ హావో హువాంగ్ (చైనీస్ తైపీ)లతో అనిరుధ్-రామ్‌కుమార్ తలపడతారు. ఈ ఏడాది మార్చిలో జరిగిన గిరోనా ఓపెన్ ఏటీపీ చాలెంజర్-100 టోర్నీలో, బెంగళూరు ఓపెన్ ఏటీపీ చాలెంజర్-125 టోర్నీలో అనిరుధ్ డబుల్స్ టైటిల్స్ సాధించాడు.

తుది పోరుకు మనుశ్-మానవ్ ద్వయం



రియో డి జనీరో: వరల్డ్ టేబుల్ టెన్నిస్ (డబ్ల్యూటీటీ) ఫీడర్ దు ఇగుఆకు కంటెండర్ టోర్నమెంట్ పురుషుల డబుల్స్ విభాగంలో మనుశ్ షా-మానవ్ ఠక్కర్ (భారత్) జోడీ టైటిల్ పోరుకు అర్హత సాధించింది. శనివారం జరిగిన సెమీఫైనల్లో మనుశ్-మానవ్ ద్వయం 5-11, 11-9, 11-6, 8-11, 11-5తో హువాంగ్ యాన్ చెంగ్-కువో గువాన్ హోంగ్ (చైనీస్ తైపీ) జంటను ఓడించింది. నేడు జరిగే ఫైనల్లో బెనెడిక్ట్ డుడా-డాంగ్ కియు (జర్మనీ)లతో మనుశ్-మానవ్ తలపడతారు. మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో మనుశ్ షా-దియా చిటాలె (భారత్) జోడీ కూడా ఫైనల్లోకి దూసుకెళ్లింది. సెమీఫైనల్లో మనుశ్-దియా జంట 11-7, 11-2, 11-7తో నికోలస్ బుర్గోస్-పౌలీనా వేగా (చిలీ) జోడీపై విజయం సాధించింది. నేడు జరిగే ఫైనల్లో సతోషి ఐడా-హొనోకా హషిమోటో (జపాన్)లతో మనుశ్-దియా ఆడతారు. మరోవైపు మహిళల సింగిల్స్ విభాగంలో భారత స్టార్ మనిక బత్రా క్వార్టర్ ఫైనల్ చేరింది. ప్రిక్వార్టర్ ఫైనల్లో మనిక 6-11, 11-5, 11-3, 7-11, 11-4తో ఏడో సీడ్ కిమ్ నాయెంగ్ (దక్షిణ కొరియా)పై గెలిచింది.

యూకీ జోడీకి నిరాశ



టొరంటో: నేషనల్ బ్యాంక్ ఓపెన్ ఏటీపీ మాస్టర్స్-1000 టెన్నిస్ టోర్నీలో భారత డబుల్స్ నంబర్‌వన్ యూకీ బాంబ్రీ తొలి రౌండ్‌ను దాటలేకపోయాడు. తొలి రౌండ్‌లో యూకీ బాంబ్రీ-మైకేల్ వీనస్ (న్యూజిలాండ్) ద్వయం 4-6, 6-3, 10-12తో 'సూపర్ టైబ్రేక్'లో జాన్ పీర్స్ (ఆస్ట్రేలియా)-జాన్ జిలిన్‌స్కీ (పోలాండ్) జంట చేతిలో ఓడిపోయింది. 95 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో ఇండో-కివీస్ ద్వయం ఐదు డబుల్ ఫాల్ట్‌లు చేసింది. తమ సర్వీస్‌ను ఒకసారి కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను రెండుసార్లు బ్రేక్ చేసింది. నిర్ణాయక సూపర్ టైబ్రేక్‌లో మాత్రం యూకీ-వీనస్ కీలకదశలో తప్పిదాలు చేసి మూల్యం చెల్లించుకుంది. తొలి రౌండ్‌లో ఓడిన యూకీ-వీనస్‌లకు 19,050 డాలర్ల (రూ. 16 లక్షల 61 వేలు) ప్రైజ్‌మనీ లభించింది.

800 మీటర్లలో సప్త స్వర్ణం

ప్రపంచ చాంపియన్‌షిప్‌లో ఎదురులేని అమెరికా మహిళా స్విమ్మర్ కేటీ లెడెకీ

సింగపూర్: ఒకటి కాదు...రెండు కాదు... మూడు కాదు... నాలుగు కాదు... వరుసగా ఏడోసారి కేటీ లెడెకీ తన ఆధిపత్యాన్ని చాటుకుంది. లాంగ్ డిస్టెన్స్ స్విమ్మింగ్‌లో తనకు తిరుగులేదని అమెరికా మహిళా స్టార్ స్విమ్మర్ నిరూపించుకుంది. ప్రపంచ స్విమ్మింగ్ చాంపియన్‌షిప్ 800 మీటర్ల ఫ్రీస్టయిల్ విభాగంలో 7వసారి లెడెకీ చాంపియన్‌గా నిలిచింది. 28 ఏళ్ల లెడెకీ 800 మీటర్ల విభాగంలో 7వసారి స్వర్ణ పతకాన్ని సొంతం చేసుకుంది. శనివారం హోరాహోరీగా సాగిన 800 మీటర్ల ఫైనల్ రేసును లెడెకీ 8 నిమిషాల 05.62 సెకన్లలో ముగించి అగ్రస్థానాన్ని దక్కించుకుంది. ఈ చాంపియన్‌షిప్‌లో నాలుగో స్వర్ణంపై గురి పెట్టిన సమ్మర్ మెకింటోష్ కాంస్య పతకంతో సరిపెట్టుకుంది. మెకింటోష్ 8 నిమిషాల 07.29 సెకన్లలో రేసును ముగించి మూడో స్థానంలో నిలిచింది. లానీ పాలిస్టర్ (ఆస్ట్రేలియా; 8 నిమిషాల 05.98 సెకన్లు) రజత పతకాన్ని కైవసం చేసుకుంది. 700 మీటర్లు ముగిశాక మెకింటోష్ 0.14 సెకన్ల ఆధిక్యంలో ఉండగా... చివరి 100 మీటర్లలో లెడెకీ జోరు పెంచడంతో చివరకు మెకింటోష్ మూడో స్థానంతో, లానీ పాలిస్టర్ రెండో స్థానంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. 16 ఏళ్ల ప్రాయంలో 2013 ప్రపంచ చాంపియన్‌షిప్‌లో 800 మీటర్ల



ఫ్రీస్టయిల్ విభాగంలో తొలిసారి స్వర్ణ పతకాన్ని గెల్చుకున్న లెడెకీ... 2015లో, 2017లో, 2019లో, 2022లో, 2023లోనే బంగారు పతకాలు సొంతం చేసుకోవడం విశేషం. ఇప్పటి వరకు ప్రపంచ చాంపియన్‌షిప్ చరిత్రలో లెడెకీ 23 స్వర్ణాలు, 6 రజతాలు, 1 కాంస్యం సాధించింది. ఒలింపిక్స్‌లో 9 స్వర్ణాలు, 4 రజతాలు, 1 కాంస్యం కైవసం చేసుకుంది. ఓవరాల్‌గా లెడెకీ 44 ప్రపంచ, ఒలింపిక్ పతకాలతో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకుంది.

మిక్స్‌డ్ రిలేలో ప్రపంచ రికార్డు

మరోవైపు మిక్స్‌డ్ ఫ్రీస్టయిల్ 4X100 రిలేలో జాక్ అలెక్సీ, ప్యాట్రిక్ సామన్, కేట్ డగ్లస్, టోరి హుస్కేలతో కూడిన అమెరికా జట్టు కొత్త ప్రపంచ రికార్డు సృష్టించడంతోపాటు పసిడి పతకాన్ని హస్తగతం చేసుకుంది. అమెరికా బృందం 3 నిమిషాల 18.48 సెకన్లలో రేసును ముగించి 2023లో 3 నిమిషాల 18.83 సెకన్లతో ఆస్ట్రేలియా బృందం నెలకొల్పిన ప్రపంచ రికార్డును బద్దలు కొట్టింది. మహిళల 50 మీటర్ల బటర్‌ఫ్లయ్ విభాగంలో గ్రెట్‌చెన్ వాల్ష్ (అమెరికా; 24.83 సెకన్లు) బంగారు పతకాన్ని దక్కించుకుంది. పురుషుల 50 మీటర్ల ఫ్రీస్టయిల్‌లో పారిస్ ఒలింపిక్స్ చాంపియన్ కామెరాన్ మెక్‌ఇవోయ్ (ఆస్ట్రేలియా; 21.14 సెకన్లు) స్వర్ణ పతకాన్ని సాధించాడు. 200 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్‌లో డిఫెండింగ్ చాంపియన్ కేలీ మెక్‌కియోవన్ (ఆస్ట్రేలియా; 2ని:03.33 సెకన్లు)



విజేతగా నిలిచి టైటిల్ నిలబెట్టుకున్నాడు. నేటితో ముగియనున్న ప్రపంచ చాంపియన్‌షిప్‌లో ప్రస్తుతం అమెరికా 8 స్వర్ణాలు, 11 రజతాలు, 7 కాంస్యాలతో కలిపి మొత్తం 26 పతకాలతో నంబర్‌వన్ స్థానంలో ఉంది.



లెడెకీ

మెస్సీ మేనియా షురూ!

భారత పర్యటనకు అర్జెంటీనా ఫుట్‌బాల్ స్టార్

- డిసెంబర్‌లో కోల్‌కతా, అహ్మదాబాద్, ముంబై, ఢిల్లీలో ప్రత్యేక కార్యక్రమాలు
- ఈడెన్ గార్డెన్స్‌లో సెలెబ్రిటీలతో 'సెవెన్-ఎ-సైడ్' మ్యాచ్

కోల్‌కతా: ఫుట్‌బాల్ దిగ్గజం, అర్జెంటీనా కెప్టెన్ లియోనెల్ మెస్సీ ఈ ఏడాది చివర్లో భారత్‌లో పర్యటించనున్నాడు. 2011లో చివరిసారిగా భారత్‌కు విచ్చేసిన మెస్సీ... రెండు రోజుల పర్యటనలో భాగంగా డిసెంబర్‌లో కోల్‌కతా, అహ్మదాబాద్, ముంబై, న్యూఢిల్లీలో ప్రత్యేక కార్యక్రమాల్లో పాల్గొననున్నట్లు సమాచారం. ఫుట్‌బాల్‌ను అమితంగా ఇష్టపడే కోల్‌కతా నుంచి మెస్సీ పర్యటన ప్రారంభం కానుంది. అందకు తగ్గట్లే ఏర్పాట్లు సైతం జరుగుతున్నట్లు సమాచారం. అయితే భారత పర్యటనపై ఇప్పటి వరకు మెస్సీ నుంచి అధికారిక ప్రకటన మాత్రం రాలేదు. అతి త్వరలో అది వెలువడే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. 'మెస్సీ పర్యటన ఖరారైంది. అతడి నుంచి అధికారిక స్పందన రావడమే తరువాయి. అది సామాజిక మాధ్యమాల ద్వారా ఏ క్షణమైనా రావచ్చు' అని నిర్వాహకులు వెల్లడించారు. ప్రస్తుత సమాచారం ప్రకారం ఈ ఏడాది డిసెంబర్ 12న మెస్సీ కోల్‌కతాలో అడుగుపెట్టనున్నాడు.

70 అడుగుల విగ్రహం...

ఫుట్‌బాల్‌ను విపరీతంగా అభిమానించే కోల్‌కతా వాసులు... మెస్సీ కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వీఐపీ రోడ్‌లోని లేక్‌టౌన్ శ్రీభూమిలో మెస్సీ 70 అడుగుల విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. పర్యటనలో భాగంగా మెస్సీ ఈ విగ్రహాన్ని ఆవిష్కరించనున్నాడు. ప్రపంచంలో మెస్సీకి ఇదే అతి ఎత్తయిన విగ్రహం కానుంది. డిసెంబర్ 13 మధ్యాహ్నం ఈడెన్ గార్డెన్స్‌లో నిర్వహించే 'గోట్ కాన్సెర్ట్'లో మెస్సీ పాల్గొననున్నాడు. మెస్సీ ఘనతలను వివరించేలా సాగే ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున అభిమానులు తరలివచ్చే అవకాశం ఉందని నిర్వాహకులు పేర్కొన్నారు. 'అభిమానులను తప్పుదోవ పట్టించాలనుకోవడం లేదు. గోట్ కాన్సెర్ట్‌తో పాటు ఏడుగురు ప్లేయర్లతో కూడిన 'సెవెన్-ఎ-సైడ్ గోట్ కప్ మ్యాచ్‌'లో మెస్సీ పాల్గొననున్నాడు. ఇందులో భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్



సౌరవ్ గంగూలీ, టెన్నిస్ దిగ్గజం లియాండర్ పేస్, భారత ఫుట్‌బాల్ జట్టు మాజీ కెప్టెన్ బైచుంగ్ భూటియా, ప్రముఖ నటుడు జాన్ అబ్రహం తదితరులు పాల్గొననున్నారు. ఇది మెస్సీ గౌరవార్థం నిర్వహిస్తున్నాం. ఈడెన్ గార్డెన్స్‌లో నిర్వహించే ఈ మ్యాచ్ చూసేందుకు అభిమానులు ఎగబడే అవకాశం ఉండగా... టికెట్ ధరలు సైతం ఎక్కువగానే ఉండనున్నాయి. సుమారు గంటన్నర పాటు మెస్సీ మైదానంలో ఉంటాడు. అతడిని దగ్గర నుంచి చూసేందుకు స్టేడియం నిండిపోవడం ఖాయమే' అని నిర్వాహకులు వెల్లడించారు. ఈ మ్యాచ్ అనంతరం బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ మెస్సీని సత్కరించే అవకాశముంది.

ముంబైలో క్రికెట్ మ్యాచ్!

కోల్‌కతా పర్యటన అనంతరం మెస్సీ అహ్మదాబాద్, ముంబైలో జరగనున్న ప్రత్యేక కార్యక్రమాల్లో పాల్గొననున్నాడు. డిసెంబర్ 14న ముంబైలోని ప్రఖ్యాత వాంఖడే స్టేడియంలో జరగనున్న 'గోట్ కాన్సెర్ట్', 'గోట్ కప్'లో మెస్సీ పాల్గొననున్నాడు. దీని కోసం ఇప్పటికే మైదానాన్ని బుక్ చేసినట్లు సమాచారం. ముంబైలో మెస్సీ క్రికెట్ మ్యాచ్ ఆడనున్నట్లు వార్తలు వస్తుండగా... నిర్వాహకులు మాత్రం వాటిని ఖండించారు. 'మెస్సీ ఎలాంటి క్రికెట్ మ్యాచ్ ఆడబోవడం లేదు. భారత సెలెబ్రిటీలతో సరదాగా సాఫ్ట్‌బాల్ ఆడుతాడు' అని వెల్లడించారు. అదే సమయంలో భారత ఫుట్‌బాల్ జట్టును సైతం మెస్సీ కలిసే అవకాశముంది. అనంతరం డిసెంబర్ 15న ఢిల్లీ చేరుకోనున్న మెస్సీ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీతో మర్యాద పూర్వకంగా భేటీ కానున్నాడు. ఈ సందర్భంగా ఢిల్లీలోని ఫిరోజ్ షా కోట్లా స్టేడియంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా ప్రతి నగరంలో మెస్సీ చిన్నారులతో ప్రత్యేకంగా గడపనున్నాడు. ఈ టూర్‌లో మెస్సీ కేరళకు వెళ్లడం లేదని నిర్వాహకులు స్పష్టం చేశారు.

అప్పుడేం జరిగిందంటే...

2011 ఆగస్టు 31న మెస్సీ తొలిసారి భారత్‌లో పర్యటించాడు. వెనిజులాతో ఎగ్జిబిషన్ మ్యాచ్ కోసం కోల్‌కతాకు విచ్చేసిన మెస్సీకి అభిమానులు బ్రహ్మరథం పట్టారు. అర్జెంటీనా జట్టుతో పాటు వచ్చిన మెస్సీ కోసం వేలాది మంది అభిమానులు ఎయిర్‌పోర్ట్‌లో స్వాగతం పలకగా... మ్యాచ్ జరుగుతున్నంత సేపు 'సాల్ట్‌లేక్' స్టేడియం మెస్సీ నామస్మరణతో మార్మోగిపోయింది. కోల్‌కతా నగరం మొత్తం 'మెస్సీ మేనియా'తో ఊగిపోయింది. ఇప్పుడు మళ్లీ ఇన్నాళ్ల తర్వాత... ప్రపంచ చాంపియన్ హోదాలో మెస్సీ భారత్‌లో అడుగుపెట్టనుండటంతో... ఈ సారి మరింత మంది అభిమానులు అర్జెంటీనా స్టార్‌ను చూసేందుకు ఎగబడటం ఖాయమే.



విజేత కార్ల్‌సన్... అర్జున్‌కు నాలుగో స్థానం

రియాద్: తొలిసారి నిర్వహించిన ఈ-స్పోర్ట్స్ వరల్డ్‌కప్ చెస్ టోర్నమెంట్‌లో నార్వే దిగ్గజం, ప్రపంచ నంబర్‌వన్ మాగ్నస్ కార్ల్‌సన్ చాంపియన్‌గా అవతరించాడు. అలీరెజా ఫిరూజా (ఫ్రాన్స్)తో జరిగిన ఫైనల్లో కార్ల్‌సన్ 3-1, 3-1తో విజయం సాధించాడు. సెట్-1లో భాగంగా జరిగిన నాలుగు గేముల్లో కార్ల్‌సన్ రెండు గేముల్లో గెలిచి, రెండింటిని 'డ్రా' చేసుకున్నాడు. సెట్-2లో భాగంగా జరిగిన నాలుగు గేముల్లో కార్ల్‌సన్ మూడు గేముల్లో నెగ్గి, ఒక గేమ్‌లో ఓడిపోయాడు. హికారు నకమురా (అమెరికా) మూడో స్థానం పొందగా... భారత గ్రాండ్‌మాస్టర్, తెలంగాణ స్టార్ ఇరిగేశి అర్జున్ నాలుగో స్థానాన్ని దక్కించుకున్నాడు. నకమురతో జరిగిన వర్గీకరణ మ్యాచ్‌లో అర్జున్ 2.5-3.5తో ఓడిపోయాడు. ఐదు గేముల్లో అర్జున్ రెండింటిలో గెలిచి, ఒక దానిని 'డ్రా' చేసుకున్నాడు.






విజేతగా నిలిచిన కార్ల్‌సన్‌కు 2,50,000 డాలర్లు (రూ. 2 కోట్ల 18 లక్షలు) లభిస్తాయి. రెండో స్థానం పొందిన అలీరెజాకు 1,90,000 డాలర్లు (రూ. 1 కోటీ 65 లక్షలు), మూడో స్థానంలో నిలిచిన నకమురకు 1,45,000 డాలర్లు (రూ. 1 కోటీ 26 లక్షలు), నాలుగో స్థానంలో నిలిచిన అర్జున్‌కు 1,15,000 డాలర్లు (రూ. 1 కోటీ 33 వేలు) ప్రైజ్‌మనీగా లభించాయి.

లెక్‌లెర్క్‌కు తొలి 'పోల్'

నేడు హంగేరి గ్రాండ్‌ప్రి రేసు

బుడాపెస్ట్ (హంగేరి): ఎట్టకేలకు ఈ ఏడాది ఫార్ములావన్ సీజన్‌లోని 14వ రేసులో ఐదో కొత్త 'పోల్ పొజిషన్' డ్రైవర్ అవతరించాడు. గత 13 రేసుల్లో లాండో నోరిస్ (మెక్‌లారెన్), ఆస్కార్ పియాస్ట్రి (మెక్‌లారెన్), మాక్స్ వెర్‌స్టాపెన్ (రెడ్‌బుల్), జార్జి రసెల్ (మెర్సిడెస్) 'పోల్ పొజిషన్స్' దక్కించుకున్నారు. శనివారం జరిగిన హంగేరి గ్రాండ్‌ప్రి క్వాలిఫయింగ్ సెషన్‌లో ఫెరారీ డ్రైవర్ చార్లెస్ లెక్‌లెర్క్ 'పోల్ పొజిషన్' సాధించాడు. తాజా సీజన్‌లో మెక్‌లారెన్ డ్రైవర్లు నోరిస్, పియాస్ట్రి జోరు సాగుతుండగా... వారిద్దరినీ వెనక్కి నెట్టి లెక్‌లెర్క్ ఈ ఏడాది తొలి 'పోల్ పొజిషన్' దక్కించుకున్నాడు. క్వాలిఫయింగ్ సెషన్‌లో లెక్‌లెర్క్ అందరి కంటే వేగంగా 1 నిమిషం 15.372 సెకన్లలో ల్యాప్‌ను పూర్తి చేసి 'టాప్'లో నిలిచాడు. ఆదివారం జరగనున్న ప్రధాన రేసును లెక్‌లెర్క్ అగ్రస్థానం నుంచి నుంచి ప్రారంభిస్తాడు. పియాస్ట్రి (1 నిమిషం 15.398 సెకన్లు; మెక్‌లారెన్), నోరిస్ (1 నిమిషం 15.413 సెకన్లు; మెక్‌లారెన్) వరుసగా రెండో, మూడో స్థానాల్లో నిలిచారు. 'మాటలు రావడం లేదు. ఏమాత్రం ఊహించలేదు. అందుకే ఇది నా ప్రదర్శనల్లో అత్యుత్తమమైన వాటిలో ఒకటి. ఎలా జరిగిందో అర్థం కావడం లేదు. అగ్రస్థానంలో నిలిచేందుకు చేయాల్సిందంతా చేశాను'



అని కెరీర్‌లో 27వసారి పోల్ పొజిషన్ పొందిన లెక్‌లెర్క్ పేర్కొన్నాడు. ఓవర్‌టేక్ చేయడం చాలా కష్టమైన హంగేరి ట్రాక్‌పై పోల్ పొజిషన్ సాధించడం ప్రధాన రేసులో ఫెరారీ డ్రైవర్‌కు ఎంతో సహకరించనుంది. డిఫెండింగ్ చాంపియన్ వెర్‌స్టాపెన్ (1 నిమిషం 15.728 సెకన్లు; రెడ్‌బుల్) 8వ స్థానంలో నిలవగా.... ఫెరారీకే చెందిన మరో డ్రైవర్, ఏడుసార్లు ప్రపంచ చాంపియన్ లూయిస్ హామిల్టన్ (1 నిమిషం 15.702 సెకన్లు) 12వ స్థానంతో సరిపెట్టుకున్నాడు.

ఆయన చేతిలో తోలుబొమ్మ

ఈసీని నరేంద్ర మోదీ దుర్వినియోగం చేస్తున్నారు

- రాజ్యసభలో ధన్‌ఖడ్‌నూ ప్రభుత్వం వాడుకుంది
- కాంగ్రెస్ చీఫ్ ఖర్గే విమర్శ



న్యూఢిల్లీ: ప్రధాని మోదీపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విమర్శల వర్షం కురిపించారు. బిహార్‌లో బీజేపీ కూటమికి అనుకూలంగా ఓటర్ల జాబితాను మార్చేందుకు ప్రధాని మోదీ కేంద్ర ఎన్నికల సంఘాన్ని దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపించారు. శనివారం ఢిల్లీలో నిర్వహించిన ''రాజ్యాంగం ఎదుర్కొంటున్న పెను సవాళ్లు, వాటికి పరిష్కార మార్గాలు''సదస్సులో ప్రసంగిస్తూ ''భారతరాజ్యాంగం అనేది కేవలం చట్టపరమైన పత్రం కాదు. అది మన ప్రజాస్వామ్య ఆత్మ. ప్రతి భారతీయుడికి రాజ్యాంగం న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వాలను ప్రసాదించింది. అలాంటి రాజ్యాంగం ఇప్పుడు మోదీ సర్కార్ ఏలుబడిలో ప్రమాదంలో పడింది. రాజ్యాంగంలో సవరణలు చేయాలన్న దుస్సాహసానికి నేటి పాలకులు తెగిస్తున్నారు. గత ఏడాది సార్వత్రిక ఎన్నికల్లో 400 సీట్లు గెలిస్తే ఖచ్చితంగా రాజ్యాంగంలో బీజేపీ పెను మార్పులు చేసేది. కానీ ప్రజాశీస్సులు లేని ఎన్‌డీఏ కూటమికి అన్ని సీట్లు రాలేదు. ఓటర్లు 400సీట్లు అని పాటపాడి వారి చెంప చెళ్లుమనిపించారు. ఈ ఘనత అంతా కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీకే దక్కుతుంది. రాజ్యాంగంలో మార్పులు చేస్తామన్న ఎన్‌డీఏ సర్కార్‌కు ఎదురునిలిచి నెలలతరబడి పోరాటంచేశారు. ప్రతి సమావేశంలో రాజ్యంగ ప్రతిని చేతబూని రాజ్యాంగ గొప్పదనాన్ని మరోసారి గుర్తుచేశారు''అని ఖర్గే అన్నారు.

ఏకంగా 65 లక్షల ఓట్లు ఎలా తీసేస్తారు?

''బిహార్‌లో ఓటరు జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) వేళ 65 లక్షల మంది ఓటర్లు తమ ఓటు దరఖాస్తును మరోసారి సమర్పించంత మాత్రాన అంత మంది ఓటర్లను ముసాయిదా జాబితా నుంచి ఈసీ ఎలా తొలగిస్తుంది?. పేదలు, అణగారిన వర్గాలకు చెందిన ఈ ఓటర్ల ఓటు హక్కులను ఈసీ ఉద్దేశపూర్వకంగా లాగేసుకుంటోంది. బీజేపీ పాలనతో విసిగిపోయిన కాంగ్రెస్‌కు ఓటేస్తే తమ జీవితాలు బాగుపడతాయని కోరుకుంటున్న ఓటర్ల ఓట్లను తొలగించాలన్న కుట్ర జరుగుతోంది. మహారాష్ట్ర శాసనసభ ఎన్నికలతోపాటు సార్వత్రిక ఎన్నికల వేళ ఓటర్ల జాబితాలో 'మార్పులు'జరుగుతున్నాయి. కర్ణాటక ఎన్నికల వేళ అసెంబ్లీ నియోజక వర్గంలో ఎలా ఓటర్ల జాబితాలో అక్రమ మార్పులు జరిగాయనేదానిపై ఇప్పుడు కాంగ్రెస్ వద్ద బలమైన ఆధారాలు ఉన్నాయి. ఒక్క గదిలో 9 ఓట్లు, ఒకే హాస్టల్‌లో 9,000 ఓట్లు ఎలా ఉంటాయి? ఇలాంటి అక్రమాలపై ప్రజల్లో మరింత అవగాహన పెరగాలి. ఇది కేంద్ర ఎన్నికల సంఘమా? లేదంటే మోదీ చేతిలో కీలుబొమ్మనా?''అని ఖర్గే ప్రశ్నించారు. ''బీజేపీ పాలిత రాష్ట్రాల్లో మైనారిటీలు, దళితులను వివక్షకు గురిచేయడం నిత్యకృత్యమైంది. ఎన్నికల వేళ కేవలం ఒక పక్షానికి అనుకూలంగా ప్రధాని ప్రకటనలు చేస్తూ భారత్‌లో ఏకధ్రువ సమాజాన్ని సృష్టించాలని ఆయన ఆశపడుతున్నారు. తరచూ చికెన్, మొఘలులు, మంగళసూత్రం అంశాలపై మోదీ మాట్లాడుతూ సమాజంలో విభజన తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. రాజ్యాంగాన్ని పరిరక్షిస్తాడనే ఆయనను ప్రజలు ఎన్నుకుంటే ఆయనను ఏకంగా రాజ్యాంగ విలువలనే కాలరాస్తున్నారు''అని ఖర్గే ఆరోపించారు.

మోదీకి చురక

''పార్లమెంట్ సమావేశాల వేళ ప్రధాని మోదీ పార్లమెంట్ ప్రాంగణానికి వచ్చి ఆయన ఆఫీస్‌లోనే కూర్చుంటారు. టీవీలో రాజ్యసభ, లోక్‌సభ చర్చలు, సభా కార్యకలాపాలను ప్రత్యక్షప్రసారాలు చూస్తారు. పార్లమెంట్ ప్రోసీడింగ్స్ తెలియాలంటే అలా టీవీలో చూడకుండా నేరుగా సభలోకి వచ్చి కూర్చోవాలి. అప్పుడు ప్రత్యక్ష అనుభవం కల్గుతుంది''అని మోదీకి ఖర్గే చురక అంటించారు.

రాజ్యసభలో డెప్యూటీ ఛైర్మన్‌నూ..

''రాజ్యసభలో నాటి డెప్యూటీ ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్‌నూ ప్రభుత్వం తన స్వప్రయోజనాల కోసం ఉపయోగించుకుంది. రాజ్యసభలో విపక్షాల గొంతు నొక్కేందుకు ధన్‌ఖడ్‌నూ ఓ పావులా వాడుకున్నారు. విపక్ష నేతలకు ధన్‌ఖడ్ మాట్లాడే అవకాశం ఇవ్వలేదు. ఆయన సభా కార్యకలాపాలను పర్యవేక్షించినప్పుడు పెద్ద సంఖ్యలో విపక్ష పార్టీల ఎంపీలను సస్పెండ్ చేశారు. చిట్టచివర్లో ఆయన స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకుందామని భావించినా ఆయనపై ప్రభుత్వ పెద్దలు మరింత ఒత్తిడి పెంచారు''అని ఖర్గే వ్యాఖ్యానించారు.

సామ్యవాదం, లౌకికవాదంను తొలగించాలనుకున్నారు

''రాజ్యాంగ పీఠికలో దశాబ్దాల క్రితం చేర్చిన సామ్యవాదం, లౌకికవాదం పదాలను తొలగించాలని బీజేపీ ప్రభుత్వం నిశ్చయంగా ఉందిన ఆ పార్టీ కీలక నేతలే సెలవిస్తున్నారు. రాజ్యాంగం నుంచి ఈ పదాలను తీసేయాలని చూస్తున్న ఇదే పార్టీ తమ సొంత పార్టీ సిద్ధాంతాలు, నియమనిబంధనల్లో మాత్రం సామ్యవాదం, లౌకికవాదం పదాలను కొనసాగించడం విడ్డూరం. ఆ పదాలను బీజేపీ-ఆర్ఎస్ఎస్ శక్తులు తొలగించలేవు. ఎందుకంటే అంతటి శక్తిని వాళ్లకు ప్రజలు కట్టబెట్టలేదు''అని ఖర్గే అన్నారు. ''ప్రజాస్వామ్యాన్ని కాపాడే పవిత్రబాధ్యతలు రాజ్యాంగం న్యాయవ్యవస్థ, ఎలక్షన్ కమిషన్, మీడియాకూ ఇచ్చింది. కానీ ఒక మతాన్ని కించపరుస్తూ అనుచిత వ్యాఖ్యలు చేసిన జడ్జీపై ఇంతవరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. చీఫ్ ఎలక్షన్ కమిషనర్ ఎంపిక క్రతువు నుంచి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని తప్పించారు. ఇలాంటి దుర్భర పరిస్థితుల్లో దేశంలో ప్రజాస్వామ్యం ఉందనడం కంటే నియంతృత్వం ఉందనడం నయం''అని అన్నారు.

మతరాజ్యంగా మార్చే కుట్ర

బీజేపీపై సోనియా గాంధీ తీవ్ర విమర్శ

న్యూఢిల్లీ: మోదీ సారథ్యంలోని ఎన్‌డీఏ ప్రభుత్వంపై కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియాగాంధీ విమర్శల నిప్పులు గుమ్మరించారు. గణతంత్ర రాజ్యంగా వెలుగొందుతున్న భారత్‌లో రాజ్యాంగాన్ని బందీ చేసి, మతసిద్ధాంతాలతో దేశాన్ని మతరాజ్యంగా మార్చే కుట్రకు బీజేపీ పాలకులు తెగించారని సోనియా గాంధీ వ్యాఖ్యానించారు. శనివారం ఢిల్లీలో జరిగిన ''రాజ్యాంగం ఎదుర్కొంటున్న పెను సవాళ్లు, వాటికి పరిష్కార మార్గాలు''సదస్సులో ప్రసంగిస్తూ బీజేపీపై సోనియా పలు విమర్శలు చేశారు. ''బీజేపీ దేశ రాజ్యాంగాన్ని తక్కువ చేసేందుకు చేసిన ప్రతి ప్రయత్నాన్ని పార్లమెంట్‌లో, కోర్టుల్లో, వీధుల్లో ప్రతి వేదికపై రాజ్యాంగ పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ పాటుపడింది. ఇది కేవలం రాజకీయపరమైన పోరాటం కాదు ప్రతి ఒక్క భారతీయుడి గౌరవానికి సంబంధించిన కీలకాంశం. బీజేపీ పాలనలో ఇప్పుడు రాజ్యాంగం బందీఖానాలో బంధింపబడింది. స్వతంత్రభారతం కోసం ఏ ఒక్కరోజూ పోరాటం చేయని బీజేపీ-ఆర్ఎస్ఎస్ ద్వయం ఇప్పుడు నిర్దాక్షిణ్యంగా రాజ్యాంగ మూలసూత్రాలను సర్వనాశనం చేసేందుకు అధికారాన్ని దుర్వినియోగం చేస్తున్నాయి. బీజేపీ-ఆర్ఎస్ఎస్ నమ్మే మనుస్మృతి మన త్రివర్ణపతాకాన్ని తిరస్కరించింది. వాళ్లు కేవలం హిందూ దేశాన్ని కోరుకుంటున్నారు. మత రాజ్యంలో ప్రజాస్వామ్యం మిథ్యగా, చట్టాలు చట్టబండలుగా మిగిలిపోతాయి. బీజేపీ అధికారంలోకి వచ్చాక రాజ్యాంగబద్ధ సంస్థలన్నింటినీ అస్తవ్యస్తం చేశారు. అసమ్మతి తెలిపితే వాళ్లపై నేరాలుమోపారు. మైనారిటీలను లక్ష్యంగా చేసుకున్నారు. దళితులు, ఆదివాసీలు, ఓబీసీలు, పేద శ్రామికులను మోసగించారు. పౌరసత్వంలో సమానత్వానికి బాటలుపరచాలని ఆశించిన మహోన్నత నేత అంబేడ్కర్ అడుగుజాడల్లో నడుస్తూ రాజ్యాంగంలో చేర్చిన సామ్యవాదం, లౌకికవాదంపదాలను సైతం పెకిలించివేయాలని బీజేపీ పాలకులు తెగ ఆరాటపడుతున్నారు. ఇలాంటి చర్యలు సంస్కరణలు అనిపించుకోవు. ప్రజాస్వామ్య గణతంత్ర రాజ్యాన్ని శక్తివంతమైన వ్యక్తుల చెప్పుచేతల్లో నడిచే మత రాజ్యంగా మార్చేందుకు కుట్ర పన్నారు'' అని సోనియా వ్యాఖ్యానించారు.

గణనీయంగా తగ్గిన రైల్వే ప్రమాదాలు

- 2014-15తో పోలిస్తే 77% తగ్గిన ప్రమాదాలు
- ప్రమాద బాధితులకు రూ. 67 కోట్ల పరిహారం
- 6,635 రైల్వే స్టేషన్లలో ఎలక్ట్రానిక్ ఇంటర్‌లాకింగ్ అమలు
- భద్రతపై దృష్టిసారించామన్న రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్

సాక్షి, న్యూఢిల్లీ: భారత రైల్వేల్లో ప్రమాదాల సంఖ్య గత దశాబ్దంలో గణనీయంగా తగ్గిందని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. భద్రతకు అత్యధిక ప్రాధాన్యతనిస్తూ అనేక ఆధునిక సాంకేతిక పద్ధతులు, మౌలిక వసతుల అభివృద్ధి చర్యలు చేపట్టిన నేపథ్యంలో ఈ ఫలితాలు కనిపిస్తున్నాయని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. ''2014-15 ఏడాదితో పోలిస్తే 2024-25లో ప్రమాదాలు 77 శాతం తగ్గాయి. 2024-25లో కేవలం 31 ప్రమాదాలు సంభవించాయి. 2025-26లో జూన్ చివరివరకు కేవలం 3 ప్రమాదాలు మాత్రమే నమోదయ్యాయి. 2014-15 ఏడాదిలో ప్రతి 10,00,000 కిలోమీటర్ల రైలు ప్రయాణాలకు 0.11 శాతం మాత్రమే ప్రమాదాలు సంభవించాయి. 2024-25లో ఇది మరింతగా తగ్గి 0.03 శాతానికి దిగొచ్చింది. అంటే రైలు ప్రమాదాలు ఏకంగా 73 శాతం తగ్గాయి. 2004-14 కాలంలో 1,711 రైల్వే ప్రమాదాలు జరిగాయి. ఈ ప్రమాదాల్లో 904 మంది మృతి చెందారు. 3,155 మంది గాయపడ్డారు. 2014-24 కాలంలో 678 ప్రమాదాలు సంభవించాయి. మొత్తంగా 748 మంది మరణించారు. 2,087 గాయపడ్డారు''అని మంత్రి తెలిపారు.

ప్రమాద బాధితులకు రూ. 67.59 కోట్ల పరిహారం

''2020 నుంచి ఇప్పటివరకు రైలు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయినవారికి లేదా గాయపడినవారికి రూ. 37 కోట్ల ఎక్స్‌గ్రేషియా చెల్లించాం. రైల్వే క్లెయిమ్స్ ట్రిబ్యునల్ ద్వారా తేలిన పరిహారంగా రూ.30.59 కోట్లు చెల్లించాం. ట్రిబ్యునల్ పరిహారం ఎక్స్‌గ్రేషియాకు అదనం. ఇది న్యాయప్రక్రియ ప్రకారం మాత్రమే కల్పిస్తాం''అని మంత్రి అన్నారు.

భద్రతకు అత్యంత ప్రాధాన్యం

''భద్రతకు అత్యంత ప్రాధాన్యం కల్పించాం. దేశవ్యాప్తంగా 6,635 రైల్వే స్టేషన్లలో ఎలక్ట్రానిక్ ఇంటర్‌లాకింగ్ అమలు చేశాం. 2020 ఏడాదిలో కవచ్ వ్యవస్థ ఆమోదం పొందింది. 2025 జూలై 30 నాటికి కోటా-మథురా మార్గంలో 324 కిలోమీటర్ల మేర కవచ్‌ను కొత్తగా అమల్లోకి తెచ్చాం. 2014లో 90 మాత్రమే ఉన్న ఫాగ్ సేఫ్టీ డివైజ్‌ల సంఖ్యను 2025 నాటికి 25,939 యంత్రాలకు పెంచాం. 2004-14 కాలంలో కొత్తగా 14,985 కిలోమీటర్ల మేర ట్రాక్‌ను వేశాం. 2014-24 కాలంలో ఇది 34,428 కి.మీకు పెరిగింది. బ్రిడ్జిలు, రోడ్డు ఓవర్ బ్రిడ్జిలు, అండర్ పాసుల సంఖ్య 4,148 నుంచి 13,808కి పెరిగింది. ఐసీఎఫ్ కోచ్‌ల స్థానంలో ఆధునిక ఎల్‌హెచ్‌బీ కోచ్‌లకు మార్చాం. అన్ని బ్రాడ్ గేజ్ మార్గాల్లో 2019 నాటికి అన్‌మాన్‌డ్ లెవెల్ క్రాసింగ్‌ల ఇబ్బందులను పూర్తిగా తొలగించాం''అని రైల్వే మంత్రి స్పష్టం చేశారు.

గాజాలో ఆకలి కేకలు.. చిన్నారి సహా ఏడుగురు మృతి

డెయిర్ అల్-బలాహ్: గాజాలోని రెండు ఆహార పంపిణీ కేంద్రాల వద్ద శనివారం ఇజ్రాయెల్ బలగాలు జరిపిన కాల్పుల్లో కనీసం 10 మంది పాలస్తీనియన్లు ప్రాణాలు కోల్పోయారు. రఫా, జికిమ్ క్రాసింగ్ కాల్పులు జరిగినట్లు నాస్సెర్ ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. అదేవిధంగా, కరువు పరిస్థితులు తీవ్ర రూపం దాల్చడంతో ఆకలి చావులు సర్వసాధారణమైపోయాయని అధికారులు తెలిపారు. పోషకాహార లోపం సంబంధిత కారణాలతో 24 గంటల వ్యవధిలో చిన్నారి శనివారం మరో ఏడు ప్రాణాలు విడిచారన్నారు. ఇజ్రాయెల్, యూఏఈ, ఈజిప్ట, ఫ్రాన్స్, జర్మనీల సహకారంతో జోర్డాన్ గాజాలోని అన్నార్థులకు విమానాల ద్వారా ఆహార ప్యాకెట్లను జారవిడవటం కొనసాగుతూనే ఉంది. అయినప్పటికీ ఈ సరఫరాలు ప్రజల అవసరాలకు ఏమాత్రం సరిపోయేవి కావని చెబుతున్నారు. మరో వైపు, జవైదా, డెయిర్ అల్-బలాహ్ వద్ద ఇజ్రాయెల్ ఆర్మీ వైమానిక దాడుల్లో తల్లిదండ్రులు, వారి ముగ్గురు చిన్నారులు ప్రాణాలు కోల్పోయారు. ఖాన్ యూనిస్‌లో టెంట్‌పై జరిగిన మరో దాడిలో తల్లి, కుమార్తె మృతి చెందారని ఆరోగ్య విభాగం తెలిపింది.

కశ్మీర్‌లో ఎన్‌కౌంటర్.. ఇద్దరు ముష్కరులు హతం

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లోని కుల్గాం జిల్లాలో శనివారం భద్రతా బలగాలతో జరిగిన ఎదురుకాల్పుల్లో ఇద్దరు ఉగ్రవాదులు హతమయ్యారు. నిఘా వర్గాల సమాచారం మేరకు భద్రతా బలగాలు శుక్రవారం సాయంత్రం అఖాల్ అటవీ ప్రాంతాన్ని దిగ్బంధించి, సోదాలు చేపట్టాయి. సాయంత్రం ఇరు వర్గాల మధ్య కొద్దిసేపు కాల్పులు జరిగాయి. రాత్రి కావడంతో అధికారులు ఆపరేషన్‌ను ఆపేశారు. అదనపు బలగాలను ఆ ప్రాంతానికి తరలించి, శనివారం ఉదయం తిరిగి కూంబింగ్ ముమ్మరం చేశారు. ఈ సందర్భంగా జరిగిన ఎదురుకాల్పుల్లో ఇద్దరు ఉగ్రవాదులు చనిపోయారు.

ఉక్రెయిన్ దాడుల్లో ముగ్గురు రష్యన్లు మృతి

కీవ్: ఉక్రెయిన్ ఆర్మీ శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఉదయం వరకు రష్యాలోని వివిధ ప్రాంతాలపై డ్రోన్లను ప్రయోగించింది. ఈ దాడుల్లో కనీసం ముగుగరు చనిపోయారు. ఆక్రమిత క్రిమియా సహా వివిధ ప్రాంతాలపైకి ఉక్రెయిన్ ప్రయోగించిన 112 డ్రోన్లను ధ్వంసం చేసినట్లు రష్యా రక్షణ శాఖ తెలిపింది. ఉక్రెయిన్ సరిహద్దుల్లోని రొస్టొవ్, పెంజా, సమారా ప్రాంతాలపైకి జరిగిన దాడుల్లో ఒక్కొక్కరు చొప్పున ప్రాణాలు కోల్పోయారని పేర్కొంది. అదేవిధంగా, రష్యా ప్రయోగించిన 53 డ్రోన్లకుగాను 45 డ్రోన్లను కూల్చినట్లు ఉక్రెయిన్ తెలిపింది. గురువారం ఉక్రెయిన్ రాజధాని కీవ్ లక్ష్యంగా రష్యా సాగించిన డ్రోన్, మిస్సైల్ దాడుల్లో ఐదుగురు చిన్నారులు సహా 33 మంది చనిపోగా, 150 మంది గాయపడ్డారు.

రూ.3 వేల కోట్ల రుణ మోసం కేసులో ఈడీ మొదటి అరెస్ట్

న్యూఢిల్లీ: పారిశ్రామిక వేత్త అనిల్ అంబానీ యాజమాన్యంలోని వ్యాపార సంస్థలపై నమోదైన మనీలాండరింగ్ రూ.3 వేల కోట్ల రుణమోసం కుంభకోణం దర్యాప్తులో కీలక పరిణామం సంభవించింది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) తొలి అరెస్టును చేసింది. బిశ్వాల్ ట్రేడ్‌లింక్ ప్రైవేట్ లిమిటెడ్(బీటీపీఎల్) మేనేజింగ్ డైరెక్టర్ పార్థ సారథి బిశ్వాల్‌ను అదుపులోకి తీసుకుంది. బిశ్వాల్‌ను మనీలాండరింగ్ చట్టం-2002 నిబంధనల మేరకు కస్టడీలోకి తీసుకున్నామని ఈడీ వర్గాలు తెలిపాయి. ఇటీవల ఈడీ అధికారులు సోదాలు జరిపిన ప్రాంతాల్లో బీటీపీఎల్‌కు చెందిన భువనేశ్వర్, కోల్‌కతాల్లోని కార్యాలయాలు సైతం ఉన్నాయి. సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(ఎస్ఈసీఐ) పేరుతో ఈ కంపెనీ తప్పుడు గ్యారెంటీని బ్యాంకుకు సమర్పించినట్లు ఈడీ ఆరోపిస్తోంది. మొత్తమ్మీద రూ.68.2 కోట్ల విలువైన ఫేక్ బ్యాంక్ గ్యారెంటీలను బీటీపీఎల్ ఇచ్చినట్లు తెలిపింది. ఈ కేసులో అనిల్ అంబానీకి ఈ నెల 5న హాజరు కావాలంటూ ఈడీ సమన్లు జారీ చేయడంతెల్సిందే.

తలకు గాయంతో జార్ఖండ్ మంత్రి పరిస్థితి విషమం

న్యూఢిల్లీ/రాంచీ: జార్ఖండ్ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి రాందాస్ సోరెన్(62) తలకు తీవ్ర గాయం కావడంతో పరిస్థితి విషమించింది. శనివారం జెంషెడ్‌పూర్‌లోని తన నివాసంలోని వాష్‌రూంలో సోరెన్ జారి పడ్డారు. తలకు తీవ్రగాయం కావడంతో ఆయన్ను వెంటనే హెలికాప్టర్‌లో ఢిల్లీలోని ఇంద్రప్రస్థ అపొలో ఆస్పత్రికి తీసుకువచ్చారు. రాందాస్ సోరెన్ వెంటిలేటర్‌పై ఉన్నారని, వైద్య నిపుణుల బృందం ఆయన పరిస్థితిని ఎప్పటికప్పుడు క్షుణ్నంగా పరిశీలిస్తోందని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. రాష్ట్ర ఆరోగ్య మంత్రి అన్సారీ ఆస్పత్రిలో ఆయన వెన్నంటే ఉన్నారు. మంత్రి సోరెన్ మెదడులో రక్త స్రావం అయినట్లు రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రి అర్జున్ ముండా తెలిపారు. ఆయన కోలుకోవాలని ఆకాంక్షించారు.

తెరచుకోనున్న అమృత్ ఉద్యాన్

రాష్ట్రపతి భవన్ ఉద్యానవనంలో ఆగస్టు 16 నుంచి సెప్టెంబర్ 14 వరకు సందర్శకులకు అనుమతి

క్రీడాకారులకు ఆగస్టు 29న, ఉపాధ్యాయులకు సెప్టెంబర్ 5న ప్రత్యేక ప్రవేశం • అందరికీ ఉచిత ప్రవేశం

సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్రపతి భవన్ పరిధిలోని అమృత ఉద్యానంలో వేసవి పూల ప్రదర్శన ఆగస్టు 16 నుంచి సెప్టెంబర్ 14 వరకు జరగనుంది. ఈ సందర్భంగా ప్రతిరోజూ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు సందర్శకులకు 'అమృత్ ఉద్యాన్'తోటను సందర్శించవచ్చు. సాయంత్రం 5:15ల తర్వాత ప్రధాన ద్వారం దాటి లోపలికి అనుమతించబోమని రాష్ట్రపతి భవన్ సచివాలయం తెలిపింది. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేసింది. తోట నిర్వహణ నిమిత్తం ప్రతి సోమవారం అమృత్ ఉద్యాన్‌కు సెలవు ప్రకటించారు. జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆగస్టు 29వ తేదీన క్రీడాకారులకు, ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా సెప్టెంబర్ ఐదో తేదీన ఉపాధ్యాయులకు ప్రత్యేక ప్రవేశం కల్పిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.

ఆన్‌లైన్ బుకింగ్ లేదా కియోస్క్ ద్వారా నమోదు

సందర్శకులు నార్త్ అవెన్యూ రోడ్‌లోని 35వ నంబర్ ద్వారం ద్వారా ఉద్యనవనంలోకి ప్రవేశించాల్సి ఉంటుంది. ప్రవేశం ఉచితమే అయినా ముందస్తుగా రాష్ట్రపతి భవన్ అధికారిక వెబ్‌సైట్ ద్వారా స్లాట్ బుకింగ్ చేసుకోవాలి. visit. rashtrapatibhavan. gov.in వెబ్‌సైట్ ద్వారా టికెట్‌ను బుక్ చేసుకోవచ్చు. ముందస్తు ప్రణాళికలేకుండా వచ్చే సందర్శకులు గేట్ వద్ద ఏర్పాటు చేసిన సెల్ఫ్ సర్వీస్ కియోస్కల ద్వారా నమోదు చేసుకోవచ్చు. ఉద్యానంలోకి మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ కీలు, పర్సులు, హ్యాండ్ బ్యాగ్‌లు, నీళ్ల సీసా, బేబీ మిల్క్ బాటిళ్లు, గొడుగులు మాత్రమే తీసుకెళ్లే వీలుంటుంది. ఇతర వస్తువులపై నిషేధం విధించారు.

కొత్తగా బాబ్లింగ్ బ్రూక్

సందర్శనలో భాగంగా మొత్తం తోటలో బాలవాటిక, ఔషధ వనం, బొన్సాయ్ తోట, సెంట్రల్ లాన్, లాంగ్ గార్డెన్, వలయాకార తోట వంటి ఎన్నో ప్రాంతాలు సందర్శకులను ఆకట్టుకోనున్నాయి. ప్రతి గార్డెన్‌లో కీలకమైన మొక్క, చెట్టు వద్ద ఈసారి క్యూఆర్ కోడ్‌లను ఏర్పాటుచేశారు. ఈ మొక్క, చెట్టు విశిష్టత తెలియాలంటే ఆ క్యూఆర్ కోడ్‌ను స్మార్ట్‌ఫోన్‌తో స్కాన్ చేసి వివరాలు పొందొచ్చు. ఈ ఏడాది ప్రత్యేక ఆకర్షణగా రూపొందించిన 'బాబ్లింగ్ బ్రూక్'సందర్శకులకు కొత్త అనుభూతిని అందించనుంది. ఇందులో భాగంగా నీటి ప్రవాహాలు, శిల్ప రూపకల్పనలతో కూడిన స్పాట్స్, స్టెప్పింగ్ స్టోన్లు, రిఫ్లెక్టింగ్ పూల్ ఉన్నాయి. మర్రి చెట్ల తోటలో పంచతత్వ ట్రైల్స్, రిఫ్లెక్సాలజీ మార్గాలు, ప్రకృతి శబ్దాల అనుభూతి కల్పించనున్నారు. వీటితో పాటు ఔషధ మొక్కలతో పాటు ప్లూమేరియా పుష్పజాతుల చెట్లు సందర్శకులను అలరించనున్నాయి.



దేగలతో వేట: కిర్గిస్తాన్‌లో ఏటా సాల్బురున్ పేరిట జరిగే వేటోత్సవంలో భాగంగా శనివారం బొకొన్‌బయెవ్ గ్రామంలో చేతిలో దేగలతో అశ్వారూఢులై కదం తొక్కుతున్న వేటగాళ్లు



బురద ఫుట్‌బాల్: జర్మనీలో జరుగుతున్న బురద ఫుట్‌బాల్ ఛాంపియన్ షిప్‌లో భాగంగా శనివారం ఓ మ్యాచ్‌లోని దృశ్యం



జలధార: రాంచీలో సందర్శకులకు కనువిందు చేస్తున్న గౌతంధార జలపాతం



లాహిరి లాహిరి లాహిరిలో: యూపీలోని ప్రయాగ్‌రాజ్‌లో త్రివేణీ సంగమం వద్ద శనివారం వరద తీవ్రత పెరగడంతో రబ్బరు బోట్ల ద్వారా లోతట్టు ప్రాంతాల ప్రజల తరలింపు



అంకెల్లో ఒదిగి: బీజింగ్ (చైనా)లో 751 డి పార్క్ వద్ద ఫొటోలకు పోజులిస్తున్న సందర్శకులు



శిల్ప సంపద: జమ్మూకాశ్మీర్‌లోని అనంత్‌నాగ్ జిల్లాలో తవ్వకాల్లో బయటపడ్డ పురాతన విగ్రహాలతో అధికారులు



ఆఖరి ఎయిర్‌బస్: ఒప్పందంలో భాగంగా అందాల్సిన 16 మిలటరీ రవాణా ఎయిర్‌బస్ విమానాల్లో చిట్టచివరి ఎయిర్‌బస్‌తో స్పెయిన్‌లోని భారత రాయబారి, భారత వాయిసేన అధికారుల గ్రూప్ ఫొటో

సుప్రీంకోర్టు మొదటి మహిళా న్యాయమూర్తి ఎవరు?

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

పాలిటీ



మాదిరి ప్రశ్నలు

1. ఏకీకృత న్యాయవ్యవస్థగా దేన్ని పేర్కొంటారు?
ఎ) మొత్తం న్యాయ స్థానాలు ఉన్నత న్యాయ స్థానం నియంత్రణలో పనిచేసే విధానం
బి) ప్రతి న్యాయస్థానం స్వతంత్రంగా పనిచేసే విధానం
సి) శాసన వ్యవస్థ, కార్యనిర్వాహక వ్యవస్థలకు బాధ్యత వహించనిది
డి) పైవన్నీ

2. అమెరికాలో 'సుప్రీం లెజిస్లేచర్'గా దేన్ని పేర్కొంటారు?
ఎ) కాంగ్రెస్ బి) సెనెట్
సి) మంత్రి మండలి
డి) అమెరికా ఫెడరల్ కోర్టు

3. స్వయం ప్రతిపత్తి ఉన్న న్యాయ వ్యవస్థ అంటే ఏమిటి?
ఎ) స్వతంత్రంగా పనిచేసేది
బి) రాజ్యాంగ హోదా ఉన్నది
సి) శాసన, కార్యనిర్వహక శాఖలకు బాధ్యత వహించనిది
డి) పైవేవీ కాదు

4. న్యాయ వ్యవస్థకు స్వయం ప్రతిపత్తి కల్పించేందుకు కారణాలు?
ఎ) రాజ్యాంగ ఆధిక్యత పరిరక్షణ
బి) ప్రాథమిక హక్కుల పరిరక్షణ
సి) కేంద్ర-రాష్ట్రాల మధ్య వివాదాల పరిష్కారం
డి) పైవన్నీ

5. 99వ రాజ్యాంగ సవరణ ద్వారా ఏర్పాటు చేసిన జాతీయ న్యాయమూర్తుల నియామక కమిషన్ అధ్యక్షునిగా ఎవరు కొనసాగుతారు?
ఎ) రాష్ట్రపతి
బి) సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి
సి) కేంద్ర న్యాయశాఖ మంత్రి
డి) అటార్నీ జనరల్

6. ప్రస్తుత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి హెచ్.ఎల్. దత్తు ఏ రాష్ట్రానికి చెందినవారు?
ఎ) తమిళనాడు బి) కర్ణాటక
సి) మహారాష్ట్ర డి) కేరళ

7. కేంద్ర - రాష్ట్రాల మధ్య వివాదాల పరిష్కారం సుప్రీంకోర్టు ఏ అధికార పరిధిలో ఉంటుంది?
ఎ) ప్రారంభ అధికార పరిధి
బి) అప్పీళ్ల విచారణ అధికార పరిధి
సి) సలహా రూపక పరిధి
డి) పైవన్నీ

8. రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని సుప్రీంకోర్టు ఏ కేసులో ప్రస్తావించింది?
ఎ) గోలక్‌నాథ్ వర్సెస్ పంజాబ్ స్టేట్-1967
బి) కేశవానంద భారతి వర్సెస్ కేరళ స్టేట్-1973
సి) బేరుబారి వర్సెస్ భారత ప్రభుత్వం-1960
డి) ఇంద్రసహాని వర్సెస్ భారత ప్రభుత్వం - 1993

9. సుప్రీంకోర్టు మొదటి మహిళా న్యాయమూర్తి ఎవరు?
ఎ) లీలాసెథ్ బి) అన్నా చాందీ
సి) ఫాతిమా బీబి డి) అమరేశ్వరి దేవి

10. కిందివాటిలో సరైనది?
ఎ) సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఎక్కువ కాలం జస్టిస్ చంద్రచూడ్ పనిచేశారు
బి) సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా తక్కువ కాలం జస్టిస్ నాగేంద్రసింగ్ పనిచేశారు
సి) సుప్రీంకోర్టు న్యాయమూర్తుల పదవీ విరమణ వయసు 65 ఏళ్లు
డి) పైవన్నీ

11. అధికరణ 152 నుంచి ఏ రాష్ట్రానికి మినహాయింపు ఇచ్చారు?
ఎ) గోవా బి) జమ్మూ కశ్మీర్
సి) నాగాలాండ్ డి) అరుణాచల్‌ప్రదేశ్

12. గవర్నర్‌ను నియమించేటప్పుడు రాష్ట్రపతిని సంప్రదించాలని ఇందుకు అవసరమైన అధికరణ 155ని సవరించాలని ఏ కమిటీ సూచించింది?
ఎ) రాజమన్నార్ కమిటీ
బి) బల్వంత్‌రాయ్ మెహతా కమిటీ
సి) సర్కారియా కమిటీ
డి) సంతానం కమిటీ

13. గవర్నర్ వ్యవస్థకు సంబంధించి సరికానిది?
ఎ) ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మొదటి గవర్నర్ సి.ఎం. త్రివేది
బి) గవర్నర్ పదవి చేపట్టిన తొలి తెలుగువ్యక్తి భోగరాజు పట్టాభి సీతారామయ్య
సి) ఆంధ్రప్రదేశ్ మొదటి మహిళా గవర్నర్ సరోజినీ నాయుడు
డి) గవర్నర్ పదవి చేపట్టేందుకు కనీస వయసు 35 ఏళ్లు

14. కింది వాటిలో గవర్నర్ విచక్షణాధికారం ఏది?
ఎ) బిల్లులను రాష్ట్రపతికి నివేదించడం
బి) రాష్ట్ర పరిస్థితికి సంబంధించి కేంద్రానికి నివేదిక పంపడం
సి) విధానసభ రద్దు పర్చే విషయం
డి) పైవన్నీ

15. కింది వాటిలో గవర్నర్ అర్హతకు సంబంధించి సరైంది?
ఎ) 35 ఏళ్లు నిండి ఉండాలి
బి) కనీస విద్యార్హత డిగ్రీ పూర్తి చేసి ఉండాలి
సి) శాసనసభలో సభ్యుడై ఉండరాదు
డి) 65 ఏళ్లు నిండి ఉండకూడదు

16. ఈ కింది వాటిలో గవర్నర్‌కు ఏ అధికారాలు లేవు?
ఎ) ఆర్థిక అధికారాలు
బి) విచక్షణాధికారాలు సి) సైనికాధికారాలు
డి) కార్య నిర్వాహకాధికారాలు

17. ఏ అధికరణ ప్రకారం నేరస్థులకు క్షమాభిక్ష పెట్టేందుకు, శిక్షను తగ్గించేందుకు గవర్నర్‌కు అధికారం ఉంటుంది?
ఎ) అధికరణ-153 బి) అధికరణ-161
సి) అధికరణ-213 డి) పైవేవీ కాదు

18. కిందివాటిలో సరైనది?
ఎ) 243(i) ప్రకారం గవర్నర్ రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్, సభ్యులను నియమిస్తారు
బి) 243(k) ప్రకారం గవర్నర్ రాష్ట్ర ఎలక్షన్ కమిషన్ కమిషనర్‌ను నియమిస్తారు
సి) అధికరణ 165 ప్రకారం గవర్నర్ అడ్వకేట్ జనరల్‌ను నియమిస్తారు
డి) పైవన్నీ

19. ముఖ్యమంత్రికి సంబంధించి సరైంది?
ఎ) ప్రత్యక్షంగా ఎన్నికవుతాడు
బి) పరోక్షంగా ఎన్నికవుతాడు
సి) గవర్నర్ నియమిస్తారు
డి) గవర్నర్ నామ నిర్దేశం చేస్తారు

20. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా తక్కువ కాలం పనిచేసిందెవరు?
ఎ) భవనం వెంకట్రామ్ రెడ్డి
బి) టి. అంజయ్య సి) నాదెండ్ల భాస్కర్‌రావు
డి) ఎన్. జనార్దన్ రెడ్డి

21. ఆంధ్ర రాష్ట్ర మొదటి ఉప ముఖ్యమంత్రి?
ఎ) కె.వి.రంగారెడ్డి బి) సుబ్బారెడ్డి
సి) నీలం సంజీవరెడ్డి డి) కళా వెంకట్రావ్

22. కింది వారిలో ఎవరిని గవర్నర్ నియమించరు?
ఎ) రాష్ట్ర మానవహక్కుల కమిషన్ చైర్మన్
బి) రాష్ట్ర ఎలక్షన్ కమిషనర్
సి) రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్
డి) అడ్వకేట్ జనరల్

23. రాష్ట్ర మంత్రివర్గ ఏర్పాటు, శాఖల కేటాయింపు గురించి తెలిపే అధికరణ?
ఎ) అధికరణ - 74 బి) అధికరణ - 164
సి) అధికరణ -165 డి) పైవేవీ కాదు

24. రాష్ట్ర మంత్రి మండలికి సంబంధించినది?
ఎ) కనీస సభ్యుల సంఖ్య 10, గరిష్టం 30
బి) కనీసం-12 మంది, గరిష్టం- ఎమ్మెల్యేల సంఖ్యలో 15 శాతం
సి) ఎమ్మెల్యేల సంఖ్యలో 15శాతం మించరాదు
డి) పైవన్నీ

25. ఎవరి విశ్వాసం కోల్పోయినప్పుడు ఒక రాష్ట్ర మంత్రిని రాజీనామా చేయమని కోరవచ్చు?
ఎ) రాష్ట్ర శాసనసభ బి) గవర్నర్
సి) ముఖ్యమంత్రి డి) ప్రధాన కార్యదర్శి

26. రాష్ట్ర సచివాలయ అధిపతి ఎవరు?
ఎ) రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి
బి) గవర్నర్ సి) ముఖ్యమంత్రి
డి) పై ఎవరూ కాదు

27. విధాన పరిషత్ రద్దు, తిరిగి ఏర్పాటు గురించి ఏ అధికరణ తెలుపుతుంది?
ఎ) అధికరణ-167 బి) అధికరణ - 169
సి) అధికరణ-170 డి) అధికరణ - 175

28. ప్రస్తుతం ద్విసభ విధానం ఉన్న రాష్ట్రాల సంఖ్య?
ఎ) ఐదు బి) ఆరు సి) ఏడు డి) ఎనిమిది

29. విధాన పరిషత్‌కు సంబంధించి సరైంది?
ఎ) ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విధాన పరిషత్ విరామకాలం 25 ఏళ్లు
బి) ప్రస్తుత తెలంగాణ విధాన పరిషత్ సభ్యుల సంఖ్య - 40
సి) ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ విధాన పరిషత్ సభ్యుల సంఖ్య - 58
డి) పైవన్నీ

30. అక్టోబర్‌లో ఎన్నికలు జరగనున్న బీహార్‌లో విధానసభ సభ్యుల సంఖ్య?
ఎ) 233 బి) 243 సి) 245 డి) 292

31. ఇంటర్నెట్ వినియోగంలో మొదటిస్థాన ఆక్రమించిన దేశం?
ఎ) భారత్ బి) అమెరికా
సి) బ్రిటన్ డి) చైనా

32. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విధానసభకు మధ్యంతర ఎన్నికలు ఎన్నిసార్లు జరిగాయి?
ఎ) 1 బి) 2 సి) 3 డి) 4

33. ఆంధ్రప్రదేశ్ మొదటి మహిళా స్పీకర్?
ఎ) శమంతకమణి బి) కల్పనాదేవి
సి) ప్రతిభా భారతి డి) పద్మా దేవేందర్ రెడ్డి

34. హైదరాబాద్ రాష్ట్ర ఏకైక స్పీకర్ ఎవరు?
ఎ) మాడపాటి హన్మంతరావు
బి) సరోజిని పుల్లారెడ్డి
సి) కాశీనాథరావు వైద్య
డి) కొండా లక్ష్మణ్ బాపూజీ

35. కింది వాటిలో రాష్ట్ర శాసనసభకు లేని అధికారం ఏది?
ఎ) శాసన అధికారం
బి) కార్య నిర్వాహక అధికారం
సి) రాజ్యాంగ అధికారం
డి) న్యాయ అధికారం

36. దేశంలో మొదటిసారిగా ఏ రాష్ట్ర శాసనసభను 'పేపర్‌లెస్' కార్యాలయంగా మార్చాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది?
ఎ) గుజరాత్ బి) ఆంధ్రప్రదేశ్
సి) మధ్యప్రదేశ్ డి) ఉత్తరప్రదేశ్

37. కిందివాటిలో ఏది సుప్రీంకోర్టు, హైకోర్టుల అధికార పరిధిలోకి వస్తుంది?
ఎ) కేంద్ర, రాష్ట్రాల మధ్య వివాదాల పరిష్కారం
బి) రాష్ట్రాల మధ్య వివాదాల పరిష్కారం
సి) ప్రాథమిక హక్కుల పరిరక్షణ
డి) ఆదేశిక సూత్రాల పరిరక్షణ

38. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిని ఎవరు నియమిస్తారు?
ఎ) సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి
బి) న్యాయశాఖ మంత్రి
సి) రాష్ట్రపతి డి) గవర్నర్

39. హైకోర్టు న్యాయమూర్తుల సంఖ్యను నిర్ణయించేది?
ఎ) గవర్నర్ బి) పార్లమెంట్
సి) రాష్ట్ర ప్రభుత్వం డి) భారత రాష్ట్రపతి

40. షాబానో కేసు దేనికి సంబంధించింది?
ఎ) జీవించే హక్కు బి) ఉమ్మడి పౌరస్మృతి
సి) ఆస్తి హక్కు డి) నిర్బంధ విద్య

41. రాష్ట్ర ప్రభుత్వానికి ప్రధాన న్యాయ సలహాదారు ఎవరు?
ఎ) ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి
బి) గవర్నర్ సి) అడ్వకేట్ జనరల్
డి) న్యాయశాఖ మంత్రి

42. హైకోర్టు న్యాయమూర్తుల పెన్షన్ ఎక్కడి నుంచి చెల్లిస్తారు?
ఎ) కేంద్ర సంఘటిత నిధి
బి) రాష్ట్ర సంఘటిత నిధి
సి) రాష్ట్ర ఆగంతుక నిధి
డి) పైవేవీకావు

43. కిందివాటిలో సరైంది?
ఎ) ఆంధ్రప్రదేశ్ హైకోర్టు మొదటి ప్రధానన్యాయమూర్తి - కె.సుబ్బారావు
బి) దేశంలో హైకోర్టు మొదటి మహిళా ప్రధాన న్యాయమూర్తి - లీలాసెథ్
సి) దేశంలో స్థాపించిన మొదటి హైకోర్టు - కలకత్తా హైకోర్టు
డి) పైవన్నీ

44. హైకోర్టులకు సంబంధించి సరికానిది?
ఎ) రాజస్థాన్ హైకోర్టు జోధ్‌పూర్‌లో ఉంది
బి) ఉత్తరప్రదేశ్ హైకోర్టు లక్నోలో ఉంది
సి) ఉత్తరాఖండ్ హైకోర్టు నైనిటాల్‌లో ఉంది
డి) ఛత్తీస్‌గఢ్ హైకోర్టు బిలాస్‌పూర్‌లో ఉంది

45. ఇ-కోర్టులను ప్రవేశపెట్టిన మొదటి రాష్ట్రం?
ఎ) గుజరాత్ బి) హిమాచల్ ప్రదేశ్
సి) కేరళ డి) తెలంగాణ

46. జాతీయ సమాచార కేంద్రాన్ని ఎప్పుడు నెలకొల్పారు?
ఎ) 1976 బి) 1980
సి) 1984 డి) 2002

47. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఇన్వెస్ట్‌మెంట్ రీజియన్ (ఐటీఐఆర్)ను కేంద్ర ప్రభుత్వం ఎక్కడ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది?
ఎ) బెంగళూరు బి) హైదరాబాద్
సి) పుణే డి) గాంధీనగర్

సమాధానాలు

1) ఎ; 2) డి; 3) సి; 4) డి; 5) బి; 6) బి; 7) ఎ; 8) బి; 9) సి; 10) డి; 11) బి; 12) సి; 13) సి; 14) డి; 15) ఎ; 16) సి; 17) బి; 18) డి; 19) సి; 20) సి; 21) సి; 22) సి; 23) బి; 24) బి; 25) సి; 26) ఎ; 27) బి; 28) సి; 29) డి; 30) బి; 31) బి; 32) ఎ; 33) సి; 34) సి; 35) డి; 36) బి; 37) సి; 38) సి; 39) డి; 40) బి; 41) సి; 42) ఎ; 43) డి; 44) బి; 45) ఎ; 46) ఎ; 47) బి.

మన మొదటి రిపబ్లిక్ డే ఏ రోజు అవుతుంది?



క్యాలెండర్

క్యాలెండర్ చాప్టర్ నుంచి ప్రతి పోటీ పరీక్షలో 2 - 5 వరకు ప్రశ్నలు వచ్చే అవకాశం ఉంది.

గమనిక: ఈ చాప్టర్‌లోని ప్రశ్నలు సాధించాలంటే బేసి రోజులను గుర్తించడం తెలిస్తే చాలు.

బేసి దినాలు గుర్తించడం

క్యాలెండర్‌లో రెండు రకాల సంవత్సరాలుంటాయి.

- సాధారణ సంవత్సరంలో 365 రోజులు అంటే 52 వారాలు + 1 రోజు. ఆ మిగిలిన ఒక రోజునే 'బేసిదినం' అంటాం.

గమనిక: ఆదివారం నుంచి శనివారం వరకు ఏడు రోజులు ఉంటాయి. కాబట్టి ఇచ్చిన రోజులను 7తో భాగిస్తే వచ్చిన శేషాన్ని 'బేసి దినాలు'గా గుర్తించాలి.

- లీపు సంవత్సరంలో 366 రోజులు అంటే 52 వారాలు + 2 బేసి దినాలు ఉంటాయి.

గమనిక: లీపు సంవత్సరంలో ఫిబ్రవరిలో 29 రోజులు ఉంటాయి.

లీపు సంవత్సరాన్ని గుర్తించడం

- ఇచ్చిన ఏడాదిలోని చివరి రెండు అంకెల(అంటే ఒకట్లు, పదుల స్థానం)ను 4 నిశ్శేషంగా భాగిస్తే అది లీపు సంవత్సరం. లేకపోతే సాధారణ సంవత్సరం.

శతాబ్దంలోని లీపు సంవత్సరం గుర్తించడం

- శతాబ్దాలన్నీ లీపు సంవత్సరాలు కావు. ఏదైనా ఒక శతాబ్దాన్ని 400 నిశ్శేషంగా భాగిస్తే అది లీపు సంవత్సరం.

ఉదా: 400, 800, 1200, 1600, 2000 లీపు సంవత్సరాలు. కానీ 500, 600, 1100, 1500, 1700, 1800, 1900 లీపు సంవత్సరాలు కావు.

శతాబ్దం చివరి రోజు వచ్చే వారాలను కనుక్కోవడం

- వంద సంవత్సరాల్లో ఐదు బేసిదినాలు ఉంటాయి. అంటే 76 సాధారణ సంవత్సరాలు + 24 లీపు సంవత్సరాలు ఉంటాయి.

76×1 బేసిదినం + 24×2 బేసిదినాలు
= 76+48 = 124 రోజులు.
124 రోజులను 7తో భాగిస్తే 5 శేషం వస్తుంది. కాబట్టి 100 ఏళ్లలో ఐదు బేసి దినాలు ఉంటాయి. అంటే ఆ రోజు శుక్రవారం.
200 ఏళ్లలో 5×2 = 10ని 7తో భాగిస్తే 3 బేసి దినాలు అంటే బుధవారం.
300 సంవత్సరాల్లో 5×3=15ను 7తో భాగిస్తే 1 బేసిదినం అంటే సోమవారం. 400 సంవత్సరాల్లో 0 బేసిదినాలు అంటే ఆదివారం.
శతాబ్దం చివరి రోజున శుక్రవారం, బుధవారం, సోమవారం, ఆదివారం వస్తాయి.

లీపు సంవత్సరంలో జనవరి, జూలై..

సాధారణ సంవత్సరంలో జనవరి అక్టోబర్ నెలలకు ఒకే విధమైన క్యాలెండర్ ఉంటుంది.

కింద ఇచ్చిన కోడ్స్ సహాయంతో క్యాలెండర్ సమస్యలకు సులభంగా సమాధానాలు గుర్తించవచ్చు.

శతాబ్దం - కోడ్

1600-1699→6	2000-2099→6
1700-1799→4	2100-2199→4
1800-1899→2	2200-2299→2
1900-1999→0	2300-2399→0

వారం - కోడ్

ఆదివారం - 0	గురువారం - 4
సోమవారం - 1	శుక్రవారం - 5
మంగళవారం - 2	శనివారం - 6
బుధవారం - 3	

నెల - కోడ్

జనవరి - 0	జూలై - 6
ఫిబ్రవరి - 3	ఆగస్టు - 2
మార్చి - 3	సెప్టెంబర్ - 5
ఏప్రిల్ - 6	అక్టోబర్ - 0
మే - 1	నవంబర్ - 3
జూన్ - 4	డిసెంబర్ - 5

గమనిక: బేసి దినాలను కోడ్స్‌గా రాశాం.

వీటిని జ్ఞాపకం ఉంచుకోవడానికి టిప్స్

- శతాబ్దపు కోడ్‌లను గమనిస్తే 6, 4, 2, 0 పునరావృతం అవుతున్నాయి.
- నెలకోడ్‌లను 12 అంకెల మొబైల్ నెంబర్‌గా గుర్తుపెట్టుకోవాలి.
అది 033 614, 625 035

ఒక తేదీ ఇస్తే అది ఏ వారమో గుర్తించడానికి కోడ్

తేది + నెలకోడ్ + సంవత్సరం + లీపు సంవత్సరం + శతాబ్దం కోడ్

ఉదా: 22-04-1984 ఏ వారం అవుతుంది?
సాధన: పైన ఇచ్చిన కోడ్ ప్రకారం అన్నింటిని కూడాలి.
22 + 6 + 84 + 21 + 0 = 133
133ను 7తో భాగిస్తే శేషం సున్నా.
అంటే కోడ్ ప్రకారం ఆదివారం అవుతుంది.
తేది = 22, ఏప్రిల్ నెలకోడ్ = 6,
సంవత్సరం = 84,
లీపు సంవత్సరాలు 84/4 = 21
శతాబ్దం కోడ్ = 0
అన్నింటిని కూడితే 133 వస్తుంది.
పై విధంగా ప్రాక్టీస్ చేస్తే తక్కువ సమయంలో కచ్చితత్వంతో సమాధానాన్ని గుర్తించగలం.

సమానమైన క్యాలెండర్‌ను గుర్తించడం

ఉదా:
1. 2003 లాంటి క్యాలెండర్ మళ్లీ ఏ సంవత్సరంలో పునరావృతం అవుతుంది? (ఎస్ఐ-2012)
ఎ) 2006 బి) 2013 సి) 2012 డి) 2014
జవాబు (డి)

సాధన: ఇచ్చిన సంవత్సరం నుంచి బేసి దినాలను లెక్కిస్తూ పోతే ఎక్కడైతే బేసి దినాల మొత్తం 7 అవుతుందో అది సమానమైన క్యాలెండర్ అవుతుంది. ఒకవేళ బేసిదినాల మొత్తం 7 కాకపోతే 14 వరకు లెక్కించాలి.
2003-1, 2004-2 (లీపు సంవత్సరం)
2005-1, 2006-1
2007-1, 2008-2 (లీపు సంవత్సరం)
2007 వరకు బేసిదినాల మొత్తం = 6
2008 వరకు = 8
కాబట్టి 14 వచ్చే వరకు చూద్దాం.
2009-1 2010-1 2011-1
2012-2 2013-1
2013 వరకు బేసి దినాల మొత్తం = 14
కాబట్టి 2014 జవాబు అవుతుంది.
అంటే 2003 లాంటి క్యాలెండర్ 2014లో వస్తుంది.

తేలిక పద్ధతి:

	2000	2001	2002	2003	*2004*
		+	+	+	
కోడ్:		6	11	11	
				2014	

స్టెప్1: ముందుగా ఇచ్చిన సంవత్సరానికి ముందు, వెనుక లీపు సంవత్సరాలను గుర్తించాలి.
స్టెప్ 2: వాటికి మధ్య ఉన్న సంవత్సరాలకు 6, 11, 11లను కలిపితే వాటికి సమాన క్యాలెండర్ వస్తుంది.
స్టెప్ 3: మన ప్రశ్నలోని 2003కు 11ను కలిపితే 2014 సమాధానం వచ్చింది.

గమనిక: అడిగిన ప్రశ్నలోని సంవత్సరం లీపు సంవత్సరం అయితే + *28*తో కూడాలి.
ఉదా: 2000 లాంటి లీపు సంవత్సరం 2028లో వస్తుంది.

క్యాలెండర్ చాప్టర్ నుంచి ముఖ్యంగా అడిగే ప్రశ్నలు

- ఒక సంవత్సరం ఇచ్చినప్పుడు దానికి సమానమైన సంవత్సరం మళ్లీ ఎప్పుడు పునరావృతమవుతుంది.
- తేదీని ఇస్తే వారాన్ని, వారాన్ని ఇస్తే తేదీని కనుక్కోవడం.
- ఒక లీపు సంవత్సరం ఇచ్చినప్పుడు అలాంటి లీపు సంవత్సరం మళ్లీ ఎప్పుడొస్తుందో గుర్తించడం.
- ఒక సంవత్సరం, తేదీ, వారం ఇచ్చినప్పుడు, మరో ఏడాదిలో అదే తేదీ లేదా వారం ఎప్పుడొస్తుందో కనుక్కోవడం.

మాదిరి ప్రశ్నలు

1. 12 ఫిబ్రవరి, 1991 ఏ వారం అవుతుంది?
ఎ) సోమవారం బి) మంగళవారం
సి) బుధవారం డి) గురువారం
సాధన: తేది + నెలకోడ్ + సం. + లీపు సం. + శతాబ్దం కోడ్‌ను ఉపయోగించాలి.
12 + 3 + 91 + 22 + 0 = 128
(91/4 = 22 లీపు సంవత్సరాలు)
128ను 7తో భాగిస్తే శేషం 2.
కాబట్టి మంగళవారం అవుతుంది.

2. కిందివాటిలో లీపు సంవత్సరం ఏది?
ఎ) 1500 బి) 1700 సి) 1800 డి) 1600
సాధన: ఇచ్చినవన్నీ శతాబ్దాలు కాబట్టి శతాబ్దాన్ని 400తో భాగించాలి. అప్పుడు శేషం సున్నా వస్తే అది లీపు సంవత్సరం అవుతుంది.
400) 1600 (4
1600
0
శేషం సున్నా
కాబట్టి 1600 మాత్రమే లీపు సంవత్సరం.

3. 1992లో మొదటిరోజు ఏ వారం?
ఎ) మంగళవారం బి) బుధవారం
సి) గురువారం డి) నిర్ణయించలేం
సాధన:
1992లో మొదటిరోజు అంటే జనవరి 1
కోడ్ ప్రకారం
1 + 0 + 92 + 23 + 0 =116
116ను 7 తో భాగిస్తే శేషం 4.
అంటే గురువారం అవుతుంది.

4. మొదటి శతాబ్దంలోని జనవరి 1 ఏ రోజు అవుతుంది?
ఎ) మంగళవారం బి) సోమవారం
సి) బుధవారం డి) గురువారం
సాధన: క్యాలెండర్‌లోని మొత్తం సమస్యలు, కోడ్‌లు వీటన్నింటినీ 1 - జనవరి - 01 సంవత్సరం సోమవారం నుంచి మొదలైనట్లుగానే తీసుకున్నారు.
గమనిక: క్యాలెండర్‌లో మొదటి ఆదివారం 7వ తేది అవుతుంది.
కాబట్టి 1 - జనవరి - 01న సోమవారం అవుతుంది.
కోడ్ ప్రకారం తేదీ + నెలకోడ్ + సంవత్సరం + లీపు సంవత్సరం + శతాబ్దం కోడ్
1 + 0 + 1 + 0 + 6 = 8
8ను 7తో భాగిస్తే శేషం 1.
అంటే సోమవారం అవుతుంది.

5. ఒక సంవత్సరంలో ఎన్ని నెలలు సమాన క్యాలెండర్ కలిగి ఉంటాయి?
ఎ) జనవరి, జూన్ బి) జనవరి, ఏప్రిల్
సి) జనవరి, మార్చి డి) నిర్ణయించలేం
సాధన: జవాబు నిర్ణయించలేం (డి)
ఎందుకంటే ఒక సంవత్సరం అని అడిగారు. కానీ అది సాధారణ సంవత్సరమా లీపు సంవత్సరమా ఇవ్వలేదు.

6. 11-జనవరి-1996 రోజు ఏ వారం అవుతుంది?
ఎ) బుధవారం బి) గురువారం
సి) శుక్రవారం డి) శనివారం
సాధన: కోడ్ ప్రకారం
11 + 0 + 96 + 24 + 0 = 131
131ను 7తో భాగిస్తే శేషం 5 అంటే శుక్రవారం.
కానీ ఇచ్చిన ప్రశ్నలో 1996 లీపు సంవత్సరం. 1996లో జనవరి నెలలోని తేది అడిగారు. ఇది మార్చి నెలకు ముందు కాబట్టి 131-1 = 130ను 7తో భాగించాలి.
అప్పుడు శేషం = 4 అంటే గురువారం అవుతుంది.
శుక్రవారం అనేది తప్పు జవాబు.
గమనిక: ఇచ్చిన ప్రశ్న లీపు సంవత్సరంలోని జనవరి లేదా ఫిబ్రవరిలో ఉంటే బేసిదినాల నుంచి 1ని తీసివేసి మిగిలిన దినాలను 7తో భాగించాలి.

7. 1 మార్చి 1996 రోజు ఏ వారం?
సాధన:
1 + 3 + 96 + 24 + 0 = 124
124ను 7తో భాగిస్తే 5 శేషం అంటే శుక్రవారం 1996 లీపు సంవత్సరం అయినప్పటికీ బేసి దినాల నుంచి '1' తీసివేయలేదు. ఎందుకంటే కనుక్కోవాల్సింది మార్చి నెలలోని తేది.
ఫిబ్రవరిలో 29 రోజులు ఉంటాయి. కాబట్టి జనవరి, ఫిబ్రవరిలో అడిగిన ప్రశ్నకు బేసి దినాల నుంచి '1' తీసివేయాలి.

8. 2001 జనవరి 1 సోమవారం అయితే ఈ సంవత్సరంలో చివరిరోజు ఏ వారం?
ఎ) సోమవారం బి) మంగళవారం
సి) బుధవారం డి) గురువారం
సాధన: 2001 సాధారణ సంవత్సరం
= 52 వారాలు + 1 బేసి దినం కాబట్టి సోమవారమే అవుతుంది.

9. మన మొదటి రిపబ్లిక్ డే ఏ రోజు అవుతుంది?
ఎ) శుక్రవారం బి) శనివారం
సి) గురువారం డి) మంగళవారం
సాధన:
మన మొదటి రిపబ్లిక్ డే 26 జనవరి 1950
కోడ్ ప్రకారం 26 + 0 + 50 + 12 + 0 = 88
88ను 7తో భాగిస్తే శేషం 4 వస్తుంది.
అంటే గురువారం అవుతుంది.

గతంలో అడిగిన ప్రశ్నలు

1. ఒకవేళ జనవరి 1, 2007 సోమవారం అయితే జనవరి 1, 2008 ఏ రోజు అవుతుంది? (గ్రూప్-2, 2008)
ఎ) ఆదివారం బి) సోమవారం
సి) బుధవారం డి) మంగళవారం
సమాధానం: డి

2. భారత స్వాతంత్ర్య దినోత్సవం 1996లో శుక్రవారం అయితే 2000 సంవత్సరంలో ఏ వారం అవుతుంది? (వీఆర్‌వో-2012)
ఎ) బుధవారం బి) గురువారం
సి) శుక్రవారం డి) శనివారం
సమాధానం: ఎ

మొగల్ రాజపురం గుహలను ఎవరు నిర్మించారు?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

తెలంగాణ చరిత్ర

మాదిరి ప్రశ్నలు

1. అద్దంకి గంగాధర కవి ఎవరి కొలువులో ఉండేవాడు?
   1) సింగ భూపాలుడు
   2) ఇబ్రహీం కుతుబ్‌షా
   3) అబుల్ హసన్ తానీషా
   4) కాకతి ప్రతాపరుద్రుడు
2. తెలుగుభాషకు తొలి వ్యాకరణం?
   1) ఆంధ్రశబ్ద చింతామణి
   2) ఆంధ్రభాషా భూషణం
   3) కావ్యాలంకార సంగ్రహం
   4) కవిజనాశ్రయం
3. 'శ్రీ పర్వత స్వామి' ఏ రాజు వంశీయుల కులదైవం?
   1) శాలంకాయనులు
   2) ఆనందగోత్రీకులు
   3) ఇక్ష్వాకులు 4) విష్ణుకుండినులు
4. బుద్ధుణ్ని దేవుడిగా ఆరాధించడం ప్రారంభించిన ప్రాథమిక శాఖ ఏది?
   1) దిగంబరులు 2) హీనాయానం
   3) మహాయానం 4) శ్వేతాంబరులు
5. తెలంగాణలో సామాజిక సాంస్కృతిక చైతన్యం తీసుకొచ్చింది ఎవరు?
   1) అఘోరనాథ ఛటోపాధ్యాయ
   2) దస్తూల్ హోషాంగ్
   3) ముల్లా అబ్దులఖియా
   4) పైవారంతా
6. తల్లి పేరుతో శాసనాలు వేయించిన ఇక్ష్వాక రాజు?
   1) రెండో ఏహబల శాంతమూలుడు
   2) రెండో వీరుపురుషదత్తుడు
   3) మొదటి వీరపురుషదత్తుడు
   4) మొదటి శాంతమూలుడు
7. పేష్కస్ అంటే?
   1) ప్రభుత్వానికి రైతు చెల్లించాల్సిన శిస్తు
   2) జమీందారుకు రైతు చెల్లించాల్సిన శిస్తు
   3) ప్రభుత్వానికి జమీందారు చెల్లించాల్సిన శిస్తు
   4) గ్రామాధికారికి రైతు చెల్లించాల్సిన శిస్తు
8. నిజాం ఉల్‌ముల్క్ మహారాష్ట్రులతో కుదుర్చుకున్న సంధి?
   1) మునిషిప్ గాంప్ 2) వార్నా సంధి
   3) దురాయ్ సరాయి 4) పైవన్నీ
9. ఏ నిజాం పరిపాలనా కాలంలో వహాబీ ఉద్యమం ప్రారంభమైంది?
   1) అఫ్జల్ ఉద్దౌలా
   2) మహబూబ్ అలీఖాన్
   3) నాసిరుద్దౌలా 4) సలాబత్ సింగ్
10. మీరట్‌లో తిరుగుబాటు ఏ రోజున ప్రారంభమైంది?
   1) 1857 మే 10
   2) 1858 నవంబర్ 1
   3) 1856 డిసెంబర్ 10
   4) 1858 జనవరి 1
11. 'నిజాం రాజ్యం కల్తీలేని మధ్యయుగపు రాచరికం' అని వ్యాఖ్యానించింది ఎవరు?
   1) రావి నారాయణ రెడ్డి
   2) బద్దం ఎల్లారెడ్డి
   3) పుచ్చలపల్లి సుందరయ్య
   4) చంద్ర రాజేశ్వరరావు
12. ఇక్ష్వాకు అంటే అర్థం?
   1) చెరకు 2) పక్షి
   3) పర్వతం 4) నది
13. గౌతమీ బాలశ్రీ వేయించిన శాసనం?
   1) నాసిక్ శాసనం
   2) చినగంజాం శాసనం
   3) మ్యాకదోని శాసనం
   4) నానాఘాట్ శాసనం
14. శర్మవర్మ, గుణాఢ్యుడు ఎవరి ఆస్థాన కవులు?
   1) యజ్ఞశ్రీ శాతకర్ణి 2) పులోమావి
   3) గౌతమీపుత్ర శాతకర్ణి 4) హాలుడు
15. మొగల్ రాజపురం గుహలను ఎవరు నిర్మించారు?
   1) ఇక్ష్వాకులు 2) ఆనంద గోత్రీకులు
   3) శాలంకాయనులు 4) విష్ణుకుండినులు
16. 1915లో సంఘ సంస్కార నాటక మండలి స్థాపించి, హరిజనులతో నాటకాలు వేయించింది ఎవరు?
   1) నరాలశెట్టి దేవేంద్రుడు
   2) శేషాద్రి
   3) కృష్ణస్వామి 4) భాగ్యరెడ్డి వర్మ
17. కాకతీయుల కాలంలో మంత్రులు, సేనాధిపతులు, రాజోద్యోగులందరూ ఏ వర్గానికి చెందినవారు?
   1) బ్రాహ్మణ 2) క్షత్రియ
   3) వైశ్యులు 4) శూద్రులు
18. శాతవాహన కాలంనాటి వర్తకులు?
   1) సార్థవాహులు 2) తిలపిష్టకులు
   3) సుగధికులు 4) సేధి
19. ఇక్ష్వాకుల కాలంలో తలవర అంటే?
   1) ఒక వృత్తి
   2) రాజు సమకూర్చుకున్న సైన్యం
   3) సేనాధిపతి, సామంతరాజు
   4) నాణెం
20. 'విజ్ఞాన చంద్రికా మండలి' స్థాపన?
   1) 1906 2) 1907
   3) 1908 4) 1908



21. జస్టిస్ పార్టీ మౌలికంగా?
   1) హరిజనుల పార్టీ
   2) బ్రాహ్మణ పక్షపాత పార్టీ
   3) బ్రాహ్మణ వ్యతిరేక పార్టీ
   4) ఉన్నత వర్గాల పార్టీ
22. హిందూ ధర్మ పరిషత్తు పేరిట 1925 ఏప్రిల్ 1న మత విషయక కాన్ఫరెన్స్ జరిగింది. ఈ సదస్సుకు అధ్యక్షత వహించింది ఎవరు?
   1) కర్తుకోటి శంకరాచార్యులు
   2) రాజా ప్రతాపగిర్జీ
   3) పండిట్ శేషాద్రి 4) భాగ్యరెడ్డి వర్మ
23. 'సూత్తనిపాతం' ఏ మతగ్రంథం?
   1) జైన 2) హిందూ
   3) బౌద్ధ 4) ఏదీకాదు
24. భట్టిప్రోలులో నివసించే ఏ జాతి బౌద్ధమతాన్ని స్వీకరించింది?
   1) నాగులు 2) పుళిందులు
   3) యక్షులు 4) ద్రావిడులు
25. భట్టిప్రోలు ప్రాచీన నామం ఏది?
   1) ప్రతిపాలపురం 2) బేతవోలు
   3) ఘంటశాల 4) శ్రీ పర్వతం
26. హేతువాది ప్రాధాన్యత ఇచ్చే వాదం?
   1) ప్రతీత్య సముత్పవాదం
   2) గతి తార్కిక భౌతికవాదం
   3) కార్యకరణ వాదం 4) కర్మసిద్ధాంతం
27. శుద్ధి ఉద్యమాన్ని చేపట్టింది?
   1) బ్రహ్మసమాజం 2) ఆర్యసమాజం
   3) దివ్యజ్ఞాన సమాజం
   4) పైవన్నీ
28. 1975లో విధించిన ఎమర్జెన్సీ వల్ల ఏ పార్టీ ఆవిర్భవించింది?
   1) భారతీయ లోక్‌దళ్
   2) జనతాపార్టీ
   3) భారతీయ జనతాపార్టీ 4) ఏదీకాదు
29. శాతవాహన కాలం నాటి నిగమాలంటే ?
   1) గ్రామాలు 2) నగరాలు
   3) పట్టణాలు 4) రెవెన్యూ మండలాలు
30. బైబిల్‌ను తెలుగులోకి అనువదించిన తొలి విదేశీయుడు?
   1) బ్రేక్ 2) జెవెక్ బాక్
   3) కెప్టెన్ ఓర్ 4) ఎడిసన్
31. చౌరీ- చౌరా సంఘటనతో ఆగిపోయిన ఉద్యమం?
   1) సహాయనిరాకరణ
   2) శాసనోల్లంఘన
   3) వందేమాతర ఉద్యమం
   4) క్విట్ ఇండియా ఉద్యమం
32. ఈ కింద పేర్కొన్న ఏ గ్రంథాల్లో వరంగల్ నగరాన్ని వర్ణించారు?
   1) రాజశేఖర చరిత్ర
   2) కళాపూర్ణోదయం
   3) క్రీడాభిరామం 4) నీలాంబరి
33. శాతవాహనానంతర యుగంలో భూములను పగ్గాలతో కొలిచి ఆయకట్టును నిర్ణయించే వారిని ఏమనేవారు?
   1) హస్తికోశ 2) సెట్టి
   3) అక్షపటలాధికృతుడు
   4) రజ్జుకుడు
34. 'గుడిసెలు కాలిపోతున్నాయి' రచన ద్వారా జాతీయ పురస్కారం పొందినవారు?
   1) బోయి భీమన్న
   2) సి. నారాయణ రెడ్డి
   3) కంభంపాటి రామశాస్త్రి
   4) గుడిపాటి వెంకటాచలం
35. హరిజన్ సేవక్ సంఘ్ ద్వారా రాజకీయ చైతన్యం తీసుకొచ్చినవారు?
   1) భాగ్యరెడ్డి వర్మ
   2) కోదాటి నారాయణరావు
   3) జమలాపురం కేశవరావు
   4) మందముల నరసింగరావు
36. శాతవాహనుల కాలంనాటి పన్నెండు బృంద నాట్య శిల్పాలు ఎక్కడ లభించాయి?
   1) అమరావతి 2) జగ్గయ్యపేట
   3) గుడిమల్లం 4) కార్లే గుహలు
37. నిజాం ఉల్‌ముల్క్ అసలు పేరు?
   1) ముబారిజ్ ఖాన్
   2) చిన్‌ఖిలిచ్ ఖాన్
   3) మీర్ ఖమీరుద్దీన్ ఖాన్
   4) బహదూర్ షా
38. పర్ణిక శ్రేణి, పూసిన శ్రేణులు ఎవరి కాలం నాటివి?
   1) శాతవాహనులు 2) విష్ణుకుండినులు
   3) ఇక్ష్వాకులు 4) తూర్పు చాళుక్యులు
39. బౌద్ధ శిల్పకళలో అంగాలెన్ని?
   1) 2 2) 3 3) 4 4) 5
40. కుతుబ్‌షాహీలు ఏ సాంఘిక దురాచారం రూపుమాపటానికి ప్రయత్నించారు?
   1) వేశ్యాలోలత 2) సతీసహగమనం
   3) బాల్యవివాహాలు
   4) అంటరానితనం
41. బౌద్ధుల ప్రార్థన మందిరం?
   1) స్తూపం 2) ఛత్రం
   3) చైత్యం 4) విహారం
42. రాజనీతిని గురించి వివరించిన గ్రంథం?
   1) రాయవాచకం
   2) ఆముక్తమాల్యద
   3) సుమతీ శతకం 4) రామాభ్యుదయం
43. ఎవరికాలంలో నాగార్జున కొండ సుప్రసిద్ధ విద్యాకేంద్రంగా వర్ధిల్లింది?
   1) శాలంకాయనులు
   2) ఆనంద గోత్రీకులు
   3) ఇక్ష్వాకులు
   4) విష్ణుకుండినులు
44. శాతవాహనుల కాలంలో ఇత్తడి పనిచేసే వారి శ్రేణి?
   1) కమర 2) వధికి
   3) సెలవధికి 4) కాసకార
45. చాందా రైల్వే ఆందోళన ఎవరి పరిపాలనా కాలంలో జరిగింది?
   1) ఉస్మాన్ అలీఖాన్
   2) మహబూబ్ అలీఖాన్
   3) నాసిరుద్దౌలా 4) సికిందర్ జా
46. భారతదేశాన్ని తన రెండో మాతృభూమిగా పేర్కొన్న మహిళ?
   1) మేడం బ్లావట్ స్కీ
   2) అనిబిసెంట్
   3) మదర్ థెరిస్సా 4) ఎవరూ కాదు
47. గోల్కొండ ఏ పరిశ్రమకు ప్రసిద్ధిగాంచింది?
   1) కలంకారి 2) నూలు వస్త్రాలు
   3) వజ్రాలు 4) ముత్యాలు
48. మహాపరినిర్యాణం అంటే ?
   1) బుద్ధుడి ధర్మప్రచారం
   2) బుద్ధుడి జననం
   3) బుద్ధుడి తపస్సు 4) బుద్ధుడి మరణం
49. మొదటి కర్ణాటక యుద్ధం నాటి ఆర్కాటు నవాబు?
   1) ముజఫర్ జంగ్ 2) సలాబత్ జంగ్
   3) అన్వరుద్దీన్ 4) మహ్మద్ అలీ
50. బయ్యారం శాసనం ఎవరి చరిత్రను గురించి తెలుపుతుంది?
   1) కొండవీటి రెడ్లు
   2) బాదామి చాళుక్యులు
   3) శాతవాహనులు
   4) కాకతీయులు

సమాధానాలు

1) 2;	2) 4;	3) 3;	4) 3;	5) 4;
6) 4;	7) 3;	8) 4;	9) 1;	10) 1;
11) 1;	12) 1;	13) 1;	14) 4;	15) 4;
16) 4;	17) 2;	18) 1;	19) 3;	20) 1;
21) 3;	22) 2;	23) 3;	24) 1;	25) 1;
26) 3;	27) 2;	28) 2;	29) 3;	30) 2;
31) 1;	32) 3;	33) 4;	34) 1;	35) 2;
36) 4;	37) 3;	38) 3;	39) 3;	40) 2;
41) 3;	42) 2;	43) 3;	44) 4;	45) 2;
46) 2;	47) 3;	48) 4;	49) 3;	50) 4.

I heard through the grapevine that..



BANK EXAMS

GENERAL ENGLISH

MODEL QUESTIONS

Directions (Q.1-5): Read the following passage carefully and answer the questions given below it. Certain words have been printed in **bold** to help you locate them while answering some of the questions.

The original design of "Oscar" was by MGM art director Cedric Gibbons. He came up with a statuette of a knight standing on a reel of film gripping a crusader's sword. The Academy commissioned the Los Angeles sculptor George Stanley to create the design in three dimensions. It was presented for the first time at the initial awards banquet on May 16, 1929 to Emil Jannings, named Best Actor for his performances in "The Last Command" and "The Way of All Flesh". Since then, 2,701 statuettes have been presented. The new golden statuettes are cast, moulded, polished and buffed each January by RS Owens & Company, the Chicago based awards manufacturer retained by the Academy since 1982. Oscar stands 13½ inches tall and weighs 8½ lbs. The film reel features five spokes, signifying the five original branches of the Academy: actors, directors, producers, technicians and writers. Although the statuette remains true to its original design, the size of the base varied until 1945, when the current standard was adopted. Officially named the Academy Award of Merit, the statuette is better known by its nickname, Oscar. While the origins of the moniker are not clear, a popular story has it that upon seeing the trophy for the first time, Academy librarian (and eventual executive director) Margaret Herrick remarked that it resembled her Uncle Oscar. The Academy didn't adopt the nickname officially until 1939. The statuettes presented at the initial ceremonies were gold-plated solid bronze. Within a few years the bronze was abandoned in favour of Britannia metal, a pewter-like alloy which is then plated in copper, nickel silver, and finally, 24-carat gold. Due to a metal shortage during the Second World War, Oscars were made of painted plaster for three years. Following the war, the Academy invited recipients to redeem the plaster figures for gold-plated metal ones. The Academy is not certain know how many statuettes it will hand out until the envelopes are opened on the night of the ceremony. Although the number of categories are known in advance, the possibility of ties and of multiple recipients sharing the prize in some categories makes it impossible to predict the exact number of statuettes to be awarded. Any surplus awards are housed in the Academy's vault until the following year's event.

1. Which of the following is true according to the passage:
   1) The perfect number of awards is always erratic
   2) Oscars were made of painted plaster always
   3) The film reel features five spokes, signifying the four original branches of the Academy
   4) Oscar stands 13½ inches tall and weighs 8½ kgs
   5) The Academy adopted the nickname officially until 1939
2. Which of the following is false according to the passage
   1) The Academy commissioned the Los Angeles sculptor George Stanley to create the design in three dimensions
   2) The statuettes presented at the initial ceremonies were gold-plated solid bronze.
   3) Due to a metal shortage during the Second World War, the metal was changed.
   4) Actors, directors, producers, technicians and writers are not the only people who represent the five spokes
   5) The initial awards banquet was held on May 16, 1929
3. The meaning of Crusader used in second line is
   1) champion 2) jury 3) board 4) committee 5) member
4. An alloy means
   1) A metal made by combining two or more metals
   2) A metal made by combining gold and bronze
   3) A metal made by combining plaster of paris and copper
   4) A metal made by combining silver and gold
   5) A metal made by compressing two or more metals
5. Vault is
   1) A burial chamber
   2) tombstone 3) cemetery
   4) park 5) closet

Directions (Q.6-10): Each question below has a blank/ two blanks, each blank indicating that something has been omitted. Choose the word/ set of words from the five options for each blank that best fits the meaning of the sentence as a whole.

6. The seriousness of the situation is______ to appreciate in its ______.
   1) easy; complete
   2) different; wholesome
   3) difficult; totality
   4) hard; completeness
   5) tough; compliment
7. The new policy was adopted in the ______ of fierce ______.
   1) wake; opponent
   2) show; postponement
   3) teeth; criticism
   4) course; outcome
   5) reality; injustice
8. The computer is now an ______ tool for the family doctor.
   1) valuable 2) valid 3) price 4) worth 5) invaluable
9. A nasty incident was prevented by the ____ arrival of the police.
   1) timid 2) rightly 3) timely 4) correct 5) properly
10. The author ______ draws together the different ______ of the plot.
   1) nicely; theme 2) tactfully; lines 3) cleverly; link 4) skillfully; threads 5) truly; stories

Directions (Questions 11-15): Which of the phrases (1), (2), (3), and (4) given below each sentence should replace the phrase underlined in the sentence to make it grammatically correct? If there is no error mark (5) No correction required as your answer.

11. Many people are being crushed when the building collapsed on top of them.
   1) was crushed 2) were crushed 3) are crushed 4) is crushed 5) No correction required
12. She was struck by the sudden thought that he might leave already.
   1) has leaving already
   2) already leaving
   3) already have left
   4) have left already
   5) No correction required
13. She was very upset at what to him was just a throw-in remark.
   1) throw out 2) throw down 3) throw back 4) throw away 5) No correction required
14. I heard through the grapevine that you are quitting.
   1) via grape vine
   2) via knitted channel
   3) reliable sources 4) media
   5) No correction required
15. Avoid smoking in danger zones. Fires run out easily in such areas.
   1) catch up 2) passed away 3) do without 4) called off
   5) No correction required

Directions (Q. 16-25): Read each sentence to find out whether there is any grammatical mistake/ error in it. The error, if any, will be in one part of the sentence. Mark the number of that part with error as your answer. If there is 'No error', mark (5) as your answer.

16. Unfortunately the people (1)/ making the decisions (2)/ are out of touch (3)/ in the real world. (4)/ No error (5)
17. I'm still (1)/ not totally convinced (2)/ that he knows (3)/ what he's doing. (4)/ No error (5)
18. Many of the rebels (1)/ were captured (2)/ and torture (3)/ by police. (4)/ No error (5)
19. All this information (1)/ is readily available (2)/ at the touch (3)/ of button. (4)/ No error (5)
20. Years of living (1)/ in England (2)/ have eliminated all trace of (3)/ her American accent. (4)/ No error (5)
21. Bank statements (1)/ help you keep track (2)/ of where your money (3)/ was going. (4)/ No error (5)
22. Pollution is just (1)/ one of the disadvantage (2)/ of living (3)/ in the town. (4)/ No error (5)
23. The article was (1)/ moderate in tone (2)/ and presented (3)/ both side of the case. (4)/ No error (5)
24. The penalty for failure (1)/ will be high. (2)/ But, by the same token, (3)/ the reward for success will be great. (4)/ No error (5)
25. Rising unemployment (1)/ and reservation policies (2)/ is a political time bomb (3)/ for the government. (4)/ No error (5)

Directions (Q. 26-30): Read each sentence which has four parts to find out whether there is any grammatical mistake or spelling mistake in it. Certain words are given in bold in each part to identify the error. Mark the number of that part with error as your answer.

26. She **has been** (1) lauded by **various** (2) organizations for **breaking down** (3) the **bariers**. (4)
27. The **effort of a** (1) physically challenged person **whom** (2) overcomes the **odds** (3) and participates in the Games **is lauded**. (4)
28. The **success of** (1) Burj Al Arab's **offshore** (2) encouraged the Arabs to **formulate** (3) an even **grander** (4) plan.
29. 'Work **incessantly**, (1) but **not** (2) attached to it': **this is the** (3) central idea **of** (4) Geeta.
30. **Admitance** (1) was **refused** (2) to him **by** (3) the **security**. (4)

Directions (Q. 31-35): Rearrange the following six sentences (A), (B), (C), (D), (E) and (F) in a proper sequence to form a meaningful paragraph and then answer the questions given below.

A) As a scholarly discipline, it is closely related to subjects such as science and ethics.
B) As a professional, the engineer is expected to commit himself to high standards of conduct.
C) The field examines and sets the obligations by engineers to society, to their clients, and to the profession.
D) Engineering ethics is the field of applied ethics and system of moral principles that apply to the practice of engineering.
E) By transforming nature for the benefit of mankind, the engineer must increase his awareness of the world as the abode of man.
F) The engineer recognizes that the greatest merit is the work and exercises his profession committed to serving society, attending to the welfare and progress of the majority.

31. What is the FIFTH sentence after rearrangement?
   1) A 2) B 3) D 4) E 5) F
32. What is the THIRD sentence after rearrangement?
   1) A 2) B 3) D 4) F 5) E
33. What is the FOURTH sentence after rearrangement?
   1) A 2) C 3) D 4) E 5) F
34. What is the FIRST sentence after rearrangement?
   1) B 2) D 3) C 4) E 5) F
35. What is the SECOND sentence after rearrangement?
   1) A 2) B 3) C 4) E 5) F

Key

1) 3	2) 4	3) 1	4) 1	5) 5
6) 3	7) 3	8) 5	9) 3	10) 4
11) 2	12) 3	13) 4	14) 5	15) 1
16) 4	17) 5	18) 3	19) 4	20) 3
21) 4	22) 2	23) 4	24) 4	25) 3
26) 4	27) 2	28) 1	29) 2	30) 1
31) 4	32) 1	33) 5	34) 2	35) 3